SOME PAGES IN THE ORIGINAL CONTAIN FLAWS AND OTHER DEFECTS WHICH APPEAR ON THE FILM

విశాఖదత్త

ముద్రారాక్షసము

అమలాపురము, 1932.

Record no. 44

Visakhadatta

Mudrārāksasamu

Amalāpuramu, 1932.

Record no. 44

Bibliographic Record Target

విశాఖదత్త.

ముద్రారాక్షసము / మహాకవి విశాఖదత్తుని సంస్కృతనాటకమునకు ; పాలెపు వేంకటసూర్యగోపాల ప్రధానుని యాంధ్రానువాదము. - 1. కూర్పు. - అమలాపురము : శ్రీమారుతి ముద్రానిలయము, 1932.

3, 28, 132 p. ;21 cm.

Record no. 44

Viśākhadatta.

Mudrārākṣasamu / mahākavi Viśākhadattuni saṃskṛtanāṭakamunaku ; Pālepu Vēṅkaṭasūryagōpāla pradhānuni yāndhrānuvādamu. - 1. kūrpu. - Amalāpuramu : Śrīmāruti Mudrānilayamu, 1932.

3, 28, 132 p. ;21 cm.

Record no. 44

శ్రీరస్తు.

ముద్రారాక్షసము.

ఇది

మహాకవి విశాఖదత్తుని సంస్కృత నాటకమునకు

పాలెపు వేంకటసూర్యగోపాలప్రధానుని

యాంధ్రానువాదము.

౧వ కూర్పు. 500 ప్రతులు.

వాసుగాజు చంద్రమౌళిగారి

శ్రీమారుతి ముద్రానిలయమున ముద్రితము,

అమలాపురము.

1932

వెల అ. ౧-౦.

ముద్రారాక్షసము.

శుద్ధపత్రిక. (కొంతవఱకు)

పుట	పంక్తి(పం) లేక పద్యము (ప)	తప్పు	ఒప్పు
1	1ప	ను♦నెమ్మది	ను నె♦మ్మది
		మిమ్ము♦	మిమ్ముర♦
		రక్షించు	క్షించు
	2ప	సర్వమును♦	సర్వమును
		నో	నో♦
	3ప	గదా♦విత్తు	గదావిత్తు♦
4	6ప	మిచ్ఛనడ్డు	మిట్టమడ్డు
		(అడుగున) ఇదిప్రస్తావన.	
6	13ప	బడి♦రసం	బడిరసం♦
			తా
		♦మార్యస్థం	మా♦ర్య
		బు	స్థంబు
9	16ప	లట్టి♦గజా	లట్టిగ♦జా
17	3పం	దంతపాశి	దండపాశి
18	1పం	దంతపాశి	దండపాశి
24	25ప	న♦ప్రియుం	నప్రి♦యుం
25	26ప	క్కువ్వన	కుక్కువ్వన
		న♦మదూ	నమ♦దూ

పుట	పంక్తి(పం) లేక పద్యము (ప)	తప్పు	ఒప్పు
27	1పం	ప్రథమాం	ద్వితీయాం
		కము	కము
30	10ప	బంగమవు	బంగరువు
35	15ప	♦శక్తి	శక్తి♦
ఒ0	18ప	వైచొనె	వైచునె
48	1ప	నాశత్రో	నాశరో
	13పం	మహో	మహో
			త్సవము
	15పం	నిపుఁడు	నిపుడు
49	2ప	♦గో	గో♦
	5ప	ప్రదంబుతో	ప్రదంబులో
50	4ప	డొోడ్ల	డొండ్ల
52	10ప	వీధుల	వీథుల
54	16ప	తృష్ణది	తృష్ణదే
58	21ప	లవ	జల
		వైమె♦శేష	♦వైమెశేష
61	24ప	♦భూభి	భూపి♦
	22పం	యుపరాగ	యపరాగ

పుట	పంక్తి (పం) పద్యము (ప)	తప్పు	ఒప్పు
		కథాసంగ్రహములో	
6	3 పం.	సప్తత్రింశత్త	సప్తత్రింశ
		ములభూషా	త్తమభూ
		లుర	షాలుని
8	19 పం.	అవాక్ఛల	ఆవాక్ఛల
	24 పం.	అజాను	ఆజాను
10	23 పం.	కుటంబిని	కుటుంబిని
21	4 పం.	బ్రదర్శింప	ప్రదర్శింప
	7 పం.	అప్రభువు	ఆప్రభువు
	17 పం.	అజ్ఞ	ఆజ్ఞ
		నాటకములో	
4	6 ప	గేతువు	గేతుండు
			దావోకట
		బుధయోగ	విష్టుండు
		మిచ్ఛసడ్డువడి	బుధుఁడు
		గలదు	గలఁడు
6	12 ప,	దూరి	దూతి
13	16 పం.	జారి	జాతి
	19 పం.	దొర్కిన	దొరకిన
	23 పం.	శార్గగవ	శార్ఙ్గరవ
		ఇట్టి శార్జపదము శార్ఙ్గ అని అంతట దిద్దునది.	
14	11 పం.	అయన	ఆయన
18	21 ప.	లొందవు	లోదవు
		యసస్థ	యవస్థఁ
	2 పం.	ఇద్దరు	ఇద్దఱు
20	18 పం.	అరి	అది
	25 పం.	పాఁ	పొరపాటు
21	1 పం.	బాటు	
22	6 పం.	భువింప	భవింప

పుట	పంక్తి (పం) పద్యము (ప)	తప్పు	ఒప్పు
24	25 ప.	అతని	ఆతని
	14 పం.	వానినిఁ	వానిని
27	3 పం.	జాణక్య	చాణక్య
28	21 పం.	నాతో	నాతోఁగూ
		గూఁ	
29	9 ప.	జంత్రి	జంద్ర
		వ్రతిష్ఠ	ప్రతిష్ఠ
		జైనుఁక	జైనక
31	6 పం.	ఆమాత్య	అమాత్య
34	14 ప.	అఖలం	అఖిలాం
		బంతరమందు	తరమునయందు
35	1 పం.	బడిఁన	బడిన
	20 పం.	నూరడించి	ఊఱడించి
37	24 పం.	రోజించి	యోచించి
38	8 పం.	చాణ-	రాక్ష-
44	22 ప.	దయ్యోను	దయ్యెను
45	16 పం.	దొరుకుట	దొరకుట
46	17 పం.	కోనిఁ	కోని
49	2 ప.	స్థితినిజేసి	స్థితినిమూర్ఛ
		మూర్ఛితయు	నొందినది
	3 ప.	విషమఁబు	విషమంబుతో
		తొ	
54	16 ప.	సత్యవచుల్	సత్యవచస్తు
		సదా	లు
56	19 ప.	బల్మారె	బల్మార్లు
58	20 ప.	వరలు	వఱలు
	21 ప.	తరి	తతి
61	24 ప.	గజతాశ్వ	గజతాశ్వచ
		తా	యు
64	13 పం.	బడె	బడి

పుట	పంక్తి (పం) పద్యము (ప)	తప్పు	తప్పు	పుట	పంక్తి (పం) పద్యము (ప)	తప్పు	ఒప్పు
69	12 పం.	బిగ్గర	బిగ్గఱ	109	7 పం.	చాణ్య	చాణక్య
90	12 పం.	క్షమించు	శమించు	115	11 పం.	జార	జాఱ
93	20 పం.	అప్త	అప్త	117	1 పం.	విష్ణ	జిష్ణ
94	7 పం.	జారి	జాటి		7 పం.	అసజ్జ	ఆసజ్జ
96	11 ప.	సైన్యముఖ మునందు	సైన్యప్రము ఖమందు	122	6 పం.	గలుగునని	గలిగించు
					23 పం.	దేరి	దేఱి
97	12 ప.	రొుద	యొడ	129	12 ప.	ప్రజ	బ్రజ
93	21 పం.	ఆమాత్యుని	అమాత్యుని	130	16 పం.	యదును	యదను
104	25 పం.	నేనుఁగులఁ	నేనుఁగుల	131	5 పం.	అమాత్వ	అమాత్య

తక్కిన తప్పులు పాఠకులు సుకరముగాఁ దెలిసికొనఁగలరు. పయితప్పులను సవరించి యీగ్రంథముఁ జదువుటకుఁ బాఠకులఁ బ్రార్థించుచున్నాను.

“ఇందలి తెనుఁగు పద్యములును (అర్థము తెలియుటకు) సంస్కృతశ్లోకసాహాయ్యము నపేక్షించునేమో” యని విజ్ఞాపనమందుఁ జెప్పియున్నాను. ఎందుకయిన మంచిదని సంస్కృతశ్లోకములఁగూడ ముద్రింపించి యిందుఁజేర్చితిని.

పాలెపు వేంకట సూర్యగోపాలం.

విజ్ఞాపనము.

తెనుఁగుభాష తత్సమపదభూయిష్ఠము. సుష్ఠువులయిన తత్సమపదములను దెనుఁగు పద్యములందుఁ బ్రయోగించుటకు సంస్కృతవ్యాకరణమందలి కృత్తద్ధితసమాసప్రకరణముల సూత్రముల విజ్ఞానమయినను గవికావశ్యకము. అట్టి ప్రకరణములు నేను గురుముఖమున నభ్యసించియుండలేదు. కనుక నేఁబండితుఁడఁగాను. “పాండిత్యహీనాః కవయో భవంతి” అని నానుడికలదు. అందువలనఁ గవిత్వమునకుఁ బాండిత్యమక్కఱలేదందురేమో? నిరర్గళకవితాధారయు నాకలవడియుండలేదు. అయినను నాటకములు దెనిఁగించుటకుఁ జిన్ననాటనుండియు నాకుఁజాపల్యము మెండుగనుండెను. నాటకాంతం కవిత్వమ్మను పూర్వలోకోక్తి యిపుడు నాటకాద్యం కవిత్వమ్మని మాఱినదని కీ. శే. కళాప్రపూర్ణ వేదము వేంకటరాయ శాస్త్రులవారు ఆక్షేపగర్భముగా వ్రాసియున్నారు. ఇందుకు నేను ఆ 1889 వ సంవత్సరమందే లక్ష్యభూతుఁడనయి కమలినీ కలహంస, జానకీపరిణయ, నాగానందములను బ్రహ్మశ్రీ మల్లాదిలక్ష్మణశాస్త్రులవారియొద్దఁ గాకినాడలోఁజదివి, తెనిఁగించి, నామిత్రులు వ. సు. రాయకవీంద్రులచే దిద్దించి ప్రకటించితిని. ఎక్కుడువివరము నాజానకీపరిణయపీఠికయందుఁ గనఁబడును. తరువాతఁ గాకినాడ కాపురముమానుకొని వీరవల్లిపాలెమువచ్చితిని. అపుడు ముద్రితప్రతులన్నియు నిలువుమించుగాఁ జెదలపాలయ్యెను. కొన్నేండ్లకు తరువాతి, అమలాపురము నాకు వాసభూమియయ్యెను. 1900 సంవత్సరమునందుఁ గాఁబోలు జానకీపరిణయమందలి మొదటినాలుగంకములు F.A.కు పాఠ్యములయ్యెను. వానికిఁ డీకవ్రాసినవారు, మదరాసు కాలేజి తెనుఁగుపండితులు, నగు సూర్యనారాయణశాస్త్రులువారి మెప్పునకీయది పాత్రమయ్యెను. కొందఱు కవులు తమగ్రంథములను నానాటకములకు వినిమయముగా దయచేసిరి. ఉపయుక్తగ్రంథములేవియు రచింపలేదు. వ్యసనము విడువనందున ‘వృషభానుజ’ యను చిన్ననాటికను మాత్రము పదునైదుసంవత్సరములమున్ను తెనిఁగించియుట్టియుంచితిని, తరువాతఁబ్రమోదసంవత్సర పుష్యమాస భారతిలో, నుసర్ల అనంతరాయాంధ్రీకృత ముద్రారాక్షస ప్రథమాంక పద్యములనుగూర్చి కీ. శే. కళాప్రపూర్ణ వేదము వేంకటరాయ శాస్త్రులవారి విమర్శనముఁ జదివితిని. ప్రతిపద్యమును దోషభూయిష్ఠమని వారు సూచించిరి. అంతకంటె నించుకయినను జక్కఁగాఁ బద్యరచనము దుర్లభమాయని నామది నొక ప్రశ్నముదయించెను. కొన్నిపద్యముల రచించితిని. వానిని విన్న నామిత్రులు విమర్శితపద్యముల

కంటె బాగున్నవనిరి ఇది వారన్నమాట. ఆత్మశ్లాఘయని యెంచకుఁడు. క్రమముగాఁ బద్యములను మొదటఁ దెనిఁగించుచుంటిని అపుడు బ్రి॥ జయంతి రామయ్యపంతులవారు, ఈనాటకమును శతావధానులు తిరుపతి వేంకటేశ్వరులు మున్నే తెలిఁగించిరని తెలిపిరి. ఒకప్రతి సంపాదింపఁగోరితిని. అందుఁ దిరుపతిశాస్త్రులవారు దివంగతులైరి. వెంకటశాస్త్రులవారియొద్ద నాకుఁ జనువులేదు. నన్నును మఱచియుందురు. అయినను నాబంధువుఁడు దుగ్గిరాల సూర్యప్రకాశరావుగారి ద్వారమునఁ దిరుపతిశాస్త్రి పుత్త్రునుండి యొకసంపుటము నెరవుగాఁ బుచ్చుకొంటిని. అందీనాటకమునంతను శ్రద్ధతోఁ జదివితినా వారిపదములు నిండు దొర్లి ఆంధ్రకవితాపితామహుఁడు వ్రాసినట్లు నాకుఁ గొంతను వెఱచి, కొలఁదిగాఁ జూచియే, వారిసంపుటము వారికంపివేసితిని. అనంతరాయ గ్రంథము నేను మొదలే చూడలేదు. ఒకరి యాంధ్రీకరణముకంటె మిన్నగా రచించు శక్తి నాకు లేదని యెఱుఁగుదును. అందుచేత నొకరు తెనిఁగించినట్లు విన్నరూపకము నే నెప్పుడును తెనిఁగింపఁగోరకొనలేదు.* అందునను, శతావధానులు, కింకవీంద్రఘటాపంచాననులు, అనేకనాటకాది పరిశ్శతగ్రంథకర్తలు. అధీతమహాభాష్యులు, ఏవంవిధానేక గుణప్రపూర్ణులు తిరుపతి వేంకటేశ్వరులెక్కడ? వైయాకరణఖసూచిని, "ఇతఃపురాపఠితశాస్త్రగ్రంథజాత్యం"ధుడను నేనెక్కడ? ఇది యెంచి తెలిఁగించుటనుగూర్చి నిరుత్సాహుఁడనైతిని. మహాకవులును, పండితులును, వినయవాక్యములం బచరించియున్నారు. 'మందః కవియశఃప్రార్థీ' త్యాదిచేఁ గాళిదాసుఁడు; 'న శబ్దశాస్త్రే నచతర్కశాస్త్రే నచాన్యశాస్త్రేష్వపి విశ్రుతోఽహ' మ్మని, ప్రతాపరుద్రీయ రత్నశాణవ్యాఖ్యాత; ఇట్టితెరులును గొందఱు వారి వాక్యములు యథార్థములు గావు. నావియథార్థములు మిత్రులు గొందఱప్పుడపుడు ప్రోత్సహించుచువచ్చిరి. ఇతరవ్యాపారశూన్యత చేత నావ్యసనము మఱలమఱలఁ దలచూపుచు వచ్చెను. వ్యసనమును స్వభావమువంటిదే! దానిందప్పించుకొనుటకుఁ బండితులకయినను. అసాధ్యము. అంతేకాని నాయీరచన పండితులపై స్పర్ధచేతఁగాదు. 'నస్పర్ధయా వ్యోమ్ని సహస్రధామ్నః ఖద్యోతకస్స్వాంద్యుతిమాతనోతి' అని సహృదయానందము. 'ఢిల్లికి ఢిల్లి, పల్లికి పల్లి' యను సామెత కలదుగదా! వీనితో మనసు సమాధానపర్చుకొని, యేనాఁడు గావలసిన వచనభాగము తొందరగాఁ దొలినాఁడు వ్రాసి దీనిని ముద్రింపించితిని.

ఆంధ్రీకరణమందలి చిక్కులు.

ఈచిక్కులు ఛిన్ననాఁడు నేను గనిపెట్టలేదు. 'యేన మయా, యస్య మమ, యత్, యావత్' ఇత్యాది సాకాంక్ష సర్వనామములు, ఈనాటకమందు లెక్కకు మీఱియున్నవి. అవి సంస్కృతభాషాశైలికిసామాన్యములు. ఆంధ్రభాషాశైలికిఁగావు యథాసంస్కృతముగాఁ దెనిఁగింపవలెనన్న నవి పనికిరావు. అందుచేత నాకుఁ బ్రాలు ప్రోదయ్యెను. 'సతి సప్తమి' కి, 'అవుచుంచున్నుండఁగా' అని కావ్యగురువులు విద్యార్థులకుఁ బాఠములఁ జెప్పుచుండఁగా వినియున్నాను. అట్లు, ఇందుఁ బ్రయోగింపవచ్చునని నాకుఁ దోఁచలేదు 'యదాజ్ఞాపయత్యుపాధ్యాయః,— ఆర్యః,— అమాత్యః,— కుమారః' ఈరీతి ప్రయోగములు తఱచున్నవి. వానిని సరిగాఁ దెనిఁగించుట అనవసరమని నాకుఁదోఁచి, విధేయతాసూచకమయి యీదేశవ్యవహారమందు వాడఁబడు 'చిత్తము' అను పదముతోఁ బెక్కుచోట్ల సరిపెట్టితిని. 'అవును' అర్థమునుసూచించు 'అథకిమ్' అను ప్రయోగము సంస్కృతమందుఁగలదు. అందుకు సమానార్థకము తెనుఁగున, 'మఱేమి' అనికదా! ఈమాటను విశాఖపట్టణమునుండి యీప్రాంతమునకు వచ్చినవారు వాడుట వినియున్నాను. ఈప్రాంతములవారు 'మఱే' అందురు, 'చెలి విజయంగనుంగొనుము (కనుఁగొను) ఉత్తరము. (జాబు) ఈపదములు గోదావరీయములని, యిక్కడికివారికేగాని, వాని సరియయిన యర్థము బోధింపదని, కళాప్రపూర్ణులాక్షేపించియున్నారు. అందుచేత, 'మఱేమి, మఱే' అనుమాటకు బదులుగా 'అవును' అనియే వ్రాసితిని. ముఖాముఖిసంభాషణమందు సంబోధనము తెనుఁగున వాడుకలో లేదు. విసుగుఁగూడఁ బుట్టించునేమో? అయినను, ఉపాధ్యాయ, భద్ర, అమాత్య, కుమార, దేవ, ఇత్యాది సంబోధనములు లెక్కకు మిక్కిలిగానున్నవి. ఉండనిమ్మని వానిని నేను విడువలేదు.

పద్యములు.

ఈనాటకమందు సంస్కృతమున శార్దూలస్రగ్ధరాదులు పెద్దవృత్తములుగలవు వానియర్థమంతయుఁ దెనుఁగువృత్తములోఁ దెచ్చుట నావంటివానికి దుష్కరమని నాకుఁదోఁచినది. అట్టివృత్తములు, అనంతరాయవిరచితములు, త్యక్తకతిపయమూల పదములని కళాప్రపూర్ణులాక్షేపించియున్నారు. వారి సీసములందలిపదములుకొన్ని అమూలకములు, వ్యర్థములనియాక్షేపించియున్నారు. అయినను త్యక్తమూలతను సైఁపక ఈరెండవయాక్షేపమునకు లోఁబడి నేను సీసములనే వ్రాసితిని. శ్రీనాథునంతటికవి సార్వభౌముఁడు సూర్యశతకశ్లోకములకుఁ దెనుఁగున సీసములు వ్రాసినాఁడఁట. అల్పజ్ఞునకు నాకుఁ గంచకికివలెనే సీసమే మెత్తనిదిగదా! మఱియు శ్లేషానుప్రాణితమయిన పదములను మక్కికి మక్కిగాఁ బెట్టితిని. వచనములందక్కడక్కడఁ బదములకుసంధి

* నాగానందమును వేదము వేంకటరాయశాస్త్రులవారు తెలిఁగించుట నాగ్రంథ మచ్చుపడ్డతరువాతఁ దెలిసినది.

గూగ్వకమానితిని ఈవ్రాతను సహించుటకుఁగాని, గర్హించుటకుఁగాని, పండితులే ప్రమాణము.

ఇందుకుమూలమయిన సంస్కృతగ్రంథమునుగూర్చి — నాకుపలబ్ధములయిన మూలగ్రంథములలో, ఆంగ్లేయటిప్పణముతో ఢుంఢిరాజవ్యాఖ్యానముతోను, సంపాదకులు కీ. శే. టిలాంగుగారు ప్రకటించిన ప్రతియొకటి. అందు పాఠభేదములు పెక్కులు. ప్రతిపుటయందధోభాగమునఁ జాలనిరకటముతో సూచింపఁబడినవి. వాని నన్నిటిని విడఁదీయుటకుఁ గాలహరణముమాత్రమే ఫలమని తోఁచినది. వ్యాఖ్యయుఁ బ్రతిపదవ్యాఖ్యగాదు. పండిత శీంకనకలాల శర్మగారి భావబోధినీవ్యాఖ్యతో, శ్రీహరి కృష్ణదాసుఁడు, కాశిలో 1921 సం॥రమునఁ బ్రకటించిన ప్రతియొకటి. ఇది ప్రతిపదవ్యాఖ్య, సమాసవిగ్రహములున్నవి. అవి పునరుక్తములయినను విడిచినవాఁడు గాఁడు. ఇంత విపులవ్యాఖ్యను మఱియొకటి నేఁజూచియుండలేదు. ఇంచుక పరిజ్ఞానమున్నను సంస్కృతభాషాజిజ్ఞాసువులకిది మహోపకారి. ముఖ్యముగా దీనినాధారముగాఁజేసికొని తెనిఁగించితిని. తెనుఁగు సాక్ష్యశాసనము చదువునపుడు ఇంగ్లీషు అష్ట సాహాయ్యములేనిది కొన్నిసూత్రముల యర్థములు తెలియకుండెను అట్లే యిందలి తెనుఁగుపద్యములును సంస్కృతశ్లోకసాహాయ్యము నపేక్షించునేమో యనుకొనుచున్నాను. 'కావ్యాలాపాంశ్చ వర్జయే' త్తనుటను లక్ష్యముగా 'తస్య ముద్రారాక్షసాద్యసత్కావ్యవిషయత్వాత్' అని యహోబలపతి పండితీయములో నీగ్రంథము పేర్కొనంబడ్డది. అదిచూచి, 'తుదకబ్బెగా తురకబాస' యన్నట్లు యిదియేల యీవయస్సునఁదెనిఁగింపదగునని సంకోచమొదవియు, చాణక్యుని మహాప్రభావమును లక్ష్యముంచుకొని తెనిఁగించితి. 'చాణక్యప్రథితప్రభావ' యని కృతిపతినిఁ దెనాలి రామకృష్ణుఁడు సంబోధించినాఁడుగదా!

విమర్శముఁగూర్చి.

'ఒప్పులుగ్రహింపకెప్పుడుఁ దప్పులరయు కాకవుల లోకమును నేనిగాకరింతు' బిల్హణీయకవి. ఇట్లే యించుమించుగా నందఱుకవులును భావివిమర్శకులనునిందించిరి. నేనట్లు నిందింపను. నాకంటె నధికులంగాదుసరే, నాకంటె నధములను నిందింపను. ఏమా? మనము చేఁ చూచునపుడు వంటకమునందు దోషముల నెన్నుదుము. అంతకుఁ దక్కువగానైనను వండఁజాలము. ఏశిల్పమునయినను నిందింతుము. ఆరీతి శిల్పరచనమయినను మనకుఁ జేతఁగాదు. అట్లే గుణదోషవిచారముపట్ల లోకులందఱికి స్వాతంత్ర్యముగలదు, భాషయందు దోషములు రాకుండ నాపుటకిది యొకసాధనము. కనుక దూషకులకయినను వందనములు. నాటకాంధ్రీకరణమునందలి దోషములనుగూర్చి,

బ్ర॥ మహామహోపాధ్యాయ తాతా సుబ్బారాయశాస్త్రివారి సూచనాసంగ్రహమును, ప్రజోత్పత్తి శ్రావణభారతిలోఁ బ్రకటితమును, నేను, ఈనాటకసమాప్త్యనంతరము, అచ్చునుం బూర్తికావచ్చుతరి మొన్నమొన్నఁ జూచితిని.

సిద్ధార్ధానుస్వారములు, శకటరేఫములు.

పూర్వము పదముల యుచ్చారణస్వరమునుబట్టి వీనిని దెలిసికొననువుగానుండెననియు, ఇపుడాస్వరము మాసెననియు నామతము. సంస్కృతపదములందే, (వేదమందుఁదప్ప) అనుదాత్త, స్వరితస్వరములిపుడు వినఁబడవుగదా!కనుక సిద్ధార్ధానుస్వారరేఫములకు నిఘంటువులు శరణ్యము. వానిలో నభిప్రాయభేదములు గలిగినవి. అప్పకవి సీసమాలికను వల్లించుటకుఁగాని, నిఘంటువులను సావధానముగా విమర్శించుటకుఁగాని యిపుడు నాకోపికలేదు. కనుక వానినిఁగూర్చిన స్ఖాలిత్యములు మన్నింపఁబడుఁగాక యని కోరిక.

తుదిమనవి.

నేనీగ్రంథముఁ బ్రకటించుట ద్రవ్యలాభముం బ్రధానముగాఁ జేసికొనికాదు. నాకు హృదయగోచరులయిన కవిపండితులకును, మిత్రులకును దీనిప్రతులను సమర్పించుచున్నాను. వారు తమగ్రంథములలో దేనినైనఁ బంపిరేని కృతజ్ఞతతో స్వీకరించెదను. ఇంకనుదానీయులు పెక్కురుండవచ్చును. తెలియకయు, వార్థకముంజేసి జ్ఞప్తికిరాకయు, ఆదరింతురో లేదో యను సంశయము పోకయు, వారికిఁ బంపలేదు. పిపఠిషువులయిన నామిత్రులెవ్వరయిననుండిరా, వారువ్రాసిరేని వారికి నూరకసమర్పించెదను.

అచ్చుతప్పులు.

ముద్రాశాల సమీపమందున్నను, నేను తొందరగా మాతృకవ్రాసియిచ్చుట, కొన్నిపుటలు చిత్తుగానుండుట, నావ్రాలు కొన్ని ముద్రాశాలవారికిఁ దెలియకుండుట, నేను ప్రూఫులు రెండుసారులు సవరించినను, వారు తుదిప్రూఫును జాగ్రత్తతో గమనింపకుండుట, ఇత్యాది హేతువులచేత నచ్చటచ్చటఁ దప్పులుపడ్డవి. విశ్రమస్థానసూచకములయిన పువ్వులు కొన్ని తప్పుచోటులంబడ్డవి. అవి సుకరముగాఁ గనిపెట్టవచ్చును. శీఘ్రముగా నచ్చుముగించిన మారుతి ముద్రాశాలవారికిఁ గృతజ్ఞుఁడను.

నాగానంద, జానకీపరిణయములు త్వరలో నచ్చువేయించుచున్నాను.

అమలాపురము
అంగీరస-మార్గశిరము
1932 డిశంబరు.

ఇట్లు.
పాలెపు వేంకటసూర్యగోపాలము.

కథాసంగ్రహము.

ఆర్యావర్తదేశములందు మగధమను పట్టణముగలదు. అందుఁ బూర్వము బలిష్ఠుఁడు జరాసంధుఁడను మహారాజుగలఁడు. అతనిం దొట్టి సప్తత్రింశత్తముల భూపాలుర పిమ్మట నవకోటిశతేశ్వరుఁడు నందుఁడు రాజయ్యెను. అతనికి రత్నావళియను పేరిటి పట్టపురాణి, సద్గుణభూషిత గలదు. అతనికి, విఖ్యాతపౌరుషులు, శూరులు. తొమ్మండ్రుకొడుకులు. అందు మొదటివానిపేరు చంద్రగుప్తుఁడు. ఇతఁడు దాసి మురయందుఁగలిగెను. జ్యేష్ఠుఁడయ్యును, దాసీగర్భోద్భవుఁడను హేతువుచేత నీతనిని సోదరులు త్యజించిరి. విద్వేషభాజనుఁడయిన యితఁడు మిగుల ఖేదించుచు, దైవదోషమును విచింతించుచు, కాలముగడపుచుండెను. ఆనందరాజు కులామాత్యులు బ్రాహ్మణులు, గుణసంపన్నులు, వక్రనాసాదులు ముగ్గురు. ఆమంత్రులలో దండనీతివిచక్షణుఁడు, షాడ్గుణ్యప్రవిభాగజ్ఞుఁడు, శూరుఁడు, బలి, సద్బుద్ధిభాసురుఁడు, రణమందుసాహసి, రాక్షసుఁడను భూసురుఁడు నందునికిఁబ్రియుఁడు, రాజకార్యకరుఁడయి రాజస్నేహమునకు మిగులఁ బాత్రమయ్యెను. అంతనొకనాఁడు నందుఁడు, తీవ్రస్వభావకుఁడు శకటారుఁడనువానిని ద్వేషించి సపుత్రదారముగా నతనినిఁ జెఱసాలం బెట్టి, దినమునకయిదుపలముల సెలగలను అన్నిగేజలములను మాత్ర మిచ్చుచుండునదియనియు, ఎవరినివిడువరాదనియు భృత్యులకాజ్ఞాపించెను. ఈదురవస్థనుగూర్చి పుత్రులతో నాలోచింపఁగా వారు, ఈబత్తెముతో జీవితముగాపాడుకొని ప్రతీకారముం జేయఁగోరిరి. తండ్రియిట్లు జీవించుచుండఁగా వారుక్రమముగాఁ బ్రాణములం బాసిరి. తరువాతఁ గొంత కాలమునకు రాజు చెఱసాలం జేరి, చచ్చినశకటారపుత్రుల యెముకలును, శల్యావశిష్టుఁడయిన శకటారునిఁ జూచి అప్పుడు జాలిపడి యాతనిని చెఱనుండి విడిపించెను. శకటారుఁడు తనపగదీర్చుకొనుట కుపాయము వెదకుచు, దేశములుతిరుగు నాఁడొకనాఁడొక యడవినడుమ, మీసము పెరిగినవానిని, దద్దుర్లతోనిండిన మేనివానిని ఎత్తువెండ్రుకలవానిని, నల్లనివానిని, దర్భమొక్కలనన్నిటి నొక్కటొక్కటిగా నూడబెరికి మొదటఁ జల్లఁబోయుచున్న వానిని, తేజస్విని, మితవాక్కును, విష్ణుగుప్తుఁడను విప్రునింజూచెను. చూచి వినమితుఁడై యాతనివృత్తాంతమును గ్రుచ్చిగ్రుచ్చి యడుగఁగా తనపేరు చాణక్యుఁడనియు సాంగముగా నాల్గువేదములం జదివి, కొంత కాలమైనపిమ్మట దారపరిగ్రహమునకయి యాత్రోవనే వెళ్లుచుండఁగా నీదర్భలు కాలికి గ్రుచ్చుకొని యందువలని యాశౌచముచేఁ బెండ్లికంతరాయముగలిగినందున నామశత్రువుల దర్భల నూడఁబెరికి మరలఁబుట్టకుండ వేళ్లుతినివేయు చీమల కాహారమునిమిత్త మీచల్ల నిందు జల్లుచున్నాననియు, ఋణాగ్నిశత్రుశేషములుండనీయరాదనియు నామశలుఁడు చెప్పెను

అంతట శకటారుఁడు, ఇతనికి నందునితో శత్రుత్వము పుట్టినయెడలఁ దనకు మేలగునని యెంచి చాణక్యునితో నగరమునకురమ్మనియు, నీడవలె సర్వదానిన్నుపకరించెదననియు, అనేకజనమును నియోగించి ప్రపంచమందలి కుశలనన్నిటి నూడఁబెరికించి భూతలమును నిష్కుశముగాఁజేసెదననియుఁ జెప్పెను. దానికీయకొని చాణక్యుఁడువచ్చి నగరమందువసియించెను. అపుడు నందునింటనొక శ్రాద్ధదివసమువచ్చెను. శకటారుఁడు చాణక్యునిఁ దీసుకవచ్చి, అగ్రపీఠమునందుఁ గూర్చుండఁబెట్టి, తనకుఁ బనియున్నదని వెళ్లిపోయెను. అంతట నందమంత్రి, రాక్షసుఁడు, ఒకపండితునితోఁగూడ శ్రాద్ధమండపమునకువచ్చి, శకటారునిచేఁ దేఁబడ్డవానిని, చాణక్యుని, గాంచి సర్వలక్షణుఁడయిన యీబ్రాహ్మణునిఁ దాను శ్రాద్ధమునకై తెచ్చితిననియు, శకటారుఁడు నల్లనిమేనివానిని, శావదంతుని, రక్తనేత్రుని, కులక్షణుని, పీటపైఁగూర్చుండఁబెట్టి, తనకు దండనగల్గునని యెచటికో వెళ్లిపోయెననియు రాజుతోఁజెప్పఁగా రాజుకోపించివచ్చి, చాణక్యుని జుట్టుపట్టుకొని పీటనుండి క్రిందికి లాగించెను. అంతఁ జాణక్యుఁడు నల్లత్రాఁచువలె నుగ్రుఁడై భూమినిఁ గాలితోఁదన్ని "రాజా, నీ అవినీతికి ఫలమనుభవింతువుగాక. ఓసభాసదులారా! వినుండు. సుగర్వితులయిన నందవంశుల నందఱిని ఉన్మూలింపకుండ నేనీజుట్టు ముడువను" అని శపథముచేసెను. మఱియు నందరాజ్యమభిలషించువాఁడు నాతోఁగలియవలసినదని ఘోషించెను. అప్పుడు చంద్రగుప్తుఁడిట్లు ఆలోచించెను. "నందకులంబుండఁగా నాకు రాజ్యమురాదు. ఇతనిప్రసాదమువలన రాజ్యములభించెనా మహాప్రయోజనము గలుగును. దేశాంతరమునకు వెళ్లి తన్నుఁ గాపాడుకొనియెదను" అని నిశ్చయించి చాణక్యునిఁ జేరెను. అట్లువెళ్ళఁగా భృత్యులయిన భద్రభటాదులును అతనిననుసరించిరి. అంతట, చాణక్యుఁడు అనేకములయిన యుపాయములచేత రాజ్యమును సంపాదించి చంద్రగుప్తునిం బ్రతిష్ఠించెను. ఆరాజ్యము స్థిరముగా నిల్చుటకై రాక్షసుని మంత్రిగా సంపాదించుటకొఱకుఁ బన్నిన తంత్రమే, యీనాటకమందుఁ బ్రదర్శింపఁబడినది.

ధుంఢిరాజ రచిత కథాసంగ్రహము.

'నందాంతం క్షత్రియకుల' మని పురాణగాథ. కలియుగారంభమందు నందులని పేరిట రాజులు కొందఱు గలరు. వారియందు సర్వార్థసిద్ధియను నతఁడు విఖ్యాతపౌరుషుఁడు. నవకోటిశతేశ్వరుఁడు. అతఁడు చిరకాలము భూమిపాలించెను. వక్రనాసాదులు బ్రాహ్మణులతనికి కులామాత్యులు. వారిలో రాక్షసుఁడను బ్రాహ్మణుఁడు దండనీతిప్రవీణుఁడు, షాడ్గుణ్యవిభాగవేత్త, శుచి, శూరతముఁడు, నందుల మన్ననలంబడసి రాజ్యభారమువహించెను. ఆరాజు పెద్దభార్యపేరు సునంద. రెండవ

యామె వృషలుని కూఁతురు ముర. ఆమె శీల లావణ్య సంపదచేత భర్తకుఁ జాల ప్రియురాలు. ఒకనాఁడు తనయింటికి వచ్చిన యతిథిని, తపోధనుని, అర్ఘ్యపాద్యాది విధులచే భార్యలు, తానును పూజించెను. అతని పాదోదకమును తన భార్యల శిరస్సులమీఁదఁ జల్లెను. అందుఁ తొమ్మిదిబిందువులు పెద్దభార్యతలపయిఁ బడెను. ఒక బిందువు మురనెత్తిమీఁదఁ బడెను. దాని నామె భక్తి వినయములతో గ్రహించెను. ఆయాదరముచూచి యీయతిథి యామెపట్ల మిగులఁ బ్రసన్నుఁడయ్యెను.

మురకు గుణవత్తముఁడయిన మౌర్యుఁడను కుమారుఁడు కలిగెను. సునంద కడుపున నొక పెద్ద మాంసపుముద్ద కలిగెను. అది తొమ్మిది గర్భశకలములయ్యెను. వానిని నూనెకుండలలోఁ బెట్టి రాక్షసుఁడతిప్రయత్నముతోఁ బోషించెను. అందుండి వీరులయిన తొమ్మండ్రు కుమారులు పుట్టి రాక్షసునిచేఁ బెంపఁబడిరి. తండ్రి వారికి నందులని పేరిడెను. రాజు వృద్ధుఁడయి వారికి రాజ్యమప్పగించి, మౌర్యుని సేనాధిపతిం జేసెను. చంద్రగుప్తుఁడాదిగా మౌర్యునకు నూర్గురు కొడుకులు గలిగిరి. మహాబలులయిన యీనూర్గురు కొడుకులచేతను మౌర్యుఁడు నందుల నతిశయించినట్లయ్యెను. అంత దురాత్ములు నందులు, అసూయచేత మంత్రవ్యాజముచే సంహరించువారై మౌర్యుని సపుత్రముగా అంతర్భూమిగృహమందుఁ బెట్టిరి అంత సింహళదేశాధిపుఁడు మైనముతో సింహముఁ జేయించి, బ్రతికియున్నదానివలెనే పంజరమందుఁ బెట్టించి నందులకుఁ బంపించి, ఇట్లు వర్తమానించెను. ఎవఁడు ఈపంజరము ద్వారము తెరవకుండ క్రూరమైన యీసింహమును విద్రావించునో, అట్టి సుమతి మీకు గలఁడా యని సందేశమంపెను. ఆవాక్ఛలమును దెలిసికొనలేక మందులయిన నందులు కొంచెకొంచెము జీవముతోనున్న చంద్రగుప్తుని బయటకు రప్పించిరి. మేధావియగు చంద్రగుప్తుఁడు కిటుకు గ్రహించి యినుపకోలఁ గాల్చి ఆమైనపుసింహమునకు అంటించి ఆమైనపు సింహమును కరఁగించి, సకలజనులను ఆశ్చర్యపఱిచెను. నందులు వానిం జంపఁగోరినవారయ్యు, పైహేతువుచేత నాతనిని భూబిలమునుండి తీసి వెడలఁగొట్టిరి. భావికాల దైవసంపదచేత నతఁడు జీవించెను. అజానుబాహుతాది రాజలక్షణలక్షితుఁడు, ఔదార్యశౌర్యగాంభీర్యనిధి, వినయవారిధి, యిట్టివాఁడయ్యును, దుష్టులు, ఈర్ష్యాళువులు నగు నందులకసహ్యుఁడయ్యెను. దురాత్ములీనందులాతని వేదోమిషచేఁ జంపనెంచిరి. అక్కడ సత్రాధికారమందు వారిచే నియుక్తుఁడయి చంద్రగుప్తుఁడు, నందాపచికీర్షుఁడై కాలముఁ గనిపెట్టుచు అక్కడనె యుండెను.

ఇట్లుండి యొకప్పుడతికోపనుఁడయిన యొక బ్రాహ్మణునిఁ జూచెను. అతఁడు తనకాలికి గ్రుచ్చుకొన్న కుశనూడఁ బెరికి కాల్చుటకు మహాప్రయత్నము చేయుచుండెను. ఇతఁడు నందోన్మూలనసమర్థుఁడని యెంచి శరణొంది తనయిష్టసిద్ధికాతని నాశ్ర

యించెను. అతని పేరు విష్ణుగుప్తుఁడు' బాలుఁడు. శుక్రదండనీతియందును, జ్యోతిశ్శాస్త్రమందును, పారగుఁడు. నీతిశాస్త్రప్రణేత యగు చణకుని నందనుఁడు. చాణక్యుఁడని విఖ్యాతుఁడు. శ్రోత్రియుఁడు. సర్వధర్మవిదుఁడు. గుణాఢ్యుఁడైన చంద్రగుప్తునియందతనికిఁ జాలపక్షపాతము కలిగెను. తనవ్యసనము చంద్రగుప్తుఁడాతనికి నివేదించెను. నందరాజ్యమాతనికి ప్రతిజ్ఞచేసి యొకనాఁడాఁకలిగొని, నందుల భోజనశాలయందు ప్రవేశించి, అగ్రాసనమందుఁ గూర్చుండెను. నందులు కాలోపహతచేతసులై, ఆమహాత్మునికిం గోపించి, వలదు వలదని మంత్రులు వారించుచున్నను, కట్టవాఁడని యవమానించి పీటనుండి లేవఁగొట్టిరి. చాణక్యుఁడు క్రోధాంధుఁడై మధ్యేశాలమునఁ జేతితో జుట్టువిప్పి తీవ్రమైన ప్రతిజ్ఞ నిట్లు కావించెను. 'నన్నెఱుఁగక, దర్పాంధులు, దుర్మతులునైన యీనందాధముల నున్మూలింపకుండ నేను జుట్టు ముడివేయను' అని పలికి క్షుభితమానసుఁడయి, పురమునుండి వేవేగ వెడలిపోయెను. ఉద్ధతులానందులు చెడుకాలము ప్రాప్తించి క్రుద్ధునాతనిని బతిమాలుకొనరైరి. ఆచంద్రగుప్తుఁడును, అపుడు తనకు నిగ్రహము కలుగునని భయాకులుఁడయి నగరమునుండి రహస్యముగా వెడలిపోయి చాణక్యునాశ్రయించెను.

చాణక్యుఁడు చంద్రగుప్తునుపసంగ్రహించి, నందకులోన్మూలనమునకయి కుటిలమయిన నీతిం బ్రయోగించెను. తనమిత్రుఁడు, ఆభిచారికవేత్త, ఇందుశర్మ యను బ్రాహ్మణునికి క్షపణక (బుద్ధసన్యాసి) వేషముఁ గల్పించి రాక్షసాదులను వంచింపించెను. నందరాజ్యమందు సగమిత్తునని మ్లేచ్ఛరాజు పర్వతేశ్వరుని కాశపెట్టి యాతనిమహాబలముతోఁ గుసుమపురమును ముట్టడింపించెను. శూరుఁడయిన మంత్రిరాక్షసుని సహాయముచే నందులెదుర్కొనఁగడఁగిరి. రాక్షసుఁడు దుర్జయమయిన యీమహాబలమును జూచి మోసముచేతఁ జంద్రగుప్తునిఁ జంపఁదలంచెను పర్వతేశ్వరబలవాయువుచే రగులుకొన్న చాణక్యక్రోధాగ్నికి నందులందఱు మిడుతలయి నశించిరి. రాక్షసుఁడు క్షీణబలపౌరుషుఁడయి, పురము సురక్షముగామి నెఱింగి, నందవృద్ధుని, సర్వార్థసిద్ధిని నందానురక్తులయిన జనులచేత రహస్యముగా సురంగద్వారమునఁ బురమునుండి వెలువరించి, సఖ్యమును నటించుచుఁ బట్టణము మౌర్యునికి వశపఱిచెను. అభిచారముచే నొక విషకన్యకం బుట్టించెను. దానితోనొకమాఱు పొందే మరణముగలిగించును. ఆకన్యను మౌర్యునిపయి కాగేశించెను. ఈమోసమును గ్రహించిన చాణక్యుఁడా కన్యచేఁ బర్వతేశ్వరుం జంపెను. అతనికొడుకు మలయకేతునకు సత్యముదెలిపించి భయపఱిచి పాఱిపోఁగొట్టెను. ఆరాజకమయిన కుసుమపురము వశపఱిచికొనియు, నందానురక్తులయిన ప్రజలనుగూర్చి శంకించి వెంటనే ప్రవేశింపఁడయ్యెను. పురమందుఁ బ్రవే

శించుచున్నపుడే రిపులను జంపుటకయి రాక్షసుఁడు తన మిత్రులయిన దారువర్మాదుల చేతఁ గూటయంత్రములు సిద్ధపఱిపించెను. కుటిలప్రజ్ఞుఁడయిన చాణక్యుఁడిది నియంత్రయుఁ దెలిసికొనెను. రాక్షసుఁడే విషకన్యచేతఁ బర్వతేశ్వరుం జంపించెనని యపవాదముం బ్రకటించెను. తనమీఁద నపవాదము రాకుండఁ దప్పించుకొనుటకయి పర్వతేశ్వరున కిచ్చెదనన్న యర్ధరాజ్యము తత్సోదరుఁడు వైరోచకున కాసపెట్టెను. వనమందుఁ దప మాచరించుకొనుచున్న సర్వార్థసిద్ధిం జంపించెను. ఇదివిని దుఃఖితుఁడయి రాక్షసుఁడు మలయకేతుం జేరి యాతని నిట్లు ప్రోత్సహించెను. "అక్కడ నెలకొన్న మౌర్యుని బలిమిచే నున్మూలించెదను. దివంగతుల ప్రభువుల ఋణము దీర్చికొనియెదను. ప్రాకులం తఱు మనయందనురక్తులు. చంద్రగుప్తుని పాంశువుగ సంహరించుటకుఁ బురమందు నాయాప్తులు జాగరూకులయి యున్నారు. సర్వోపాయవిక్రమములచేత నీహితము ఘటియింతుము. సకౌటిల్యముగా మౌర్యుని జయింపుము. ఆనందరాజ్యము నీది కాఁగలదు. పాపియయిన చాణక్యుఁడే విషకన్యం బ్రయోగించి, యర్ధరాజ్యహారియయిన నీతండ్రిని నాశమొందించెను. ఉపాయముచేతనైనను, బలముచేతనైనను, సర్వథా వీనిని సంహరించెదను. రాజ్యమంతయు నీకుఁగూర్చి నాస్వాముల ఋణము దీర్చికొందును." అని ప్రోత్సహించి రాక్షసుఁడు మ్లేచ్ఛబలములం గూర్చెను.

ఇది కథాసంగ్రహము. తరువాతివృత్తము నాటకమందుఁ గవిచేఁ గూర్పఁబడినది.

ముద్రారాక్షసము— సంస్కృతనాటకమును గూర్చి టిలాంగ్ మహాశయుల యుపోద్ఘాత సారాంశము.

ఈనాటకము అనేకవిషయములం దద్వితీయముగా నున్నది. కథ కేవలకల్పితము గాదు. సంస్కృతకవులు సాధారణముగాఁ గైకొన్నట్టి పురాణగాథలనుండి కైకొన్నదియుఁ గాదు. ఈనాటకపాత్రములందు స్త్రీపాత్రమొకటియే యని చెప్పనొప్పును. అది చందనదాసుని కుటుంబిని. నాటకముతుదను సప్తమాంకమందు వచ్చుచున్నది. ఆపాత్రమయినను శృంగారరసాభినయమునకుఁ గాని, గృహకృత్య నిర్వహణప్రదర్శనమునకుఁ గాని కాదు. ప్రాణపరిత్యాగనిమిత్తము లోవచ్చుచున్నది. కవిత్వశైలి నాటకకథ కనురూపముగా నున్నది. మాధుర్యమునకుఁ గాని, మార్దవమునకుఁ గాని లక్ష్యభూతము గాదు.

పాత్రములను గూర్చి - నిర్దిష్టజనులస్వభావము— సత్స్వభావమును దుస్స్వభావమును— సరిగా వర్ణింపఁబడినది. అందుఁ బ్రధానపాత్రము చాణక్యుఁడు సుప్రకాశమతి, తనయందు దృఢప్రత్యయుఁడు, కుటిలతంత్రపారీణుఁడు, రాజనీతికుశలుఁడు, ఉగ్రుఁడు

గాను దనతంత్రములను మిగులనేర్పుతోఁ బ్రయోగించి తనప్రతిజ్ఞను నెరవేర్చుకొన్నవాఁడుగాను బ్రదర్శింపఁబడెను. మఱియుఁ దనతంత్రములు తనశిష్యుఁడయిన శార్ఙ్గరవునికయినను తనభృత్యులయిన భాగురాయణాదులకయినను దెలియనంత గూఢముగాఁ బ్రయోగించుట ప్రదర్శింపఁబడెను.

ఇఁక నతని ప్రతిపక్షుఁడు రాక్షసుఁడు నందరాజమంత్రి యెట్లు ప్రదర్శింపఁబడె ననఁగా— మహాశూరుఁడగు యోధుఁడయ్యును, స్ఖలితుఁడు, మృదుహృదయుఁడు, తన మొదటిప్రభువులపట్ల భక్తి, అప్రభువుల నున్మూలించిన చాణక్య చంద్రగుప్తులపైని బగదీర్చుకొనుటకుఁ బ్రేరేచినను శత్రుతంత్రములం జేసి విఫలుఁడయి తనయత్నము మానుకొనెను.

నాయకుఁడు చంద్రగుప్తుఁడు— ప్రౌఢుఁడయిన సార్వభౌముఁడుగాను, దృఢశీలుఁడుగాను, సామర్థ్యముఁబట్టియు, తంత్రశక్తినిఁబట్టియుఁ దానునమ్మఁదగినమంత్రిపట్ల దృఢవిశ్వాసముగలవాఁడుగాను ప్రదర్శింపఁబడెను.

ప్రతినాయకుఁడు మలయకేతుఁడు— తననమ్మకము రాక్షసునియందును, అపనమ్మకము భాగురాయణునియందును గలుగవలసినందుకుఁ దారుమారు చేసినవాఁడుగాను, సందిగ్ధచిత్తుఁడుగాను, గాంభీర్యహీనుఁడుగాను, బాలచేష్టితుఁడుగాను, ప్రదర్శింపఁబడియెను.

చాణక్యచారులు— పరమభక్తిప్రవీణులుగాను, ఆజ్ఞావిధేయులుగాను, కార్యదక్షులుగాను, ప్రదర్శింపఁబడిరి.

కథారచన— మిగులనేర్పుతోఁ గావింపఁబడినది. మృచ్ఛకటికముఁ దప్ప, తక్కిన సంస్కృతనాటకముల రచనకిది తీసిపోదు.

కవి విశాఖదత్తుఁడు.

ఇతని కాలముం గూర్చి విశ్వసనీయమయిన యాధారము లభింపలేదు. క్రీస్తుశకము ఎనిమిదవశతాబ్ది మొదటిభాగమువాఁడని కనిపించుచున్నది. ఇతఁడు రాజవంశమువాఁడని ప్రస్తావనంబట్టి తెలియును.

ఈనాటకమందువచ్చు పాత్రములు.

పురుషులు:—

సూత్రధారుఁడు.

చాణక్యుఁడు— చంద్రగుప్తమంత్రి (తద్రాజ్యస్థాపకుఁడు.)

శార్ఙ్గరవుఁడు— చాణక్యశిష్యుఁడు.

నిపుణకుఁడు— చాణక్యచారుఁడు. యమపటముతో కుసుమపురవృత్తాంతమరసి రాక్షసుని ముద్రాంగుళీయకము సంపాదించిన వాఁడు.

సిద్ధార్థకుఁడు— చాణక్యచారుఁడు

చందనదాసుఁడు— రత్నవర్తకుఁడు–రాక్షసప్రియమిత్రుఁడు.

విరాధగుప్తుఁడు— రాక్షసచారుఁడు–పాములవాని వేషముతోఁ గుసుమపురవృత్తాంత మరసినవాఁడు

రాక్షసుఁడు— నందరాజమంత్రి.

జాజిలి— మలయకేతుని కంచుకి.

ప్రియంవదకుఁడు— రాక్షససేవకుఁడు.

శకటదాసుఁడు— రాక్షసుని మిత్రము, కాయస్థుఁడు.

వైహీనరి— చంద్రగుప్తుని కంచుకి.

చంద్రగుప్తుఁడు— కుసుమపురాధిపతి.

కరభకుఁడు— రాక్షసుని గూఢచరుఁడు.

ద్వారపాలకుఁడు—

వేత్రిహస్తుఁడు—

మలయకేతుఁడు— పార్వతీయమ్లేచ్ఛరాజు (ప్రతినాయకుఁడు.)

భాగురాయణుఁడు— చాణక్యదూత (మలయకేతుం జేరి మోసపెట్టినవాఁడు.)

జీవసిద్ధి— క్షపణకవేషధారి–చాణక్యమిత్రుఁడు (రాక్షసునిఁ జేరి మోసగించినవాఁడు.)

భానురకుఁడు— మలయకేతుభృత్యుఁడు.

సుసిద్ధార్థకుఁడు— సిద్ధార్థకుని మిత్రుఁడు.

జీర్ణోద్యానగతపురుషుఁడు— చాణక్యచరుఁడు–ఛద్మవేషి.

వజ్రలోముఁడు— చండాలవేషి (సిద్ధార్థకుఁడు.)

వేణువేత్రకుఁడు— ద్వితీయచండాలవేషి (సుసిద్ధార్థకుఁడు.)

చందనదాసుని కొడుకు—

స్త్రీలు:-

నటి—

శోణోత్తర— చంద్రగుప్తుని ప్రతీహారి.

విజయ— మలయకేతుని ప్రతీహారి.

చందనదాసుని భార్య—

శ్రీరస్తు.

ముద్రారాక్షసశ్లోకాః

ప్రథమాంకః

ధన్యా కేయం స్థితా తే శిరసి శశికలా కిన్ను నామైతదస్యా నామైవాస్యాస్తదేతత్పరిచితమపి తే విస్మృతం కస్య హేతోః । నారీం పృచ్ఛామి నేందుం కథయతు విజయా నప్రమాణం యదీందుర్దేవ్యానిహ్నోతు మిచ్ఛోరితి సురసరితం శాఠ్య మవ్యాద్విభోర్వః ॥ ౧ ॥

పాదస్యావిర్భవంతీ మవనతిమవనే రక్షతస్స్వైరపాతైస్సంకోచేనైవ దోష్ణాం ముహురభినయతః సర్వలోకాతిగానాం । దృష్టిం లక్ష్యేషు నోగ్రజ్వలనకణముచం బధ్నతో దాహభీతే రిత్యాధారానురోధాత్త్రిపురవిజయినః పాతు వో దుఃఖనృత్యం॥

చీయతే బాలిశస్యాపి సుక్షేత్రపతితా కృషిః ।
నశాలే స్తంబకరితా వప్తుర్గుణమపేక్షతే ॥ 3 ॥

వహతి జలమియం పినష్టి గంధానియమియముద్గ్రథతే స్రజో విచిత్రాః ।
ముసలమిదమియంచ పాతకాలే ముహురనుయాతి కలేన హుంకృతేన ॥ ౪ ॥

గుణవత్యుపాయనిలయే స్థితిహేతో స్సాధికే త్రివర్గస్య ।
మద్భవననీతివిద్యే కార్యాచార్యే ద్రుతముపైహి ॥ ౫ ॥

క్రూరగ్రహస్స కేతుశ్చంద్రమసం పూర్ణమండలమిదానీం ।
అభిభవితు మిచ్ఛతిబలాత్ రక్షత్యేనం హిబుధయోగః ॥ ౬ ॥

కౌటిల్యః కుటిలమతి స్సఏష యేన క్రోధాగ్నౌ ప్రసభమదాహి నందవంశః ।
చంద్రస్య గ్రహణమితి శ్రుతేస్సనామ్నో మౌర్యేందోర్ద్విషదభియోగఇత్యవైతి ॥ ౭ ॥

ఆస్వాదిత ద్విరదశోణిత శోణశోభాం సంధ్యారుణామివకలాం శశలాంఛనస్య ।
జృంభావిదారితముఖస్య ముఖాత్స్ఫురంతీం కోహర్తుమిచ్ఛతి హరేః పరిభూయ దంష్ట్రాం ॥ ౮ ॥

నందకులకాలభుజగీం కోపానల బహుళనీల ధూమలతాం ।
అద్యాపి బధ్యమానాం వధ్యః కోనామ నేచ్ఛతి శిఖాం మే ॥ ౯ ॥

ఉల్లంఘయన్మమ సముజ్జ్వలతః ప్రతాపం కోపస్య నందకులకాననధూమకేతోః ।
సద్యః పరాత్మపరిమాణవివేకమూఢః కశ్శాలభేన విధినా లభతాం వినాశం ॥ ౧౦ ॥

శ్యామీకృత్యాననేమా నరియువతిదిశాం సంతతైశ్శోకధూమైః కామం మంత్రి
ద్రుమేభ్యో నయపవనహృతం మోహభస్మ ప్రకీర్య । దగ్ధ్వా సంభ్రాంతపౌరద్విజగణ
రహితాన్నందవంశప్రరోహాన్ దాహ్యాభావాన్న ఖేదాజ్జ్వలన ఇవ వనే శామ్యతి
క్రోధవహ్నిః ॥ ౧౧ ॥

శోచంతో౽వనతై ర్నరాధిపభయాద్ధిక్ఛబ్దగర్భై ర్ముఖై ర్మామగ్రాసనతో౽-
వకృష్టమవశం యే దృష్టవంతః పురా । తే పశ్యంతి తథైవ సంప్రతి జనా నన్దం
మయా సాన్వయం సింహేనేవ గజేంద్రమద్రిశిఖరా త్సింహాసనాత్పాతితం ॥ ౧౨ ॥

సముత్ఖాతా నందా నవహృదయరోగా ఇవ భువః కృతా మౌర్యే లక్ష్మీః సరసి
నళినీవ స్థిరపదా । ద్వయో స్సారం తుల్యం ద్వితయమభియుక్తేన మనసా ఫలం కోప
ప్రీత్యో ర్ద్విషదిచ విభక్తం సుహృదిచ ॥ ౧౩ ॥

ఐశ్వర్యాదనపేతమీశ్వరమయం లోకో౽ర్థతస్సేవతే తం గచ్ఛత్యనుయే విప
త్తిషు పునస్తే తత్ప్రతిష్ఠాశయా । భర్తుర్యే ప్రలయే౽పి పూర్వసుకృతాసంగేన నిస్సం
గయా భక్త్యా కార్యధురాం వహంతి బహవ స్తే దుర్లభా స్త్వాదృశాః ॥ ౧౪ ॥

అప్రాజ్ఞేనచ కాతరేణచ గుణస్స్యాత్సానురాగేణ కః । ప్రజ్ఞావిక్రమశాలి
నో౽పిహి భవేత్కిం భక్తిహీనాత్ఫలం । ప్రజ్ఞావిక్రమభక్తయ స్సముదితా యేషాం
గుణాభూతయే । తే భృత్యా నృపతేః కళత్రమితరే సంపత్సుచాపత్సుచ ॥ ౧౫ ॥

స్వయమాహృత్య భుంజానా బలినో౽పి స్వభావతః ।
గజేంద్రాశ్చ నరేంద్రాశ్చ ప్రాయస్సీదంతి దుఃఖితాః ॥ ౧౬ ॥
ప్రణమత యమస్య చరణౌ కిం కార్యం దైవతైరన్యైః ।
ఏష ఖల్వన్యభక్తానాం హరతి జీవితం పరిస్ఫురంతమ్. ॥ ౧౭ ॥
పురుషస్య జీవితవ్యం విషమాద్భవతి భక్తిగృహీతాత్ ।
మారయతి సర్వలోకం యస్తేన యమేన జీవామః ॥ ౧౮ ॥

కౌలూత శ్చిత్రవర్మా మలయనరపతి స్సింహనాదో నృసింహః । కాశ్మీరః
పుష్కరాక్షః క్షతరిపుమహిమా సైంధవ స్సింధుషేణః । మేఘాఖ్యః పంచమో౽స్మిన్
పృథుతురగబలః పారశీకాధినాథో । నామాన్యేషాం లిఖామి ధ్రువమహమధునా
చిత్రగుప్తః ప్రమార్ష్టు ॥ ౧౯ ॥
చాణక్యే అకరుణే సహసా శబ్దాయితస్య లోకస్య ।
వర్ధతే నిర్దోషస్యాపి శంకా కింపునర్మమ జాతదోషస్య ॥ ౨౦ ॥
ఉపరిఘనం ఘనరటితం దూరే దయితా కిమేతదాపతితం,
హిమవతి దివ్యౌషధయ శ్శీర్షే సర్పస్సమావిష్టః ॥ ౨౧ ॥

విక్రాంతైర్నయశాలిభి స్సుసచివైః శ్రీవక్రనాసాదిభి ర్నందే జీవతి యాతదా
నగమితా స్థైర్యం చలంతీముహుః । తామేకత్వముపాగతాం ద్యుతిమిహ ప్రహ్లాద
యంతీం జగత్కశ్చంద్రాదివ చంద్రగుప్తనృపతేః కర్తుం వ్యవస్యేత్పృథక్ ॥ ౨౨ ॥
సులభేష్వర్థలాభేషు పరసంవేదనే జనే ।
క ఇదం దుష్కరం కుర్యాదిదానీం శిబినా వినా ॥ ౨౩ ॥
త్యజత్యప్రియవత్ప్రాణాన్యథా తస్యాయమాపది ।
తథైవాస్యాపది ప్రాణా నూనం తస్యాపి నప్రియాః ॥ ౨౪ ॥

యే యాతాః కిమపి ప్రధార్య హృదయే పూర్వంగతా ఏవ తే । యే తిష్ఠంతి
భవంతు తే౽పి గమనే కామం ప్రకామోద్యమాః । ఏకా కేవలమేవ కార్యసాధనవిధౌ
సేనాశతేభ్యో౽ధికా । నందోన్మూలనదృష్టవీర్యమహిమా బుద్ధిస్తు మాగాన్మమ ॥ ౨౫ ॥
స్వచ్ఛందమేకచరముజ్జ్వలదానశక్తి ముత్సేకినం మదబలేన విగాహమానం ।
బుద్ధ్యా నిగృహ్య వృషలస్య కృతే క్రియాయామారణ్యకం గజమివ ప్రగుణీకరోమి ॥

ఇతి ప్రథమాంకః ॥

అథ ద్వితీయాంకః

జానంతి తంత్రయుక్తిం యథాస్థితం మండలమభిలిఖంతి ।
యే మంత్రరక్షణపరాస్తే సర్పే నరాధిపేచ ఉపచరంతి ॥ ౧ ॥
కౌటిల్యధీరజ్జునిబద్ధమూర్తిం మన్యే స్థిరాం మౌర్యకులస్య లక్ష్మీం ।
ఉపాయహస్తైరపి రాక్షసేన నికృష్యమాణామివ లక్షయామి ॥ ౨ ॥
విరుద్ధయోర్భృశమిహ మంత్రిముఖ్యయో ర్మహావనే వనగజయోరివాంతరే ।
అనిశ్చయాద్గజవశయేవ భీతయా గతాగతైర్భృశమివ ఖిద్యతే శ్రియా ॥ ౩ ॥

వృష్ణీనామివ నీతివిక్రమగుణవ్యాపారశాంతద్విషాం నందానాం విపులే కులే౽
కరుణయా నీతే నియత్యాక్షయం । చింతావేశసమాకులేన మనసా రాత్రిం దివం
జాగ్రత స్సైవేయం మమ చిత్రకర్మరచనా భిత్తిం వినా వర్తతే ॥ ౪ ॥

నేదం విస్మృతభక్తినా నవిషయవ్యాసంగమూఢాత్మనా ప్రాణప్రచ్యుతిభీరుణా
నచ మయా నాత్మప్రతిష్ఠార్థినా । అత్యర్థం పరదాస్యమేత్య నిపుణం నీతౌ మనో
దీయతే దేవస్స్వర్గగతో౽పి శాత్రవవధే నారాధితస్స్యాదితి ॥ ౫ ॥
ఆనందహేతుమపి నందముపాస్య దేవం సక్తాసి కిం కథయ వైరిణి మౌర్యపుత్రే ।
దానాంబురాజిరివ గంధగజస్య నాశే తత్రైవ కిం నచపలే ప్రలయం గతాసి ॥ ౬ ॥

పృథివ్యాం కిం దగ్ధాః ప్రథితకులజా భూమిపతయః పతిం పాపే మౌర్యం యదసి కులహీనం వృతవతీ । ప్రకృత్యా వా కాశప్రభవ కుసుమప్రాంతచపలా పురంధ్రీణాం ప్రజ్ఞా పురుషగుణవిజ్ఞానవిముఖీ ॥ ౭ ॥

ఇష్టాత్మజస్సపది సాన్వయఏవ దేవశ్శార్దూలపోతమివ యం పరిపుష్య నష్టః ।
తస్యైవ బుద్ధివిశిఖేన భినద్మి మర్మ వర్మీభవేద్యది న దైవ మదృశ్యమానం ॥ ౮ ॥

కామం నందమివ ప్రమథ్య జరయా చాణక్యనీత్యా యథా ధర్మో మౌర్య ఇవ క్రమేణ నగరే నీతః ప్రతిష్ఠాం మయి । తం సంప్రత్యుపచీయమానమను మే లబ్ధాంతరస్సేవయా లోభో రాక్షసవజ్జయాయ యతతే జేతుం న శక్నోతి చ ॥ ౯ ॥

సతావన్నిర్వీర్యైః పరపరిభవక్రాంతికృపణైః గృహామ్యంగైరేభిః ప్రతనుమపి సంస్కారరచనాం । నయావన్నిశ్శేషక్షపితరిపుచక్రస్య నిహితం సుగాంగే హేమాంకం నృపవర ఇవ సింహాసనమిదం ॥ ౧౦ ॥

పీత్వా నిరవశేషం కుసుమరసమాత్మనః కుశలతయా ।
యదుద్గిరతి భ్రమరోఽన్యేషాం కరోతి తత్కార్యం ॥ ౧౧ ॥

వామాం బాహులతాం నివేశ్య శిథిలాం కంఠే వివృత్తాననా స్కంధే దక్షిణయా బలాన్నిహితయాప్యంకే పతంత్యా ముహుః । గాఢాలింగనసంగ పీడితముఖం యస్యోద్యమాశంకినీ మౌర్యస్యోరసి నాధునాపి కురుతే వామేతరం శ్రీస్తనం ॥ ౧౨ ॥

ప్రాకారం పరితః శరాసనధరైః క్షిప్రం పరిక్షిప్యతాం ద్వారేషు ద్విరదైః ప్రతిద్విపఘటాభేదక్షమైః స్థీయతాం । త్యక్త్వా మృత్యుభయం ప్రహర్తుమనసః శత్రోర్బలే దుర్బలే తే నిర్యాంతు మయా సహైకమనసో యేషామభీష్టం యశః ॥౧౩॥

యత్రైషా మేఘనీలా చలతి గజఘటా రాక్షసస్తత్ర యాయా దేతత్పారిప్లవాంభఃప్లుతితురగబలం వార్యతాం రాక్షసేన । పత్తీనాం రాక్షసోఽంతం నయతు బలమితి ప్రేషయన్మహ్యమాజ్ఞా మాజ్ఞాసీః ప్రీతియోగాత్స్థితమివ నగరే రాక్షసానాం సహస్రం ॥ ౧౪ ॥

కర్ణేనేవ విషాంగనైకపురుషవ్యాపాదినీ రక్షితా హంతుం శక్తిరివార్జునం బలవతీ యా చంద్రగుప్తం మయా । సా విష్ణోరివ విష్ణుగుప్తహతక స్యాత్యంతికశ్రేయసే హైడంబేయమివైత్య పర్వతనృపం తద్వధ్యమేవావధీత్ ॥ ౧౫ ॥

కన్యా తస్య వధాయ యా విషమయీ గూఢం ప్రయుక్తా మయా దైవాత్పర్వతకస్తయా సనిహతో యస్తస్య రాజ్యార్ధభాక్ । యే తంత్రేషు రసేషు చ ప్రణిహితాస్తైరేవ తే ఘాతితా మౌర్యస్యైవ ఫలంతి పశ్య వివిధశ్రేయాంసి మన్నీతయః॥

ప్రారభ్యతే న ఖలు విఘ్నభయేన నీచైః ప్రారభ్య విఘ్నవిహతా విరమంతి మధ్యాః । విఘ్నైః పునఃపునరపి ప్రతిహన్యమానాః ప్రారబ్ధముత్తమగుణా న పరిత్యజంతి ॥ ౧౭॥

కిం శేషస్య భరవ్యథా న వపుషి క్ష్మాం నక్షిపత్యేవ యత్కిం వా నాస్తి పరిశ్రమో దినపతే రాస్తేన యన్నిశ్చలః । కింత్వంగీకృతముత్సృజన్ కృపణవచ్ఛ్లాఘ్యో జనో లజ్జతే నిర్వాహం ప్రతిపన్నవస్తుషు సతామేతద్ధి గోత్రవ్రతం ॥ ౧౮ ॥

స్వస్మిన్పరిహృత్యయశః పాతితమస్మాసు ఘాతితోఽర్ధరాజ్యహరః ।
ఏకమపి నీతిబీజం బహుఫలతామేతి యస్య తవ ॥ ౧౯ ॥

అస్మాభిరముమేవార్థమవలంబ్య జిజీవిషామ్ ।
పరలోకగతో దేవః కృతఘ్నైర్నానుగమ్యతే ॥ ౨౦ ॥

దృష్ట్వా మౌర్యమివ ప్రతిష్ఠితపదం శూలం ధరిత్ర్యాస్స్థలే తల్లక్ష్మీమివ చేతసః ప్రమథినీం మూర్ధ్నావబద్ధాం స్రజం । శ్రుత్వా స్వామ్యుపరోధరౌద్రవిషమానాఘాతతూర్యస్వనాన్న ధ్వస్తం ప్రథమాభిఘాతకఠినం యత్తన్మదీయం మనః ॥ ౨౧ ॥

అక్షీణభక్తిః క్షీణేఽపి నందే స్వామ్యర్థముద్వహన్ ।
పృథివ్యాం స్వామిభక్తానాం ప్రమాణే పరమే స్థితః ॥ ౨౨ ॥

మౌర్యస్తేజసి సర్వభూతలభుజామాజ్ఞాపకో వర్తతే చాణక్యోఽపి మదాశ్రయాదయమభూద్రాజేతి జాతస్మయః । రాజ్యప్రాప్తికృతార్థమేకమపరం తీర్ణప్రతిజ్ఞార్ణవం సౌహార్దాత్కృతకృత్యతైవ నియతం లబ్ధాంతరా భేత్స్యతి ॥ ౨౩ ॥

ఇతి ద్వితీయోఽంకః ॥

అథ తృతీయోఽంకః

రూపాదీన్విషయాన్నిరూప్య కరణైర్యైరాత్మలాభస్త్వయా లబ్ధస్తేష్వపి చక్షురాదిషు హతా స్స్వార్థావబోధక్రియాః । అంగాని ప్రసభం త్యజంతి పటుతామాజ్ఞావిధేయాని మే న్యస్తం మూర్ధ్ని పదం తవైవ జరయా తృష్ణే ముధా తామ్యసి॥

ఆలింగంతు గృహీతధూపసురభీన్ స్తంభాన్ పినద్ధస్రజస్సంపూర్ణేందుమయూఖసంహతిరుచాం సచ్చామరాణాం శ్రియః । సింహాంకాసనధారణాచ్చ సుచిరం సంజాతమూర్ఛామివ క్షిప్రం చందనవారిణా సకుసుమస్సేకోఽనుగృహ్ణాతు గాం ॥ ౨ ॥

సువిస్రబ్ధైరంగైః పథిషు విషమేష్వప్యచలతా చిరం ధుర్యేణోఢా గురురపి భువో యాస్య గురుణా । ధురం తామేవోచ్చైర్నవవయసి వోఢుం వ్యవసితో మనస్వీ దమ్యత్వాత్స్ఖలతిచ నదుఃఖం వహతిచ ॥ ౩ ॥

పరార్థానుష్ఠానే రహయతి నృపం స్వార్థపరతా పరిత్యక్తస్వార్థో నియతమ
యథార్థః క్షితిపతిః । పరార్థశ్చేత్స్వార్థా దభిమతతరో హంత పరవాన్ పరాయత్తః
ప్రీతేః కథమివ రసం వేత్తి పురుషః ॥ ౪ ॥

తీక్ష్ణాదుద్విజతే మృదౌ పరిభవత్రాసాన్న సంతిష్ఠతే మూర్ఖం ద్వేష్టి నగచ్ఛతి
ప్రణయితా మత్యంతవిద్వత్స్వపి । శూరేభ్యోప్యధికం బిభేత్యుపహస త్యేకాంతభీరూ
నహో శ్రీర్లబ్ధప్రసరేవ వేశవనితా దుఃఖోపచర్యా భృశం ॥ ౫ ॥

ఇహ విచరయన్ సాధ్వీం శిష్యః క్రియాం నవినాశ్యతే త్యజతిచ యదా
మార్గం మోహాత్తదా గురురంకుశః । వినయరుచయ స్తస్మాత్సంతస్సదైవ నిరంకుశాః
పరతరమతస్స్వాతంత్ర్యేభ్యో వయంహి పరాఙ్ముఖాః ॥ ౬ ॥

శనైశ్శ్యామీభూతాః సితజలధరచ్ఛేదపులినా స్సమంతాదాకీర్ణాః కలవిరుతిభిః
సారసకులైః । చితాశ్చిత్రాకారైర్నిశి వికచనక్షత్రకుముదై ర్నభ స్తః స్యందంతే సరిత
ఇవ దీర్ఘా దశదిశః ॥ ౭ ॥

అపాముద్వృత్తానాం నిజముపదిశంత్యా స్థితిపదం దధత్యా శాలీనా మవనతి
ముదారే సతి ఫలే । మయూరాణాముగ్రం విషమివ హరంత్యా మదమహో కృతః
కృత్స్నస్యాయం వినయ ఇవ లోకస్య శరదా ॥ ౮ ॥

భర్తుస్తథా కలుషితాం బహువల్లభస్య మార్గే కథంచిదవతార్య తనూభవంతీం ।
సర్వాత్మనా రతికథాచతురేవ దూతీ గంగాం శరన్నయతి సింధుపతిం ప్రసన్నాం ॥

ధూర్తై రన్వీయమానా రతిచతురకథాకోవిదై ర్వేశనార్యో నాలం కుర్వంతి
రథ్యాః పృథుజఘనభరాక్రాంతిమందైః ప్రయాతైః । అన్యోన్యం స్పర్ధమానా నచ
గృహవిభవై స్స్వామినో ముక్తశంకాస్సాకం స్త్రీభిర్భజంతే విధిమభిలషితం పార్వ
ణం పౌరముఖ్యాః ॥ ౧౦ ॥

కృతాగాః కౌటిల్యో భుజగ ఇవ నిర్గత్య నగరాద్యథా నందాన్హత్వా నృపతి
ముకరోన్మౌర్యవృషలం । తథాహం మౌర్యేందోశ్శ్రియమపహరామీతి కృతధీః
ప్రతికర్తుం మద్బుద్ధే రతిశయితుమేష వ్యవసితః ॥ ౧౧ ॥

ఉత్సిక్తః కుసచివదృష్టరాజ్యభారో నందోసౌ నభవతి చంద్రగుప్త ఏషః ।
చాణక్య స్త్వమపి నచైవ కేవలం తే సాధర్మ్యం మదనుకృతేః ప్రధానవైరం ॥ ౧౨ ॥

ఉద్ఘాత్యైః కిల సోపి పర్వతసుతో వ్యాప్తః ప్రవిష్టాంతరై రుద్యుక్తాస్స్వామి
యోగసాధనవిధౌ సిద్ధార్థకాద్యాః స్పశాః । కృత్వా సంప్రతి కైతవేన కలహం
మౌర్యేందునా రాక్షసం భేత్స్యామి స్వమతేన భేదకుశల స్త్వేష ప్రతీపం ద్విషః ॥ ౧౩

భేత్తవ్యం నృపతే స్తతస్సచివతో రాజ్ఞస్తతో వల్లభా దన్యేభ్యశ్చ వసంతి
యత్ర భవనే లబ్ధప్రసాదావిటాః । దైన్యాదున్ముఖదర్శనాపలపనైః పిండార్థమాయా
స్యత స్సేవాం లాఘవకారిణీం కృతధియ స్థానే శ్వవృత్తిం విదుః ॥ ౧౪ ॥

ఉపలశకలమేతద్భేదకం గోమయానాం వటుభిరభిహృతానాం బర్హిషాం
స్తూపమేతత్ । శరణమపి సమిద్భిశ్శుష్యమాణాభిరాభిర్వినమిత పటలాంతం దృశ్యతే
జీర్ణకుడ్యం ॥ ౧౫ ॥

స్తువంతి శ్రాంతాస్యాః క్షితిపతిమభూతైరపి గుణైః ప్రవాచః కార్పణ్యాద్య
దవితథవాచోపి పురుషాః । ప్రభావ స్తృష్ణాయాస్సఖలు సకలస్యాదితరథా నిరీహాణా
మీశా స్తృణమివ తిరస్కారవిషయాః ॥ ౧౬ ॥

యోనందమౌర్యనృపయోః పరిభూయ లోక మస్తోదయావదిశదప్రతిభిన్నకాలం ।
పర్యాయపాతిత హిమోష్ణమసర్వగామి ధామ్నాతిశాయయతి ధామ సహస్రధామ్నః ॥

నంద్యై ర్నియుక్తమనపేక్షితరాజరాజై రధ్యాసితం చ వృషలేన వృషేణ రాజ్ఞాం ।
సింహాసనం సదృశపార్థివసంగతంచ ప్రీతిం పరాం ప్రగుణయంతి గుణా మమైతే ॥ ౧౮

ఆశైలేంద్రాచ్ఛిలాంతః స్ఖలితసురనదీశీకరాసారశీతా దాపారాన్నైకరాగ
స్ఫురితమణిరుచో దక్షిణస్యార్ణవస్య । ఆగత్యాగత్య భీతప్రణతనృపశతై శ్శశ్వదేవం
క్రియంతాం చూడారత్నాంశుగర్భా స్తవ చరణయుగస్యాంగులీరంధ్రభాగాః ॥ ౧౯ ॥

ఆకాశం కాశపుష్పచ్ఛవిమభిభవతా భస్మనా శుక్లయంతీ శీతాంశోరంశు
జాలైర్జలధరమలినాం క్లిశ్నతీ కృత్తిమైభీం । కాపాలీ ముద్వహంతీ స్రజమివ ధవ
లాం కౌముదీం కాప్యపూర్వా హాసశ్రీ రాజహంసీ హరతు తనురివ క్లేశమైశీ శరద్వః ॥

ప్రత్యగ్రోన్మేషజిహ్మా క్షణమనభిముఖీ రత్నదీపప్రభాణా మాత్మవ్యాపారగుర్వీ
జనితజలలవా జృంభితైః స్సాంగభంగైః । నాగాఙ్కం మోక్తుమిచ్ఛోశ్శయనమురుఫణా
చక్రవాలోపధానం నిద్రాచ్ఛేదాభితామ్రా చిరమవతు హరేర్దృష్టిరాకేకరా వః ॥ ౨౧ ॥

సత్త్వోత్కర్షస్య ధాత్రా నిధయ ఇవ కృతాః కేపి కస్యాపి హేతో ర్జేతార
స్స్వేనధామ్నా మదసలిలముచాం నాగయూథేశ్వరాణాం । దంష్ట్రాభంగం మృగా
ణామధిపతయ ఇవ వ్యక్తమానావలేపా నాజ్ఞాభంగం సహంతే నృవర నృపతయ
స్త్వాదృశాస్సార్వభౌమాః ॥ ౨౨ ॥

భూషణాద్యుపభోగేన ప్రభుర్భవతి నప్రభుః ।
పరైరనభిభూతాజ్ఞ స్త్వమివ ప్రభురుచ్యతే ॥ ౨౩ ॥

అంభోధీనాం తమాలప్రభవకిసలయశ్యామవేలావనానామాపారేభ్యశ్చతుర్ణాం చటులతిమికులక్షోభితాంతర్జలానాం । మాలేవామ్లానపుష్పా తవ నృపతిశతైరూహ్యతే యా శిరోభిస్సా మయ్యేవ స్ఖలంతీ కథయతి వినయాలంకృతం తే ప్రభుత్వం ॥ ౨౪ ॥

సహి భృశమభియుక్తో యద్యుపేయాద్వినాశం నను వృషలవియుక్తస్స్యాద్యశే నాపి పుంసా । అథ తవ బలముఖ్యాన్ఘాతయేత్సోపి పీడా వనగజఇవ తస్మాత్సోఽభ్యుపాయైర్వినేయః ॥ ౨౫ ॥

లబ్ధాయాం పురి యావదిచ్ఛముషితం కృత్వా పదం మూర్ధ్ని తే వ్యాఘాతో జయఘోషణాదిషు బలాదస్మద్బలానాం కృతః । అత్యర్థం విపులైశ్చ నీతివిభవైస్సమ్మోహమాపాదితా విశ్వాస్యేష్వపి విశ్వసంతి మతయో నస్వేషు వర్గేషు నః ॥ ౨౬ ॥

ఆరుహ్యారూఢకోపస్ఫురణవిషమితాగ్రాంగులీముక్తచూడాం లోకప్రత్యక్షముగ్రాం సకలరిపుకులోత్సాదదీర్ఘాం ప్రతిజ్ఞాం । కేనాన్యేనావలిప్తా నవనవతిశతద్రవ్యకోటీశ్వరాస్తే నందాః పర్యాయభూతాః పశవఇవ హతాః పశ్యతో రాక్షసస్య ॥

గృధ్రైరాబద్ధచక్రం వియతి విచలితైర్దీర్ఘనిష్కంపపక్షైర్ధూమైర్ధ్వస్తార్కభాసాం సఘనమివ దిశాం మండలం దర్శయంతః । నందైరానందయంతః పితృవననిలయాన్ప్రాణినః పశ్య చైతాన్ నిర్వాంత్యద్యాపి నైతే స్రుతబహులవసావాహినో హవ్యవాహాః ॥ ౨౮ ॥

శిఖాం మోక్తుం బద్ధామపి పునరయం ధావతి కరః ప్రతిజ్ఞామారోఢుం పునరపి చలత్యేవ చరణః । ప్రణాశాన్నందానాం ప్రశమముపయాతం త్వమధునా పరీతః కాలేన జ్వలయసి మమ క్రోధదహనం ॥ ౨౯ ॥

సంరంభోత్స్పందిపక్ష్మక్షరదమలజలక్షాళనక్షామయాపి భ్రూభంగోద్భేదధూమం జ్వలితమివ పురః పింగయా దృష్టిభాసా । మన్యే రుద్రస్య రౌద్రం రసమభినయతస్తాండవేషు స్మరంత్యా సంజాతోగ్రప్రకంపం కథమపి ధరయా ధారితః పాదఘాతః ॥ ౩౦ ॥

చాణక్యతశ్చలితభక్తిమహం సుఖేన జేష్యామి మౌర్యమితి సంప్రతి యః ప్రయుక్తః ।
భేదః కిలైష భవతా సకలస్సఏవ సంపత్స్యతే బత తవైవహి దూషణాయ ॥ ౩౧ ॥

సదోషస్సచివస్యైవ యదసత్కురుతే నృపః ।
యాతి యంతుః ప్రమాదేన గజో వ్యాళత్వవాచ్యతాం ॥ ౩౨ ॥

ఆర్యాజ్ఞయైవ మమ లంఘితగౌరవస్య బుద్ధిః ప్రవేష్టుమివ భూవివరం ప్రవృత్తా ।
యే సత్యమేవహి గురూనతిపాతయంతి తేషాం కథంను హృదయం నభినత్తి లజ్జా ॥

ఇతి తృతీయోంకః ॥

అథ చతుర్థాంకః

యోజనశతం సమధికం కో నామ గతాగతమిహ కరోతి ।
అస్థానగమనగురుకా ప్రభోరాజ్ఞా యది నభవతి ॥ ౧ ॥

మమ విమృశతః కార్యారంభే విధేరవిధేయతామపిచ కుటిలాం కౌటిల్యస్య ప్రచింతయతో మతిం । అథచ విహితే మత్కృత్యానాం నికామముపగ్రహే కథమిదమిహేత్యున్నిద్రస్య ప్రయాంత్యనిశం నిశాః ॥ ౨ ॥

కార్యోపక్షేపమాదౌ తనుమపి రచయంస్తస్య విస్తారమిచ్ఛన్ బీజానాం గర్భితానాం ఫలమతిగహనం గూఢముద్భేదయంశ్చ । కుర్వన్ బుద్ధ్యా విమర్శం ప్రసృతమపి పునస్సంహరన్ కార్యజాతం కర్తా వా నాటకానామిమమనుభవతి క్లేశమస్మద్విధో వా ॥ ౩ ॥

దూరేప్రత్యాసత్తిర్దర్శనమపి దుర్లభమధన్యైః ।
కల్యాణకులగృహాణాం దేవానాంచ మనుష్యదేవానాం ॥ ౪ ॥

వక్షస్తాడనభిన్నరత్నవలయం భ్రష్టోత్తరీయాంశుకం హాహేత్యుచ్చలితార్తనాదకరుణం భూరేణురూక్షాలకం । తాదృఙ్మాతృజనస్య శోకజనితం సంప్రత్యవస్థాంతరం శత్రుస్త్రీషు మయా విధాయ గురవే దేయో నివాపాంజలిః ॥ ౫ ॥

ఉద్యచ్ఛతా ధురమకాపురుషానురూపాం గంతవ్యమాజినిధనేన పితుః పథా వా ।
ఆచ్ఛిద్య వా స్వజననీజనలోచనేభ్యో నేయో మయా రిపువధూనయనాని బాష్పః ॥ ౬ ॥

సోత్సేధైస్స్కంధదేశైః ఖరతరకవికాకర్షణాత్యంతభుగ్నైరశ్వాః కైశ్చిన్నిరుద్ధాః ఖమివ ఖురపుటైః ఖండయంతః పురస్తాత్ । కేచిన్మాతంగముఖ్యైర్విహతజవతయా మూకఘంటైర్నివృత్తా మర్యాదాం భూమిపాలా జలధయఇవ తే దేవ నోల్లంఘయంతి ॥ ౭ ॥

సత్వభంగభయాద్రాజ్ఞాం కథయంత్యన్యథా పురః ।
అన్యథా వికృతార్థేషు స్వైరాలాపేషు మంత్రిణః ॥ ౮ ॥

కౌముదీ కుముదానందే జగదానందహేతునా ।
కీదృశీ సతిచంద్రేఽపి నృపచంద్ర త్వయావినా ॥ ౯ ॥

సద్యః క్రీడారసచ్ఛేదం ప్రాకృతోపి నమర్షయేత్ ।
కిము లోకాధికం తేజో బిభ్రాణః పృథివీపతిః ॥ ౧౦ ॥

దేవస్య యేన పృథివీతలవాసవస్య స్వాగ్రాసనాపనయనాన్నికృతిర్న సోఢా ।
సోఽయం స్వయంకృతనరాధిపతేర్మనస్వీ మౌర్యాత్కథంను పరిభూతిమిమాం సహేత ॥

రాజ్ఞాం చూడామణీందుద్యుతిఖచితశిఖే మూర్ధ్ని విన్యస్తపాద సైన్యైరేవో
త్పాద్యమానం కిమితి విషహతే మౌర్యఆజ్ఞావిఘాతం । కౌటిల్యః కోపనోఽపి స్వయమ
భిచరణజ్ఞాతదుఃఖప్రతిజ్ఞో దైవాత్తీర్ణప్రతిజ్ఞః పునరపి నకరోత్యాయతిం గ్లానిభీతః ॥౧౨॥

అత్యుచ్ఛ్రితే మంత్రిణి పార్థివే చ విష్టభ్య పాదావుపతిష్ఠతే శ్రీః ।
సా స్త్రీస్వభావాదసహా భరస్య తయోర్ద్వయోరేకతరం జహాతి ॥ ౧౩ ॥

నృపోఽపకృష్టస్సచివాత్తదర్పణ స్తనంధయోఽత్యంతశిశు స్తనాదివ ।
అదృష్టలోకవ్యవహారమందధీ ర్ముహూర్తమప్యుత్సహతే నవర్తితుం ॥ ౧౪ ॥

త్వయ్యుత్కృష్టబలేఽభియోక్తరి నృపే నందానురక్తే పురే చాణక్యే చలితాధి
కారవిముఖే మౌర్యే నవే రాజని । స్వాధీనేమయి మార్గమాత్రకథనవ్యాపారయోగో
ద్యమే త్వద్వాంఛాంతరితాని సంప్రతి విభో తిష్ఠంతి సాధ్యాని నః ॥ ౧౫ ॥

ఉత్తుంగాస్తుంగకూలం స్రుతమదసలిలాః ప్రస్యందిసలిలం శ్యామాః శ్యామోప
కంఠద్రుమమభిముఖరాః కల్లోలముఖరం । స్రోతఃఖాతావసీదత్తటమురుదశనైరుత్పా
టితతటాః శోణం సింధూః శోణా మమ గజపతయః పాస్యంతి శతశః ॥ ౧౬ ॥

గంభీరగర్జితరవాః ప్రమదాంబుమిశ్ర మాసారవర్షమివ శీకరముత్కిరంత్యః ।
వింధ్యం వికీర్ణసలిలాఇవ మేఘమాలా గంధంతు వారణఘటా నగరం మదీయాః ॥౧౭

శాసనమర్హతాం ప్రతిపద్యధ్వం మోహవ్యాధివైద్యానాం ।
యే ముహూర్తమాత్రకటుకం పశ్చాత్పథ్యముపదిశంతి ॥ ౧౮ ॥

అస్తాభిముఖే సూరే ఉదితే సంపూర్ణమండలే చంద్రే ।
గమనం బుధస్య లగ్నే ఉదితాస్తమితే చ కేతౌ ॥ ౧౯ ॥

ఏకగుణా భవతి తిథిశ్చతుర్గుణం భవతి నక్షత్రం ।
చతుష్షష్టిగుణం లగ్నం ఏతద్దృశ్యతే జ్యోతిషసిద్ధాంతే ॥ ౨౦ ॥

లగ్నం భవతి సులగ్నం క్రూరగ్రహం పరిహర ఆశు ।
ప్రాప్నుహి దీర్ఘం లాభం చంద్రస్య బలేన గచ్ఛన్ ॥ ౨౧ ॥

ఆవిర్భూతానురాగాః క్షణముదయగిరే రుజ్జిహానస్య భానోః పర్ణచ్ఛాయైః
పురస్తాదుపవనతరవో దూరమాశ్వేవ గత్వా । ఏతే తస్మిన్నివృత్తాః పునరపరగిరిప్రాం
తపర్యస్తబింబే ప్రాయో భృత్యాస్త్యజంతి ప్రచలితవిభవం స్వామినం సేవమానాః ॥

ఇతి చతుర్థాంకః ॥

అథ పంచమాంకః

బుద్ధిజలనిర్ఝరైస్సిచ్యమానా దేశకాలకలశైః ।
దర్శయిష్యతి కార్యఫలం గురుకం చాణక్యనీతిలతా ॥ ౧ ॥

అర్హతాం ప్రణమామో యే తే గంభీరతయా బుద్ధేః ।
లోకోత్తరైర్లోకే సిద్ధిం మార్గైర్మార్గయంతి ॥ ౨ ॥

ముహుర్లబ్ధోద్భేదా ముహురధిగమాభావగహనా ముహుస్సంపూర్ణాంగీ
ముహురతికృశా కార్యవశతః । ముహుర్నశ్యద్బీజా ముహురపి బహుప్రాపితఫలే
త్యహో చిత్రాకారా నియతిరివ నీతిర్నయవిదః ॥ ౩ ॥

కులే లజ్జాయాంచ స్వయశసిచ మానేచ విముఖః శరీరం విక్రీయ క్షణికమపి
లోభాద్ధనవతి । తదాజ్ఞాం కుర్వాణో హితమహితమిత్యేతదధునా విచారాతిక్రాంతః
కిమితి పరతంత్రో విమృశతి ॥ ౪ ॥

భక్త్యా నందకులానురాగదృఢయా నందాన్వయాలంబినా కిం చాణక్యనిరాకృ
తేన కృతినా మౌర్యేణ సంధాస్యతే । స్థైర్యం భక్తిగుణస్య వాధిగణయన్ కిం సత్య
సంధో భవే దిత్యారూఢకులాలచక్రమివ మే చేతశ్చిరం భ్రామ్యతి ॥ ౫ ॥

శ్రుతం సఖే శ్రవణవిదారణం వచస్సుహృన్ముఖాద్రిపుమధికృత్య భాషితం ।
పితుర్వ్యథవ్యసనమిదంహి యేన మే చిరాదపి ద్విగుణమివాద్య వర్ధతే ॥ ౬ ॥

మిత్రం మమాయమితి నిర్వృతచిత్తవృత్తిం విస్రంభతస్త్వయి నివేశితసర్వకార్యం ।
తాతం నిపాత్య సహబంధుజనాశ్రుతోయై రన్వర్థతోఽపి నను రాక్షసరాక్షసోఽసి ॥౭॥

మిత్రాణి శత్రుత్వముపానయంతీ మిత్రత్వమర్థస్య వశాచ్చ శత్రూన్ ।
నీతిర్నయత్యస్మృతపూర్వవృత్తం జన్మాంతరం జీవతఏవ పుంసః ॥ ౮ ॥

పృశ్యంత్యై గుణేషు దోషేషు పరాఙ్ముఖం కుర్వంత్యై ।
అస్మాదృశజనస్యై ప్రణమామః స్వామిభక్త్యై ॥ ౯ ॥

సాధ్యే నిశ్చితమన్వయేన ఘటితం బిభ్రత్సపక్షేస్థితిం వ్యావృత్తంచ విపక్షతో
భవతి యత్తత్సాధనం సిద్ధయే । యత్సాధ్యం స్వయమేవ తుల్యముభయోః పక్షే
విరుద్ధంచ యత్తస్యాంగీకరణేన వాదినఇవ స్యాత్స్వామినో నిగ్రహః ॥ ౧౦ ॥

ప్రస్థాతవ్యం పురస్తాత్సహ మగధగణై ర్మామనువ్యూహ్య సైన్యై ర్గాంధారై
ర్మధ్యయానే సయవనపతిభిస్సంవిధేయః ప్రయత్నః । పశ్చాత్తిష్ఠంతు వీరాశ్శకనరపత
యస్సంభృతాశ్చేదిహూణైః కౌలూతాద్యశ్చ శిష్టః పథిపథి వృణుయాద్రాజలోకః
కుమారం ॥ ౧౧ ॥

భయం తావత్సేవ్యాదభినివిశతే సేవకజనం తతః ప్రత్యాసన్నాద్భవతి హృదయేచైవ నిహితం । తతోధ్యారూఢానాం పదమసుజనద్వేషజననం గతిస్సోచ్ఛ్రాయాణాం పతనమనుకూలం కలయతి ॥ ౧౨ ॥

పాదాగ్రే దృశమవధాయ నిశ్చలాంగీం శూన్యత్వాదపరిగృహీత తద్విశేషాం ।
వక్త్రేందుం వహతి కరేణ దుర్వహాణాం కార్యాణాం కృతమివ గౌరవేణ నమ్రం ॥౧౩
స్మర్తవ్యం స్యాత్ పుత్రదారాణాం విస్మృత్య స్వామిభక్తినా ।
చలేష్వర్థేషు లుబ్ధేన నయశస్స్వనపాయిషు ॥ ౧౪ ॥

ముద్రా తస్యకరాంగుళిప్రణయినీ సిద్ధార్థకస్తత్సుహృత్తస్యైవాహరలేఖ్యసూచితమిదం లేఖ్యం ప్రయోగాశ్రయం । సువ్యక్తం శకటేన భేదపటుభిః సంధాయ సార్థం పరైర్భర్తృస్నేహపరాఙ్ముఖేన కృపణం ప్రాణార్థినా చేష్టితం ॥ ౧౫ ॥

ఏతాని తాని తవ భూషణవల్లభస్య గాత్రోచితాని కులభూషణభూషణాని ।
యైశ్శోభితోసి ముఖచంద్రకృతావభాసో నక్షత్రవానివ శరత్సమయప్రదోషః ॥౧౬ ॥
చంద్రగుప్తస్య విక్రేతురధికం లాభమిచ్ఛతః ।
కల్పితామూల్యమేతేషాం క్రూరేణ భవతా వయం ॥ ౧౭ ॥

లేఖోయం మమనేతి నోత్తరమిదం ముద్రా మదీయా యతః సౌహార్దం శకటేన ఖండితమితి శ్రద్ధేయమేతత్కథం । మౌర్యే భూషణవిక్రయం నరపతౌ కోనామ సంభావయే త్తస్మాత్సంప్రతిపత్తిరేవహి వరం నగ్రామ్యమత్రోత్తరం ॥ ౧౮ ॥

మౌర్యోసౌ స్వామిపుత్రః పరిచరణపరో మిత్రపుత్రస్తవాహం దాతా సోర్థస్య తుభ్యం స్వమతముపగతస్త్వంతు మహ్యం దదాసి । దాస్యం సత్కారరూపం నను సచివపదం తత్ర తే స్వామ్యమత్ర స్వార్థే కస్మిన్సమీహా పునరధికతరే త్వామనార్యం కరోతి ॥ ౧౯ ॥

భృత్యత్వే పరిభావధామనిసతి స్నేహాత్ప్రభూణాం సతాం పుత్రేభ్యః కృతవేదినాం కృతధియా మేషాం నభిన్నావయం । తే లోకస్య పరీక్షకాః క్షితిభృతః పాపేన యేన క్షతాః తస్యేదం విపులం విధేర్విలసితం పుంసాం ప్రయత్నచ్ఛిదః ॥ ౨౦॥

కన్యాం తీవ్రవిషప్రయోగవిషమాం కృత్వా కృతఘ్నస్త్వయా విస్రంభప్రవణః పితా మమ పురా నీతః కథాశేషతాం । సంప్రత్యాహితగౌరవేణ భవతా మంత్రాధికారే రిపోః ప్రారబ్ధాః ప్రళయాయ మాంసవదహో విక్రేతుమేతే వయం ॥ ౨౧ ॥

విష్ణుగుప్తంచ మౌర్యంచ సమమప్యాగతౌ త్వయా ।
ఉన్మూలయితుమీశోహం త్రివర్గమివ దుర్నయః ॥ ౨౨ ॥

గౌడీనాం లోధ్రధూళీపరిమళబహుళా న్ధూమ్రయంతః కపోలాన్ క్లిశ్నంతః కృష్ణిమానం భ్రమరకులరుచః కుంచితస్యాలకస్య । పాంసుస్తంబాబలానాం తురగఖురపుటక్షోభలబ్ధాత్మలాభాశ్శత్రూణా ముత్తమాంగే గజమదసలిలక్లిన్నమూలాః పతంతు ॥ ౨౩ ॥

కిం గచ్ఛామి తపోవనం నతపసా శామ్యేత్సవైరం మనః కిం భర్తౄననుయామి జీవతి రిపౌ స్త్రీణామియం యోగ్యతా । కింవా ఖడ్గసఖః పతామ్యరిబలే నైతచ్చయుక్తంభవే చ్చేతశ్చందనదాసమోక్షరభసం రుంధ్యాత్కృతఘ్నం నచేత్ ॥ ౨౪ ॥

ఇతి పంచమోంకః ॥

అథ షష్ఠాంకః

జయతి జలదనీలః కేశవః కేశఘాతీ జయతిచ జనదృష్టి చంద్రమాశ్చంద్రగుప్తః ।
జయతి జయనకార్యమేవ కృత్వా ససర్వం ప్రతిహతప్రతిపక్షాఽర్యచాణక్యనీతిః ॥౧॥
సంతాపే తారేశానాం గేహోత్సవే సుఖాయమానానాం ।
హృదయస్థితానాం విభవా విరహేమిత్రాణాం దూనయంతి ॥ ౨ ॥
అతిశయగురుణా దానదర్పేణ దంతినః సజలజలదలీలా ఉద్భ్రమంతో నదంతి ।
కశాప్రహారణభయేన జాతకంపానురాగాః గృహీతజయనశబ్దాః సంపతంతి తురంగాః॥
షడ్గుణసంయోగదృఢా ఉపాయపరిపాటీ ఘటితపాశముఖీ ।
చాణక్యనీతిరజ్జూ రిపుసంయమనబుజుకా జయతి ॥ ౪ ॥

ఉచ్ఛిన్నాశ్రయకాతరేవ కులటా గోత్రాంతరే శ్రీర్గతా తామేవానుగతా గతానుగతికా స్త్యక్త్వానురాగాః ప్రజాః । ఆప్తైరప్యనవాప్త పౌరుషఫలైః కార్యస్య ధూరుజ్ఝితా కింకుర్మ స్త్వథవోత్తమాంగరహితై రంగైరివ స్థీయతే ॥ ౫ ॥

పతిం త్యక్త్వా దేవం భువనపతిముచ్చైరభిజనం గతా ఛిద్రేణ శ్రీః వృషలమవినీతేవ వృషలీ స్థిరీభూతాచాస్మిన్కిమిహ కరవామ స్థిరమపి ప్రయత్నం నో యేషాం విఫలయతి దైవం ద్విషదివ ॥ ౬ ॥
దేవే గతే దివమతద్విధ మృత్యుయోగ్యే శైలేశ్వరం తమధికృత్య కృతః ప్రయత్నః ।
తస్మిన్ హతే తనయమస్య తథాప్యసిద్ధిః దైవంహి నందకులశత్రురసౌ నవిప్రః ॥ ౭॥

యో నష్టానపి బీజనాశమధునా శుశ్రూషతే స్వామినస్తేషాం వైరిభిరక్షతః కథమసౌ సంధాస్యతే గాత్రసః । ఇత్థం వస్తువివేకమూఢమతినా మ్లేచ్ఛేన నాలోచితం దైవేనోపహతస్య బుద్ధిరథవా సర్వా విపర్యస్యతి ॥ ౮ ॥

శార్ఙ్గజ్యాకృష్టిముక్తప్రశిథిలకవికా ప్రగ్రహేణాత్రదేశే దేవేనాకారిచిత్రం ప్రజవితతురగం బాణమోక్షశ్చలేషు । అస్యాముద్యానరాజౌ స్థితమిహ కథితం రాజభిస్తైర్వినేత్థం సంప్రత్యాలోక్యమానాః కుసుమపురభువో భూయసా దుఃఖయంతి ॥ ౯ ॥

పౌరైరంగులిభిర్నవేందువదహం నిర్దిశ్యమానశ్శనైర్యోరాజేవ పురా పురాన్నిర్గమం రాజ్ఞాం సహస్రైర్వృతః । భూయస్సంప్రతి సోహమేవ నగరే తత్రైవ వంధ్యశ్రమో జీర్ణోద్యానకమేష తస్కర ఇవ త్రాసాద్విశామి ద్రుతం ॥ ౧౦ ॥

విపర్యస్తం సౌధం కులమివ మహారంభగచనం సరశ్శుష్కం సాధోర్హృదయమివ నాశేన సుహృదాం । ఫలైర్హీనా వృక్షా విగుణనృపయోగాదివ నయాస్తృణైశ్ఛన్నా భూమిర్మతిరివ కునీతైరవిదుషః ॥ ౧౧ ॥

క్షతాంగానాం తీక్ష్ణైః పరశుభిరుదగ్రైః క్షితిరుహాం రుజా కూజంతీనామవిరతకపోతోపరుదితైః । స్వనిర్మోకచ్ఛేదైః పరిచితపరిక్లేశకృపయా శ్వసంతశ్శాఖానాం వ్రణమివ నిబధ్నంతి ఫణినః ॥ ౧౨ ॥

అంతశ్శరీరపరిశోషముదగ్రయంతః కీటక్షతస్రుతిభిరస్రమివోద్వమంతః ।
ఛాయావియోగమలినా వ్యసనే నిమగ్నా వృక్షాః శ్మశానముపగంతుమివ ప్రవృత్తాః॥

ప్రకుర్వన్ శ్రోత్రాణాం శ్రుతిపథమసారం గురుతయా బహుత్వాత్ప్రాసాదైస్సపది పరిపీతోజ్ఝిత ఇవ । అసౌ నాందీవాదః పటుపటహశంఖధ్వనియుతో దిశాం ద్రష్టుం దైర్ఘ్యం ప్రసరతి సకౌతూహల ఇవ ॥ ౧౪ ॥

శ్రావితోస్మి శ్రియం శత్రోరభినీయచ దర్శితః ।
అనుభావయితుం మన్యే యత్నస్సంప్రతి మాం విధేః ॥ ౧౫ ॥

పితౄన్ పుత్రాః పుత్రాన్ పరవదభిహింసంతి పితరో యదర్థం సౌహార్దం సుహృది చ విముంచంతి సుహృదః । ప్రియం మోక్తుం తద్యో వ్యసనమివ సద్యో వ్యవసితః కృతార్థోయం సోర్థస్తవసతి వణిక్త్వేపి వణిజః ॥ ౧౬ ॥

కిమౌషధపథాతిగైరుపహతో మహావ్యాధిభిః కిమగ్నివిషతుల్యయా నరపతేర్నిరస్తః క్రుధా । అలభ్యమనురక్తవాన్ కిమయమన్యనారీజనమ్ కిమస్య భవతో యథా సుహృద ఏవ నాశో విషమ్ ॥ ౧౭ ॥

శిబినేవ సముద్భూతం శరణాగతరక్షయా ।
నిచీయతే త్వయా సాధో యశోపి సుహృదా వినా ॥ ౧౮ ॥

నిస్త్రింశోయం విగతజలదవ్యోమసంకాశమూర్తిర్యుద్ధశ్రద్ధా పులకిత ఇవ ప్రాప్తసఖ్యః కరేణ । సత్వోత్కర్షాత్సమరనికషే దృష్టసారః పరైర్మే మిత్రస్నేహాద్వివశమధునా సాహసే మాం నియుంక్తే ॥ ౧౯ ॥

యది సశకటో నీతశ్శత్రోర్మతేన మమాంతికం కిమితి నిహతః క్రోధావేశాద్వధాధికృతో జనః । అథచ నకృతం తాదృక్కష్టం కథంను విభావయేదితి మనుమతిస్తర్కారూఢా న పశ్యతి నిశ్చయం ॥ ౨౦ ॥

నాయం నిస్త్రింశకాలః ప్రథమమిహ కృతే ఘాతుకానాం విఘాతే నీతిః కాలాంతరేణ ప్రకటయతి ఫలం కిం తయా కార్యమత్ర । ఔదాసీన్యం న యుక్తం ప్రియసుహృది గతే మత్కృతామేవ ఘోరాం వ్యాపత్తిం జ్ఞాతమస్య స్వతనుమహమిమాం నిష్క్రియాం కల్పయామి ॥ ౨౧ ॥

ఇతి షష్ఠాంకః ॥

అథ సప్తమాంకః

యదిరక్షితుం మన్యధ్వం ప్రాణం విభవం కులం కలత్రంచ ।
పరిహరత తస్మాత్ విషమివ రాజాపథ్యం ప్రయత్నేన ॥ ౧ ॥
భవతి పురుషస్య వ్యాధిర్మరణంవా సేవతే అపథ్యాపి ।
రాజాపథ్యే పున స్సేవితేహి సకలమపి కులం మ్రియతే ॥ ౨ ॥
ముక్త్వా ఆమిషాణి మరణభయేన తృణైర్జీవంతం ।
వ్యాధానాం ముగ్ధహరిణం హంతుం కో నామ నిర్బంధః ॥ ౩ ॥

యేన స్వామికులం రిపోరివకులం దృష్టం వినశ్యత్పురా మిత్రాణాం వ్యసనే మహోత్సవ ఇవ స్వస్థేన యేన స్థితం । ఆత్మా యస్య వధాయ వః పరిభవక్షేత్రీకృతోపి ప్రియః తస్యేయం మమ మృత్యులోకపదవీ వధ్యస్రగాబధ్యతాం ॥ ౪ ॥

దుష్కాలేపి కలావసజ్జనరుచౌ ప్రాణైః పరం రక్షతా నీతం యేన యశస్వినాతిలఘుతా మాశీనరీయం యశః । బుద్ధానామపి చేష్టితం సుచరితైః క్లిష్టం విశుద్ధాత్మనా పూజార్హోపి సయత్కృతే తవ గతో వధ్యత్వమేషోస్మి సః ॥ ౫ ॥

కేనోత్తుంగశిఖాకలాపకపిశో బద్ధః పటాంతే శిఖీ పాశైః కేన సదాగతేరగతితా సద్యస్సమాసాదితా । కేనానేకపదానవాసితసటస్సింహోర్పితః పంజరే భీమః కేనచ నైకనక్రమకరో దోష్ణా ప్రతీర్ణోర్ణవః ॥ ౬ ॥

ఆకరస్సర్వశాస్త్రాణాం రత్నానామివ సాగరః ।
గుణైర్న పరితుష్యామో యస్య మత్సరిణో వయం ॥ ౭ ॥
గురుభిః కల్పనాక్లేశైః దీర్ఘజాగరహేతుభిః ॥
చిరమాయాసితా సేనా వృషలస్య మతిశ్చ మే ॥ ౮ ॥

భృత్యా భద్రభటాదయ స్సచ తథా లేఖస్ససిద్ధార్థక స్తచ్చాలంకరణత్రయం
సభవతో మిత్రం భదంతఃకిల । జీర్ణోద్యానగతిస్సచార్త్తపురుషః క్లేశస్సచ శ్రేష్ఠినః
సర్వం మే వృషలస్య వీర భవతా సంయోగమిచ్ఛోర్నయః ॥ ౯ ॥
ఫలయోగమవాప్య సాయకానాం విధియోగేన విపక్షతాం గతానాం ।
నను చేవ భవత్యధోముఖానాం నిజతూణీశయనవ్రతం ప్రతుష్ట్యై ॥ ౧౦ ॥
విగుణీకృతకార్ముకో విజేతుం భువి జేతవ్యమసౌ సమర్థఏవ ।
స్వపతోపి మమేవ యస్య తంత్రే గురవో జాగ్రతి కార్యజాగరూకాః ॥ ౧౧ ॥
బాలఏవహి లోకేన సంభావితమహోదయః ।
క్రమేణారూఢవాన్రాజ్యం యూథైశ్వర్యమివ ద్విపః ॥ ౧౨ ॥
జగదః కిం నవిజితం మయేతి ప్రవిచింత్యతాం ।
గురౌ షాడ్గుణ్యచింతాయా మార్యే చార్యేచ జాగ్రతి ॥ ౧౩ ॥
ద్రవ్యం జిగీషు మధిగమ్య జడాత్మనోపి నేతుర్యశస్వినిపదె నియతం ప్రతిష్ఠా ।
అద్రవ్యమేత్య భువి శుద్ధనయోపి మంత్రీ శీర్ణాశ్రయః పతతి కూలజవృక్షవృత్త్యా।౧౪

అశ్వైస్సార్థమజస్రదత్తకవికా క్షామైః శూన్యాసనై స్స్నానాహారవిహారపాన శయిన స్వేచ్ఛాసుఖైర్వర్జితాః । మాహాత్మ్యాత్తవ పౌరుషస్య మతిమన్నప్తారిదర్పచ్ఛిదః పశ్యైతాన్పరికల్పనవ్యతికరప్రోచ్ఛూనవంశాన్గజాన్ ॥ ౧౫ ॥

నందస్నేహగుణాః స్పృశంతి హృదయం భృత్యోస్మి తద్విద్విషాం యేసిక్తాః స్వయమేవ పాణిపయసశ్ఛేద్యాస్తఏవ ద్రుమాః । అస్త్రం మిత్రశరీరరక్షణకృతే వ్యాపారణీయం మయా కార్యాణాం గతయో విధేరపి నయంత్యాలోచనాగోచరం ॥

రాక్షసేనసమం మైత్రీ రాజ్యే చారోపితా వయం।
నందాశ్చోన్మూలితా స్సర్వే కింకర్తవ్యమితఃపరం ॥ ౧౭ ॥
సహానాహనహస్తిభ్యో ముచ్యతాం సర్వబంధనం ।
పూర్ణప్రతిజ్ఞేన మయా కేవలం బధ్యతే శిఖా ॥ ౧౮ ॥

వారాహీమాత్మయోనే స్తనుమవనవిధావాస్థితస్యానురూపాం యస్య ప్రాగ్దంతకోటిం ప్రలయపరిగతా శిశ్రియే భూతధాత్రీ । మ్లేచ్ఛైరుద్వేజ్యమానా భుజయుగమధునా పీవరం రాజమూర్తే స్సశ్రీమద్బంధుభృత్యశ్చిరమవతు మహీం పార్థివశ్చంద్రగుప్తః ॥ ౧౯ ॥

ఇతి సప్తమోంకః ।

శ్రీరస్తు.

ముద్రారాక్షసము ప్రథమాంకము.

నాంది :—

సీ॥ భవదుత్తమాంగంబు ♦ పయినెక్కి ధన్యత
వెలయు వీరేరు జా ♦ బిల్లిగారు ।
వీరిపేరిదియొకో ♦ వీరిపేరిది యొకా
యెఱిఁగినదానవు ♦ మఱచితేల ।
చందురుఁగాదునే ♦ సుందరినడిగెద
మఱి చందురుండ ప్ర ♦ మాణమేని ।
యాబాల్యముగ భక్తి ♦ ననుసరించెడు చేటి
విజయయే దేవికి ♦ విన్నవించు ।
గీ॥ నిట్టి వక్రోత్తరంబుల ♦ నిచ్చుచుండి ।
పర్వతతనూజనుండి ది ♦ వ్యసరివంతి ।
మఱుఁగువడఁజేయుటకును ♦ నెమ్మదిఁ దలంచు ।
శివుని శాఠ్యంబు మిమ్ము ♦ రక్షించుఁగాక ॥ 1 ॥

సీ॥ స్వైరపాదాఘాత ♦ సంయోగమబ్బెనా
యిలకెంతో యవనతి ♦ గలుగుననియు ।
బాహువులిచ్చవి ♦ స్ఫారితంబయ్యెనా
లోకంబులన్నిటిఁ ♦ దాఁకుననియు ।
జ్వాలనకళాభీల ♦ ఫాలనేత్రంబునఁ
గాంచెనా లక్ష్యముల్ ♦ గాలుననియు ।
నాధారములకిట్టి ♦ యాపదరాకుండఁ
బాదవిన్యాసంబు ♦ పదిలపఱచి ।

గీ॥ బాహువులఁగుదించి ♦ ఫాలనేత్రమ్మును ।
విప్పకుండ ఱెప్పఁ ♦ గప్పియాడు ।
త్రిపురజేత దుఃఖ ♦ నృత్యంబు మీయభీ ।
ష్టములు సర్వమును ♦ నొసంగుఁ గాక ॥ 2 ॥

(నాంది ముగియగానే)

సూత్రధారుఁడు:— ఇఁక నధికప్రసంగమక్కఱలేదు. ఈసభవారు నన్నిట్లాజ్ఞాపించిరి— 'సామంతవటేశ్వరదత్తుని పౌత్రుఁడును, మహారాజపదభాజన పృథుని పుత్రుఁడును, అయిన కవివిశాఖదత్తుఁడు సంస్కృతమున విరచించిన కృతికి పాలెపు వేంకటసూర్యగోపాలప్రధానుఁడు తెలుఁగుచేసిన ముద్రారాక్షసనాటకమును బ్రయోగింపవలయును.' అని. కావ్యవిశేషవేదిని యయిన పరిషత్తునందు నాటకమును బ్రయోగించుటకు నాకును మిగుల నుత్సాహము గలుగుచున్నది. ఏమా?

గీ॥ బాలిశుండైన సుక్షేత్ర ♦ పతితమయిన ।
కృషికి సాఫల్యముంగాంచు ♦ నెంచిచూడ ।
శాలి బీజంబులకుఁ గల్గు ♦ స్తంబకరిత ।
కనవసరముగదా ♦ విత్తు నతని నేర్పు ॥ 3 ॥

కనుక నిపుడింటికిఁజని యిల్లాలినిఁ బిలిచి యామెతోఁగూడ సంగీతకమారంభించెదను. (పరిక్రమించి, యవలోకించి) ఇదే మాయిల్లు! కనుకఁ బ్రవేశించెదను. (నాట్యముచేఁ బ్రవేశించి, యవలోకించి) మాయింటియందిప్పుడు మహోత్సవమువలెఁ గనఁబడుచున్నదేమి? పరిజనము తమతమపనులను మిగుల శ్రద్ధతోఁ జేయుచున్నారు. అవును.

ఉ॥ ఈమె జలంబుదెచ్చు మఱి ♦ యీయమ గంధముదీయు సానపై
నీమెయొ చిత్రచిత్రముగ ♦ నెన్నియొ పూవులఁగ్రుచ్చు దండలి
ట్లీమెయొదంచెదుఱ్ఱుముసల ♦ మెత్తుచు వ్రీల్చుచుఁబోటుపోటుకెం
తో మధురస్వనంబునను ♦ హుంకృతి సేయుచు నేర్పుమీఱఁగన్.

కానిమ్ము. మాయిల్లాలిని బిలిచి యడిగెదను. (తెఱవంకఁజూచి)

గీ॥ గుణవతి! యుపాయనిలయ! య ♦ కుంఠిత త్రి
వర్గసంస్థితిసాధిక! ♦ భవననీతి
విద్య! కార్యగురూత్తమ! ♦ వేగ వేగ
రమ్ము నేవేచియుంటి ద్వా ♦ రమ్మునందు.

నటి:— (ప్రవేశించి) ఆర్యపుత్ర! ఇదిగో వచ్చితిని. ఆజ్ఞానియోగముచేత నన్ననుగ్రహింపుము.

సూత్ర:— ఆర్యా! ఆజ్ఞానియోగముచేత నిన్ననుగ్రహించుట యట్లుంచి, యిపుడు భగవానులను బ్రాహ్మణుల ననుమంత్రించుటమూలముగా నీవీకుటుంబకము ననుగ్రహించితి వేల చెప్పుము. లేక, యిష్టులయిన యతిథులు విచ్చేసినారా? ఈపాకవిశేషారంభమునకు హేతువేమి?

నటి:— తపోధనులను బ్రాహ్మణుల నిపుడు పిలిచితిని.

సూత్ర:— ఎందునిమిత్తము?

నటి:— భగవానుఁడు చంద్రునకు గ్రహణముకదా!

సూత్ర:— ఇట్లెవ్వరు చెప్పిరి?

నటి:— నగరవాసులు జనులిట్లు చెప్పిరి.

సూత్ర:— ఆర్యా! అఱువదినాలుగంగముల జ్యోతిశ్శాస్త్రమందుఁ బరిశ్రమచేసితిని. బ్రాహ్మణులఁగూర్చి వంటలు జరుపవచ్చునుగాని చంద్రగ్రహణమునుగూర్చి యెవఁడో నిన్ను మోసపెట్టినాఁడు చూడు—

ద్వి॥ మానక సంపూర్ణమండలుఁ జంద్రుఁ
బూనిపట్టుటకునై పొంచియుండెడిని
దుష్టగ్రహమ్ము కేతువు—

తెఱలో:— ఆ! నేనుండఁగాఁ జంద్రుని బూనిపట్టుటకుఁ బొంచియున్నవాఁడెవఁడు ?

సూత్ర:— బుధయోగ
మిచ్ఛనడ్డుపడి రక్షింపఁగాఁగలదు

నటి:— అయ్యా! భూమియందున్నవాఁడై చంద్రుని గ్రహాభియోగమునుండి రక్షించుట కిచ్ఛయించుచున్న యతఁడెవరు ?

సూత్ర:— ఆర్యా! సత్యమేదో నాకును దెలియలేదు. కానిమ్ము. మఱల సావధానుఁడనయి స్వరముంబట్టి వ్యక్తిని దెలిసికొందును. ద్వి. మానక సంపూర్ణమండలుఁ జంద్రు- (ఈపద్యమును మఱలఁ బఠించును.)

తెఱలో:— ఆ! నేనుండఁగా- (ఇత్యాది వాక్యము మఱల వినఁబడును.)

సూత్ర:— (విని) ఆ! తెలిసినది. కౌటిల్యుఁడు—

నటి:— (భయమును నటించును.)

సూత్ర:— కౌటిల్యుఁడితఁడు—

గీ॥ నందవంశముఁ గ్రోధాగ్ని ♦ యందుఁ గాల్చి ।
నతఁడు కుటిలుఁడు కౌటిల్యుఁ ♦ డాత్మ నెంచుఁ ।
జంద్రుఁబట్టుటయన నామ ♦ సామ్యమునను ।
మౌర్యచంద్రుని రిపుసేన ♦ మాఱుకొనుట ॥ 7 ॥

కనుక మనమిక్కడనుండి వెడలుదము.

ఇద్దఱు—(నిష్క్రమింతురు.)

చాణక్యుఁడు:— (విడివడ్డ జుట్టు సవరించుకొనుచుఁ బ్రవేశించును.) నేనుండఁగాఁ జంద్రుని బూనిపట్టుటకుఁ బొంచియున్నవాఁడెవఁడు చెపుమా !

గీ॥ కుంభి రుధిరములను ♦ గ్రోలుట నెఱ్ఱనై ।
కలువతేని సంజ ♦ కళనుబోలి ।
సింగ మావులింపఁ ♦ గం గనంబడు కోఱఁ ।
బెఱుక నెవఁడు గోరుఁ ♦ బగిభవించి ॥ 8 ॥

క॥ నందకుల కాలభుజగిన ।
మందక్రోధాగ్ని ధూమ ♦ మలినాకృతిని ।
ప్డుందిద్దని నాశిఖ నే
మందుఁడసహ్యించుఁ దాను ♦ మడియుటకొఱకై ॥ 9 ॥

మఱియు—

ఉ॥ నందకులాటవీప్రదహ ♦ నప్రళయానల ముజ్జ్వలంబుని ।
స్తంద్రము నాదుక్రోధము ప్ర ♦ తాపము నుగ్రమతిక్రమించియే
మందుఁ డిటుల్ పరాత్మ పరి ♦ మాణవివేక విహీనుఁడౌచుఁజా ।
వందమకించెదుర్గ మిడుతె ♦ వైఖరి దానువహించి యియ్యెడన్ ॥

శార్ఙ్గరవ, శార్ఙ్గరవ.

శిష్యుఁడు:— (ప్రవేశించి) ఉపాధ్యాయ ! ఏమి సెలవు.

చాణ:— వత్సా ! కూర్చుండ నిచ్ఛయించుచున్నాను.

శిష్యుఁడు:— ఉపాధ్యాయ ! ఇదిగో, ద్వారప్రకోష్ఠమునందు వేత్రాసనము. అందుఁ గూర్చుండవచ్చును.

చాణ:— వత్సా! కార్యాభియోగమే మమ్మాకుల పెట్టుచున్నది. ఉపాధ్యాయులకు శిష్యజనమందు సహజమయిన దుశ్శీలతగాదుసుమీ. (కూర్చుండి, తనలో) నందకులవినాశమువలనఁ బుట్టినరోషముచే రాక్షసుఁడు, పితృవధామర్షితుని, పర్వతకపుత్రుని, మలయ

కేతునిం గలిసికొని సకల నందరాజ్యప్రదానము నాతనికాశపెట్టి యాతని మహత్తరమయిన మ్లేచ్ఛసైన్యముతోఁ గూడికొని, చంద్రగుప్తుని మార్కొన నుద్యమించుచున్నాఁడన్న వార్త పురజనులకెట్లు వెల్లడియయ్యెనో? (ఆలోచించి) లేక, సర్వలోకము నెఱుఁగునట్లుగా నందవంశనిర్మూలనముఁ బ్రతిజ్ఞచేసి దుస్తరమయిన యీప్రతిజ్ఞాతరంగిణిని దాఁటితిని. అట్టి నేను, ఇపుడు వెల్లడియయిన యీకార్యమును వారించుటకుఁ జాలనా? ఏమా?

చ॥ అరిసతిదిక్తతీ ముఖసి ◆ తాంశువులేడ్పుఁబొగం గసీసమై ।
పరఁగఁగ మంత్రిభూజముల ◆ పైని నయానిలనీతి మోహక ।
ప్రరజముఁ జల్లి భ్రాంతనగ ◆ రద్విజహీనము నందవంశజాం ।
కురతతిఁగాల్చి దాహ్యమఱఁ ◆ గ్రోధదవాగ్నిప్రశాంతమయ్యెడన్

మఱియు–

మ॥ అవశున్ నన్నుపడగ్రపీఠగతుఁబా ◆ యందో్రయుఁగాఁగుంది పా
ర్థివభీతిం గడునమ్రలౌట మది యం ◆ దేదూరిరెవ్వారిగో వా ।
రవనీధ్రాగ్రమునుండి మేన్గు హరి చా ◆ యన్ సాన్వయున్ నందునే
దివుచున్ సింగపుఁబీటనుండి యిపుడెం ◆ తేఁగాంచినారేకదా ॥12

ఇట్లు ప్రతిజ్ఞను జెల్లించుకొనియు వృషలునియందలి ప్రీతిచేత శస్త్రమును ధరించెదను. మఱియు—

మ॥ నవనందుల్ పెకలింపఁగాఁ బడి ◆ రనంతాశల్యముల్ గుంటఁగై
రవమూలంబును నాటినట్లిడితి ◆ మౌర్యస్థంబుగా సుస్థిరం ।
బవు రాజ్యంబిటు యుక్తచిత్తమునఁ ◆ గోపానుగ్రహశ్రీఫలం ।
బు విభక్తంబు యథార్హరీతి నరికిం ◆ బ్రాత్తేడనో వానికిన్ ॥ 13

లేక, రాక్షసుని లోఁబర్చుకొననియెడల నందవంశోన్మూలనమాత్రమునఁ జంద్రగుప్తసామ్రాజ్యలక్ష్మికి స్థైర్యము చేకూఱినదా?

(ఆలోచించి) ఓహో! రాక్షసునకు నందవంశమందలి భక్తి నిరతిశయముగదా! నందకులావయవ మొకఁడు జీవించియున్నను వృషలుని యొద్ద మంత్రిత్వమాతనిచేఁ జేకొనం జేయుటకు శక్యముకాదు. ఆకార్యముంగూర్చి మేము నిరుద్యోగులమయి యుండరాదు. ఇట్లెంచియే తపోవనగతుఁడయినను నందవంశీయుఁడు, దిక్కులేనివాఁడు, సర్వార్థసిద్ధి సంహరింపఁబడెను. అయినప్పటికిని రాక్షసుఁడు మలయకేతువుంగలిసికొని మమ్ములనుచ్ఛేదించుటకు విపులతరప్రయత్నము గావించుచునే యున్నాఁడు. (ప్రత్యక్షముగా నాకాశమందు లక్ష్యమొగ్గి) బాగు! అమాత్యరాక్షసా! మంత్రిబృహస్పతీ! బాగు! ఏమా?

మ॥ ధనమాశించి భజింత్రు సంపద జనుల్ ◆ ధాత్రీశు, నాపత్తుఁజెం
దిన సేవింత్రు పునఃప్రతిష్ఠకయి య ◆ త్నింపన్ ధృతిన్ రాజు స
చ్చిన తర్వాతనుగూడఁ బూర్వకృతమా ◆ స్నేహంబుచే లాభమే
మిన పేక్షింపక కార్యదీక్షగొను నీ ◆ మేవారిలన్ దుర్లభుల్ ॥ 14॥

అందుచేతనే, యెట్లు నీవు వృషలునియొద్ద మంత్రిత్వమంగీకరించి యనుగ్రహింతువని కోరి నిన్ను సంగ్రహించుటకీప్రయత్నము. ఏమా?

శా॥ ప్రజ్ఞాహీనుఁడుఁ గాతరుండునగుచో ◆ భక్తుండు వ్యర్థుండగుం ।
బ్రజ్ఞావిక్రమశాలియైన యతఁడున్ ◆ వ్యర్థుండభక్తుండు; స ।
త్ప్రజ్ఞావిక్రమభక్తిశాలి పతికై ◆ శ్వర్యంబుఁ జేకూర్చుఁ దం ।
త్ప్రజ్ఞండై సిరిసేగి భృత్యులితరుల్ ◆ దారాయితుల్ స్వామికిన్॥

కావుననే యీకార్యమువిషయమమయి నేను శయానుఁడనయి యుండను. మఱియు, వృషల పర్వతకులలో నెవఁడో యొకఁడు నశించినను జాణక్యునకపకారము గాఁగలదని రాక్షసునివలన విషకన్యచేత మాకత్యంతోపకారి, దొడ్డవాఁడు, పరమమిత్రుఁడు, పర్వతకుఁడు సంహరింపఁబడినట్లు లోకులునమ్ముటకయి దేశమందు జనాపవాదము

వ్యాపింపఁజేసితిమి. సత్యమును వ్యక్తపఱుచుచు 'నీతండ్రి చాణక్యుని చేత ఘాతితుఁ'డని మలయకేతుని రహస్యముగా భాగురాయణుని చేత భయపఱిచి యాతనిని స్థానాంతరగతుం గావించితిని. రాక్షసమతిపరిగృహీతుఁడయి యుద్ధసన్నద్ధుఁడుగాఁ గోరినను నీతనిని మాబుద్ధిచేత నివారించుట శక్యమే. కాని వీనిని నిగ్రహించితిమా పర్వతకసంహారమువలన రాక్షసునిపయిని వ్యాపించిన యపకీర్తి మాసిపోవును. అందుకిచ్ఛగింపను. మఱియు, స్వపక్షపరపక్షములందనురక్తాపరక్తులను దెలిసికొనఁగోరి, నేను, బహువిధదేశభాషావేషాచారసంచారవేదులను నానావిధవేషధారులను, గూఢచారులను నియోగించితిని. కుసుమపురవాసులయిన నందామాత్యస్నేహితుల ప్రచారగతులు నిపుణతరముగాఁ బరీక్షింపఁబడుచున్నవి. చంద్రగుప్తసహోత్థాయులయిన ప్రధానపురుషులు భద్రభటప్రముఖులు, ఆయాకారణములు త్పాదించి కృతకృత్యతంగాంచునట్లు కావింపఁబడిరి. శత్రుప్రయుక్తులయి విషప్రయోగముచేయు వారలకుఁ బ్రతివిధానమాచరించుటనుగూర్చి పరీక్షితభక్తులయిన యాప్తపురుషులు, అప్రమత్తులయి రాజును గనిపెట్టియుండుటకు నియమింపఁబడిరి. మాకు సహాధ్యాయియు, మిత్రమును అగు విష్ణుశర్మ యను విప్రుఁడు గలఁడు. అతఁడు శుక్రదండనీతిశాస్త్రమందును, చతుష్షష్ట్యంగమయిన జ్యోతిశ్శాస్త్రమందును విశేషప్రవీణతంబొందినవాఁడు. నేను నందవధప్రతిజ్ఞ కావించినవెంటనే బౌద్ధసన్యాసివేషముతోఁ గుసుమపురమునకు రప్పించి, నందామాత్యులందఱితోఁ జెలిమిఁజేయించితిని. విశేషించి, రాక్షసునకాతనియందు మెండు విశ్వాసము గలిగినది. కనుక నాతనిచేత నిపుడు మహత్తరమయిన ప్రయోజనముకలుగఁగలదు. ఈవిధముగా మేమించుకయు దిగవిడువలేదు. ఇఁక వృషలుఁడే ప్రధానమంత్రులమయిన మాయందు రాజ్యతంత్రభారమెల్ల నారోపించి తానుదాసీనుఁడయి

యున్నవాఁడు ఇది సరియే! అసాధారణమయిన కార్యభారదుఃఖములకుఁ దాను పాలుగాని రాజ్యమే సుఖహేతువగును. ఏమా?

గీ॥ ప్రకృతిని బలాఢ్యులయ్యు సం ♦ పాదనంబు।
తామె కావించుకొని మఱి ♦ తామె మెసవు।
నట్టి నరపతులట్టు ♦ గజాధిపతులు।
గాసి గాంతురు తర్చు దుః ♦ ఖంబుచేత ॥ 16 ॥

చరుఁడు:- (యమపటముతోఁ బ్రవేశించును.)

క॥ యముచరణమ్ములకె ప్రణా।
మము సేయుండితర దైవ ♦ మండలితోఁ గా।
ర్యములేదితండు పరదై
వము భక్తుల జీవితంబుఁ ♦ బరిమార్చు వడిన్ ॥ 17 ॥

మఱియు:—

గీ॥ పురుషుజీవితంబుఁ ♦ బ్రోచు భక్తిగృహీతుఁ।
డైనయెడల విషముఁ ♦ డయ్యు నతఁడు।
సర్వలోకములను ♦ సమయించు యమునిచే।
బ్రదుకుచున్నవార ♦ మదురులేక ॥ 18 ॥

(అని చదుచును.)

శిష్యుఁడు:- (చూచి) భద్రుఁడా! ప్రవేశింపఁగాదు.

చరుఁడు:- ఓహో బ్రాహ్మణ! ఈయిల్లెవరిది?

శిష్యుఁడు:- మాగురువులు, సుగృహీతనామధేయులు, ఆర్య చాణక్యులది.

చరుఁడు:- (నవ్వి) ఓ బ్రాహ్మణ! ఆయన మాధర్మభ్రాతయే. కావున నన్నుఁ బ్రవేశింపనిమ్ము. మీయుపాధ్యాయునికి ధర్మములుపదేశించెదను.

శిష్యుఁడు.— (క్రోధముతో) ఛీ! మూర్ఖుఁడా; మాయుపాధ్యాయులకంటెను నీవెక్కువధర్మవేదివఁటరా!

చరుఁడు:— ఓ హో బ్రాహ్మణ! కోపింపకు. అందఱును అన్నిటి నెఱుఁగరు. నావంటివారును గొన్నింటి నెఱుఁగుదురు.

శిష్యుఁడు:— (క్రోధముతో) ఓరిమూర్ఖుఁడా! ఉపాధ్యాయులవారి సర్వజ్ఞత నపహరించుటకు యత్నించుచున్నావు.

చరుఁడు:— ఓ హో బ్రాహ్మణ! మీయుపాధ్యాయునికి సర్వముఁ దెలిసినయెడలఁ జంద్రునిపై అహితుఁడెవఁడో తెలిసికొనవచ్చును.

శిష్యుఁడు:— మూర్ఖుఁడా! ఇది తెలిసినయెడల గురువునకేమి ప్రయోజనము?

చరుఁడు:— ఇది తెలిసినయెడలఁ బ్రయోజనమేమో మీయుపాధ్యాయులవారెఱుఁగుదురు. సరళబుద్ధివి నీవింతమాత్రమే యెఱుఁగుదువు. కమలములకుఁ జంద్రుఁడు ప్రియుఁడు గాఁడని—చూఁడు మఱి—

క॥ సుమనోహరంబులయినను ।
గమలము లాకృతిని వేఱు ♦ గాఁగనఁబడు శీ ।
లము పూర్ణమండలుఁడు చం ।
ద్రమయందుం జిత్తమనను ♦ రక్తంబగుటన్ ॥ 19 ॥

చాణ:- (విని తనలో) చంద్రగుప్తునిపయి ననురాగములేనివారిని దానెఱుఁగుదునని యితనిమాటకర్థము.

శిష్యుఁడు:— మూర్ఖుఁడా! ఇట్లసంబద్ధమాడుచున్నావేమి?

చరుఁడు:— ఓ బ్రాహ్మణ! ఇది సుసంబద్ధమే.

శిష్యుఁడు:— అయినచో ఫలమేమి?

చరుఁడు:— విని తెలిసికొనువారు లభించినయెడల—

చాణ:— (చూచి) భద్రుఁడా! నిస్సందేహముగాఁ బ్రవేశింపుము. విని తెలిసికొనువారు లభింతురు.

చరుఁడు:— ఇదిగో వచ్చుచున్నాను. (ప్రవేశించి సమీపించి) ఆర్యులకు జయము.

చాణ:— (చూచి తనలో) కార్యములెక్కువగుటచేత ఏమి తెలిసికొనుటకు నిపుణకుని నియమించితినో జ్ఞప్తికిరాలేదు. ఆ! తెలిసినది. జనులయభిప్రాయములఁ దెలియుటకయి నియమించిన నిపుణకుఁడా వీఁడు. (పయికి) భద్రా! స్వాగతము. కూర్చుండుము.

చరుఁడు:— చిత్తము (భూమిపైఁ గూర్చుండును.)

చాణ:— భద్రా! నిన్ను నియోగించిన వృత్తాంతము నిపుడు సవిస్తరముగాఁజెప్పుము. ప్రజలు వృషలునియందనురక్తులైయున్నారా?

చరుఁడు:—మఱియేమి? అయ్యా యివి రాగకారణము లార్యులవారు పరిహరించినందున సుగృహీతనామధేయుఁడయిన చంద్రగుప్త మహారాజునందుఁ బ్రజలు గట్టిగా ననురక్తులైయున్నవారు. కాని, అమాత్యరాక్షసునియెడ మొదటినుండియు స్నేహబహుమానములు గలవారు, చంద్రశ్రీకుఁడైన మహారాజు నభ్యుదయము సహింపనివారు ముగ్గురు పురుషులు గలరు.

చాణ:— (క్రోధముతో) తమజీవితమునే సహింపనివారని చెప్పఁదగును. భద్రా! వారిపేళ్ళెఱుంగుదువా?

చరుఁడు:— పేళ్ళెఱుఁగకుండ దేవరతో విన్నవింతునా?

చాణ:— అయితే వినిపింపుము.

చరుఁడు:— ఆర్యులు వినఁదగును. ఆర్యుల రిపుపక్షమందుఁబక్షపాతముగలవారు ముగ్గురు. అందు మొదటివాఁడు క్షపణకుఁడు.

చాణ:— (హర్షముతో, తనలో) మారిపుపక్షమందుఁ బక్షపాతముగలవాఁడఁట క్షపణకుఁడు. (పయికి) అతనిపేరు?

చరుఁడు:- జీవసిద్ధి.

చాణ:- క్షపణకుఁడు మాశత్రుపక్షమందుఁ బక్షపాతముగల వాఁడని నీకెట్లు తెలిసినది?

చరుఁడు:- అమాత్యరాక్షసుఁడు ప్రయోగించిన విషకన్య నీతఁడు పర్వతేశ్వరునిపైఁ బఱపినాఁడు.

చాణ:- (తనలో) ఈజీవసిద్ధి మాగూఢచారుఁడే. (పయికి) భద్రా! మఱి రెండవవాఁడెవఁడు?

చరుఁడు:- ఆర్యా! రెండవవాఁడు అమాత్యరాక్షసుని ప్రియస్నేహితుఁడు, కాయస్థుఁడు, శకటదాసనువాఁడు.

చాణ:- (నవ్వి తనలో) కాయస్థుడనునది చిన్నమాత్ర. క్షుద్రుఁడయినను శత్రువునుపేక్షింపరాదు. కావుననే యాతనిపైని మిత్రవ్యాజముచే సిద్ధార్థకుని నియమించితిని. (పయికి) భద్రా! మూఁడవవాఁడెవఁడో వినఁగోరుచున్నాను.

చరుఁడు:- మూఁడవవాఁడమాత్యరాక్షసునికి బహిఃప్రాణము వంటివాఁడు. రత్నవర్తకుఁడు, సెట్టి, చందనదాసుఁడు. అతనియింటనే భార్యనుదాఁచి యమాత్యరాక్షసుఁడు నగరమునుండి వెడలినవాఁడు.

చాణ:- (తనలో) నిశ్చయముగా సుహృత్తముఁడు. తనకుఁ దుల్యుఁడుగాని వానియింటఁ దనభార్యను దాఁచఁడు (పయికి) భద్రా! చందనదాసునియింటనే యమాత్యరాక్షసుఁడు తనభార్యను దాఁచియుంచెనని నీకెట్లు తెలిసినది?

చరుఁడు:- ఆర్యా! ఈముద్దుటుంగరమే తమకు వివరము విశదముచేయును (అని ముద్రనిచ్చుచున్నాఁడు.)

చాణ:- (చూచి, పుచ్చుకొని రాక్షసునిపేరు చదివి హర్షముతో, తనలో) ఇఁక రాక్షసుఁడే మనచేతఁ జిక్కినాఁడు. భద్రా! ఈముద్దుటుంగరములభించినవిధము సవిస్తరముగావినఁగోరుచున్నాను.

చరుఁడు:- ఆర్యులు వినుఁడు. పౌరజనచరితము నారయుటకు మీరు నన్ను నియోగించితిరిగదా. నేనితరులయింటఁ బ్రవేశించుటకయి, వారికి శంకగలుగఁజేయని యీయమపటముతో సంచరించుచు, మణికారశ్రేష్ఠి చందనదాసునింటఁ బ్రవేశించితిని. అక్కడ నీపటమును విప్పి గీతములఁ బాడుటకారంభించితిని.

చాణ:- తరువాత?

చరుఁడు:- తరువాత నొకగదినుండి, చక్కనివాఁడు, అయిదేండ్లప్రాయముగల యొక కుఱ్ఱవాఁడు, బాలజనసులభమయిన వేడుకచేఁ గన్నులు విప్పి యీవలికి రాఁగడంగినాఁడు. అంతట, "అయ్యో వెలుపలికి వెళ్ళినాఁడు, వెళ్ళినాఁడు." అని ఆగదినుండియే శంకాపరిగృహీతముగా స్త్రీలు వేసెడు కేకలు వినవచ్చెను. అంత ద్వారదేశమునుండి యీవలికి మొగము కొంచెము గనిపించునట్లు నిలిచి యొక లలనామణి యాబాలకుని బెదరించుచు కోమలమయిన బాహువుచే వానిం బట్టుకొనెను. కుమారునట్లాటంకించు తొందరలోఁ గదిలిన చేతివ్రేళ్ళనుండి, పురుషునివ్రేలికి సరిపడెడు నీసికాయుంగరము ఆమెకుఁ దెలియకుండ జారి గడపకీవలఁబడి నాపాదములదగ్గఱకు దొర్లి ప్రణామనమ్రమైన కులకాంతవలె నక్కడనాగిపోయెను. నేనును, అందుఁజెక్కిన అమాత్యరాక్షసునిపేరు చూచి మీపాదసన్నిధికిఁ దెచ్చితిని. ఈయుంగరము దొరికినమార్గమిది.

చాణ:- భద్రా! అంతయు వింటిని వెళ్లుము. ఈపరిశ్రమమునకుఁ దగిన బహుమానము త్వరలోఁ బొందఁగలవు.

చరుఁడు:- చిత్తము. (అని వెళ్లును.)

చాణ:- శార్ఙ్గరవ! శార్ఙ్గరవ.

శిష్యు:- (ప్రవేశించి) ఉపాధ్యాయ! ఆజ్ఞాపింపుఁడు.

చాణ:- వత్స! సీరాబుడ్డియు, కాగితమును దెమ్ము.

శిష్యు:- చిత్తము. (వెళ్ళి, మరలవచ్చి) ఇదిగో సిరాబుడ్డియు కాగితమును.

చాణ:- (పుచ్చుకొని, తనలో) ఏమి వ్రాయుదును? ఇందువలననే రాక్షసుని జయింపవలెను.

ప్రతీహారి:- (ప్రవేశించి) ఆర్యులకు జయము, జయము.

చాణ:- (హర్షముతో, తనలో) జయశబ్దము గ్రహింపఁబడినది. (పైకి) శోణోత్తరా! నీవు వచ్చినపనియేమి?

ప్రతీ:- ఆర్య! తామరమొగ్గంబోలు నంజలిని శిరసునందిడికొని చంద్రగుప్త మహారాజార్యులకిట్లు విన్నవించుచున్నాఁడు. "ఆర్యులవారి యానతిం గైకొని పర్వతేశ్వరుని పారలౌకికకృత్యములఁ జేయ నిచ్చగించుచున్నాను. అయన మున్ను ధరించిన యాభరణములు గుణవంతులయిన బ్రాహ్మణులకు సమర్పించుచున్నాను." అని.

చాణ:- (హర్షముతో, తనలో) బాగు! వృషలా! బాగు నాహృదయగతమునే నీవును యోచించితివి. (పయికి) శోణోత్తరా! వృషలుతో నామాటలుగా నిట్లుచెప్పుము. "బాగు! నాయనా, బాగు. లోకవ్యవహారములన్నిటి నెఱుఁగుచున్నావు. కనుక నీయభిప్రాయము నాచరింపుము; కాని పర్వతేశ్వరుఁడు మున్ను ధరించిన భూషణములు గుణవంతములు. వానిని గుణవంతులగు బ్రాహ్మణులకే యియ్యఁదగును. కావున వానికొఱకుఁ బరీక్షితగుణులయిన బ్రాహ్మణులను నేనే పంపెదను." అని.

ప్రతీ:- ఆర్యులు సెలవిచ్చినట్లు విన్నవించెదను. (వెళ్ళును)

చాణ:- శార్ఙ్గరవ, శార్ఙ్గరవ. విశ్వావసునకును, అతని సోదరులిరువురకును ఇట్లుచెప్పుము. "వృషలునివలననుండి యాభరణములు గ్రహించి నన్నుఁ జూడవలసినది." అని.

శిష్యు:- ఆచార్యులాజ్ఞాపించినట్లు చేసెదను. (వెళ్లును.)

చాణ:- (తనలో) ఇది లేఖయందుఁ దుదను వ్రాయఁదగిన విషయము. మొదట వ్రాయఁదగినదేది? (ఆలోచించి) ఆహా! తెలిసినది. నాగూఢచారులవలన లభించిన విషయమేమనఁగా!- ఆమ్లేచ్ఛరాజు బలము మధ్యమందుఁ బ్రధానతములయిదుగురు రాజులు పరమభక్తితో రాక్షసుననుసరించి వర్తించుచున్నారని- వారెవరనఁగా-

సీ॥ మలయాచలప్రాంత ♦ మండలేశుండు నృ
సింహుఁడు పేరిచే ♦ సింహనాదుఁ ;।
డల కులూతాఖ్య దే ♦ శాధీశ్వరుఁడు చిత్ర
వర్మాభిధానుఁ డ ♦ వార్యబలుఁడు ;।
కాశ్మీరదేశ భూ ♦ కాంతుఁడు పుష్కరా
క్షుండు; సంక్షోభిత ♦ చండ శత్రు
జీవన విభవుండు ♦ సింధుదేశధవుండు
సింధుషేణుఁడు; పార ♦ సీకరాజ్య

గీ॥ వరుఁడు మేఘాఖ్యుఁడక్షీణ ♦ తురగబలుఁడు;।
ఈయయిదుగు పేళ్లనున్ నేన ♦ వ్రాయువాఁడ।
ధ్రువముగానిపుడే; తాను ♦ దుడిచివైచి।
కొనును వ్యర్థములని చిత్ర ♦ గుప్తుఁ డింక॥

(ఆలోచించి) లేక, ఏమియు వ్రాయను. అంతయు గూఢముగానుండఁదగును. (పయికి) శార్ఙ్గరవ!

శిష్యు:- (ప్రవేశించి) ఉపాధ్యాయా; ఆనతిమ్ము.

చాణ:- వత్సా! ప్రయత్నముతో వ్రాసినను శ్రోత్రియుని యక్షరములు స్పష్టముగాఁ గుదురవు. కనుక సిద్ధార్థకునితో నామాటగా నిట్లుచెప్పుము. (చెవిలో, ఇట్లట్ల) "ఈయక్షరములతో, ఎవరో యెవరికో స్వయముగాఁ జెప్పవలసియున్నదని తెలిపి విలాసముక్కఱ

లేకుండ శకటదాసునిచేత వ్రాయించి నాయొద్దకుఁ దేవలసినది. చాణక్యుఁడిది వ్రాయించుచున్నాఁడని యాతనితోఁ జెప్పఁదగదు" అని.

శిష్యు:- చిత్తము. (వెళ్లును.)

చాణ:- (తనలో) ఆహా మలయకేతుఁడు జయింపఁబడెను.

సిద్ధా:- (లేఖతోఁ బ్రవేశించి) ఆర్యులకు జయము, జయము. ఇదిగో! శకటదాసుఁడు స్వహస్తముతో వ్రాసిన లేఖ.

చాణ:- (పుచ్చుకొని, చూచి) ఓహో! అక్షరములెంత పొంకముగానున్నవి! భద్రా! ఈసికాతో దీనిని ముద్రింపుము.

సిద్ధా:- చిత్తము. (ముద్రించి) ఇదిగో ముద్రించితిని. ఇఁకఁ జేయవలసినదేమో యానతీయవలెను.

చాణ:- భద్రా! నేను స్వయముగాఁ జేయఁదగిన కార్యమొకటి నీచేతఁ జేయింపఁగోరుచున్నాను.

సిద్ధా:- (హర్షముతో) ఆర్యా! ఇది నాపట్ల ననుగ్రహము. కనుక నీదాసజనుఁడు తమనిమిత్తమాచరింపఁదగినదేదో సెలవియ్యవలెను.

చాణ: భద్రా! మొట్టమొదట వధ్యస్థానమునకువెళ్లి రోషముతోఁ గుడికంటిని ముడిచి, యాసైగను ఘాతకులకుఁ గనఁబఱుపవలయును. వారాసంజ్ఞనుగ్రహించి యిటునటుఁ బాఱిపోవఁగా శకటదాసుని వధ్యస్థానమునుండి తప్పించి రాక్షసునియొద్దకుఁ జేర్పవలయును. మిత్రుని ప్రాణములఁ గాపాడినందుకుఁ బరితుష్టుఁడగు నారాక్షసునివలన బహుమానమును బొందవలయును. మఱియుఁ గొంతకాలము రాక్షసుని సేవింపవలయును. తరువాత శత్రువులసన్నిధిని నీవి ప్రయోజనము నాచరింపవలయును. (చెవిలో నేమియో చెప్పును)

సిద్ధా:- ఆర్యుల యానతి నిర్వర్తించెదను.

చాణ:- శార్ఙ్గరవ; శార్ఙ్గరవ.

శిష్యు:- (ప్రవేశించి) ఉపాధ్యాయా! ఏమి సెలవు?

చాణ:- వృషలుఁడిట్లాజ్ఞాపించినట్లు నామాటలుగా, కాలపాశికునితోను, దండపాశికునితోను చెప్పఁదగును. "జీవసిద్ధి యను క్షపణకుఁడు రాక్షసప్రేరితుఁడయి విషకన్యచేత పర్వతేశ్వరునిఁజంపినాఁడు. ఈదోషమారోపించి యాతనిని సతిరస్కారముగాఁ బట్టణమునుండి వెడలఁగొట్టవలెను" అని.

శిష్యు:- చిత్తము. (వెళ్లఁబోవును.)

చాణ:- వత్సా! ఉండుండుము. రెండవవాఁడు, కాయస్థుఁడు శకటదాసుఁడు రాక్షసప్రయుక్తుఁడయి నాశరీరనిర్విశేషుఁడయినమౌర్యునకు ద్రోహముచేయఁ గడఁగుచున్నవాఁడు. అతనిపై నీదోషమారోపించి కొఱతనెక్కింపవలయుననియు, ఆతని గృహజనమును జెఱసాలయందుఁ బెట్టవలయుననియుఁ జెప్పుము.

శిష్యు:- చిత్తము. (వెళ్లును.)

చాణ:- (చింతనటించుచు, తనలో) దురాత్ముఁడా రాక్షసుఁడు గ్రహింపఁబడునా?

సిద్ధా:- ఆర్యా! గ్రహింపఁబడెను.

చాణ:- (హర్షముతో, ఆత్మగతము) వహవా! రాక్షసుఁడు గ్రహింపఁబడెనా? (పయికి) భద్రా! గ్రహింపఁబడెననఁగా నేమి?

సిద్ధా.- ఆర్యుని సందేశము నాచేగ్రహింపఁబడెను. కనుక, కార్యసిద్ధికై వెడలుచున్నాను.

చాణ:- (అంగుళిముద్రతోడి లేఖనిచ్చి) భద్రా, సిద్ధార్థక! వెడలుము. నీకుఁ గార్యసిద్ధియగుఁగాక.

సిద్ధా:- ఆర్యుల యానతిచొప్పున జరిపెదను. (నమస్కరించి వెడలును.)

శిష్యు:- (ప్రవేశించి) ఉపాధ్యాయ! కాలపాశిక, దంతపాశికులు చంద్రగుప్తమహారాజు శాసనముచొప్పునఁ గావింతుమని యుపాధ్యాయులకు విన్నవించుచున్నారు.

చాణ:- బాగు! వత్సా! రత్నవర్తకుఁడు చందనదాసు నిపుడు చూడఁగోరుచున్నాను.

శిష్యు:- చిత్తము. (వెళ్లి, చందనదాసునితోఁ బ్రవేశించి) సెట్టీ! ఈలాగీలాగు;

చంద:- (తనలో)

క॥ దిగులొందవు దయారహితుం।
డగు చాణక్యుండు పిలువ ♦ నంపినచో దుం।
డగ మింతలేని వానికిఁ।
బగతుఁడనే నాయవస్థ ♦ బలుకఁగ వలెనే ॥ 21 ॥

అందుచేత, ధనసేనుండు మొదలుగా ముగ్గురువర్తకులకిట్లునిదేశించితిని. "ఎపుడయినఁ జాణక్యహతకుఁడు నాయింటిఁ బరీక్షించును. కనుక మీరు జాగరూకులయియుండి ప్రభువయిన యమాత్యరాక్షసుల వారి గృహజనమును నాయింటనుండి దాటింపుఁడు. నాకో, ఏమి కాఁగలదో అది యగుఁగాక" అని.

శిష్యు:- సెట్టీ! ఇటు, ఇటు

చంద:- ఇదిగో వచ్చుచున్నాను.

(ఇద్దరు నడతురు)

శిష్యు:- ఉపాధ్యాయ! ఇదిగో సెట్టి, చందనదాసుఁడు.

చంద:- (సమీపించి) ఆర్య! జయము, జయము.

చాణ:- (చూచుట నభినయించి) సెట్టీ! స్వాగతము. ఈయాసనముపయిఁ గూర్చుండుము.

చంద:- (నమస్కరించి) అనుచితమయిన యుపచారము పరాభవముకంటెను ఎక్కువయిన దుఃఖముఁ గలిగించునని యార్యులకుఁ దెలియదా? నాకుఁ గూర్చుండుట కుచితము భూమియే. ఇందుఁ గూర్చుండెదను.

చాణ:- సెట్టీ! ఇట్లు కాదు కాదు. మావంటివారిచేత నీపట్ల నిది యుచితమే. కనుక నాసనమందే కూర్చుండుము.

చంద:- (తనలో) ఇతఁడేమయినఁ గనిపెట్టినాఁడా? (పయికి) ఆర్యుల యాజ్ఞ (కూర్చుండును.)

చాణ:- సెట్టీ! చందనదాస! మీవ్యాపారమందు వృద్ధిలాభములధికముగా నున్నవా?

చంద:- (తనలో) అత్యాదరము శంకనీయము. (పయికి) చిత్తము. ఆర్యుల యనుగ్రహముచేత నావ్యాపారము కొనసాగుచున్నది.

చాణ:- సెట్టీ! చంద్రగుప్తునిదోషములు, గతరాజుల గుణముల నిపుడు ప్రజలను స్మరింపఁజేయుచున్నవా?

చంద:- (చెవులు మూసికొని) పాపము శమించుఁగాక! శరత్కాలరాత్రియందలి చంద్రునిచేతవలెనే చంధ్రగుప్తశ్రీచేతఁ బ్రజలధికముగా నానందించుచున్నారు.

చాణ:- సెట్టీ! ఇట్లయినయెడలఁ, బ్రీతులయిన ప్రజలనుండి రాజులు ప్రతిప్రియమును గోరుదురు.

చంద:- ఈజనునివలన నేమి ప్రియముగావలెనో ఆర్యులాజ్ఞాపింపఁదగును.

చాణ:- సెట్టీ! ఇది చంవ్రగుప్తరాజ్యము నందరాజ్యము గాదు. నందునకపేక్ష ధనము. అతనికి ధనమే ప్రీతిజనకము. చంద్రగుప్తునకన్ననో మీకుఁబరిక్లేశము కలుగకుండుటయే ప్రీతిజనకము.

చంద:— (హర్షముతో) ఆర్యా! అనుగ్రహింపఁబడితిని.

చాణ:— సెట్టీ! ఆపరిక్లేశము కలుగకుండుట యెట్లని నీవు మమ్మడుగవలెను.

చంద:— ఆర్యులు సెలవీయవలెను.

చాణ:— సంక్షేపముగాఁ జెప్పెదను- రాజునకు విరుద్ధముగాని వృత్తులచేత వర్తింపవలెను.

చంద:— అట్టిభాగ్యహీనుఁడెవఁడని యార్యులకుఁ దెలిసినది.

చాణ:— నీవే మొదటివాఁడవని-

చంద:— (చెవులు మూసికొని) పాపము శమించుగాక. పాపము శమించుగాక. గడ్డిపరకల కగ్నితో విరోధమెట్టిది?

చాణ:— ఆవిరోధమిట్టిది. ఇపుడును రాజాపథ్యకారియయిన యమాత్యరాక్షసుని గృహజనమును నీయింటికిఁదెచ్చి రక్షించుచున్నావు.

చంద:— ఆర్యా! ఇది యబద్ధము. ఎవఁడో దుష్టుఁడార్యులకు నివేదించినాఁడు.

చాణ:— సెట్టీ! భయమక్కఱలేదు. భయపడిన పూర్వరాజపురుషులు, తమ గృహజనమును, బౌరులయిండ్లయం దాపౌరులిచ్ఛగించకున్నను దిగవిడిచి దేశాంతరమున కేగుదురు. అది పౌరులదోషముగాదు వారిని దాఁచియుంచుటయే దోషము.

చంద:— ఇదియిట్లు-ఆసమయమం దమాత్యరాక్షసుని గృహజనము నాయింటనుండెను.

చాణ:— మొదట నది యబద్ధమంటివి. నాయింటనుండెనని యిపుడంటివి. నీమాటలు పరస్పరవిరోధములు.

చంద:— ఇంతవఱకే నామాటలు పరస్పరవిరోధములు. ఇది పొరఁబాటు.

చాణ:— చంద్రగుప్తుఁడు రాజయియుండఁగా పొరఁబాటుపనికిరాదు. కనుక రాక్షసుని గృహజనమును సమర్పింపుము. అపుడు నీకాపట్యము తొలఁగును.

చంద:— అయ్యా! ఆసమయమందమాత్యరాక్షసుని గృహజనము నాయింట నుండెనని విన్నవించియుంటిని.

చాణ:— అయితే యిపుడెక్కడ నున్నది?

చంద:— ఎక్కడికేగెనో యెఱుఁగను.

చాణ:— (చిఱునవ్వుతో) ఎఱుఁగననుట యెట్లు? ఓయీసెట్టీ తలపైనిఁ బామును, దూరమందౌషధమును. ఇదిగాక, నందునివలె విష్ణుగుప్తుఁడు- (ఇటు సగము చెప్పి లజ్జను నటించును.)

చంద:— (తనలో)

క॥ పయిని జలదములు నుఱుములు।
ప్రియ దూరమునందు సంభ♦ వించెఁగదా యీ।
క్రియ, తలపైఁ బాము హిమా।
లయమున దివ్యౌషధంబు♦ లాగున నకటా!॥ 22॥

చాణ:— చంద్రగుప్త నమాత్యరాక్షసుఁడున్మూలింపఁగలఁడని తలఁపకు. చూడు-

మ॥ అల నందుల్; మనినప్డె శ్రీని స్థిరఁజే♦ యన్ వక్రనాసాదిమం।
త్రులకున్ నీతిబలప్రవీణులకు నెం♦తో దుష్కరంబయ్యె; రా।
జ్యలసచ్ఛ్రీ, యిపుడింపు వెన్నెలగతిం♦ జంద్రుంబెనంగొంచు లో
కుల కాహ్లాదముఁ గూర్చు; దీని విడఁగాఁ♦ గొట్టంగ వేఁడోపెడున్

చంద:— (తనలో) ఇతని యాత్మశ్లాఘఫలమున కనురూపము గానున్నది.

తెఱలో—(కలకలము)

చాణ:— శార్ఙ్గరవా! ఇది యేమో తెలిసికొనుము.

శిష్యు:- చిత్తము. (వెళ్లి తిరిగివచ్చి) ఉపాధ్యాయ! రాజాపథ్యకారియయిన క్షపణకుఁడు జీవసిద్ధి చంద్రగుప్తమహారాజువారియాజ్ఞచేత తిరస్కారముతోఁ బురమునుండి వెడలఁగొట్టఁబడుచున్నాఁడు.

చాణ:- క్షపణకుఁడా? ఆహాహా! లేక, రాజాపథ్యకారిత్వమునకుఁ దగినఫలమనుభవింపనీ! ఓయి సెట్టీ! చందనదాస! రాజాపథ్యమాచరించువారియెడల రాజుగారి దండనమిట్లు చాలకఠినము. కనుక మిత్త్రుని హితవచనమువిని రాక్షసుని గృహజనమును సమర్పించి, చిరకాలము విచిత్రము రాజప్రసాదమనుభవింతువుగాక!

చంద:- అమాత్యరాక్షసగృహజనము నాయింటలేదు.

తెరలో— (మరలఁ గలకలము)

చాణ:- శార్ఙ్గరవ! మరల నిదియేమో తెలిసికొమ్ము.

శిష్యు:- చిత్తము. (వెళ్ళి తిరిగివచ్చి) ఉపాధ్యాయ! రాజాపథ్యకారి, కాయస్థుఁడుశకటదాసుఁడు రాజాజ్ఞచేత శూలమెక్కింపఁబడుటకుఁ గొంపోఁబడుచున్నాఁడు.

చాణ:- తనకర్మము ఫలమనుభవించుఁగాక! ఓసెట్టీ! రాజాపథ్యకారులవిషయమయి రాజీవిధముగా తీక్ష్ణదండుఁడు. రాక్షసకళత్రము నీవు దాఁచుటను సహింపఁడు. కనుక, పరకళత్రమునర్పించి నీకళత్రమును, జీవితమును గాపాడుకొనుము.

చంద:- అయ్యా! నన్ను భయపెట్టెదవా? అమాత్యరాక్షసుని గృహజనము నాయింటనున్నను నేను సమర్పింపను. ఇఁక లేనపుడెట్లు?

చాణ:- చందనదాస! ఇది నీనిశ్చయమా?

చం:- అవును. స్థిరమయిన నిశ్చయము.

చాణ:- (తనలో) బాగు! చందనదాస! బాగు.

క॥ పరసంవేదనమున బహు |
తరమర్థము సులభముగనె ♦ దక్కెడుచోఁ దు |
ష్కరమీకృత్యం బెవఁడా |
చరించునీ యుగమున శిబి ♦ చాయను భూమిన్ ॥ 24 ॥

(పయికి) చందనదాస! ఇది నీనిశ్చయమా?

చంద:- అవును.

చాణ:- (క్రోధముతో) దురాత్ముఁడ! దుష్టవర్తకుఁడ! అయిన రాజకోపము ఫలమునసుభవింపు.

చంద:- (బాహువులు చాచి) సిద్ధముగానున్నాను. ఆర్యా! మీయధికారమునకుఁ దగినట్లాచరింపుము.

చాణ:- (క్రోధముతో) శార్ఙ్గరవ! కాలపాశిక, దండపాశికులతో నామాటలుగా నిట్లు చెప్పుము. "ఈదుష్టవర్తకుని శీఘ్రముగా దండింపు" మని- లేక, ఉండు- దుర్గపాల, విజయపాలురతో నిట్లుచెప్పుము. "నేను వృషలునితో వివరించుదాక, ఈతని సొత్తులను సపుత్త్రకళత్రముగాఁ బట్టుకొని కాపాడు" మని, అతఁడే వీనిప్రాణములు తీయుదండన మాజ్ఞాపింపఁగలఁడు.

శిష్యు- చిత్తము. సెట్టీ! ఇటురారమ్ము.

చంద- (లేచి) అయ్యా! ఇదిగో వచ్చుచున్నాను. (తనలో) మిత్త్రకార్యముచేత నాకు వినాశముగలిగినది. నాదోషముచేతఁ గాదు. ఇది యదృష్టము.

(ఇద్దఱు వెళ్లుదురు)

చాణ-(హర్షముతో) వహవా! రాక్షసుఁడిపుడు దొరికినాఁడు. ఏమా?

క॥ అతనియాపదఁ బ్రాణము ।
లీతఁడువిడుచునప్రియంబు ♦ లెట్లగునో య ।
ట్లీతని యాపదఁ బ్రాణము ।
లాతండును విడుచు న ♦ ప్రియంబులువోలెన్ ॥ 25 ॥

తెరలో—(కలకలము)

చాణ- శార్ఙ్గరవ.

శిష్యు- (ప్రవేశించి) ఉపాధ్యాయ! ఏమిసెలవు?

చాణ- ఇదియేమో తెలిసికొమ్ము.

శిష్యు- (వెళ్లి తెలిసికొని వచ్చి తొందరపాటుతో) ఉపాధ్యాయ! ఉరిదీయఁబడఁదగిన శకటదాసుని వధ్యభూమినుండి తప్పించి వానితోఁగూడ సిద్ధార్థకుఁడు పాఱిపోయినాఁడు.

చాణ- (తనలో) బాగు సిద్ధార్థకా! బాగు! కార్యారంభము చక్కఁగాఁజేసినావు. (పయికి) హఠాత్తుగాఁ బాఱిపోయినాఁడా? (క్రోధముతో) వత్సా! వానినిఁ ద్వరితముఁగాఁబట్టి తెమ్మని భాగురాయణునితోఁ జెప్పు.

శిష్యు- (వెళ్లి తిరిగివచ్చి) ఉపాధ్యాయ! అయ్యయ్యో! భాగురాయణుఁడును బాఱిపోయినాఁడు.

చాణ- (తనలో) కార్యసిద్ధికై వెళ్లుఁగాక. (పయికి) వత్సా! విషాదమక్కఱలేదు. నామాటగా భద్రభట పురుషదత్త డింగరాత బలగుప్త రాజసేన రోహితాక్ష విజయవర్మలతో నిట్లుచెప్పుము— "దురాత్ముని భాగురాయణుని శీఘ్రముగాఁ గలిసికొని పట్టుకొనవలయును" అని.

శిష్యు- చిత్తము (అని వెళ్లి మరలఁ బ్రవేశించి విషాదముతో) ఉపాధ్యాయ! అయ్యయ్యో ఎంతకష్టము. తంత్రమంతయు నాకులీభూ

తమయినది. ఆభద్రభట ప్రముఖులును మొదటఁ దెల్లవాఱకముందే వెళ్లిపోయిరి.

చాణ- (తనలో) అందఱికిని మార్గములు మంగళకరములగుఁగాక. (పయికి) వత్సా! విషాదముతోఁ బనిలేదు చూడుము.

ఉ॥ ఎవ్వరెవో మదిందలఁచి ♦ యేగిరొ వారిటమున్నె యేగిరిం ।
కెవ్వరు పోవఁగోరుదురొ ♦ యిప్పుడు వారలఁబోవనిమ్ముఁ కం ।
జివ్వకుఁ గాలుద్రివ్వ పర ♦ సేనలు నూఱిటికంటె బీరము ।
క్కువ్వననందుఁగూల్చిన ♦ మదూర్జితబుద్ధి యొకండెనిల్చుతన్ ॥ 26

(లేచి, ప్రత్యక్షమువలెనే ఆకాశమందు లక్ష్యముంచి) ఇదిగో! దురాత్ములను భద్రభటప్రముఖులను బట్టి తెప్పించెదను. (తనలో) దురాత్ముఁడా! రాక్షసుఁడ.

గీ॥ ఏకచరు స్వైరశక్తు న ♦ హీనదాన
కలితును త్సేక మదసు వి ♦ గాహమాను
వనగజాభుని నిను మౌర్య ♦ పనికినాదు
ధీకలనఁబట్టి పైఁబ్రగు ♦ ణీకరింతు ॥ 27 ॥

(అందఱు నిష్క్రమింతురు.)

ఇది పాలెపు వేంకటసూర్యగోపాల ప్రధానాంధ్రీకృత
ముద్రారాక్షస నాటకమునఁ బ్రథమాంకము.

ముద్రారాక్షసము—ద్వితీయాంకము.

పాములవాఁడు— (అంతటఁ బ్రవేశించును.)

గీ॥ తంత్రయుక్తి నెఱింగియ ♦ థాస్థితముగ।
మండలమ్ము లిఖింపస ♦ మర్థులైన।
మంత్రరక్షణపరులు భూ ♦ మండలేశ్వ।
రోరగేశ్వరులకుఁ జాల ♦ నుపచరింత్రు॥ 1 ॥

(ఆకాశమందుఁ జెవియొగ్గి) అయ్యా! ఏమనుచున్నావు? నీవెవఁడవందువా? నేను పాములవాఁడను. నాపేరు జీర్ణవిషుఁడు. (మరల ఆకాశమువంకఁ జూచి) అయ్యా! ఏమనుచున్నావు. నేనుగూడఁ బాములతో నాడనిచ్ఛగించుచున్నా ననుచున్నావా? అట్లయినయెడల నేవృత్తిచేతనీవుపజీవించుచున్నావు? రాజకులసేవకుఁడవా? అయినచో నీవు పాములతో నాడుచున్నవాఁడవే. ఏలయందువా? అనురూపమంత్రౌషధి కుశలుఁడుగాని పాములవాఁడును, అంకుశముచేతలేని మావటీఁడును, అధికారముఁబొంది అభిమానియైన రాజసేవకుఁడును ఈమువ్వురును అవశ్యముగా వినాశమనుభవింతురు. ఇతఁడు కనఁబడి వెళ్లిపోయినాఁడేమి? (మఱల ఆకాశముఁజూచి) అయ్యా! మఱి నీవేమనియెదవు? ఈపెట్టెలలో దేమందువా? అయ్యా! నాకు జీవికకు సాధకములయిన సర్పములు. ఏమందువు! చూడఁగోరెదనందువా? అయ్యా! క్షమింపుము, క్షమింపుము. ఇది తగినచోటుగాదు. నీకుఁ గౌతూహలము గలదేని యీయింటిలోఁ జూపెదను రమ్ము. ఏమందువు? ఇది ప్రభువయిన యమాత్యరాక్షసుని యిల్లుగదా! మావం

టివారికిందుఁ బ్రవేశము లేదందువా? అయితే వెళ్లిపొమ్ము. నాబ్రదుకుఁదెరువువలన నాకిందుఁ బ్రవేశము కలదు. ఇతఁడును వెళ్లిపోయినాఁడు. (దిక్కులుచూచి, తనలో) అన్నా! ఆశ్చర్యము. చాణక్యమతివిధేయుఁడయిన చంద్రగుప్తుని జూచితిమా, రాక్షసునిప్రయత్నము విఫలమని తోఁచును. రాక్షసమతివిధేయుఁడయిన మలయకేతునిఁజూచితిమా, చంద్రగుప్తునుండి యధిరాజ్యము చలించునట్లు తోఁచును.

గీ॥ ఇద్ధకౌటిల్యధీరజ్జు ♦ బద్ధమూర్తి।
శ్రీని మౌర్యుని కులమందు ♦ స్థిరఁగఁడలఁతు।
రాక్షసోపాయనికరక ♦ రమ్ముచే వి।
కృష్యమాణనుగాఁగూడ ♦ నెంతు మదిని॥ 2 ॥

కనుక మహానీతినిపుణులయిన యీమంత్రుల విరోధముచేత నందకులరాజ్యలక్ష్మి సంశయాకులితనాఁ దోఁచుచున్నది. ఏమా?

గీ॥ దారుణాటవివనగజ ♦ ద్వయమునడుమ।
వశవలె విరుద్ధులౌ మంత్రి ♦ వరులనడుమఁ।
జిక్కి నిశ్చయహీనత ♦ సిరి గతాగ।
తములచేతను భృశము ఖే ♦ దంబుఁ బొందు॥ 3 ॥

కనుక నేనిపు డమాత్యరాక్షసునిఁ జూచెదను. (నడచును.)

రాక్షసుఁడు (ఆసనస్థుఁడయి పురుషునిచే ననుగమ్యమానుఁడయి ప్రవేశించును. పయికిఁజూచి కన్నీటితో) కష్టమయ్యో కష్టము

మ॥ యదులుంబోలెను నీతి విక్రమగుణ ♦ వ్యాపారశాంతాహితా।
భ్యుదయుల్ నందులు; వారి సంతతికి దు ♦ ర్యోగంబుచేసంక్షయం
బొదవన్ రేఁబవలిట్లు జింతలమనం ♦ బుద్విగ్నమై యింతయున్।
నిదురంగాంచని నాదు చిత్రరచనల్ ♦ నిష్ఫుద్యముల్ చూడఁగన్।

లేక,

మ॥ పరదాస్యంబు వహించి నామని నయ ♦ వ్యాపారపారీణమూ।
టరయన్ విస్మృతభక్తిఁగాదు విషయ ♦ వ్యాలోలతంగాదు దు।
ర్మరణాశంకను గాదు కీర్తివిభవ ♦ ప్రాప్త్యాశచేఁగాదు భూ।
వరునిన్ స్వర్గతునైనఁ గొల్చుకొఱకే ♦ వైరిప్రమాథంబుచేన్॥

(ఆకాశమువైపుచూచి, కన్నీటితో) భగవతి, కమలాలయా, నీకు నిశ్చయముగా గుణదోషవివేకజ్ఞానము లేదుగదా! ఏమా?

గీ॥ నందుని మహాప్రమోద సం ♦ ధాత విడిచి।
వైరి మౌర్యుని పజ్జను ♦ జేరి తేల?
మదపుటేనుఁగు మడియ న ♦ మ్మదము మాడ్కి।
నచటనే యేల లయమంద ♦ వైతి చపల ॥ 6 ॥

మఱియు, కులహీనురాలా!

మ॥ ఇల భస్మీకృతులైరె సత్కులజులౌ ♦ పృథ్వీపతుల్ మౌర్యు ము।
ష్కులజున్ నాధునిగా వరించితివిగా ♦ సొంపేది పాపా! పురం।
ధ్రిల చాతుర్యము తెల్లపూఁగొనలతోఁ♦దుల్యత్వముం జెందు చం
చలమై పూరుషదోషసద్గుణగణ ♦ జ్ఞత్వంబునన్ మూఢమా ॥ 7॥

మఱియు- అవినీతురాలా! నీయాశ్రయము నున్మూలించి నీకు నేనాశాభంగము కలిగించెదఁ జూడు. (ఆలోచించి) నేను నగరము నుండి వెడలివచ్చుచు సుహృత్తముఁడయిన చందనదాసునింట నాగృహజనమును దాచుటచేతి న్యాయ్యమనుష్ఠించితిని. కారణమేమనఁగా; కుసుమపురము నరికట్టుటనుగూర్చి రాక్షసుఁడు ఉద్యమముకలవాఁడే యని యెంచుచు, నాతోఁగూడ నేకకార్యనిష్ఠులు, అక్కడనున్న దేవపాదోపజీవుల యత్నములు తగ్గునవి కావని; చంద్రగుప్తశరీరవినాశముకయి విషప్రయోగముచేయుటకు నేను నియమించినవారిని సమ్మోదపఱుచుటకును, శత్రుకృత్యములను రహస్యముగాఁ దెలిసికొనుటకును, గొప్ప ధనరాసులతో శకటదాసుని నియమించితిని. శత్రు

వృత్తాంతము ప్రతిక్షణము తెలిసికొనుటకును, వారి గుంపును విడఁదీయుటకును, నాస్నేహితులను జీవసిద్ధి మొదలగువారిని నియోగించితిని. కనుక నిఁక నధికమెందుకు?

గీ॥ పుత్రవత్సలుఁ డీశుఁడు ♦ పులికొదమను।
వలె నెవనిఁ బెంచి సకులుఁడై ♦ యిలిగె, వాని।
మర్మముల బుద్ధివిశిఖము ♦ మైనగల్తు।
జోడుగాదే నదృష్టము ♦ చ్చోటఁ జేరి॥

కంచుకి- (అంతటఁ బ్రవేశించును,)

సీ॥ చాణక్యనయతంత్ర ♦ జాలప్రయోగంబు
నందభూపాలు సా ♦ న్వయముగాను।
బొలియించి పాటలి ♦ పుత్ర పురంబునఁ
జంద్రగుప్త ప్రతిష్ఠ ♦ జరిపినట్లు।
క్రమముగా నిపుడు వా ♦ ర్ధక్యంబు విషయోప
భోగమూలముగాను ♦ మును మథించి।
నాపయి ధర్మచిం ♦ తనముఁ బ్రతిష్ఠించె;
మలయకేతువు సేవ ♦ వలన నిపుడు।
గీ॥ రాక్షసుఁడువలె లబ్ధాంత ♦ రముగుచు నుప।
చీయమానుని మౌర్యునిఁ ♦ జెనఁకగోరు।
నట్లు లోభము ధర్మము ♦ నాఁక పెట్ట।
జతనముం జేయు మఱియు న ♦ శక్తమగును ॥ 9 ॥

(చూచి) ఇదిగో! అమాత్యరాక్షసుఁడు (నడచి,సమీపించి) అమాత్య! నీకు శుభమగుఁగాక.

రాక్ష- అయ్యా! జాజలీ! నమస్కరించుచున్నాను. ప్రియంవదకా! వీరికాసనముఁ దెమ్ము.

పురుషుఁడు- (ఆసనముఁదెచ్చి) అయ్యా! కూర్చుండుఁడు.

కంచుకి— (కూర్చుండి) అమాత్యా! కుమారుఁడు మలయకేతువు మీకిట్లు విన్నవించుచున్నాఁడు. "ఆర్యులు చిరకాలమునుండి శరీరమునం దుచితాలంకారములను ధరించుటలేదని నామనసు పీడించుచున్నది. స్వామిగుణములు వెనువెంట మఱచుటకు శక్యముగాకున్నను, నావిన్నపము నార్యులు మన్నింపఁదగును." అని. (ఆభరణములంజూపి) అమాత్యా! ఈయాభరణములు కుమారుఁడు తన శరీరమునుండి యొలిచి యిచ్చినాఁడు. మీరు ధరింపఁదగును.

రాక్ష— అయ్యా! జాజలీ! కుమారునితో నామాటలుగానిట్లు విన్నవింపుము. "నీగుణములందలి పక్షపాతముచేత నేను స్వామిగుణములనెల్ల మఱచితిని. కాని—

చ॥ నరవర నిర్విశేష మరి ♦ నాశమొనర్చి సుగాంగమందు సు।
స్థిరముగ నిన్ను బంగరువు ♦ సింగపుగద్దియనుంచుదాఁక సం।
స్కరణము నించుకేని యిడఁ ♦ జాలను శత్రుపరాభవార్త దు।
స్తరకృపణత్వదూషిత మ ♦ దంగకపఙ్క్తిని దేని కేనియున్" అని.

కంచుకి— అమాత్యా! ఇతరుఁడుగాక నీవున్నందునఁ గుమారునకిది సులభము. కనుక, కుమారుని యీప్రథమప్రార్థనము చెల్లింపుము.

రాక్ష— అయ్యా! కుమారుని వచనమువలెనే నీవచనమును దాటఁగూడనిది. కనుక కుమారుని యాజ్ఞను నిర్వర్తింపుము.

కంచుకి— (నాట్యముచే భూషణములఁ దొడిగి) నీకు శుభముగుగాక! నేను వెళ్ళెదను.

రాక్ష— అయ్యా! నమస్కారము.

కంచుకి— (వెళ్ళును.)

రాక్ష— ప్రియంవదక! నాదర్శనము నపేక్షించి ద్వారమందున్న యతఁడెవరో తెలిసికొమ్ము.

ప్రియం— చిత్తము (అని నడచి పాములవానిఁజూచి) అయ్యా మీ రెవరు?

పాముల - భద్రా! నేను జీర్ణవిషుఁడను పేరిటి పాములవాఁడను. అమాత్యరాక్షసులవారి యెదుటఁ బాముల నాడింప నిచ్చగించుచున్నాను.

ప్రియం— ఉండు; ఆమాత్యులకు విన్నవించెదను. (రాక్షసుని సమీపించి) అయ్యా! వీఁడు పాములవాఁడు. అమాత్యులవారి యెదుటఁ బాముల నాడింపఁగోరుచున్నాఁడు.

రాక్ష— (ఎడమకన్నదరుటను సూచించుచు, తనలో) మొదటనే సర్పదర్శనమా? (పయికి) ప్రియంవదక! సర్పదర్శనమందు మాకుఁ గుతూహలములేదు. కనుక వానిని సంతోషపెట్టి పంపివేయుము.

ప్రియం— చిత్తము. (నడచి పాములవానిం జేరి) భద్ర! ఇదిగో, అమాత్యుల దర్శనకార్యమువలని ప్రసాదము నీకిచ్చుచున్నారు. సర్పదర్శనమక్కఱలేదు.

పాముల— భద్రా! నామాటగా నమాత్యులకు విన్నవింపుము "కేవలము నేను సర్పోపజీవిని గాను. ప్రాకృతకవిని. కనుక నమాత్యుఁడు నాకు దర్శనముఁ బ్రసాదింపనియెడల, ఈపత్రమునైనఁ జదివికొనఁదగును." అని

ప్రియం - (పత్రముదీసికొని రాక్షసునిజేరి) అయ్యా! ఇతఁడమాత్యులకిట్లు విన్నవించుచున్నాఁడు. "కేవలము నేను సర్పోపజీవినిగాను. ప్రాకృతకవిని. అమాత్యుఁడు నాకు దర్శనముఁ బ్రసాదింపనియెడల, ఈపత్రమునైనఁజదివికొనఁదగును." అని. (పత్రమునిచ్చును)

రాక్ష— (పత్రముఁబుచ్చుకొని చదువును.)

గీ॥ కుసుమరసము నాత్మ ♦ కుశలతకలిమిని ।
నవశేషముగను ♦ నానిమాని ।
భ్రమర మెద్ది వెడలఁ ♦ గ్రక్కునో యయ్యది ।
యొకుల కార్యసిద్ధి ♦ కుపకరించు ॥ 11 ॥

(తనలో) ఓ హెూ! కుసుమపురవృత్తాంతము దెలిసికొన్నవాఁడను, నీదు చారుఁడను. అని యీగాథకర్థము. అన్నా! కార్యవ్యాకులత్వముచేత మనసు చారప్రేషణము మఱచినది. ఇపుడు జ్ఞప్తికలిగినది. ఆహితుండిక వేషమువాడితఁడు కుసుమపురమునుండి వచ్చిన విరాధగుప్తుఁడుగావచ్చునని యిపుడు వ్యక్తమయినది. (పయికి) ప్రియంవదక! ఇతనిని బ్రవేశపెట్టుము. ఇతఁడు సుకవి. ఇతనివలన సుభాషితము వినఁదగినది.

ప్రియం— చిత్తము. (పాములవానిం జేరి) ఆర్యా! రమ్ము.

పాము— (నాట్యముచేఁ జేరి, చూచి, తనలో) ఇదిగో. అమాత్యరాక్షసుఁడు కూర్చుండియున్నవాఁడు. ఈతఁడు—

చ॥ ఎడమకరంబుఁ గంఠమున ♦ నించుక వెట్టి, మొగంబుఁ ద్రిప్పి, మార్యుఁడు పలుమాఱులంసమున ♦ నుంపగ బల్మినిలాగుచుండినం ।
దొడఁగుడిచేయి వ్రాల్చునటు ♦ దోఁచుచు గాటపుఁ గౌఁగిలింతకై
కుడిచను నియ్యదిప్డు, సిరి ♦ కొంకుచు నీతని చెయ్యి వెన్నుచున్ ॥ 12

(పయికి) అమాత్యులకు జయము.

రాక్ష— (చూచి) ఓయీ విరాధ— (అని సగము పలికి, జ్ఞప్తికిఁ దెచ్చుకొని) ప్రియంవదక! ఇపుడు పాములతో వినోదించెదను. కనుక పరిజనమును, నీవును విశ్రమింపుఁడు. నీవు ద్వారము గనుపెట్టి యుండుము.

ప్రియం— చిత్తము. (పరిజనముతో నిష్క్రమించును.)

రాక్ష— మిత్రమా! విరాధగుప్త! ఇదిగో, ఆసనము. కూర్చుండుము.

విరా— చిత్తము. (కూర్చుండును.)

రాక్ష— (ఖేదముతోఁ జూచి) అన్నన్నా! నంద దేవపాదపద్మోపజీవుల యవస్థ యెట్లు మాఱినది. (అని యేడ్చును.)

విరా— అమాత్య! శోకమనవసరము. శీఘ్రముగానే యీయవస్థనుండి పూర్వావస్థయందు నీవారోపింపఁబడఁగలవు.

రాక్ష— సఖుఁడా! కుసుమపురవృత్తాంతమింక వర్ణింపుము.

విరా— అమాత్య! ఆవృత్తాంతము విస్తీర్ణమయినది. ఎదిమొదలుకొని చెప్పవలయునో ఆనతిమ్ము.

రాక్ష— సఖుఁడా! చంద్రగుప్తుని నగరప్రవేశమును, మనము నియోగించిన విషరసదాయకులచేత నేమి యనుష్ఠింపఁబడెనదియు, నిత్యాదిగా వినఁగోరుచున్నాను.

విరా— ఇదిగో, చెప్పుచున్నాను. చాణక్యమతి పరిగృహీతములును, శక యవన కిరాత కాంభోజ పారసీక బాహ్లీక ప్రముఖములునయిన చంద్రగుప్త పర్వతేశ్వర సైన్యములు ప్రళయకాల సంచాలిత జలములయిన మహాసముద్రములవలెఁ గుసుమపురము నంతటను ముట్టడించెనుగదా,

రాక్ష— (కత్తిఁ దీసి సంభ్రమముతో) నేనుండఁగాఁ గుసుమపురమును ముట్టడింపఁగలవాఁడెవఁడు? ప్రవీరక! ప్రవీరక! త్వరగా రారమ్ము.

సీ॥ ప్రాకారముల నెల్ల ♦ పట్టులపై నెక్కి—
యిద్ధశరాసన ♦ న్నద్ధులగుచు ।
యోధవరుల్ ప్రహా ♦ రోద్యముల్ గావలె
శత్రుకుంజరఘటా ♦ సంవిభేద ।
చణమైు చెలంగెడు ♦ సామజస్తోమంబు
ద్వారంబులరికట్ట ♦ నలయు మఱియు ।

నేను యశంబు నా ♦ ర్జింప నపేక్షింతొ్ర
వారు మృత్యుభయంబు ♦ వదలికొనుచుఁ ।
గీ॥ బరఁగ దుర్బలముల ♦ వైరిబలంబుల ।
రూపుమాప మదిని ♦ రూఢిపఱిచి ।
సాగవలయు నాకు ♦ సమనస్కులగుచును ।
బురమునందునుండి ♦ త్వరితగతిని ॥ 13 ॥

విరా- అమాత్యా! సంభ్రమము మానుము. ఈవర్ణించునది వృత్తాంతముఁగదా.

రాక్ష- (నిట్టూర్చి) ఈకష్టవృత్తాంతముచేత వెనుకటి కాలము నాకు జ్ఞప్తికివచ్చినది. (కత్తిని విడిచి, కన్నీటితో) హా! నందమహారాజ! రాక్షసునియందు నీకుఁగల ప్రసాదాతిశయమును దలఁచుకొనుచున్నాను. ఇట్టికాలమందు-

సీ॥ జలధరనీల యీ ♦ సామజఘటయేడ
నచటికి రాక్షసుఁ ♦ డరుగవలయు ।
బరఁగఁ బారిప్లవాం ♦ భఃప్లుతియైనట్టి
యశ్వదళంబెట ♦ నావహిల్లుఁ ।
గడిమిమై దాని రా ♦ క్షసుఁడు వారింపఁగా
వలయును బాదాత ♦ బలములెటనొ ।
అబలంబంతర ♦ మందుఁ బ్రవేశించి
కడ తేర్పవలయు రా ♦ క్షసుఁడు దాని ।
గీ॥ నట్లు నాకయి యాజ్ఞల ♦ నంపుచుండు ।
వాఁడు; స్నేహముకలిమి వి ♦ శ్వాసమునను ।
గుసుమపురమునయందు రా ♦ క్షససహస్రి ।
మున్నయట్లు తలంచుచు ♦ నుర్విభుఁడు ॥ 14 ॥

తరువాత, తరువాత!

విరా- అట్లంతటను ముట్టడింపఁబడిన కుసుమపురముంజూచి, బహుదినములు మొదలుకొని పురజనులకు ఈగొప్పముట్టడివలన గలిగిన యుపద్రవము సహింపశక్యముగానిదయియుండఁగా, అట్టియావస్థయందయినను, పురజనులమీఁది యపేక్షచే మహారాజు సర్వార్థసిద్ధి సురంగముఁజొచ్చి తపోవనంగతుఁడుగాఁగా, స్వామివిరహము వలన మందప్రయత్నములయినను జయఘోషణావ్యాఘాతాది సాహసముచేత మీబలములంతర్నగరమందున్నట్టులనుమానింపఁబడఁగా, నందరాజ్యము మఱలఁ దెచ్చుటకయి మీరు సురంగమార్గమునఁ బయికి వెడలఁగా, చంద్రగుప్తునిఁ జంపుటకు నీవు పంపిన విషకన్యచేతఁ బర్వతకుఁడు చావఁగా-

రాక్ష- సఖుఁడా! ఈయాశ్చర్యముఁజూడు-

గీ॥ కర్ణుఁడర్జునుపై ♦ శక్తిగతిని నేను ।
వృషలుపైఁ దార్చిన బలిష్ఠ ♦ విసపుఁగన్య ।
హరికివలె విష్ణుగుప్తశ్రీ ♦ యమునకై ఘ ।
టోత్కచునివలెఁ బర్వతు ♦ నుక్కడంచె ॥ 15 ॥

విరా- అమాత్యా! ఇది దైవతేచ్ఛ. మనమేమిచేయఁగలము ?

రాక్ష- తరువాతి?

విరా- తరువాత, పితృవధభయమువలనఁ గుమారుఁడు మలయకేతుఁడు కుసుమపురమునుండి వెడలిపోఁగా, పర్వతకసోదరుఁడు వైరోచకునూరడించి, నందభవనమందుఁ జంద్రగుప్తుఁడు ప్రవేశించునని ప్రకటించి, చాణక్యహతకుఁడు కుసుమపురనివాసులయిన శిల్పులనందఱఁ బిలిపించి వారికిట్లుచెప్పెను. "జ్యోతిషులవచనముంబట్టి యీయర్ధరాత్రిమేయభిమతమయినముహూర్తముగాన నపుడు చంద్రగుప్తుఁడు నందభవనమందుఁబ్రవేశింపఁగలఁడు. కనుకఁ బ్రథమద్వారమునుండిమొదలుకొని రాజభవనమును సంస్కరింపవలయును." అని.

అంతట సూత్రధారులిట్లు విన్నవించిరి. "అయ్యా! చంద్రగుప్తమహారాజువారు నందభవనమందుఁ బ్రవేశింపఁబోవుట ముందుగానే తెలిసికొని సూత్రధారుఁడు దారువర్మ, ప్రథమరాజద్వారమందుఁ గనకతోరణన్యాసాది రూపమయిన సంస్కారములఁ గావించినాఁడు. ఇపుడిఁక లోపలిభాగములే మేము సంస్కరింపవలసియున్నది." అని. ఆదేశములేకుండనే రాజభవనద్వారము సంస్కృతముగావించినందుకుఁ బరితుష్టుఁడయినట్లు దారువర్మ నైపుణ్యమును మిగుల నభినందించి చాణక్యవటుఁడిట్లు పలికెను. "దారువర్మా! ఈనైపుణ్యమునకుఁదగిన ఫలము త్వరలోనే పొందగలవు" అని.

రాక్ష— (ఉద్వేగముతో) సఖుఁడా! చాణక్యవటువునకుఁ బరితోషమెందువలన? దారువర్మప్రయత్నము ఫలహీనమో, అనిష్టఫలజనకమో కావచ్చునని కనఁబడుచున్నది. ఏమో? ఈదారువర్మ బుద్ధిమోహమువలననో, రాజభక్తిప్రకర్షమువలననో, నియోగకాలముదాఁక వేచియుండకపోవుటచేతఁ జాణక్యవటుని మనస్సునందు బలవత్తరమయిన సందేహముగలిగియుండవచ్చును. తరువాత?

విరా— తరువాతఁ జాణక్యహతకుఁడు, అనుకూలలగ్నవశముంబట్టి నీయర్ధరాత్రముహూర్తమందే చంద్రగుప్తునకు నందభవనప్రవేశము కలుగఁగలదని శిల్పులకును, పౌరులకును స్పష్టముగాఁ దెలిపి, ఆక్షణమందే, పర్వతేశ్వరసోదరుని వైరోచకునిఁ జంద్రగుప్తునితోఁగూడ నేకాసనమందుఁ గూర్చుండఁబెట్టి పృథ్వీరాజ్యమందు సగపాలు పంచిపెట్టెను.

రాక్ష— పూర్వము ప్రతిజ్ఞాతమయిన రాజ్యార్ధమును పర్వతేశ్వరసోదరుఁడయిన వైరోచకునకుఁ బంచిపెట్టెనా యేమి?

విరా అవును.

రాక్ష— (తనలో) అతిధూర్తుఁడీ చాణక్యవటువు, తపస్విని వైరోచకునేదో యుపాయముచేత రహస్యముగాఁ గడతేర్చుటకాలోచించి పర్వతేశ్వరవినాశముచేఁ బుట్టిన యపకీర్తిని మాపికొనుటకుఁగాను లోకప్రసిద్ధిగల్పించినాఁడు. నిశ్చయము. (పయికి) తరువాత?

విరా- తరువాత, చంద్రగుప్తునికి నందభవనమందర్ధరాత్రప్రవేశము మొదటనే ప్రకటించి, వైరోచకునభిషేకించి, యాతనిమేనిపైని నిర్మలమయిన ముత్తెపుసరుల నంతటంగూర్చిన వస్త్రకంచుకముం దొడిగించి, మణిమయకిరీటముచే దృఢముగాను, అందముగాను మౌళినలంకరింపించి, సుగంధిపుష్పమాలికను విశాలవక్షమందు జందెమువోలెఁ దాలిపించి, అత్యంతపరిచితులకయిన నానవాలుపట్ట వీలులేని యాకారమాతనికిఁగల్పించెను. మఱియు, చంద్రగుప్తుఁడెక్కఁదగిన యాఁడేనుఁగు చంద్రలేఖపయిని జాణక్యహతకుని యాజ్ఞచేత వైరోచకుఁడెక్కె చంద్రగుప్తుని వెనువెంటరాఁదగిన రాజలోకము తనవెంటరాఁగా నందరాజభవనముం బ్రవేశించుసరికి, 'నీవు మున్ను నియమించిన సూత్రధారుఁడు దారువర్మ, ఈతఁడు చంద్రగుప్తుఁడే యని యెంచి వైరోచకునిమీఁదఁ బడవైచుటకుఁగాను యంత్రతోరణమును సిద్ధపఱిచెను. ఈలోఁగాఁ జంద్రగుప్తానుయాయులయిన రాజులు వాహనములతో వెలపలనే యడ్డగింపఁబడి నిలిచియుండిరి. మావటీఁడు నీవుపంపిన బర్బరకుఁడు, బంగారుటూరలోపలనున్న చురికత్తిని లాగఁగోరినవాఁడయి, బంగారుగొలుసున వ్రేలాఁడు బంగారుటూరను జేతఁదాల్చెను.

రాక్ష— ఇద్దఱిప్రయత్నమును తప్పు. తరువాత?

విరా— తరువాత, ఈయాఁడేనుఁగు మొలయందు దెబ్బదగులునని యోజించికొని నడకమార్చి మిగులవేగముతో నడచెను. అంత, మొదటినడకననుసరించి గణియించి దారువర్మ క్రిందికిఁగూ

ల్చిన యంత్రతోరణము గుఱితప్పి, చంద్రగుప్తుఁడని యెంచఁబడిన వైరోచకునికైనఁ దగులక, యొరనుండి తీసిన ఛురికఁబట్టుకొనియున్న యాదీనుని బర్బరకునిమీఁదఁబడి యాతనింగూల్చెను. అంత, దారువర్మ యంత్రతోరణనిపాతముంబట్టి తనకు మరణదండనమును శంకించుకొని, యెత్తయిన యాతోరణము శీఘ్రముగా నెక్కి యంత్రఘట్టనబీజమయిన లోహకీలకముంబుచ్చుకొని, హస్తినీగతుఁడయిన యాదీనుని వైరోచకుని సంహరించెను.

చాణ- అయ్యయ్యో! రెండనర్థములు సంభవించినది. ఈచంద్రగుప్తుఁడు చావలేదు. వైరోచక బర్బరకులు చచ్చిరి. (తొందరతో, తనలో) వారిద్దఱునుఁ జావలేదు. దైవగతిచేత మేమే చచ్చితిమి. (పయికి) సూత్రధారుఁడా దారువర్మ తరువాత నేమయినాఁడు.

విరా- వైరోచకుని వెంబడిని నడచివెళ్ళెడు జనముచే మంటిబెడ్డలతోఁ గొట్టి జంపఁబడినాఁడు.

రాక్ష- (కన్నీటితో) కష్టము, అయ్యయ్యో! వత్సలుఁడు మిత్రుఁడునయిన దారువర్మతో వియోగముగలిగినది. అక్కడనున్న భిషజుఁడు అభయదత్తుఁడేమి యాచరించినాఁడు.

విరా- సర్వము నాచరించినాఁడు.

రాక్ష- (హర్షముతో) దురాత్ముఁడు చంద్రగుప్తుఁడు సంహరింపఁబడెనా?

విరా- అమాత్య! లేదు. దైవగతిచేత సంహరింపఁబడలేదు.

రాక్ష- (వ్యసనముతో) అయితే సర్వము నాచరించినాఁడని యిప్పుడు చెప్పితివేల?

విరా- అమాత్య! యోగచూర్ణమిశ్రితమయిన యౌషధమతఁడు చంద్రగుప్తునికై కల్పించినాఁడు! బంగరుపాత్రముందు దాని

రంగు మాఱఁగాఁ గనిపెట్టి చాణక్యహతకుఁడిట్లు మందలించినాఁడు "వృషలా, ఈమందులో విషముగలిసినది. త్రాగరాదు" అని.

రాక్ష- ఈవటువు గడుసరికదా! ఆవైద్యునిపని యేమయినది?

విరా- ఆమందుఁ ద్రాగింపఁబడినాఁడు. మృతుఁడయినాఁడు.

రాక్ష- (వ్యసనముతో) అన్నన్నా! మహావిజ్ఞానరాశి చనిపోయినాఁడు. భద్ర! అతని పడకటింటినమర్చుటకు నియమించిన ప్రమోదకునకేమి జరగినది?

వి- ఆత్మవినాశము.

రాక్ష- (భయముతో) ఎట్లు?

విరా- వాఁడు మూర్ఖుఁడు. మీరిచ్చిన మహాధనరాశిఁ జేకొని, అతివ్యయముతో నుపభోగించుట కారంభించెను. "ఇంతధనము నీకెట్లువచ్చిన" దని వానినడిగి పరస్పరవిరుద్ధముగా వాఁడుత్తరములు చెప్పఁగాఁ జాణక్యుఁడు చిత్రవధ మాజ్ఞాపించి వానింజంపించెను.

రాక్ష- (ఉద్వేగముతో) ఇందునను మేము దైవోపహతులమయితిమి. మఱి, చంద్రగుప్తుఁడు నిద్రితుఁడయియున్నపుడు వానిమేన శస్త్రప్రహారముచేయ నేను నియమింపఁగా వాని పడకటింటి క్రిందిసురంగమందు వసించియుండెడు బీభత్సకాదులవృత్తాంతమేమి?

విరా- అమాత్య! ఆవృత్తాంతము దారుణము.

రాక్ష- (ఆవేగముతో) దారుణమెట్లు? వారచట నివసించియున్నట్లు చాణక్యహతకునకుఁ దెలియలేదుగదా!

విరా- తెలిసినది.

రాక్ష- ఎట్లు?

విరా- చంద్రగుప్తుఁడు ప్రవేశింపకముందు దురాత్ముఁడు చాణక్యుఁడు ప్రవేశమాత్రముననే పడకటింటినంతను బరీక్షించెను. అపుడొకగోడ బెజ్జమునుండి మెతుకులపిసరులతోఁ బ్రాఁకివచ్చు చీమల

బారుఁజూచి "యీ యింటియందుఁ బురుషులున్నా" రని నిశ్చయించి యీపడకటింటిని దగులఁబెట్టించెను. ఆ యిల్లిల్లు కాలుచుండఁగాఁ గన్నులకుఁ బొగగ్రమ్మి వెలుపలికివచ్చు ద్వారమునకు మార్గముగాన లేక బీభత్సకాదులందఱు నగ్నిచేఁ గాలి చచ్చిరి.

రాక్ష— (కన్నీటితో) సఖుఁడా! చూడు చంద్రగుప్తుని దైవ సంపదచేత నందఱును జచ్చిరి. (ఖేదముతో) మిత్రమా! దురాత్ముఁడా చంద్రగుప్తహతకుని దైవసంపదఁ జూడు. ఏమా?

చ॥ అతనివధింప గుట్టుగ వి ♦ షాంగనఁబంపితి; దైవతేచ్ఛఁ బ ।
ర్వతనృపుడర్ధరాజ్యఫల ♦ భాగియెచచ్చెను దానిచేతఁ; దం ।
త్రితతి రసప్రయోక్తలును ♦ నాశముఁజెందిరి వానిచేతఁ; నీ ।
గతిని మదీయనీతులను ♦ గల్గెను శ్రేయములెల్ల వానికే ॥ 16 ॥

విరా— అమాత్య! అయినను, ఆరంభించినది విడువఁగూడదు. అందుకిదుగో సుభాషితము—

ఉ॥ విఘ్నభయంబుచే మొదలు ♦ వెట్టరు కార్యము నీచులెద్దియున్ ।
విఘ్నముగల్గ మధ్యములు ♦ వీడుదు రమ్మొదలిడ్డ కార్యమున్ ।
విఘ్నములెన్ని గల్గినను ♦ వీడక ప్రజ్ఞను జేసి తామె వి ।
ఘ్నఘ్నతమీరి సాంతముగఁ ♦ గార్యములన్ నెఱవేర్తు రుత్తముల్

మఱియు—

చ॥ అహి పతిత్రోసివైచెనె య ♦ నంత భరవ్యథలేదె వానికిన్ ।
గ్రహపతి కూరుచుండునె స్థి ♦ రంబుగలేదె భ్రమార్తి వానికిన్ ।
మహిమగలారు నీచువలె ♦ మానరు గాదె గృహీతకార్యని ।
ర్వహణమునందు యత్నమిడి ♦ ప్రత్న మహావ్రతమిద్దివారికిన్ ॥

రాక్ష— మిత్రుఁడా! ఆరంభించినది విడువలేదనుట నీకుఁ బ్రత్యక్షమే. తరువాత?

విరా— తరువాత, ఆదినము మొదలుకొని చంద్రగుప్తుని శరీర రక్షణము నిమిత్తము చాణక్యహతకుఁడు వేయిరెప్ల జాగ్రత్తచేసి కొనియున్నవాఁడు. వీరివల్లనే యీరీతి యనిష్టము వాటిల్లునని యెంచి కుసుమపురవాసులలో నీయాప్తపురుషులనుఁ జెఱగొనెను.

రాక్ష— (ఉద్వేగముతో) చెలికాఁడా! ఎవరినెవరింజెఱగొనెనో చెప్పు, చెప్పుము.

విరా— అమాత్య! మొదటనే క్షపణకుఁడు జీవసిద్ధి నవమానించి పురమునుండి వెడలఁగొట్టెను.

రాక్ష— (తనలో) ఇంతవఱకు సహింపవచ్చును. నిష్పరిగ్రహునాతనిని స్థానభ్రంశము పీడింపదు. (పయికి) సఖుఁడా! ఏయపరాధమును మోపి యాతనిని బురమునుండి వెడలఁగొట్టెను?

విరా— "ఈ దురాత్ముఁడు రాక్షసప్రేరితుఁడయి పర్వతకుని విషకన్యచేతఁ జంపినాఁ" డని.

రాక్ష— బాగు! కౌటిల్యా! బాగు!

గీ॥ పాపికొంటివి దుష్కీర్తి ♦ మాపయినది ।
మోపితివి రాజ్యమందర్ధ ♦ మునకు నష్టి ।
మాపితీగతి నీనీతి ♦ మహితబీజ ।
మొక్కటయ్యును ఫలములఁ ♦ బెక్కుఁ గాంచె. ॥ 19 ॥

విరా— చంద్రగుప్తశరీరమునకు ద్రోహముచేయుటకయి దారువర్మాదులు శకటదాసునిచేతనే నియోగింపఁబడ్డవారని పట్టణమందుఁ బ్రకటించి యాతనిని శూలమెక్కించెను.

రాక్ష— (కన్నీటితో) సఖా! శకటదాస! ఇట్టి మృత్యువునీకుఁ దగనిది. లేక, స్వామికార్యమునకయి చచ్చిన నిన్నుఁగూర్చి శోకింప నక్కఱలేదు. నందకులవినాశమయినను జీవింపనిచ్చగించిన మేమే శోచనీయులము.

విరా- అమాత్య! స్వామికార్యము సాధింపవలెనని యే ప్రయత్నించుచున్నావుగాదె.

రాక్ష- సఖుఁడా!

క॥ పరలోకగతుండౌ నీ।
శ్వరునికి వెనువెంట మేము ♦ చనకుండుట మే।
ల్మరచి జిజీవిషచే ని।
ట్లరులఁగెడపి పగను దీర్చ ♦ టాశించియెకా ॥ 20 ॥

విరా- అమాత్య! ఇట్లనఁదగదు.

క॥ పరలోకగతుండై నీ।
శ్వరునికి వెనువెంటనీవు ♦ చనకుండుట మే।
ల్మరచి జిజీవిషచేఁగా।
దరులఁగెడపి పగను దీర్చ ♦ టాశించియెకా ॥ 20 A ॥

రాక్ష- సఖుఁడా! తక్కిన స్నేహితుల యాపదలఁగూడ వినుటకు సిద్ధముగానున్నాను. చెప్పుము.

విరా- ఇవి విని భయపడి చందనదాసుఁ డమాత్యకళత్రమును మఱియొకచోటికిం బంపెను.

రాక్ష- సఖుఁడా! క్రూరుఁడయిన యాచాణక్యవటునికి విరుద్ధమును, అయుక్తమును, ఆచరించినాఁడు చందనదాసుఁడు.

విరా- అమాత్య, మిత్రద్రోహమయుక్తతరముగదా!

రాక్ష- తరువాత?

విరా- తరువాత, యాచ్యమానుఁడయినను జందనదాసుఁ డమాత్యకళత్రమును సమర్పింపనందునఁ గుపితుఁడై చాణక్యవటుఁడు-

రాక్ష- (భయముతో) జందనదాసుని జంపలేదుగద?

విరా- చంపలేదు- కాని యావద్ధనమును దీసికొని సపుత్రకళత్రముగా నతనిని బంధించి చెఱసాలయందుంచెను.

రాక్ష- అట్లయినచో- 'చందనదాసుఁ డమాత్యకళత్రమును మఱియొకచోటికిఁ బంపెనని' పరితుష్టుఁడవయి చెప్పెదవేల? 'సకళత్రముగా రాక్షసుని బంధించె' నని చెప్పఁదగును.

ప్రియంవదకుఁడు- (తెఱఁజిమ్ముకొని ప్రవేశించి) ఆర్యులకు జయము. ఆర్య! ఇదిగో శకటదాసుఁడు వాకిటికి వచ్చియున్నాఁడు.

రాక్ష- ప్రియంవదక! సత్యముగానా?

ప్రియం- అమాత్యపాదులయొద్ద నసత్యముపలుకుదునా?

రాక్ష- సఖుఁడా, విరాధగుప్త! ఇదియెట్లు?

విరా- ఇట్లుకావచ్చును. అదృష్టము భవ్యుని రక్షించును.

రాక్ష- ప్రియంవదక! ఇట్లయినచో జాగుచేసెదవేల? వెంటనే యాతనిం బ్రవేశపెట్టుము.

ప్రియం- చిత్తము. (నిష్క్రమించును.)

శకట- (సిద్ధార్థకునితో నంతటఁ బ్రవేశించును.)
(చూచి తనలో)

సీ॥ మౌర్యునిఁబోలెను ♦ క్ష్మాతలమందున
సుప్రతిష్ఠితమల ♦ శూలదండ।
మాతని సిరిఁబోలె ♦ జేతఃప్రమాథి మా
ర్గావబద్ధంబు వ ♦ ధ్యస్రజంబు।
స్వామినందేశహిం ♦ సన రౌద్రవిషమంబు
లట్టి వాధ్మాతతూ ♦ ర్యస్వనంబు।
లట్టి శూలముఁజూచి ♦ యట్టి స్రజముదాల్చి
యట్టి తూర్యస్వనం ♦ బాలకించి।
గీ॥ వ్రయ్యఁబడదు నూఱు ♦ వ్రక్కలుగా నాదు।
మానసంబభేద్య ♦ మైనదయ్యె।
నాదిమాభిఘాత ♦ మత్యంతకఠినంబు।
గానొనర్పఁబోలు ♦ దానిమున్నె ॥ 21 ॥

(నాట్యముచే నవలోకించి హర్షముతో) ఇదిగో! అమాత్య రాక్షసుఁడు కూర్చున్నాఁడు. ఈతఁడు—

గీ॥ క్షీణుఁడయ్యును నందుఁడ ♦ క్షీణభక్తి ।
యితఁడు స్వామ్యర్థసాధన ♦ కృత్యమందు ।
స్వామిభక్తులకెల్ల నీ ♦ భూమియందు ।
మాన్యుఁడయ్యెనుఁ బరమప్ర ♦ మాణగతిని ॥ 22 ॥

(సమీపించి) అమాత్యులకు జయము.

రాక్ష— (చూచి, హర్షముతో) సఖుఁడా! శకటదాస! కౌటిల్యగోచరగతుఁడవయినను, అదృష్టముచేత మఱలఁ గనఁబడితివి. కనుక నన్నుఁ గౌఁగిలించుకొమ్ము.

శక— (కౌఁగిలించును.)

రాక్ష— (తడవు కౌఁగిలించి) ఇదిగో పీఠము. ఇందుఁగూర్చుండుము.

శక— చిత్తము. (నాట్యముచేఁ గూర్చుండును.)

రాక్ష— సఖుఁడా, శకటదాస! నాయీహృదయానందమునకు హేతువెవరు?

శక— (సిద్ధార్థకునిఁ జూపి) ప్రియస్నేహితుఁడీ సిద్ధార్థకుఁడు ఘాతకులను బాఱఁదోలి వధ్యస్థానమునుండి నన్ను విడిపించెను.

రాక్ష— (హర్షముతో) భద్రా, సిద్ధార్థక! ఈప్రియమునకిది యేమియుఁ జాలదు. అయినను బుచ్చుకొమ్ము. (అని, తనమేనినుండి భూషణములఁ దీసి యిచ్చును.)

సిద్ధా— (పుచ్చుకొని, పాదములకెరగి, తనలో) ఆర్యునియుపదేశమీరీతినిఁ గదా, కనుక నట్లుకావించెదను. (పయికి) అమాత్య! ఇక్కడికి నారాకకిదే మొదటిసారి; అమాత్యులవారి యీబహుమానము దాచుకొని నిర్విచారముగానుండుటకు నాకిక్కడఁ బరిచితు

లెవ్వరును లేరు. కనుక నీసికాతో ముద్రింపించి, యమాత్యులవారి భాండాగారమందే దాచుకొనుటకిచ్చగించుచున్నాను. నాకవసరమయినపుడు మఱలఁ దీసికొందును.

రాక్ష— భద్రా! ఏమిదోషము? శకటదాస! ఇట్లుచేయుము.

శక— చిత్తము. (ముద్రనుజూచి రహస్యముగా) అమాత్య! ఈముద్రయందలి పేరు నీదే!

రాక్ష— (చూచి, తనలో) సత్యము. నేను నగరమునుండి వెడలివచ్చునపుడు, ఎడఁబాటునం దుబుసుపోకకు బ్రాహ్మణి నాచేతినుండి దీనిం బుచ్చుకొనియెను. ఇతనికెట్లు దొరికినదో? (పయికి) భద్రా! సిద్ధార్థక! ఇది నీకెట్లు లభించినది.

సిద్ధా— అమాత్య! కుసుమపురనివాసి చందనదాసుఁడను రత్నవర్తకుఁడు గలఁడు. ఆతని యింటివాకిట నిది నాకు దొరికినది.

రాక్ష— సరిపడినది.

సిద్ధా— అమాత్య! ఏమి సరిపడినది.

రాక్ష— భద్రా! మహాభాగ్యవంతుల యిండ్లయందిట్టివి పడుటయు, దొరుకుటయు—

శక— సఖుఁడా, సిద్ధార్థక! ఇది అమాత్యుని పేరుచెక్కిన ముద్ర. కనుక, దీనికంటె నెక్కుడధనమిచ్చి యమాత్యుఁడు నిన్ను సంతోషపెట్టఁగలఁడు. కనుక దీనినిమ్ము.

సిద్ధా— అయ్యా! అమాత్యులవారీముద్రను బరిగ్రహించుటచేఁ బ్రసన్నులగుటయే నాకు సంతోషము. (ముద్రనర్పించును.)

రాక్ష— సఖా, శకటదాస! ఈముద్రనే నీయధికారమందుపయోగింపుము.

శక— చిత్తము.

సిద్ధా— అమాత్య! ఇంకొకటి విన్నవించెదను.

రాక్ష- భద్ర! నిర్భయముగాఁ జెప్పుము.

సిద్ధా- చాణక్యహతకునకు విప్రియమాచరించి మఱల నేను పాటలిపుత్రమునకు వెళ్ళఁజాలనని యమాత్యులకు విశదమే. కనుక, సుప్రసన్నములయిన మీపాదములను సేవించుటకిచ్ఛగించుచున్నాను.

రాక్ష- భద్ర! మాకుఁ బ్రియమే. మేము ముందుగాఁ గోరకుండుట నీయభిప్రాయమెఱుఁగకుండుటచేతనే.

సిద్ధా- (హర్షముతో) అనుగ్రహింపఁబడితిని.

రాక్ష- శకటదాస! సిద్ధార్థకుని విశ్రమింపఁజేయుము.

శక- చిత్తము. (సిద్ధార్థకునితో నిష్క్రమించును.)

రాక్ష- సఖుఁడా, విరాధగుప్త! శేషించిన కుసుమపుర వృత్తాంతము దెల్పుము. కుసుమపురవాసులయిన చంద్రగుప్తప్రకృతులు మనరహస్యవార్తల నంగీకరించుచున్నారా?

విరా- అమాత్య! నిశ్చయముగా నంగీకరించుచున్నారు. ఇంతేకాదు. యథాప్రధానముగా ననుసరించుచున్నారు.

రాక్ష- ఇందుకు హేతువేమి!

విరా-అమాత్య! ఇందుకు హేతువిది. మలయకేతుఁడు వెడలిపోయినదిమొదలుకొనిఁ చంద్రగుప్తుఁడు చాణక్యునిఁ బీడించుచుండుట; చాణక్యుఁడును జితకాశితవలని గర్వముచేత నసహమానుఁడయి, అమ్యాయి యాజ్ఞాభంగములం గావించి చంద్రగుప్తుని మనసునకుఁ బీడఁ గలిగించుట; ఇది నాయనుభవము.

రాక్ష- (హర్షముతో) సఖుఁడా, విరాధగుప్త! కనుక నీపాములవానివేషముతోనే నీవు మఱలఁ గుసుమపురమునకే వెళ్లుము. అక్కడ నామిత్రుఁడు వైతాళికుఁడు స్తనకలశుఁడను పేరివాఁడు వసించుచున్నాఁడు. వానితో నామాటలుగా నిట్లు చెప్పుము. "చాణక్యుఁడాజ్ఞాభంగములు గావించుచుండఁగాఁ జంద్రగుప్తుని కెట్లుక్రోధముద్దీపింపఁగలవో అట్టి శ్లోకములచేత నాతని నీవు స్తుతియింపఁదగును." అనియు, "ఆకార్యమును మిగుల రహస్యముగాఁ గరభకుని చేతఁ జెప్పి పంపవలయును." అనియు.

విరా- చిత్తము. (నిష్క్రమించును.)

పురుషుఁడు- (ప్రవేశించి) అమాత్యులకు జయము. అమాత్య శకటదాసుఁడిట్లు విన్నవించుచున్నాఁడు. "ఈగొప్ప యలంకారములుమూఁడును విక్రయింపఁబడుచున్నవి. అమాత్యులు చూడఁదగును." అని.

రాక్ష- (చూచి, తనలో) ఈయాభరణములు గొప్పవిలువగలవి. (పయికి) భద్రా! "అమ్మెదువానిం బరితోషపఱిచి పుచ్చుకొ"మ్మని శకటదాసునితోఁ జెప్పుము.

పురు- చిత్తము. (నిష్క్రమించును.)

రాక్ష- ఇపుడు కరభకునిఁ గుసుమపురమునకుఁ బంపెదను. (లేచి) దురాత్ముఁడయిన చాణక్యునుండి చంద్రగుప్తుని భేదింపవచ్చునా? లేక, సమీహితము సిద్ధించుననియే కనఁబడుచున్నది. ఏమో?

మ॥ తనకాజ్ఞావశులెల్ల రాజులనుచున్ ♦ దర్పంబునన్ మౌర్యుఁడుం,
దనచే రాజ్యము వీనికబ్బెనని చా ♦ ణక్యుండు, నీరీతి నొ।
క్కని రాజ్యైకవిభూతి నొక్కనికిఁ బ్రతి ♦ జ్ఞాసిద్ధి యాప్తార్థుఁజే।
యను సౌహార్దవిభేదనంబిఁకను సా ♦ ధ్యంబౌను నిక్కంబుగాన్॥

అందఱు- (నిష్క్రమింతురు.)

ఇది పాలెపు వేంకటసూర్యగోపాల ప్రధానాంధ్రీకృత
ముద్రారాక్షసనాటకమునఁ ద్వితీయాంకము.

ముద్రారాక్షసము—తృతీయాంకము.

కంచుకి- (ప్రవేశించి)

చ॥ అరయఁగ రూపముఖ్యవిష ♦ యాళిగ్రహించుచు స్వార్థలాభమే
కరణము లక్షిముఖ్యములు ♦ కల్మిని గూర్చెనొ నీకు, వానికిం।
బరువముదప్పె, నంగములు ♦ వాసెఁ బటుత్వము మద్విధేయముల్
జర యిపుడెక్కె నీతలను ♦ జాలు, మదింపకుమింక నాశతో ॥

(నడచి చూచి) ఓయోయి సుగాంగప్రాసాదాధికృతులయిన పురుషులారా! సుగృహీతనామధేయుఁడు చంద్రగుప్తమహారాజు మిమ్మి ట్లాజ్ఞాపించుచున్నాఁడు. "రాఁబోవు కౌముదీమహోత్సవమునందు రమణీయతరమయిన కుసుమపురముంజూడ నిచ్ఛయించుచున్నాను. కనుక సుగాంగప్రాసాదమందలి యుపరిభూములను సంస్కరింపవలయును." అని. మఱి మీరు జాగు చేయుచున్నా రేల? (ఆకాశమువంకఁ జెవియొగ్గి) "అయ్యా! ఏమనుచున్నావు? చంద్రగుప్తమహారాజువారి కౌముదీమహా ప్రతిషేధింపఁబడ్డదని యెఱుఁగరా?" అనుచున్నారా? అయ్యో! ప్రాణహారమయిన యీకథఁ జెప్పట యెందుకు? శీఘ్రముగా నిపుడు-

సీ॥ స్తంభమ్ములకు సువా ♦ సనపదార్థములచే
ధూపముల్ వెట్టియుఁ ♦ దోరమైన।
పుష్పమాలికలను ♦ బొందుగాఁ జుట్టియు
బున్నమనాటి సం ♦ పూర్ణచంద్రు।

కరముల యవదాత ♦ కాంతి నుల్లంఘించు
సచ్చామరంబుల ♦ సంతతులను।
బాలుపుగాఁ జుట్టియుఁ ♦ బలువిధంబులుగాన।
రంగుల ముత్యాల ♦ ముగ్గువెట్టి।

గీ చిరము సింహాంకపీఠ సు ♦ స్థితినిఁ జేసి।
మూర్ఛితయు నాఁగఁదోఁచు ♦ గోవును సుపుష్ప।
వారసంయుక్త చందన ♦ వారిచేత।
సిక్తనుం జేయఁ దగును సు ♦ శీఘ్రముగను ॥ 2 ॥

(ఆకాశమువంక) ఏమనుచున్నారు? ఇదిగో! త్వరతోఁ జేయుచున్నామనుచున్నారా? త్వరపడుఁడు. ఇదె చంద్రగుప్తమహారాజు రానే వచ్చినాఁడు. ఈతఁడు-

సీ॥ విషమంబుతౌచు ని ♦ ర్వేదప్రదంబు తా
నధ్వంబులందున ♦ నచలుఁడౌచు।
సంతతంబును సువి ♦ స్రబ్ధంబె యైనట్టి
యంగసంతతిచేత ♦ నలపు లేక।
చిరకాలమీతని ♦ గురుఁడే జగద్భార
మొదికంబుగా మోసి ♦ విడిచినాఁడొ?।
యమ్మహాభారంబు ♦ ననతిప్రయాసంబు
ననె వహింపఁగడంగి ♦ నాఁడితండు।

గీ॥ అధికతరమైన కాంక్ష ద ♦ న్నావహింప।
నవవయస్సునయందె మ ♦ నస్వియగుట।
దమ్యతనొకింత స్ఖలితుఁడై ♦ తనరుఁగాని।
యించుకైనను దుఃఖము ♦ గాంచఁడితఁడు ॥ 3 ॥

(తెరలో) మహారాజ! ఇటు, ఇటు.

రాజు- (ప్రతీహారితోఁ బ్రవేశించును. తనలో) రాజధర్మాను వృత్తిపరతంత్రులకు రాజ్యమనునది మిగుల నప్రీతికే స్థానము. ఏమా?

చ॥ పరకృతికై కడంగు నృపుఁ ♦ బాయుస్వతంత్రత, స్వార్థముం ద్యజిం
చురతిని జెంపు నాతనికి ♦ క్షోణివిభుండను పేరు కల్లయౌఁ ।
బరవశుఁ డొండ్లయర్థములు ♦ స్వార్థముకంటెను నెక్కుడేని, యి ।
క్కరణిఁ బరప్రసేవకుఁడు ♦ గాంచఁగఁజాలఁడు ప్రీతిభావమున్ ॥ 4

ఇంతేకాక, సమాహితచిత్తులయిన రాజులకయినను రాజలక్ష్మి నారాధించుట దుష్కరము. ఏమా?

చ॥ జడియునుదీక్ష్ణుపట్ల, మృదుఁ ♦ జప్పఁగఁజూచును, శూరుచోభయం
పడు, మిగులంగ రక్తుఁడగు ♦ పండితుపట్లను స్నేహమేమిఁ గ ।
న్పడక నటించు, మూఢుకడ ♦ వైరముఁజూపు, హసించుభీరు, రో ।
పడఁతియుఁబోలె దుఃఖపరి ♦ పాల్యగదా సిరిప్రాప్తయయ్యునున్ ॥

మఱియు, “కల్లకలహముంగావించి కొంతకాలము స్వతంత్రముగా వ్యవహరింపవలసినది” యని యార్యులుపదేశించిరి. ఇదియుఁ బాతకముగానే తోఁచియు నెట్టులో అంగీకరించితిని. లేక, మాటికిని ఆర్యుల చేత బుద్ధి దిద్దఁబడుచున్న మేము స్వతంత్రులమే. ఎందువలననఁగా-

గీ॥ అడ్డువెట్టడు సాధుకా ♦ ర్యముల శిష్యు ।
నతఁడు చెడుత్రోవఁబడ సిడి ♦ యయి మరల్చు ।
గురుఁడు; వినతుండెపుడు నిరం ♦ కుశుఁడు; గానఁ ।
బడయఁ గోరము స్వచ్ఛంద ♦ వర్తనంబు ॥ 6 ॥

(పయికి) అయ్యా, వైహీనరీ! సుగాంగప్రాసాదమునకు మార్గము గనఁబఱుపుము.

కంచుకి- దేవా! ఇటు, ఇటు.

రాజు- (నడచును.)

కంచుకి- (నడచి) ఇదె సుగాంగప్రాసాదము. దేవరవారు నెమ్మదిగా నెక్కవచ్చును.

రాజు- (ఎక్కుటనభినయించి, దిశలుచూచి) ఓహో! శరత్సమయమందుఁ బుట్టిన శోభావిభూతులచేత దిశ లెంతరమణీయములుగానున్నవి?

సీ॥ సితతరజలధర ♦ చ్ఛేద పరంపరా
సికతాతలంబులఁ ♦ జెలఁగుచుండి ।
జానొప్పనంతట ♦ సారసద్విజవార
కలరావములచేత ♦ నలరుచుండి ।
రాత్రివేళలను జి ♦ త్రవిచిత్రవర్ణక
తారకోత్పలములఁ ♦ దనరుచుండి ।
యవదాత కాశపు ♦ ష్పావలీసంకాశ
కౌముదీరాత్రులఁ ♦ గ్రాలుచుండి ।
గీ॥ దీర్ఘమాచుఁ బదియు ♦ దిక్కులు లలినభ ।
స్స్యందమాన నదుల ♦ చందమెల్లఁ ।
బొంది శాంతలక్ష్మి ♦ నందెఁ గ్రమమ్మున ।
యాత్రినిపుడు గల్గు ♦ నఖిలశుభము ॥ 7 ॥

మఱియు-

చ॥ అవనతిఁగూర్చు శాలులకు ♦ దారఫలంబుల, కెచ్చుపొర్లునం ।
బుధులకుఁ డెచ్చు నైజగతిఁ, ♦ బోనడచున్ విషమెట్లొ యట్లున ।
ట్టువపులుఁగాము నుగ్రము, ని ♦ టుల్ గనుపట్టు శరత్తుచూడఁగన్
భువనమునంతకున్ వినయ ♦ ముంగడు పేరిమి నేర్పునట్లుగన్ ॥ 8 ॥

మఱియు--

గీ॥ కాంతుబహువల్లభుని పట్లఁ ♦ గలుషితయగు
గంగ, మార్గతనూకృతిఁ ♦ గలఁకఁ దేర్చి
రతికథాచణదూతిక ♦ గతిశరత్తు
చేర్చుచున్నది బాపురే! ♦ సింధుపతిని ॥ 9 ॥

(అంతట నాట్యముచేఁజూచి) ఓయీ! కౌముదీమహోత్సవ మారంభింపఁబడలేదేమి? చూడు.

సీ॥ చతురకథాలాప ♦ చతురులై మించెడు
ధూర్తవతంసుల ♦ తోడఁగూడి
వరనితంబాభోగ ♦ భారసంక్లేశముల్
గమనంబులకు మంద ♦ గతియొనర్ప
వారవధూజన ♦ వారంబులీ రాజ
వీధులయందుఁ గ ♦ న్పింపవేమి
స్వస్వగేహమహావి ♦ భవ సంప్రదర్శన
స్పర్ధలనుం బర ♦ స్పరముఁ జెంది
గీ॥ శంకలనువీడి కామినీ ♦ జనముతోడఁ
బౌరముఖ్యులు వాంఛిత ♦ పార్వణీమ
హోత్సవమ్ము భజింప రా ♦ కుండుటేమి ?
యిందులకుఁ గారణమును నే ♦ నెఱుఁగవలఁతు ॥ 10 ॥

కంచుకి- దేవా! ఇది యిట్లు!

రాజు- ఇది యెట్లు?

కంచుకి- ఆయనవల్లనిది—

రాజు- స్ఫుటముగాఁ జెప్పవయ్యా!

కంచుకి- కౌముదీమహోత్సవము ప్రతిషేధింపఁబడెను?

రాజు-(క్రోధముతో) ఆ! ఎవరివల్ల?

కంచుకి- ఇంతకంటె నెక్కువగా దేవరకు విన్నవింపఁజాలము.

రాజు-చూచువారల చూపునకు మిగుల రమణీయముగాఁ గనఁబడు నీవిషయమార్యచాణక్యులచేఁ బ్రతిషేధింపఁబడలేదుగద!

కంచుకి-దేవా! బ్రదుకఁగోరువాఁడితరుఁడెవఁడు దేవరశాసనము నుల్లంఘింపఁగలఁడు?

రాజు-శోణోత్తరా! కూర్చుండఁగోరుచున్నాను.

ప్రతీహారి-దేవా! ఇదిగో సింహాసనము. ఇందు దేవరవారు గూర్చుండవచ్చును.

రాజు- (నాట్యముచేఁగూర్చుండి) అయ్యా! వైహీనరీ! ఆర్యచాణక్యులను జూడఁగోరుచున్నాను.

కంచుకి- చిత్తము. (వెళ్లును.)

చాణక్యుఁడు- (తనయింటిలో, ఆస్తరణమందుఁ గూర్చుండి కోపసహితమయిన చింతతో నంతఁబ్రవేశించును. తనలో) దురాత్ముఁడా రాక్షసహతకునకు నాతో స్పర్ధ యెందువలన?

గీ॥ విరచితాగుఁడు కౌటిల్యు ♦ డురగముక్రియఁ ।
బురము విడి నందులంగూల్చి ♦ మురకుమారు ।
రాజుఁ జేసినటుల్ మౌర్యు ♦ రమహరింతు ।
నని కడంగెదు నాబుద్ధి ♦ నతిశయింప ॥ 11 ॥

(ప్రత్యక్షముగా నాకాశమందు లక్ష్యముంచి) రాక్షసా! రాక్షస! ఈదుర్వ్యాపారమునుండి విరమింపుము.

గీ॥ తెలియఁగు ప్రధాన ♦ దృష్టరాజ్యాంగుఁడు ।
గర్వి నందుఁడెవుఁడు ♦ గాఁడు మౌర్యుఁ ।
డీవుగావు నేను, ♦ నిద్దఱ సాధర్మ్య ।
మొక ప్రధానవైర ♦ మోరి జాల్మ! ॥ 12 ॥

(ఆలోచించి) లేక, ఈవిషయమయి నేనంతగా ఖేదింపఁబనిలేదు. ఏమా?

మ॥ హృదయాంతఃప్రసరంబు, పర్వతజు, నా ♦ భృత్యౌఘమేచుట్టియు ।
న్నది, నాచారులకిష్టసాధనవిధిన్ ♦ దాక్ష్యంబు సిద్ధార్థకా ।
ది దృఢప్రజ్ఞుల, కీశుతోడఁ గృతక ♦ ద్వేషంబు గల్పించి యీ ।
యదనన్ రాక్షసకేతుభేదకుశలం ♦ బౌ తంత్రముంబన్నితిన్ ॥ 13

కంచుకి- (ప్రవేశించి) సేవయనఁగాఁ గష్టముకదా! ఏమా?

చ॥ భయపడఁగావలెన్ నృపుని ♦ పట్ల, నమాత్యునిపట్ల, భూమిభృ ।
త్ప్రియజనుపట్ల, లోఁగిటఁబ్ర ♦ వేశముగల్గిన ధూర్తుపట్ల, న ।
ర్పయికిడిచూచు, టాలపన ♦ భావము, పిండముఁగోరి గౌరవ ।
వ్యయమునఁ జేయు సేవనము ♦ నంహుశ్వవృత్తియటంచుఁ బండితుల్ ॥

(నడచి చూచి) ఇదే యార్యచాణక్యుని యిల్లు. ప్రవేశించెదను. (నాట్యముచేఁ బ్రవేశించి చూచి) అహ్హా! రాజాధిరాజమంత్రిగారి గృహవైభవము! ఏమా?

గీ॥ గోమయములఁ జిదుకఁ ♦ గొట్టెడు రాతున్క, ।
వటువులేర్చి యిడిన ♦ బర్హిపనలఁ, ।
బొట్టి చూర, నెండు ♦ కట్టెల, జీర్ణకు ।
డ్యములఁ గానఁబడు మ ♦ హాత్మునిల్లు ॥ 15 ॥

కనుకఁ జంద్రగుప్తమహారాజీతనికి వృషలుఁడగుట తగియున్నది. ఎందుచేతనా?

గీ॥ లేనిగుణములు భూధవు ♦ పైనిఁ బెట్టి ।
కృతులు సత్యవచుల్ సదా ♦ నుతియొనర్త్రు ।
కృపణతను, నీ ప్రభావము ♦ తృష్ణది; ని ।
రీహులకు నీశుఁడైనను ♦ దృణసముండు ॥ 16 ॥

(చూచి భయముతో) ఇదిగో! ఆర్యచాణక్యుఁడు—

సీ॥ అఖిలలోకంబును ♦ నలపులేక స్వధామ
రాశిని నెరపి ప ♦ రాభవించి ।
యస్తమయంబునం ♦ దావనీశ్వరునకు
నుదయంబు మార్యున ♦ కొక్కతఱిని ।
సంఘటించి ప్రతిజ్ఞ ♦ జరపినట్టి మహాను
భావుఁడీ చాణక్య ♦ బాడబుండు ।
అల్ల సహస్రాంశుఁ ♦ డన్న, లోకప్రద
క్షిణమును సర్వదా ♦ చేయుకతన ।
గీ॥ నస్తమయముదయంబు వే ♦ ఱగుటకతన ।
హిమము నుష్ణిమ వేర్వేఱ ♦ నెసఁగుకతనఁ ।
గనఁగనఁగ సర్వగామియుఁ ♦ గాని కతన ।
నతిని తేజంబునన్ మించు ♦ నితని తేజు ॥ 17 ॥

(మోకాళ్లువంచి భూమికెరగి) ఆర్యులకు జయము, జయము.

చాణ- (నాట్యముచేఁ జూచి) వైహీనరీ! ఈ రాకకుఁ బ్రయోజనమేమి?

కంచుకి- అయ్యా! ప్రణతులయి సంచలించు రాజవరేణ్యుల మౌళుల మాణిక్యఖండములచేఁ బింగలీకృత పాదపద్మములవాఁడు, సుగృహీతనామధేయుఁడు, చంద్రగుప్తమహారాజు, ఆర్యులకు శిరసుతోఁ బ్రణమిల్లి విన్నవించుచున్నాఁడు. “ఆర్యులకుఁ గార్యవిఘ్నము లేనియెడల దర్శనముచేయఁగోరుచున్నాను.” అని.

చాణ- వృషలుఁడు నన్నుఁ జూడఁగోరుచున్నాఁడా? నాచేసిన యీకౌముదీమహోత్సవప్రతిషేధము వృషలునికిఁ దెలియలేదుగద

కంచుకి-ఆర్యా! తెలిసినది.

చాణ- (క్రోధముతో) ఆ! ఎవరుచెప్పిరి?

కంచుకి- (భయమును నటించి) ఆర్యులు ప్రసన్నులగుదురుగాక! సుగాంగప్రాసాదశిఖరము నెక్కి కుసుమపురమందుఁ గౌముదీమహోత్సవము జరుగకుండుట మహారాజు స్వయముగానే తెలిసికొన్నాఁడు.

చాణ- ఆ! తెలిసినది. నేను లేనప్పుడు మీరే ప్రోత్సాహకులయి వృషలునకు రోషమెక్కించినారు. అన్యమేమున్నది?

కంచుకి- (భయముతో, మోమువాల్చి యూరకుండును.)

చాణ- ఓహో! రాజపరిజనమునకుఁ జాణక్యునియందుఁ బ్రద్వేషపక్షపాతము! సరే, వృషలుఁడెక్కడ?

కంచుకి- (భయమునటించుచు) అయ్యా! సుగాంగమందుండి నన్నార్యపాదమూలమునకుఁ బంపించెను.

చాణ- (లేచి) సుగాంగమునకు దారిచూపుము.

కంచుకి- అయ్యా! ఇటు, ఇటు.

ఇద్దఱు- (నడుతురు)

కంచుకి- ఇదె సుగాంగప్రాసాదము. ఆర్యులు నెమ్మదిగా నెక్కఁదగును.

చాణ— (నాట్యముచే నెక్కి, చూచి) వహవా! సింహాసన మెక్కియున్నాఁడు వృషలుఁడు. మేలుమేలు.

గీ॥ శ్రీము లెక్కఁగొనని ♦ నృపులు నందులు వాయ |
నృపవరుండు వృషలుఁ ♦ డెక్కె గద్దె |
నీవిధముగ సదృశ ♦ పృథివీశసంగతి |
నాప్రయత్నమిచ్చు ♦ నాకుఁ బ్రీతి. ॥ 18 ॥

(సమీపించి) వృషలునకు జయము.

రాజు— (సింహాసనమునుండి లేచి చాణక్యుని పాదములంబట్టుకొని) ఆర్య! చంద్రగుప్తుఁడు నమస్కరించుచున్నాఁడు.

చాణ— (చేతులుపట్టుకొని) వత్సా! లే, లెమ్ము.

సీ॥ ప్రస్తరాళిప్రాంత ♦ భాగపాతస్ఖలి
తామృతాహారాప ♦ గానవద్య |
శీకరాసారాతి ♦ శీతలంబైనట్టి
శీతాద్రియుత్తర ♦ సీమగాఁగ |
నైకరాగస్ఫుర ♦ న్మణీభాసురంబు ద
క్షిణాకంధి దక్షిణ ♦ సీమగాఁగ |
పూర్వసముద్రంబు ♦ పూర్వసీమగఁ బ్రతీ
చీవార్ధి పశ్చిమ ♦ సీమగాఁగ |
గీ॥ మధ్యదేశరాజ ♦ మండలి భీతిఁ బ |
ల్మారు వచ్చి తనదు ♦ మౌళిరత్న |
కాంతిచేత నీదు ♦ కాలి వ్రేల్సందులు |
రుచిరశోభనంద ♦ మ్రొక్కఁగాక ॥ 19 ॥

రాజు— ఆర్యప్రసాదముచేత సర్వము ననుభవించుచున్నాను. ఆర్యులు కూర్చుండఁదగును.

ఇద్దఱు— (యథోచితముగాఁ గూర్చుందురు.)

చాణ— వృషల! ఎందుకొఱకు మమ్ముఁ బిలిపించితివి?

రాజు— ఆర్యులదర్శనముచే ననుగ్రహింపఁజేయఁబడుటకొఱకు

చాణ— (చిఱునవ్వుతో) వృషలా! ఈవినయమక్కఱలేదు. ప్రభువు లధికారవంతులను నిష్ప్రయోజనముగాఁ బిలువరు. కనుకఁ బ్రయోజనమేదో చెప్పుము.

రాజు— ఆర్యా! కౌముదీమహోత్సవప్రతిషేధమున కార్యులుగనిపెట్టిన ఫలమేమి?

చాణ— (చిఱునవ్వుతో) వృషలా! కనుక నుపాలంభించుటకే మమ్ముఁ బిలిపించితివా?

రాజు— పాపము శమించుఁగాక, పాపము శమించుఁగాక. లేదు, లేదు, విన్నవించుటకు—

చాణ— అయినయెడల విజ్ఞాపనీయముల విషయములో గురువుల యిచ్ఛలకు శిష్యులనుకూలురు గావలయును.

రాజు— ఆర్యా! సందేహమేమి? కాని, ఆర్యులయిచ్ఛ యెపుడు నిష్ప్రయోజనకానిది. అందువలన మాకుఁ బ్రశ్నావకాశముకలదు.

చాణ— వృషలా! ప్రయోజనములేని యిచ్ఛ చాణక్యునకు స్వప్నమయిందనఁ గలుగదని చక్కఁగా గ్రహించినావు.

రాజు— అందుచేతనే ప్రయోజనమును వినఁగోరి యడుగుచున్నాను.

చాణ— వృషల' వినుము. అర్థశాస్త్రకారులు, సిద్ధిని, త్రివిధనుగా నుపవర్ణింతురు. ఎట్లన; రాజాయత్త, సచివాయత్త, ఉభయాయత్త అని. సచివాయత్తయయిన సిద్ధివలని ఫలము నన్వేషించుట నీకెందుకు? ఇందు నియుక్తులమయిన మేమే వర్తించెదము.

రాజు— (కోపముతోవలె మొగము ద్రిప్పికొనును.)

వైతాళికులు— (తెరలోఁ బాడుదురు.)

ఒకఁడు-

సీ॥ కాశపుష్పచ్ఛటా ♦ కాంతి సంతతిభస్మ
కలనచేతను మహా ♦ కాశమునకు ।
శుభ్రమౌదీధితి ♦ సొంపారఁగల్పించి
కువలయాప్తుని యంశు ♦ కోటిచేత ।
జలధరసంచయ ♦ చంచన్వినీలేభ
కృత్తికిఁ దెలిచాయ ♦ గీలుకొలిపి ।
కాంతసితచ్ఛాయ ♦ కౌముదీరూపక
పాలమాలికను జొ ♦ ప్పడధరించి ।
గీ॥ వరలు రాజహంస ♦ వారహాసంబుతో ।
విబుధకోటిచేత ♦ వినుతిఁగాంచి ।
శంభుతనువుఁబోలె ♦ సర్వసుందరమౌ శ ।
రత్తు క్లేశముల మ ♦ రల్చుఁగాత ॥ 20 ॥

మఱియు-

సీ॥ అపుడె మేల్కాంచుట ♦ నలసమై యొక్క క్ష
ణమ్ము ప్రసారించి ♦ నాగరాజ ।
మూర్ధమహారత్న ♦ పుంజ దీపప్రభా
రాశికొంకిత ప ♦ రాఙ్ముఖియయి ।
సాంగభంగములైన ♦ యావులింతలచేత
సంజాతలవకణ ♦ సమితియగుచు ।
నాత్మక్రియాగుర్వియై ♦ శేషభోగ సం
ఘాతోపధానుఁడు ♦ కమలనేత్రుఁ ।
గీ॥ డురగరాజమహాశయ్య ♦ నుండి లేవఁ ।
దలఁచుతఱిని నిద్రాచ్ఛేద ♦ తామ్రయగుచు ।
నించుకించుక విప్పిన ♦ దృష్టి మీకుఁ ।
జిరము సుఖములనిచ్చి ర ♦ క్షించుఁగాత ॥ 21 ॥

రెండవవాఁడు-

సీ॥ కమలసంభవుఁడేమి ♦ కారణమరసియో
నిరుపమవీర్యంపు ♦ నిధులుగాఁగ ।
సృజియించెఁగాఁ గొంద ♦ రిని నాత్మ ధామ వి
దారిత మదజలా ♦ సారవర్షి ।
నాగయూథేంద్రుల ♦ భోగదేవేంద్రుల
వ్యక్తమానావ లే ♦ పాన్వితులను ।
సార్వభౌముల వంశ ♦ పార్వణచంద్రుల
శాసన ప్రతిబద్ధ ♦ సకలజనులఁ ।
గీ॥ ద్వాదృశులను మృగేంద్రుని ♦ దంష్ట్రభంగ ।
పఱచునట్లెవ్వఁడేని నీ ♦ ప్రకటితాజ్ఞ ।
భంగపఱిచిన సహియింపఁ ♦ బాడియయ్య ।
భాస్కరసహస్రతేజ భూ ♦ పాలరాజ ॥ 22 ॥

మఱియు- గీ॥ భూషణాది కోప ♦ భోగంబుచేతను ।
బ్రభువు ప్రభువుగాఁడు ♦ పరులు నీదు ।
నాజ్ఞలన్నిగూడ ♦ నౌఁదల ధరియింతు ।
రిట్టి నీవె ప్రభుఁడ ♦ విలకునెల్ల ॥ 23 ॥

చాణ- (విని తనలో) ఇందు మొదటిదేమో విశిష్టదేవతా స్తుతిరూపము. ఇపుడారంభమయిన శరదృతుగుణసంకీర్తన మాశీర్వచనము. రెండవదేమియో తెలియకున్నది. (ఆలోచించి) ఆ! తెలిసినది. ఇది రాక్షసుని ప్రయోగము. ఆ! దురాత్మా, రాక్షసహతకుఁడ! కౌటిల్యుఁడు జాగరూకుఁడై యున్నాఁడని చూడఁగలవు-

రాజు- అయ్యా! వైహీనరీ! ఈవైతాళికులకు వేయివరాలిప్పింపుము.

కంచు- దేవరవారి సెలవుచొప్పున- (అని లేచి నడచును.)

చాణ- (క్రోధముతో) వైహీనరీ! ఉండుఁడు- వెళ్ళకు- వృషలా! అనవసరముగా నిట్లు మహాధనవ్యయము చేయుటయేల?

రాజు- ఆర్యులిట్లు నాచేయు సర్వకార్యముల నాటంకించుట చేత రాజ్యము నాకుఁ జెఱసాలవలె నున్నది. రాజ్యమువలెఁగాదు.

చాణ- వృషలా! రాజకార్యములందు స్వతంత్రులుగాని రాజులకిట్టి యాటంకములు కలుగుచునేయుండును. కనుక స్వయముగానే నడిపికొనుము.

రాజు- మేము మాకార్యములు స్వయముగానే నడిపికొందుము

చాణ- సంతోషము- మేమును మాకార్యములు స్వయముగా నడిపికొందుము.

రాజు- ఇట్లయినచో, కౌముదీమహోత్సవమును నిషేధించుటవలని ప్రయోజనము వినఁగోరుచున్నాను-

చాణ- వృషలా! కౌముదీమహోత్సవమాచరించుటవలని ప్రయోజనము వినుటకు నేనును గోరుచున్నాను.

రాజు- మొదట నాయాజ్ఞావ్యాఘాతము.

చాణ- వృషల! నాకును నీయాజ్ఞావ్యాఘాతము, కౌముదీమహోత్సవప్రతిషేధమే మొదటిప్రయోజనమనుకొమ్ము. ఏమా?

సీ॥ చీఁకటిమ్రాఁకుల ♦ చివురుఁజొంపమ్ముల
శ్యామమహా వేలావ ♦ నాళిచేత ।
గజతాశ్వతారత్న ♦ గాణిక్యమాణిక్య
హారబృహత్ప్రోతప్ర ♦ కరముచేతఁ ।
జలుల తిమింగిల ♦ జలచరక్షోభితాం
తరమైన యమ్మహా ♦ దకముచేత ।
నొప్పారుచుండెడు ♦ నుదధిచతుష్కంబు
నానలితీరముల్ ♦ హద్దుగాఁగ ।
గీ॥ నడిమిభినత భూమి ♦ నాథ శతంబు పూ ।
దండ నాఁద్వదాజ్ఞఁ ♦ దల ధరింప ।

నన్ను మీఱకుండ ♦ నున్న యీనీ ప్రభు ।
త్వంబు వినయ ♦ భూషితంబుగాదె ॥ 24 ॥

రాజు- సరే! ఇఁక రెండవప్రయోజనమెదో, అదియు వినఁ గోరుచున్నాను.

చాణ- అదియుఁ జెప్పుచున్నాను.

రాజు- చెప్పవచ్చును.

చాణ- శోణోత్తరా! కాయస్థుఁడు, అచలదత్తునితో "భద్రభటప్రముఖుల లేఖ్యపత్రిమి"మ్మని నామాటలుగాఁ జెప్పుము.

ప్రతిహారి- చిత్తము. (వెళ్ళి, తిరిగివచ్చి) ఆర్య! ఇదిగో పత్రము. (అందిచ్చును.)

చాణ- (పుచ్చుకొని) వృషల! ఇది చూడుము.

రాజు- (తీసికొని తనలో చదువును.) స్వస్తి! సుగృహీత నామధేయుఁడయిన చంద్రగుప్తదేవుని సహోత్థాయులును, ఇటనుండి వెడలి మలయకేతునాశ్రయించినవారును, అగు ప్రధానపురుషుల పరిమాణలేఖ్యమిది- ఏమనఁగా- మొదట గజాధ్యక్షుఁడు భద్రభటుఁడు, అశ్వాధ్యక్షుఁడు పురుషదత్తుఁడు, మహాద్వారపాలకుఁడయిన చంద్రభానుని మేనల్లుఁడు డింగురాతుఁడు, దేవరవారి స్వజన సంబంధియయిన మహారాజబలగుప్తుఁడు, ఆబాల్యసేవకుఁడు రాజసేనుఁడు, సేనాపతి సింహబలుని తమ్ముఁడు భాగురాయణుఁడు, మాలవ రాజపుత్రుఁడు రోహితాక్షుఁడు, క్షత్రగణమందు ముఖ్యతముఁడు విజయవర్మ, ఈమేము దేవరకార్యమందు సావధానులమయి యున్నాము. (పయికి) ఆర్య! ఈపత్రమింతివఱకున్నది. వారియుపరాగమునకు హేతువులను వినఁగోరుచున్నాను.

చాణ- వృషలా! వినుమటి- గజాధ్యక్షాశ్వాధ్యక్షులయిన యీభద్రభట పురుషదత్తనామకులిద్వరును, జారత్వము, త్రాగుడు,

వేఁట, యను వ్యసనములందగులొ్కని గజాశ్వపాలనమందు శ్రద్ధలేని వారగుట హేతువుగా వారివారి యుద్యోగమునుండి తొలఁగించి జీవనమాత్రమునకుఁ జాలినట్లిచ్చుచుంటివి. ఇందుచేత వారపరక్తులయి వెళ్ళి మలయకేతునాశ్రయించి తమతమ యధికారములను సంపాదించిరి. ఆడింగురాత బలగుప్తులు మిగులలుబ్ధులు. తమకిచ్చిన ధనమును లెక్కింపక, అక్కడ ధనమెక్కువగా దొరకునని యెంచి మలయకేతునాశ్రయించిరి. నీకు బాల్యసేవకుఁడా రాజసేనుఁడు నీ యనుగ్రహముచే నత్యధికమయిన ధనము, ఏనుఁగులు, గుఱ్ఱాలు, ఈయైశ్వర్యము వేవేగ సంపాదించినవాఁడు, మరల లాగికొనఁబడునని శంకించి వెడలిపోయి మలయకేతు నాశ్రయించెను. ఇఁకఁ దరువాతి వాఁడు, సేనాపతి సింహబలుని తమ్ముఁడు భాగురాయణుఁడు; అతఁడప్పుడు పర్వతకుని చెలిమి సంపాదించినవాఁడు. ఆప్రీతినిబట్టి మలయకేతునితో 'నీతండ్రి చాణక్యునిచేతఁ జంపింపఁబడె' నని రహస్యముగా భయపఱచి యాతనిని వెడల్చెను. తరువాత, నీకపథ్యకారులయిన చందనదాసాదులు బంధింపఁబడఁగాఁ దనదోషముల నాశంకించుకొని వెడలిపోయి మలయకేతువునాశ్రయించెను. అతఁడును, ఈతనిని తనకుఁ బ్రాణరక్షకుఁడని యెంచి కృతజ్ఞతననువర్తించుచు, తనతరువాతి మంత్రిపదవి యందీతనిం బెట్టెను. ఆలోహితాక్ష విజయవర్మలు మిగుల మానవంతులు, దాయాదులయిన తాము నీవలని యీవిని సహింపనివారయి మలయకేతువునాశ్రయించిరి. వారి యపరాగ కారణములివి.

రాజు— ఆర్య! ఇట్లు వారి యపరాగహేతువులు తెలిసెనుగదా వేవేగ మీరందుకుఁ బ్రతిక్రియ చేయలేదేల?

చాణ— వృషల! అది యయుక్తము.

రాజు— నేర్పులేమిచేతనా? లేక ప్రయోజనాపేక్షచేతనా?

చాణ— నేర్పులేమి యేలకలుగును? ప్రయోజనాపేక్షచేతనే!

రాజు— ప్రయోజనమిపుడు వినఁగోరుచున్నాను.

చాణ— విని, యోజింపుము.

రాజు— విందును, యోజింతును. చెప్పవచ్చును.

చాణ— వృషల! విరక్తులయిన ప్రజలవిషయమయి ప్రతివిధానము రెండు తెఱఁగులు. అనుగ్రహము, నిగ్రహము, నని. అనుగ్రహమనఁగా ఉద్యోగమునుండి తొలఁగింపఁబడిన భద్రభట పురుషదత్తులకు మరల నుద్యోగమిచ్చుటయే. అట్టి వ్యసనములతోఁగూడి యుండుటచేత, నయోగ్యులయినవారియం దారోప్యమాణమయిన యధికారము రాజ్యమునకంతకును మూలమయిన హస్త్యశ్వములను నశింపఁజేయఁగలదు. అతిలుబ్ధులయి సకలరాజ్యప్రదానముచేతనైనను బరితుష్టులుకాని డింగురాత బలగుప్తులపట్ల ననుగ్రహముఁ జూపుట కెట్లుశక్యము? ధనప్రణాశము కలుగునని భీతిపడు రాజసేన భాగురాయణులపట్ల ననుగ్రహమున కవకాశమెక్కడిది? దాయాదము సహింపనివారు, అత్యభిమానవంతులునైన లోహితాక్ష విజయవర్మలపట్ల నెట్టియనుగ్రహము ప్రీతిఁబుట్టింపఁగలదు. కనుక, అనుగ్రహరూపమయిన మొదటిపక్షము పరిహరింపఁబడ్డది. ఇఁక నిగ్రహరూపమయిన రెండవపక్షముమాట-కొలఁదికాలమయి నందైశ్వర్యమును బొందిన మనము సహోత్థాయియయిన ప్రధానపురుషవర్గము నుగ్రదండనముచేతఁ బీడించితిమా, నందకులానురక్తులయిన లోకుల విశ్వాసమునకు దూరులమగుదుము. కనుక, ఈపక్షమును బరిహరింపఁబడ్డది. అట్లు మనభృత్యవర్గమును జేరఁదీసికొని, రాక్షసోపదేశమును వినువాఁడయి, మహత్తరమయిన మ్లేచ్ఛబలము వెంటరాఁ, బితృవధామర్షి పర్వతకపుత్రుఁడు మలయకేతుఁడు మనలను మార్కొనుట కుద్యుక్తుఁడయియున్నందున నిది యుత్సవకాలముగాక వ్యాయామకాలమయి

యున్నది. అందువలన దుర్గసంస్కార మారంభింపఁదగియుండఁగాఁ గౌముదీమహోత్సవముతో నేమని ప్రతిషేధింపఁబడినది.

రాజు- ఆర్య! అడుగఁదగినదిక్కడఁ జాలకలదు.

చాణ- యథేచ్ఛముగా నడుగవచ్చును. నేనును అడుగఁదగినవి చాలకలదు.

రాజు- ఇట్లడుగుచున్నాను.

చాణ- నేనును ఇట్లు చెప్పుచున్నాను.

రాజు- మా యీసర్వానర్థములకు హేతువయిన మలయకేతుఁడు పురమువిడిచి వెళ్లుచు, ఆర్యులచే నుపేక్షింపఁబడ్డవాఁడెందువలన?

చాణ- వృషలా! మలయకేతుఁడు వెళ్ళిపోవునప్పుడుపేక్షించుటకు గతులు రెండు అనుగ్రహించుటా? నిగ్రహించుటా? అని. అనుగ్రహమనఁగా, పూర్వమియ్యనొప్పికొన్న రాజ్యార్థము నాతని కిచ్చుట. ఇఁక నిగ్రహమనఁగా, పర్వతకుఁడు మనచేతఁ జంపఁబడెనాఁడను కృతఘ్నతకుఁ జేయూతనిచ్చుటయగును. ఒప్పికొన్నయర్థరాజ్యము నిచ్చినను బర్వతకవినాశమునకు ఫలము కేవలము కృతఘ్నతామాత్ర మగునని యెంచి మలయకేతుఁడు పాఱిపోవుచున్నపుడుపేక్షించితిని.

రాజు- సరే! రాక్షసుఁడీనగరమధ్యమందేయుండియు, నుపేక్షింపఁబడుట కార్యుల యుత్తరమేమి?

చాణ- రాక్షసుఁడును నిజప్రభువులపట్ల దృఢానురాగమువలనను, చిరకాలమేకత్రవాసమువలనను, నందానురక్తులును, శీలజ్ఞులును అయిన లోకులనమ్మకమునకుఁ బాత్రమయినవాఁడు. ప్రజ్ఞాశౌర్యములుగలవాఁడు. సహాయసంపదతోఁగూడినవాఁడు. మహాధనమును బలమును గలవాఁడు. ఇట్టివాఁడు నగరములోనుండెనా అత్యంతమయిన యంతఃకోపమును బుట్టింపఁగలఁడు. దూరీకృతుఁడయ్యెనా బాహ్యాకోపముఁ బుట్టింపఁగలవాఁడయినను, సుసాధ్యుఁడు కాఁగలఁడని యెంచి, వెళ్ళిపోవుట నుపేక్షించితిని.

రాజు- అయినచో, నిక్కడనున్నపుడీ యుపాయములచేత లోఁబఱుచుకొనలేదేమి?

చాణ- ఆతనిని వెడలఁగొట్టుట యెట్లని ఱొమ్మునందలి మేకు నూడఁబెఱికికొన్నట్లు ఉపాయముచేత వెళ్ళిపోనిచ్చితిని. అట్లు వెళ్ళిపోవుటవలని ప్రయోజనము చెప్పియున్నాను.

రాజు- ఆర్యా! విక్రమించి యేల పట్టుకొనలేదు.

చాణ- వృషలా! ఇతఁడు రాక్షసుఁడుగదా! విక్రమించిపట్టుకొంటిమా, తాను జావనైనఁజచ్చును. నీబలములంజంపనైనఁజంపును. ఇట్లయ్యెనా రెంటను దోషమే! చూడు.

చ॥ ఘనముగఁజుట్టియుండి మన ♦ కావలివారలు గ్రమ్మిరేని యే।
యనువుననైన వాఁడిలిగె ♦ నాచెఱుపట్టి ప్రతాపశాలితోఁ।
డను సువియోగ; మాతఁడు ద ♦ శంబులఁద్రుంచిన నేనిఁ బీడయే।
వనగజముంబలెంగడు ను ♦ పాయతఁ జేయవలెన్ వినేయుఁగాన్॥

రాజు- ఆర్యులమతినతిశయించుటకు మేము చాలము. కాని, యమాత్యరాక్షసుఁడే యిందు సర్వథా ప్రశస్యతరుఁడు.

చాణ- (క్రోధముతో) నీవుగావని వాక్యశేషము. ఓయి వృషలా! అతఁడేమిచేసినాఁడు.

రాజు- తెలియనియెడల, ఇదిగో వినవలసినది. ఆమహాత్ముఁడు-

సీ॥ నగరంబు మాయధీ ♦ నంబయ్యె ననుటయు
కాని యథేచ్ఛము ♦ గాను మాదు।
గొంతుకఁ బదమూను ♦ కొన్చు వసించుచు
నున్నాఁడు; మాదు బ ♦ లోత్కరములు।
జయఘోషణాదులు ♦ సలుపఁగఁ గోరుచో
వారించినాఁడు దా ♦ బలిమిమెయిని;।
నమ్మఁదగినయట్టి ♦ నాదు భృత్యులపైని
విపులమైన స్వనీతి ♦ విభవమునను।

గీ॥ మోహమాపాదనముచేసి ◆ ముఱియుచుండుఁ ।
గావునను నాకు స్వీయావ ◆ ర్గంబుపట్ల ।
విశ్వసించుటకయినను ◆ వెనుకదీయు ।
చున్నయది చిత్తవృత్తివే ◆ యును నివేల ॥ 26 ॥

చాణ- (నవ్వి) వృషలా! రాక్షసుఁడిది చేసినాఁడా?

రాజు- అవును. అమాత్యరాక్షసుఁడిది చేసినాఁడు.

చాణ-వృషలా' నాకు మఱి యిదియొకటి తెలిసినది. నందుని వలెనే నిన్నున్మూలించి, నిన్నువలెనే మలయకేతుని భూతలమందధి రాజ్యసింహాసనమెక్కించినాఁడని-

రాజు- ఉపాలంభము చాలును. ఇది దైవానుష్ఠితము. ఆర్యునిదాయేమి?

చాణ- ఓయి మత్సరీ!

సీ॥ భూరితరాగ్రహ ◆ స్ఫురణంబు మెయిఁజేతి
వ్రేళుల కొనలెల్ల ◆ విషమములుగఁ ।
గడు వెసగాజుట్టు ◆ ముడివిప్పి సకలశా
త్రవకులచ్ఛేద దీ ◆ ర్ఘతనుమించి ।
యెల్లరు లోకులు ◆ నెఱిఁగెడునట్లుగాఁ
బటుదారుణంబైన ◆ ప్రతినసలిపి ।
నవతి శతాధిక ◆ ద్రవిణకోటీశ్వర
మవలిప్తమగు నంద ◆ నవకమొగినిఁ ।

గీ॥ బగ్గముననుగట్టి ◆ పశువులనుంబోలెఁ ।
గడిమి రాక్షసకుని ◆ కనులయెదుట ।
సంహరించి ప్రతిన ◆ సాధించినట్టివాఁ ।
డన్యుఁడెవ్వఁడింక ◆ నది వచింపు ॥ 27 ॥

మఱియు- సీ॥ గగనతలంబున ◆ కెగిరి గ్రద్దలపిండు
లాబద్ధచక్రంబు ◆ లగుచు నెనయఁ ।
గదలింపకున్న దీ ◆ ర్ఘములైన ఱెక్కలు
ధూమమై సూర్యకాం ◆ తులను మఱుఁగు ।
పఱుప దిశాచక్ర ◆ వాళము మబ్బుల
గ్రమ్మినయదివోలెఁ ◆ గానఁబడఁగ ।
మసనంపునేలను ◆ వసియించు జంబుక
విసరాదులను నంద ◆ విభుల ప్రేత ।

గీ॥ తనువులందునుండి ◆ తఱుచు స్రవించెడు ।
వసల నలరఁజేసి ◆ వహ్నులిప్ప ।
టికిని నారకుండ ◆ లేవున మండుచు ।
నున్నవిదిగో, చూడ ◆ వోయి వృషల! ॥ 28 ॥

రాజు- ఇది చేసినది యితరుఁడే;

చాణ- ఆ! ఎవఁడు.

రాజు- నందకులశత్రువైన దైవము.

చాణ- అజ్ఞానులు దైవమును బ్రమాణముగాఁ దీసికొందురు.

రాజు- విద్వాంసులయినను ఆత్మశ్లాఘాపరులుగారు.

చాణ- (క్రోధముతో) వృషలా! వృషలా! భృత్యునెట్లట్లు నన్నుఁ దిరస్కరించుచున్నావు.

మ॥ ముడిచినజుట్టు విప్పుటకు ◆ ముంగయి సాగుఁ (కాలితోభూమినిఁ
గొట్టి) బ్రతిజ్ఞ సేయఁగా ।
నడుగుచలించెడుస్ మరల; ◆ నందఱు నందులు సాన్వయంబుగా ।
మడియుట శాంతమైపరగు ◆ మాదుక్రోధాగ్నిని, నీవు, వెండియు
య్యెడ జ్వలియింపఁ జేసెదవు ◆ మృత్యుపరీతుఁడువోలె మూర్ఖుఁడా ॥

రాజు- (భయముతో, తనలో) అయ్యో! ఆర్యుఁడు సత్యముగానే కోపించినాఁడాయేమి? అట్లే తోఁచును.

సీ॥ సంరంభవశమున ♦ సంచలించెడు కను
      ఱెప్పలనంటి జా ♦ ఱెడు విశుద్ధ।
జలబిందువులచేతఁ ♦ జల్లారుననిగాఁగఁ
      దోఁచియు నేత్రకన్ ♦ దోయికాంతిఁ।
గానంగఁబడియెడుఁ ♦ గన్బొమముడిపాటు
      ధూమంబుచేఁ గ్రోధ ♦ ధూమవహుఁడు।
మరల రగుల్కొను ♦ మాదిరిని బదా
      ఘాతమిట్టట్టులిన్ ♦ గదులఁజేయుఁ।
గీ॥ బృథివి యోర్వఁజాలె ♦ నెట్లొ కష్టమువిూఁద।
నీమహాత్ము ప్రకృత ♦ కృత్యమెంతు।
రౌద్రమభినయించు ♦ రుద్రతాండవము ధా।
త్రికిఁ దలంపునకునుఁ ♦ దెచ్చెననుచు ॥ 30 ॥

చాణ- (కృతకకోపము సంహరించుకొని) వృషలా! వృషల! ఇఁక నుత్తరోత్తరములక్కఱలేదు. నాకంటె రాక్షసుఁడు శ్రేష్ఠతరుఁడని యెంచితివేని యీశస్త్రము నతనికే యిమ్ము. (శస్త్రమువిడిచి, లేచి, ఆకసమువంకఁజూచి, తనలో) రాక్షస! రాక్షస! కౌటిల్యబుద్ధిని మీఱవలెనని యెంచిన నీబుద్ధిప్రకర్షమిది.

గీ॥ స్ఖలిత చాణక్యభక్తిన్ వృ ♦ షలుసుఖాన।
గెలువవచ్చు నటంచును ♦ గితవ! యిట్లు।
తలఁచిపన్నిన యీభేద ♦ తంత్రమెల్ల।
నిను వశంపర్చుకొనుటకే ♦ పనికివచ్చు ॥ 31 ॥

(అని వెళ్లును.)

రాజు- అయ్యా! వైహీనరీ! ఇప్పటినుండియుఁ జాణక్యుని నిరాకరించి చంద్రగుప్తుఁడు స్వయముగానే రాజకార్యములంగావించుకొనునని ప్రజలకుఁ దెలుపుము.

కంచుకి- (తనలో) ఆర్యచాణక్యుఁడనక నిరుపపదముగా చాణక్యుఁడనుట యెట్లు? అయ్యయ్యో! సత్యముగా నధికారము తీసికొనఁబడ్డది. లేక, ఇందు మహారాజు దోషములేదు.

గీ॥ ధరణిధవునకార్య ♦ కరణము సేయు దో।
షంబు నిశ్చయముగ ♦ సచివునిదియ।
దంతికెన్న వ్యాల ♦ తాఖ్యాతి హేతువు।
హస్తిపకు ప్రమాద ♦ మరసిచూడ ॥ 32 ॥

రాజు- అయ్యా! ఆలోచించుచున్నావేమి?

కంచుకి- దేవ! కించిత్తయిన నాలోచించుటలేదు. మఱి యిది విన్నవించుచున్నాను. భాగ్యవశముచేత దేవరవారిపుడు నిశ్చయముగా స్వతంత్రులయినారు.

రాజు- (తనలో) లోకులిట్లు మమ్ముగ్రహింపఁగా స్వకార్యసిద్ధిగోరు నార్యచాణక్యుని కోరిక సిద్ధించుఁగాక. (పయికి) శోణోత్తరా! ఈశుష్కకలహముచేత నన్ను శిరోవేదన బాధించుచున్నది. కనుకఁ బడకటింటిఁజూపుము.

ప్రతీ- మహారాజ! రండు, రండు.

రాజు- (ఆసనమునుండి లేచి తనలో)

గీ॥ ఆర్యునాజ్ఞ మెయినె ♦ యవిధేయుఁడైతినా।
బుద్ధి చొరఁగఁగడఁగు ♦ భూబిలంబు।
నెవరు గురుని ధిక్క ♦ రింతురు నిజముగా।
వారిగుండె లజ్జఁ ♦ బగులగెట్లు? ॥ 33 ॥

అందఱు- (వెళ్లుదురు.)

ఇది పాలెపు వేంకటసూర్యగోపాల ప్రధానాంధ్రకృత
ముద్రారాక్షస నాటకమునఁ దృతీయాంకము.

ముద్రారాక్షసము-చతుర్థాంకము.

పురుషుఁడు - (అధ్వగవేషముతోఁ బ్రవేశించును.) ఆశ్చర్య మాశ్చర్యము.

గీ॥ సమధికంబైనయట్టి యో ♦ జనశతమ్ము ।
చాగువాఁడు గలండె గ ♦ తాగతములఁ ।
బార్థివుని సేవకులయందె ♦ వంతుఁగాని ।
దాఁటఁగూడని రాజాజ్ఞ ♦ దగులదేని ॥ 1 ॥

అమాత్యరాక్షసుని యింటికి వెళ్లెదను. ద్వారపాలకులలో నెవరయ్యా యిక్కడనున్నవారు? ప్రభువయిన అమాత్యరాక్షసుల వారితో "కరభకుఁడు కరభకమువలెఁ గార్యమును త్వరగా సాధించుకొని పాటలిపుత్రమునుండి వచ్చినాఁ" డని నివేదింపుఁడు.

ద్వారపాలకుఁడు- (ప్రవేశించి) భద్ర! బిగ్గరగా మాటలాడకు. ప్రభువమాత్యరాక్షసుఁడు కార్యాలోచనమువలని జాగరముచేతఁ దలనొప్పిరాఁగా నిప్పటికిని బడకవిడువలేదు, కనుక నొకముహూర్తము తాళుము.

పురుషుఁడు - భద్రముఖ! నీయిష్టము.

రాక్షసుఁడు- (అంతఁ బ్రవేశించును. తనలో)

మ॥ కృతియారంభముచేయఁగాఁ దొడఁగుచోఁ ♦ గీడెంచి నేలెంచియు
ద్ధత చాణక్యవటు ప్రకారతర చి ♦ త్తంబుల్ విచారించి చే ।
సితిఁ గృత్యంబులవెల్ల భగ్నములుగాఁ ♦ జిత్తంబతివ్యాకులా ।
న్వితమై రేలిదమిత్థమంచెఱుఁగకు ♦ న్నిద్రుండనై పుచ్చెదన్ ॥ 2

మఱియు- సీ॥ తొలుఁదొల్తఁ గొంచెమై ♦ తోఁచు కార్యమ్ము ప
క్షేపముగావించి ♦ యాపిదపను ।
విస్తారముంగోరి ♦ వెసగర్భితముల బీ
జముల ఫలంబును ♦ జాలగూఢ ।
మతిగహనంబును ♦ నగు నటుద్భేదముం
గావించి సద్బుద్ధి ♦ కలనచేవి ।
మర్శము నొనరించి ♦ మఱి ప్రసృతిముఁ గార్య
జాతిమెల్లను నుప ♦ సంహరించు ।
గీ॥ నాటకస్రష్టలెల్ల మా ♦ బోటి రాజ్య ।
కార్యనీతిప్రవీణులు ♦ గాంచునట్టి ।
క్లేశములనెల్లఁ గాంతురో ♦ క్కింతయేని ।
సందియములేదు కష్టము ♦ సమము రెంట ॥ 3 ॥

అయినను, దురాత్ముఁడు చాణక్యవటువు-

దౌవారికుఁడు- (సమీపించి) జయము గొనుఁగాక.

రాక్ష- అభిసంధానమునకు శక్యుఁడగును-

దౌవారికుఁడు - అమాత్యుఁడు.

రాక్ష- (ఎడమకన్నదరుటను సూచించుచు, తనలో) "చాణక్యవటువు జయము గొనుఁగాక, అభిసంధానమునకు శక్యుఁడగును అమాత్యుఁడు" అని వాగ్దేవత ప్రస్తావగతయై యెడమకన్నదరుటచేత నాయర్థమును సూచించుచున్నది. అయినను, ఉద్యమమునువిడువరాదు (పయికి) భద్రా! ఏమో చెప్పఁగోరుచున్నావు.

దౌవా- అమాత్య! కరభకుఁడు పాటలిపుత్రమునుండివచ్చినవాఁడు! అమాత్యునిఁ జూడఁగోరుచున్నాఁడు.

రాక్ష- వానిఁ దోడితెమ్ము.

దౌవా- చిత్తము. (వెళ్లి పురుషునిఁ జేరి) ఇదిగో, అమాత్యరాక్షసుఁడు గూర్చున్నాఁడు- సమీపింపుము- (తాను వెళ్లిపోవును)

కరభకుఁడు - (రాక్షసుం జేరి) అమాత్యునకు జయము, జయము

రాక్ష- (నాట్యము చేఁజూచి) భద్రా, కరభక! స్వాగతము- కూర్చుండుము.

కర- చిత్తము. (భూమిపైఁ గూర్చుండును.)

రాక్ష- (తనలో) నాయీచారు నేప్రయోజనముఁగూర్చి పంపించితినో ప్రయోజన బాహుళ్యముంబట్టి తలఁపునకు రాకున్నది. (అని చింతను నటించును.)

వేత్రపాణి- (మఱియొక పురుషుఁడంతఁ బ్రవేశించి) అయ్యా! తొలఁగుఁడు! తొలఁగుఁడు. దూరముగాఁ దొలఁగుఁడు. చూడరాయేమి?

క॥ పున్నెముచేయనిచో సం।
పన్నుల స్వర్పతుల భూమి ♦ పతులను ధరలో।
సన్నిధిమాట యటుండఁగఁ।
గన్నులఁగను భాగ్యమేనిఁ ♦ గలుగదుగాదే॥ 4॥

(ఆకాశమందుఁజూచి) అయ్యా! ఏమనుచున్నారు? ఎందునిమిత్తము తొలఁగించుచున్నావనుచున్నారా? అయ్యా! కుమారమలయకేతుఁడమాత్యరాక్షసునకుఁ దలనొప్పివచ్చినదని విని చూచుటకిట్లే వచ్చుచున్నాఁడు. ఈకారణముచే నపసారణ గావింపఁబడుచున్నది. (అని వెళ్లును.)

మలయకేతుఁడు (భాగురాయణుఁడును, కంచుకియును వెంటరాఁగాఁ బ్రవేశించును. నిట్టూర్పుతో, తనలో) తండ్రి చని పోయి యిప్పటికి పదిమాసములయినవి. పురుషులను పేరు వృథాగాఁ దాల్చియున్న మేము తర్పణమయినను విడువలేము- లేక, పూర్వము నేనిట్లు ప్రతిజ్ఞ చేసియున్నాను.

మ॥ మణికటకాళి చిట్లునటు ♦ మాటికి ఱొమ్ములు బాదుకొంచు న।
మ్మునఁబడి మాయయుంగురులు ♦ పుట్టముజాఱఁగ, జాలిపుట్ట హా।

యని విలపించు మాతృజన ♦ ముందినయాదశ శత్రుకాంతలం।
బనిపి యనంతరంబున ని ♦ వాపజలంబుల నిత్తుఁ దండ్రికిన్॥ 5॥

కనుక నిఁకఁ బెక్కులేల?

క॥ వీరానురూపముగనని।
దోర జనకుచనినత్రోవ ♦ ద్రొక్కుటో జననీ।
వార నయనోదకంబులు।
వైరిసతీనేత్రములకుఁ ♦ బఱచుటో వలయున్॥ 6॥

(పయికి) అయ్యా! జాజలీ! నావెంబడివచ్చు రాజులతో నామాటలుగా నిట్లు చెప్పుము. "అమాత్యరాక్షసునకుఁ దలవనితలంపుగా నేనొక్కఁడనే వెళ్లి ప్రీతిఁగలిగించుట కిచ్ఛయించుచున్నాను. కనుక ననుగమనక్లేశమక్కఱలేదు." అని.

కంచుకి- కుమారుని చిత్తము. (పరిక్రమించి, ఆకాశమందు) ఓయో రాజులార! కుమారుఁడిట్లాజ్ఞాపించుచున్నాఁడు. "నాతోనెవ్వరును రానక్కఱలే"దని. (చూచి, హర్షముతో) కుమార, కుమార! మీయాజ్ఞ వినఁగానే యీరాజులందఱును మరలిపోయిరి.

ఉ॥ కక్కులకళ్లెముల్ చొనిపి ♦ గట్టిగ లాగుట నిక్కు కంధరల్।
మిక్కిలి సుక్కు డెక్కలను ♦ మింటినిఁ జీల్చెడునట్లుగా ననొ।
జక్కులఁ గొందఱాపిరి; గ ♦ జంబులఁ ద్రిప్పిరి గంటనాదముల్।
చిక్కఁగ వేగమాపుట; వ ♦ శీకృతులీశులు నీదునాజ్ఞకున్॥ 7॥

మలయ- అయ్యా! జాజలీ! నీవును సపరిజనముగా వెనుకకు వెళ్లుము. భాగురాయణుఁడొక్కఁడే నాతోవచ్చును

కంచుకి- కుమారుని చిత్తము. (సపరిజనముగా నిష్క్రమించును)

మలయ- సఖుఁడా, భాగురాయణ! ఇక్కడకువచ్చిన భద్రభటప్రముఖులు నాకిట్లు విన్నవించిరి. "ఆశ్రయణీయుఁడయిన కుమారుని మేము, అమాత్యరాక్షసుని మూలముగా నాశ్రయించుటలేదు.

మఱి, కుమారుని సేనాపతి శిఖరసేనుని ద్వారముగా దుష్టామాత్య పరిగృహీతుఁడయిన చంద్రగుప్తునిపట్ల నపరక్తులమయి, యభిరామ గుణశోభితుఁడగుటచే నాశ్రయణీయుఁడయిన కుమారు నాశ్రయించుచున్నాము." అని; ఎంతచింతించినను వారివాక్యములకర్థము నాకవగతము కాలేదు.

భాగు- కుమార ఇందలియర్థ మత్యంతదుర్బోధముగాదు. జయేచ్ఛాశీలుని, ఆత్మగుణసంపన్నుని, ఆశ్రయింపఁబడఁదగిన యాతనిని, ప్రియహితజనద్వారమున నాశ్రయించుచున్నామని భావము. ఇది న్యాయమే.

మలయ- సఖుఁడా, భాగురాయణ! అమాత్యరాక్షసుఁడు మాకుఁ బ్రియతముఁడును, హితతముఁడునుగదా!

భాగు- కుమార! అట్లుకావచ్చును. కాని, అమాత్యరాక్షసునికి వైరము చాణక్యునియందే. చంద్రగుప్తునియందు లేదు. అందుచేత నొకవేళఁ జంద్రగుప్తుఁడు జయగర్వితుఁడయిన చాణక్యుని సహింపక మంత్రిపదవినుండి తొలఁగింపవచ్చును. అపుడు నందకులమందలి భక్తిచేత, రాక్షసుఁడు, చంద్రగుప్తుని, నందాన్వయజాతుఁడని యెంచి, సుహృజ్జనప్రార్థనముచేతఁజంద్రగుప్తునుసంధింపవచ్చును. చంద్రగుప్తుఁడును రాక్షసుని బితృపారంపర్యాగతుఁడేయని యెంచి సంధినంగీకరింపవచ్చును. ఇట్లయినపుడు కుమారుఁడు మమ్ముఁగూడ నమ్మఁడని వీరివాక్యార్థము.

మల- సఖా, భాగురాయణ! అమాత్యరాక్షసుని యింటికి మార్గము గనఁబఱుపుము.

భాగు- కుమార! ఇటు! ఇటు. (ఇద్దఱును నడుతురు). కుమార! ఇది యమాత్యరాక్షసునిల్లు. ప్రవేశింపుము.

మల- ఇదిగో, ప్రవేశించుచున్నాను.

ఇద్దఱు- (ప్రవేశమునటింతురు).

రాక్ష- (తనలో) ఆ! జ్ఞప్తికివచ్చినది. (పయికి) భద్రా! కుసుమపురమందు వైతాళికుఁడు స్తనకలశునిఁ జూచితివా?

కర- చూచితిని.

మలయ- సఖా! భాగురాయణ! కుసుమపురవృత్తాంతముఁ బ్రస్తావించుచున్నాఁడు. చెంతఁజేరకయే విందము.

గీ॥ అర్థముల్ విశదమ్ముగా ♦ నట్లు స్వైర
భాషణంబులు పలుకంగ ♦ వలయుపట్ల
వేఱుగావిన్నవింతురు ♦ విభులయొద్ద
సత్వభంగభయంబున ♦ సచివవరులు ॥ 8 ॥

భాగు- కుమారుఁడాజ్ఞాపించినట్లే.

రాక్ష- భద్రా! ఆకార్యము సిద్ధించినదా?

కర- అమాత్యుల ప్రసాదముచేత సిద్ధించినది.

మలయ- సఖా! భాగురాయణ! ఆకార్యమేదో?

భాగు- కుమార! సచివవృత్తాంతము గహనముగదా! ఇంకను బరిచ్ఛేదింప శక్యముగాదు. అవహితుఁడవయి వినుము.

రాక్ష- భద్రా! సవిస్తరముగా వినఁగోరుచున్నాను.

కర- అమాత్యులు వినఁదగును. మీరు నాకిట్లాజ్ఞాపించియున్నవారు. "స్తనకలశునితో నామాటలుగా నిట్లు చెప్పుము. చాణక్యుఁడాజ్ఞాభంగములు గావించుచుండఁగాఁ జంద్రగుప్తునకెట్లు కోపము నుద్దీపింపఁగలవో, అట్టిశ్లోకములచేత నాతనిస్తుతింపఁదగును." అని.

రాక్ష- భద్రా! తరువాత, తరువాత?

కర- తరువాతనేను బాటలిపుత్రమునకేగి వైతాళికుఁడు స్తనకలశున కమాత్యసందేశము నెఱిఁగించితిని. ఈలోఁగా, నందకులవినాశముచే దుఃఖితమయిన పౌరజనమునకుఁ బరితోషము గలిగింపఁ

గోరి రాజుగారు కౌముదీమహోత్సవముఁ జాటింపించిరి. చిరకాలము నుండి జరుగుచున్నదియు, మున్ననుభవించినదియు నగు నా మహోత్సవము, అభిమతఘనసమాగమమువలె నాగరజనులు గౌరవించునది.

రాక్ష- (కన్నీటితో) హా! దేవ! నంద.

క॥ కుముదానందుఁడు చంద్రుం
డమరియు నృపచంద్ర! త్రిభువన ♦ నానందకరో
ద్యముఁ డీవు లేని కౌముది
రమణించునె సుంతయే, ధ ♦ రాతలమందున్ ॥ 9 ॥

కర- తరువాత, లోకలోచనానందకరమయిన యాయుత్సవము నిచ్చగింపక చాణక్యహతకుఁడు నివారించెను. అంతట స్తనకలశుఁడు చంద్రగుప్తసముత్తేజకయయిన శ్లోకపరిపాటిం బాడెను.

రాక్ష- అదియెట్టిది.

కర- సీ॥ కమలసంభవుఁడేమి ♦ కారణమరసియో

(ఇత్యాది 3 అంకము, 22, 23 పద్యములు చదువును.)

చాణ- (హర్షముతో) సెబాసు, స్తనకలశా! సెబాసు. కాలమందు భేదబీజము నాటఁబడి యవశ్యముగా ఫలమును గాంచఁగలదు. ఏమా?

క॥ ప్రాకృతుఁడును గ్రీడాహే
వాకచ్ఛేదనమునోరు ♦ వన్సైపఁడుగా ।
లోకాతిగధాముఁడు పృథి
వీకాంతుండెట్టులోర్చు ♦ విచ్ఛేదంబున్ ॥ 10 ॥

మలయ- (తనలో) ఇదియిట్లే!

రాక్ష- తరువాత?

కర- తరువాతఁ దనయాజ్ఞకు భంగమువలనఁ గలుషితుఁడైన చంద్రగుప్తుఁడు ప్రసంగవశమున నమాత్యునిగుణములఁ బ్రశంసించెను. ప్రశంసించి చాణక్యహతకుని యధికారమునుండి తొలఁగించెను.

మలయ- సఖా, భాగురాయణ! గుణప్రశంసచేత రాక్షసుని యందుఁ జంద్రగుప్తునకుఁగల భక్తి పక్షపాతము సూచింపఁబడ్డది.

భాగు- గుణప్రశంసకంటెఁ జాణక్యుని నిరాకరించుటచేత సూచింపఁబడ్డది.

రాక్ష- చాణక్యునిమీఁదఁ జంద్రగుప్తునికోపమునకుఁ గారణము కౌముదీమహోత్సవప్రతిషేధమొక్కటేయా, ఇతరముగూడఁగలదా?

మలయ- సఖా! చంద్రగుప్తునికోపమున కితరకారణముఁ గూడఁ దెలిసికొనుటచేత నితఁడు కనిపెట్టుఫలమేమి?

భాగు- కుమార! చాణక్యుఁడు మతిమంతుఁడు. నిష్ప్రయోజనముగాఁ జంద్రగుప్తునిఁ గోపింపఁజేయఁడు. చంద్రగుప్తుఁడును మేలుమఱువనివాఁడు. ఈస్వల్పాంశమునకు గౌరవమునుల్లంఘింపఁడు. కాఁగా, చాణక్య చంద్రగుప్తులకు ఏదో మహాకారణమువలనఁ గలిగిన యీభేదమెడ తెగసిదిగా నుండఁగలదని

కరభ- చాణక్యునిమీఁదఁ జంద్రగుప్తునికోపమున కితరకారణముఁగూడఁ గలదు.

చాణ- ఏదేది?

కర- కుమారమలయకేతుఁడును, అమాత్యరాక్షసుఁడును, తప్పించుకొనిపోవుచుండఁగా నతఁడుపేక్షించినాఁడని.

రాక్ష- (హర్షముతో) సఖా శకటదాస! చంద్రగుప్తుఁడింక నాచేతఁ జిక్కఁగలఁడు. ఇపుడు చందనదాసుఁడు బందికానానుండి విముక్తుఁడగును. నీకును దారపుత్రులతో సమాగమము చేకుఱును. జీవసిద్ధి మొదలగువారి క్లేశము నశించును.

భాగు- (తనలో) సత్యము, జీవసిద్ధి క్లేశము నశించినది.

మలయ- సఖా! భాగురాయణ! "చంద్రగుప్తుఁడింక నాచేతఁ జిక్కఁగలఁడు." అని పలికినాఁడు. అతని యభిప్రాయమేమి?

భాగు- ఇతర మేమున్నది? చాణక్యునిచేత విడిచిపెట్టఁబడిన చంద్రగుప్తు నున్మూలించుటవలనఁ దనకుఁ గించిత్కార్యమును లేదని కనిపెట్టుచున్నాఁడు.

రాక్ష- భద్ర! అధికారమునుండి తొలఁగింపఁబడ్డ యావటుఁ డిపు డెక్కడనున్నాఁడు?

కర- ఆపాటలిపుత్రమందె యున్నాఁడు.

రాక్ష- (ఆవేగముతో) భద్ర! అక్కడనే యున్నాఁడా? తపోవనమునకు వెళ్ళలేదా? మఱలఁ బ్రతిజ్ఞనైనఁ గావింపలేదా?

కర- అమాత్య! తపోవనమునకు వెళ్లునని విన్నాను.

రాక్ష- (ఆవేగముతో) శకటదాస! ఇది జరుగదు. చూడు.

గీ॥ అవని వాసవుఁడినుఁడు త ♦ న్నగ్రపీఠిఁ ।
బాపి దివిచిన నికృతిని ♦ సైఁపఁడయ్యెఁ ।
దాను నృపుఁ జేసె మౌర్యు, న ♦ తండుసేయు ।
నిట్టి యవమానము మనస్వి ♦ యెటుసహించు? ॥ 11 ॥

మలయ- సఖా, భాగురాయణ! చాణక్యుఁడు తపోవనమునకు వెళ్ళుటవలనఁగాని లేక మరల ప్రతిజ్ఞ చేయుటవలనఁగాని యితనికి సిద్ధించునర్థమేది?

భాగు- కుమార! ఇది యంతగాఁ దెలియని విషయము గాదు. ఎంతెంతవఱకు చాణక్యహతకుఁడు చంద్రగుప్తునికి దూరమగునో, అంతంతదాఁక రాక్షసునకర్థసిద్ధి కలుగును.

శకట- అమాత్య! అత్యంతసందేహమక్కఱలేదు. ఇది పొసఁగియేయున్నది. చూడు.

మ॥ ప్రణత క్ష్మాధవమౌళిరత్న శశభృ ♦ త్ప్రత్యగ్రభాంచచ్ఛిరో ।
వినివిష్టాంఘ్రి మురాత్మజుండు పనుపుర్ ♦ భృత్యుల్ నిజుల్ మీఱ సైఁ
పునే? చాణక్యుఁడుపట్టు నెగ్గినను దాఁ ♦ బూర్వాభిచారక్రమం ।
బనుభూతంబిఁకఁ బట్టఁడే ప్రతినఁ గ్రో ♦ ధావిష్టుఁడై యుండి యుక్ ॥

రాక్ష- సఖా, శకటదాస! అవును. నిజమే. ఇఁక వెళ్లుము. కరభకుని విశ్రమింపఁ జేయుము.

శకట- చిత్తము. (కరభకునితో వెళ్ళును.)

రాక్ష- నేను కుమారునిఁ జూడఁగోరుచున్నాను.

మలయ- (సమీపించి) ఆర్యులను జూచుటకు నేనే వచ్చినాను.

రాక్ష- (నాట్యముచేఁజూచి) ఓహో! కుమారుఁడే వచ్చినాఁడు. (ఆసనమునుండి లేచి) ఇదిగో, ఆసనము. కుమారుఁడు కూర్చుండవలయును.

మలయ- ఇదిగో! కూర్చుండును. ఆర్యులు కూర్చుండవలయును.

ఇద్దఱు- (కూర్చుండురు)

మలయ- ఆర్యా! తలనొప్పితగ్గినదా?

రాక్ష- కుమారశబ్దస్థానమందధిరాజశబ్దము నీకులభింపకుండఁ దలనొప్పి తగ్గుట యెట్లు.

మలయ- ఆర్యులు స్వయముగాఁ దలపెట్టిన యిది దుర్లభము కాదు. ఇట్లుబలములను బ్రోవుచేసికొనియున్నను మనమింక నెంత కాలముదాఁక శత్రువ్యసనమును నిరీక్షించియుండవలయును?

రాక్ష- కాలహరణమున కిపుడును అవకాశ మెక్కడిది. విజయముకొఱకుఁ దరలుము.

మలయ- ఆర్య! శత్రువ్యసన మేమైనఁ దెలిసినదా?

రాక్ష- నిశ్చయముగాఁ దెలిసినది.

మలయ- అది యేది?

రాక్ష- సచివవ్యసనము- అన్యముగాదు. చంద్రగుప్తునుండి చాణక్యుఁడు విడిపోయినాఁడు.

మలయ-అమాత్య! అందుచేత సచివవ్యసన మిదియొక వ్యసనముగాదు.

రాక్ష- కుమార! ఇతరులయిన రాజులకు సచివవ్యసనమొక వేళ వ్యసనముగాక పోవచ్చును. చంద్రగుప్తునకు మాత్ర మట్లు కాదు.

మలయ- విశేషించి చంద్రగుప్తునకుఁగాదు.

రాక్ష- చంద్రగుప్తుని కమాత్యవ్యసనము వ్యసనముగాక పోవు టెట్లు?

మలయ- చంద్రగుప్తుని ప్రజలకు విరాగహేతువులు చాణక్యుని దోషములే. మొదటినుండియు వారు చంద్రగుప్తునియం దనురక్తులే. చాణక్యునిఁదొలఁగింపఁగా నిపుడధికానురాగముఁ జూపుదురు.

రాక్ష- కుమార! ఇదియిట్లుకాదు. ప్రజలు రెండువిధముల వారు. చంద్రగుప్తసహోత్థాయులు, నందకులానురక్తులు, నని. అందుఁ జంద్రగుప్తసహోత్థాయులయిన ప్రజలకు మాత్రమే చాణక్యదోషములు విరాగహేతువులు. నందకులానురక్తులకుఁగావు. వారు, తమకుఁ బితృకులసమానమయిన నందకులమంతయుఁ గృతఘ్నుఁడయిన యీచాణక్యునిచేత సంహరింపఁబడ్డదని విరాగక్రోధములంజేసి ద్వేషించియు, స్వాశ్రయములభింపమింజేసి చంద్రగుప్తు ననువర్తింతురు. మఱి, నీవలెఁ బ్రతిపక్షోన్మూలనమందు నిశ్చితసామర్థ్యముగలిగి మాఱ్కొనువారు ప్రార్థింపఁగా వెంటనే చంద్రగుప్తునివీడి నిన్నను వర్తింతురు. కుమార! ఇందుకు మేమే నిదర్శనము.

మలయ- అమాత్య! చంద్రగుప్తుని జయించుటకుఁ గారణము మంత్రివియోగమొక్కటియేనా; లేక ఇతరమునుగలదా?

రాక్ష- కుమార! ఇతరములనేకములతోనేమి? అందిది ప్రధానతమము.

మలయ- అమాత్య! ప్రధానతమమనఁగానేమి? చంద్రగుప్తుఁడు రాజ్యకార్యభారము మఱియొకమంత్రిపయినిబెట్టి కాని, తానుస్వయముగానే వహించి కాని, యెదురుకొనుటకు సమర్థుఁడుగాఁడా?

రాక్ష- నిశ్చయముగా సమర్థుఁడుగాఁడు.

మలయ- కారణమేమి?

రాక్ష- స్వాయత్తసిద్ధులయినను, లేక యుభయాయత్తసిద్ధులయినను, అట్టిభూమిపాలురకొకవేళ శత్రులనెదుర్కొను సామర్థ్యము

సంభవింపవచ్చును. కాని, చంద్రగుప్తునకుమాత్రము సంభవింపదు. దురాత్ముఁడు చంద్రగుప్తుఁడు సర్వదా సచివాయత్తసిద్ధియందే వర్తించుచుఁ గన్నులులేనివానివలెనే యప్రత్యక్షసర్వలోకవ్యవహారుఁడయి యున్నవాఁడు. న్యాయముగా శత్రువుల నెదుర్కొనుటకు సమర్థుఁడెట్లగును. ఏమా?

గీ॥ ఉన్నతులగు ప్రధానుపై ♦ నొక్కపదము
రాజుపయినొకపదముంచి ♦ రాజ్యలక్ష్మి
స్త్రీస్వభావతిబరువోర్వఁ ♦ జెంగియొకనిఁ
గూడుకొని వానితోడను ♦ గూలుఁగాదె ॥ 13 ॥

మఱియు గీ॥ ఉర్విపుఁడదృష్టలోకక్రి ♦ యుండు, మంద
బుద్ధి, రాజ్యంబునుస్ సచి ♦ వుపయిఁబెట్టి
పాలుగుడుచు శిశువు గుబ్బఁ ♦ బగిదివిడువ
జాలఁడొక్కక్షణంబేని ♦ సచివుఁదాను ॥ 14 ॥

మలయ- (తనలో) భాగ్యవశమున నేను సచివాధీనుఁడను గాను. (పయికి) అమాత్య! ముట్టడి ఫలింపఁగల కారణములనేకము లున్నను సచివవ్యసనముఁ గారణముగాఁ జేసికొని శత్రునిముట్టడించు వానికి సిద్ధినిశ్చయముకాజాలదు.

రాక్ష- కుమార! సిద్ధినిశ్చయమనియే తెలిసికొమ్ము. ఎందువలననా?

మ॥ బలవత్సైన్యుఁడవీవు యోధవయిన ♦ ద్వన్ సేన; నందానుర
క్తులుగాఁ బౌరులు; విష్ణుగుప్తుని నిజో ♦ ద్యోగచ్యుతుం జేయఁగా;
నలమౌర్యుండు నవీనభూమిపతిగా; ♦ నస్మత్సహాయంబునుం
గలుగంగాన్నృప! (అని లజ్జనటించును.)
నీదునాజ్ఞ యిపుడొ ♦ క్కండేవలెన్ సిద్ధికిన్ ॥ 15 ॥

మలయ- అమాత్య! ఇట్లుముట్టడింపఁదగిన కాలమని యమాత్యుఁడెంచెనేని యిఁకనాలస్యమెందుకు? చూడు.

సీ॥ ఉత్తుంగతరమూర్తు ♦ లుత్తుంగకూలంబుఁ
బ్రసృతిమదవారి ♦ భాసురములు
ప్రస్యందివారి ప్ర ♦ వాహంబు, శ్యామముల్
శ్యామోపకంఠ భూ ♦ జాతచయము
షట్పదసంతతి ♦ ఝుంకారముఖరముల్
కల్లోల నవమాలి ♦ కాముఖరము
దంతవప్రక్రియా ♦ దారితతటములు
స్రోతోమహావేగ ♦ ఖాతతటము
గీ॥ నాదువిఖ్యాత వేదండ ♦ నాయకములు
సురుచి సిందూరశోణముల్ ♦ శోణనదము
ననువుగాఁ జేరుచు శతస్న ♦ హస్రములుగ
గ్రుక్కఁగొనఁజాలు నెంతయు ♦ నుక్కుమీఱి ॥ 16 ॥

మఱియు క॥ ఉఱుములవలె గర్జనముల
నురువర్షాసారసమమ ♦ దోదక చయశీ
కరము లఁగురియుచు నాకరు
లరికట్టుంబురిని వింధ్య ♦ మంబుదములునాన్ ॥ 17 ॥

(అని భాగురాయణుఁడును దానును వెళ్లును.)

రాక్ష- ఓరీ! ఎవఁడురా యిక్కడ?

పురుషుఁడు- (ప్రవేశించి) అమాత్యుల సెల వేమి ?

రాక్ష- ప్రియంవదక! సాంవత్సరికులలో నెవరు ద్వారమందున్నారో తెలిసికొమ్ము.

ప్రియం- చిత్తము. (వెళ్లి, క్షపణకునిఁజూచి, తిరిగివచ్చి) అమాత్య! సాంవత్సరికుఁడు క్షపణకుఁడున్నాఁడు.

రాక్ష- (తనలో, అవశకునమును సూచించుకొని) మొదటనే క్షపణకదర్శనమా ?

ప్రియం- జీవసిద్ధి.

రాక్ష- మంచి వేషము వేయించి ప్రవేశపెట్టుము.

ప్రియం- చిత్తము.

క్షపణకుఁడు- (అంతటఁ బ్రవేశించును.)

క॥ ఒక క్షణము కటుక మా క్షప
ణక శాసన భేషజంబు ♦ నన్ విడు మోహా
ప్తికరవ్యాధులు గావున
సకలజనులు దాని సేవ ♦ సలుపఁగవలయున్ ॥ 18 ॥

(సమీపించి) ధర్మలాభము, ఉపాసక! కలుగుఁగాక.

రాక్ష- భదంత! మాప్రస్థానమునకు యోగ్యమయిన దివసము నిరూపింపుము.

క్షప- (నాట్యముచే నాలోచించి) ఉపాసక! నిరూపించితిని. మధ్యాహ్నము మొదలు శకలము లేదుదాటినతరువాత, సంపూర్ణ చంద్ర, పౌర్ణమాసి, శోభనమైనతిథి. ఉత్తరదిశనుండి దక్షిణదిశకుఁ బ్రస్థితులగుమీకు నక్షత్రము దక్షిణద్వారికము.

గీ॥ సూరుఁడస్తమునకుఁ ♦ జొరఁగఁ జంద్రుండు సం
పూర్ణమండలమునఁ ♦ బొడువఁ గేతు
వుదయమస్తమయము ♦ నొందఁగ బుధలగ్న
గమనమున ఘటించుఁ ♦ గార్యసిద్ధి ॥ 19 ॥

రాక్ష- భదంత! తిథియేయిందు శుద్ధముగాదు.

క్షప- శ్రావక:

గీ॥ ఏకగుణమెన్నఁగాఁ దిథి ♦ కెనయుననుచు
గనఁగనక్షత్రమది చతు ♦ ర్గుణమటంచు
లలిఁ జతుష్షష్టిగుణ మెన్న ♦ లగ్నమనుచు
దర్శితము జ్యౌతిషంపు సి ♦ ద్ధాంతమందు ॥ 20 ॥

క॥ వరలగ్నమునఁగలు గ్రహ
పరిహార మొనర్పఁగలవు ♦ పడయఁగలవు సు
స్థిర దీర్ఘ లాభమును చం
ద్రునిబలమున నరుగుచున్న ♦ దొరకును శుభముల్ ॥ 21 ॥

రాక్ష-క్షపణక, ఇతరులయిన జ్యోతిషికులతోఁగూడ నాలోచింపుము.

క్షప- ఉపాసకుఁడాలోచించుఁగాక, నేనునిజగృహమునకు వెళ్లెదను.

రాక్ష- మాకిపుడు భదంతకోపము ప్రాపింపలేదుగద.

క్షప- భదంతకోపము ప్రాపింపలేదు.

రాక్ష- మఱియేది ప్రాపించినది.

క్షప-భగవత్కృతాంతకోపము. ఆత్మపక్షమును విడిచి పరపక్షముఁ బ్రమాణీకరించుచున్నావు. (అని వెడలును.)

రాక్ష- ప్రియంవదక! ఇపుడు వేళ యేదో తెలియుము.

ప్రియం- చిత్తము. (వెళ్ళి, వచ్చి) భగవత్సూర్యుఁడర్థము-అస్తమునభిలషించుచున్నాఁడు.

రాక్ష- (లేచి, చూచి) ఓహో! భగవానుఁడు భాస్కరుఁడస్తమభిలషించుచున్నాఁడు. ఇపుడు-

చ॥ రవియుదయింపనాక్షణము ♦ రక్తములైవని చెట్లుచాయలన్ ।
దవులకునేగి వేమరలు ♦ దగ్గఱ, కాతఁడు పశ్చిమాశకుం ।
దివిరి చనంగ మార్గమగము ♦ దీరుచుఁ; గొల్చెడు సేవకాళి భూ ।
ధవుని నిరస్తవైభవుని ♦ దామును నిట్లె త్యజించునేమొకో ॥ 22

అందఱు- (వెళ్లుదురు.)

ఇది పాలెపు వేంకటసూర్యగోపాల ప్రధానాంధ్రీకృత
ముద్రారాక్షస నాటకమునఁ జతుర్థాంకము.

ముద్రారాక్షసము-పంచమాంకము.

సిద్ధార్థకుఁడు- (లేఖమును, ముద్రాంకితమయిన నగలపెట్టెను, చేతఁబట్టుకొని ప్రవేశించును.) ఆశ్చర్యమాశ్చర్యము!

గీ॥ దేశకాలఘటంబుల ♦ ధీవిశేష ।
నార సంసిచ్యమాన చా ♦ ణక్యనీతి ।
కల్పవల్లిక గాన్పింపఁ ♦ గలదు శీఘ్ర ।
కాలమందునె గుఱుకము ♦ కార్యఫలము ॥ 1 ॥

ఆర్యచాణక్యుఁడు మొదట వ్రాయించి, యమాత్యరాక్షసుని సికాముద్రించిన లేఖమును, ఆసికాతో నేముద్రించిన నగలపెట్టెయుఁ బట్టుకొనియున్నాను. పాటలిపుత్రమునకని బయలుదేరినానుగదా! కనుక నడచెదను. (నడచి, చూచి) క్షపణకుఁడెదురైనాఁడేమి? ఇతని దర్శనము నాకవశకునమువంటిది. కనుక సూర్యదర్శనముచేసి యిది పరిహరించుకొందును.

క్షపణకుఁడు- (అంతఁ బ్రవేశించును.)

క॥ ప్రాకటగంభీరమతిన్ ।
లోకోత్తరమార్గముల వి ♦ లోకింతురు సి ।
ద్ధైకపరాయణులర్హతు ।
లైకాంతికభక్తి వారి ♦ నారాధింతున్ ॥ 2 ॥

సిద్ధా-భదంత! ప్రణమిల్లుచున్నాను.

క్షప- ఉపాసక! నీకు ధర్మలాభమగుఁగాక. (చూచి) ఉపాసక! ప్రయాణసన్నాహముతో నున్నట్లు కనుపడుచున్నావు.

సిద్ధా— భదంతుని కెట్లు తెలిసినది?

క్షప— (నవ్వి) తెలియుట కేమున్నది? నీయీప్రయాణ యోగ్య ముహూర్తమును, చేతిలేఖయునుఁ దెలుపుచున్నవి

సిద్ధా— భదంతా! దేశాంతరమునకుఁ బయలుదేరినానని నీకుఁ దెలిసినది. ఈదిన మెట్టిదో చెప్పుము.

క్షప— (నవ్వి) ఉపాసక! తలగొఱిగించుకొని నక్షత్రము నడుగుచున్నావు.

సిద్ధా— భదంతా! ఇపుడయిన మించిపోలేదు కనుకఁ జెప్పుము. నాకనుకూలమయ్యెనా వెళ్ళెదను. లేకున్న మానెదను.

క్షప— మలయకేతుకటకమునుండి, ముద్రలేకుండ ఉపాసకులకు, అనుకూలమయినను గాకున్నను, వెళ్లుటకు వీలులేదు.

సిద్ధా— భదంత! ఇది యెట్లు? చెప్పుము.

క్షప— ఉపాసక! విను. మలయకేతుకటకమునుండి రాకపోకలకు లోకులకు మొదట నాటంకము లేకుండెడిది. ఇపుడు పాటలిపుత్రము చేరువకు వచ్చుటచేత, ముద్రలేనివాఁడెవ్వఁడును వెళ్ళుటకుఁగాని, ప్రవేశించుటకుఁగాని, అనుమోదింపఁబడఁడు. భాగురాయణుని ముద్రాలాంఛనముగలదేని నిర్భయముగా వెళ్ళుము. అదిలేనిచో నిరుత్సాహుఁడవయి యుండిపొమ్ము. గుల్మస్థానాధికృతులచేతఁ గాలుసేతులు కట్టి రాజకులమునకుఁ దీసికొనిపోఁబడకు.

సిద్ధా— భదంత! అమాత్యరాక్షసుని కేళికరుఁడు, నికటవర్తి సిద్ధార్థకుఁడని నన్నెఱుఁగవా? కనుక ముద్రలేకున్నను వెళ్ళుచున్న నన్నడ్డగించుటకు శక్తుఁడెవఁడు?

క్షప— ఉపాసక! రాక్షసునియొద్దనైనను, పిశాచమునొద్దనైనను కేళికరుఁడవు గమ్ము. ముద్రలేకుండ మాత్రము కుసుమపురమునకు రాకపోకలు లేవు.

సిద్ధా— భదంత! కోపింపకుము. నాకుఁ గార్యసిద్ధి కాఁగలదని చెప్పుము.

క్షప— ఉపాసక! వెళ్ళుము, నీకుఁ గార్యసిద్ధి కాఁగలదు.

ఇద్దఱు— (నిష్క్రమింతురు.)

(ప్రవేశకము.)

భాగురాయణుఁడు— (పురుషుఁడొకఁడు వెంటరాఁగాఁ బ్రవేశించును. తనలో) ఓహో! ఆర్యచాణక్యుని నీతియొక్క వైచిత్ర్యము

సీ॥ ఒనర మాటికిని ల ♦ క్ష్యోద్భేదయగుచు నా
పై నెన్న నధిగమా ♦ భావమునను।
గహనమై తోఁచుచుఁ ♦ గన మాటిమాటికిఁ
బూర్ణాంగములతోడఁ ♦ బొడవుసూపు।
చుంబైనిఁ గార్యవ ♦ శంబుపొందెను మాటి
కతికృశయుంబోలె ♦ నగపడుచును।
సారెసారెకును భ్ర ♦ శ్యద్బీజయగుచుండు
దకును బహుప్రాపి ♦ తఫలయగుచుఁ।
గీ॥ జిత్రరూపములను ♦ జెంది కానఁగనౌన।
యారె! నియతివలె న ♦ యజ్ఞజనుల।
నీతి, నాటకముల ♦ ఖ్యాతవృత్తమునాఁగఁ।
దెలియఁబడదయాడి ♦ తీరుదాక ॥ 3 ॥

(పయికి) భద్రా, భాసురక! కుమారుఁడు నన్నుఁ దనకు దగ్గఱగానుండఁ గోరుచున్నాఁడు. కనుక నీయాస్థానమండపమందే యాసనముఁ బెట్టఁదగును.

పురుషుఁడు— ఇదిగో, ఆసనము. ఆర్యులు కూర్చుండవచ్చును.

భాగు— (కూర్చుండి) భద్రా, భాసురక! ఎవఁడో ముద్రఁ గొనుటకు నన్నుఁ జూడఁగోరుచున్నాఁడు. వానిం బ్రవేశపెట్టుము.

పురు— చిత్తము. (వెళ్ళును.)

భాగు- (తనలో) కష్టము. ఈగతిని మాయందు బద్ధస్నేహుఁడయిన కుమారుని మోసపెట్టుట యనునది, ఓహో, దుష్కరము. లేక-

చ॥ అలమెడు కీర్తిహాని కుల ♦ హానియు గౌరవహాని యింతయుం।
దలఁపక లజ్జవీడి ధన ♦ దాస్యముకై యొడలమ్ముకొన్న య।
త్తులువకు మంచిచెడ్డ లెదఁ ♦ దోఁప స్వతంత్రుఁడుగాక స్వామియా
జ్ఞలఁ దలఁదాల్చువానికి వి ♦ చారముతోఁ బనిలేదొకింతయున్।

మలయకేతుఁడు- (ప్రతీహారి వెంటరాఁగాఁ బ్రవేశించును. తనలో) ఓహో! రాక్షసునింగూర్చి సందేహము లెక్కువగుటచేత నాబుద్ధి యాకులీభూతమయి నిశ్చయమును బొందఁజాలకున్నది ఏమో?

చ॥ నలిఁ జాణక్యనిరాకృతున్ వృషలునిన్ ♦ నందాన్వయోద్భూతు ని
ష్కలనందాన్వయరూఢభక్తి మెయివా ♦ సంధించునో లేక ని।
శ్చలసంధుండయి భూరిభర్తనను సు ♦ స్థైర్యస్థితిం జేర్చునో।
తెలియం, గుమ్మరిసారెఁ బెట్టినటు నా ♦ ధీదిర్దిరం దిర్గెడున్॥ 5 ॥

(పయికి) విజయా! భాగురాయణుఁడెక్కడ?

ప్రతీహారి- కుమార! ఇదిగో! కటకమునుండి వెడలువారికను మతిముద్ర నిచ్చుటకయి కూర్చుండియున్నాఁడు.

మలయ- విజయా! కొంచెముసేపు కాలు గదల్పకుండుము. ఈలోఁగా వెనుకనుండి వెళ్లి చేతులతో నితనికన్నులు మూసెదను.

ప్రతీ- చిత్తము.

భాసు- (ప్రవేశించి) ఆర్య! అదిగో క్షపణకుఁడొకఁడుముద్రకొఱకు కార్యానిఁ జూడఁగోరుచున్నాఁడు.

భాగు- ప్రవేశపెట్టు.

భాసు- చిత్తము. (వెళ్లును.)

క్షపణకుఁడు- (ప్రవేశించి) ఉపాసకులకు ధర్మసిద్ధియగుఁగాక.

భాగు- (నాట్యముచేఁ జూచి, తనలో) ఓహో! రాక్షసునిమిత్రుఁడు జీవసిద్ధి! (పయికి) భదంత! రాక్షసునిప్రయోజనమే కొంచెముద్దేశించి వెళ్ళుచున్నావా?

క్షప- (చెవులుమూసికొని) పాపముశమించుఁగాక, శమించుఁగాక. రాక్షసనామముగాని, పిశాచనామముగాని వినఁబడనిచోటికే వెళ్లుచున్నాను.

భాగు- భదంత! నీమిత్రునిపట్లఁ బ్రణయకోపము బలీయముగానున్నదే; భదంతునిపట్ల రాక్షసుఁడు చేసిన యపరాధమేమి?

క్షప- ఉపాసక! నాపట్ల రాక్షసుఁడు చేసిన యపరాధమేమియు లేదు. మందభాగ్యుఁడనయిన నేను స్వయముగాఁ జేసినదానికే లజ్జించుచున్నాను.

భాగు- భదంత! నాకుఁ గుతూహలము హెచ్చించుచున్నావు. వినఁగోరుచున్నాను.

మలయ- (తనలో) నేనును.

క్షప- ఉపాసక! వినరాని దీనిని వినుటచే నేమి?

భాగు- భదంత! రహస్యమయ్యెనేని, పోనీ.

క్షప- ఉపాసక! రహస్యముగాదు. దారుణము.

భాగు- రహస్యముకానిచోఁ జెప్పు.

క్షప- రహస్యము కాకున్నను జెప్పను.

భాగు- నేను ముద్రనియ్యను.

క్షప- (తనలో) అడుగుచున్నాఁడు గనుక నిపుడు చెప్పుట యుక్తము. (పయికి) ఇఁక గతిలేదు. ఇదిగో, చెప్పుచున్నాను. ఉపాసకుఁడు వినఁదగును. నేను పాటలిపుత్రమందధివసించుచుండఁగా మందభాగ్యతచేత మొదట రాక్షసునితోఁ జెలిమి కలిగెను. అపుడు రాక్షసునిచే గూఢముగా విషకన్యాప్రయోగము గావింపఁబడి పర్వతేశ్వర మహారాజు ఘాతితుఁడయ్యెను.

మలయ- (కన్నీటితో, తనలో) ఏమీ? తాత, చాణక్యుని చేతఁగాదా, రాక్షసుని చేతనా ఘాతితుఁడు.

భాగు- తరువాత,

క్షప- తరువాత, నేను రాక్షసుని మిత్త్రమని యెంచి చాణక్య హతకుఁడు సనికారముగా నన్ను నగరమునుండి వెడలఁగొట్టించెను. ఇపుడయినను, అకార్యములనేకములు చేయుటకుఁ గుశలుఁడయిన రాక్షసుఁడట్టి దుష్కార్యమేదియే నారంభింపఁగలఁడు. దానిచేత నేను జీవలోకమునుండి వెడలింపఁబడుదును.

భాగు- భదంత! ఇచ్చుటకొప్పుకొన్న యర్థరాజ్యము నిచ్చుటకిచ్చగింపక చాణక్యహతకుఁడే యీదుష్కార్యమాచరించినాఁడనియు రాక్షసుఁడు గాఁడనియు మేము విన్నామే.

క్షప- (చెవులుమూసికొని) పాపము శమించుఁగాక! చాణక్యుఁడు విషకన్య పేరైన నెఱుఁగడు. దుష్టబుద్ధియైన యారాక్షసుని చేతనే యీయకార్యసిద్ధి గావింపఁబడినది.

భాగు- భదంత! ముద్రియిత్తును. వచ్చి కుమారునకు వినిపింపుము.

మలయ- (సమీపించి)

గీ॥ రిపునిఁగూర్చి సఖ సు ♦ హృద్భాషితమును శ్ర ।
వోవిదారణంబు ♦ నీవువింటి ।
చాలకాలమైన ♦ జనకవధవ్యథ ।
యినుమడించుచున్న ♦ దిపుడు దీన ॥ 6 ॥

క్షప- (తనలో) బాగు! మలయకేతుహతకుఁడు విన్నాఁడు. కృతార్థుఁడనైనాను. (అని వెళ్ళెను.)

మలయ- (ఎదురుగానున్నట్లు ఆకాశమువైపుచూచి) రాక్షసా ఇది చాలయుక్తము.

గీ॥ నమ్మి మిత్త్రమ్మటంచుఁ గా ♦ ర్యమ్ములెల్ల ।
నీవశముచేసి నిర్వృత ♦ భావుఁడైన ।
తాతఁ గూల్చితి బంధ్వశ్రు ♦ తతులతోడ ।
రాక్షస యథార్థముగ నీవు ♦ రాక్షసుఁడవు ॥ 7 ॥

భాగు- (తనలో) రాక్షసునిప్రాణములు కాపాడవలసినదని ఆర్యుల యాదేశముగదా. కనుక, ఇట్లు సమర్థించెదను. (పయికి) కుమార! ఆవేగము చాలింపుము. కూర్చుండఁగాఁ గొంచెము విన్నవింపఁగోరుచున్నాను.

మలయ- (కూర్చుండి) సఖుఁడా! ఏమి చెప్పఁగోరుచున్నావు.

భాగు- కుమారా! అర్థశాస్త్రవ్యవహారులకు, ప్రయోజనావసరమునుబట్టి, శత్రువని, మిత్రుఁడని, తటస్థుఁడని, వ్యవస్థచేయుటకవకాశములేదు. స్వేచ్ఛావశమునుబట్టి లౌకికులకేకలదు. ఆకాలమందు సర్వార్థసిద్ధి రాజుగాఁగోరిన రాక్షసునకపుడు చంద్రగుప్తునికంటెను బలీయుఁడైన సుగృహీతనామధేయుఁడు పర్వతేశ్వరమహారాజుమాత్రమే కార్యాటంకమును గావింపఁజాలు మహాశత్రువైనాఁడు. ఆకాలమందు రాక్షసుఁడు ఇట్లాచరించినాఁడని యిందు నాకు మహాదోషము కనఁబడదు. కుమారుఁడు చూడఁదగును.

గీ॥ అర్థవశముచేత ♦ నరిని మిత్త్రునిఁగాఁగ ।
మిత్త్రునరినిఁగా స ♦ మీకరించి ।
పూర్వవృత్తిమఱపి ♦ పురుషు సజీవు జ ।
న్మాంతరప్రవిష్టు ♦ ననుచు నయము ॥ 8 ॥

కనుక నీవిషయమందు రాక్షసుఁడు నిందింపఁబడఁదగినవాఁడు గాఁడు. నందరాజ్యలాభము కలుగువఱకు ననుగ్రహింపఁబడఁదగినవాఁడు. తర్వాత నాతనిని బరిగ్రహించుటకుఁగాని, పరిత్యజించుటకుఁగాని కుమారుఁడే ప్రమాణము.

మలయ- ఇట్లే కానిమ్ము. సఖా! చక్కఁగాఁ గనిపెట్టితివి. అమాత్యునిఁ జంపితిమా, ప్రజలకు విరాగము కలుగును. కలిగెనా, విజయము సందిగ్ధమగును.

పురుషుఁడు- (ప్రవేశించి) జయము కుమార! ఆర్యుల గుల్మస్థానాధికృతుఁడగు దీర్ఘచక్షుఁడిట్లు ఆర్యునకు విన్నవించుచున్నాఁడు. "ఒకఁడు ముద్రలేకుండ కటకమునుండి ఒక లేఖ చేతఁబట్టుకొని వెడలుచుండఁగా మేము వానిం బట్టుకొంటిమి. వానినార్యుఁడు స్వయముగాఁ జిత్తగింపవలెను" అని.

భాగు- భద్రా! వానినిఁ బ్రవేశపెట్టుము.

పురుషు- చిత్తము. (అని వెళ్ళును.)

సిద్ధా- (పాశబద్ధుఁడై, పురుషునిచే ననుగమ్యమానుఁడై ప్రవేశించును. తనలో)

గీ॥ గుణములకుఁ దృప్తయై దోష ♦ గణము నెడఁబ ।
రాజ్యలక్ష్మియె యాచుఁ బరఁగెడు ♦ రాజభక్తి ।
జనని మాబోటి సేవక ♦ సమితికట్టి ।
రాజభక్తికి నతిసహ ♦ ప్రియులొనర్తు ॥ 9 ॥

పురుషు- (సమీపించి) ఆర్యా! ఆపురుషుఁడు వీఁడే!

భాగు- (నాట్యముతోఁ జూచి) భద్రా! వీఁడు క్రొత్తగావచ్చినవాఁడా, లేక యిక్కడ నెవ్వరికైన అనుచరుఁడా?

సిద్ధా- ఆర్యా! నేనుఅమాత్యరాక్షసులవారి సేవకుఁడను గదా!

భాగు- భద్రా! ఐతే, ముద్రతీసికొనకుండ కటకమునుండి వెళ్లుట యెందుకొఱకు?

సిద్ధా- కార్యగౌరవము నన్నుఁ ద్వరపెట్టినది.

భాగు- ఇట్లు రాజుగారియాజ్ఞ కూడ దాఁటఁదగినంతటి యీ కార్యగౌరవమెట్టిది?

మలయ- సఖా! భాగురాయణ! లేఖముఁ బుచ్చికొమ్ము.

సిద్ధా- (భాగురాయణునకు లేఖమర్పించును.)

భాగు- (సిద్ధార్థకునిచేతినుండి లేఖము దీసికొని ముద్రను జూచి) కుమార! యీ లేఖమందు రాక్షసనామాంకితమైన ముద్ర గలదు.

మలయ- ముద్ర చెడిపోకుండ విప్పిచూపుము.

భాగు- (అట్లు చేసి చూపును.)

మలయ- (పుచ్చుకొని చదువును.)

స్వస్తి! ఒకానొకచోటనుండి యథాస్థానముగా, ఒకానొకరు, ఒకానొకపురుషులకు విన్నవించుచున్నారు. మావిపక్షుని నిరాకరించి సత్యవాది యొకానొక సత్యతను గనఁబఱిచినారు. ఇపుడు, మొదటనే సంధినుపన్యసింపఁబడినవారైన మనమిత్రులకు, పూర్వము నిర్ణయించికొన్న సంధికిఁ బ్రతిఫలమయిన వస్తువు వారికిఁ బ్రతిపాదనముం గావించుటకుఁ బ్రోత్సాహనము గావించుచు సత్యసంధుఁడు ప్రీతినుత్పాదించుట కర్హుఁడు. వారిట్లు చేర్చుకోఁబడినవారగుచు స్వాశ్రయవినాశముచేతి నేయుపకారి నారాధింపఁగలరు. మఱువనిదయినను సత్యవంతుల జ్ఞప్తికిఁ దెచ్చునదేమనఁగా- వీరిలోఁ గొందఱు శత్రువుని ధనకోశమును దంతిఘటలను నర్థించుచున్నారు. కొందఱు దేశమును- సత్యవంతులు మమ్ముఁగూర్చి పంపించిన యలంకారత్రయమును జేరినది. లేఖము అశూన్యముగానుండుటకయి మాచే దీనితో నించుక పంపించఁబడ్డది. దానిం జేకొనఁదగును. అప్తతముఁడయిన యీతఁడు విన్నవించు నోటిమాటలుకూడ వినఁదగును.

మలయ- భాగురాయణ! ఈలేఖమెట్టిది.

భాగు- భద్రా! సిద్ధార్థక! ఈలేఖ మెవరికి?

సిద్ధా- ఆర్యా! నేనెఱుఁగను.

భాగు- ఓరిధూర్తుఁడా! లేఖముఁదీసికొని వెళ్లుచున్నావు. ఎవరికో యెఱుఁగవు! నీనోటిమాటలు వినఁదగిన దెవరిచేత?

సిద్ధా- (భయమునునటించుచు) మీచేత.

భాగు- మాచేతననఁగా నేమి?

సిద్ధా- మీచేతఁబట్టుకొనఁబడినవాఁడ నేమిచెప్పుచున్నానో యెఱుఁగనని.

భాగు- (రోషముతో) వీఁడెఱుఁగును. భాసురక! వెలుపలికిఁ గొనిపోయి చెప్పునందాఁకఁ గొట్టవలసినది.

పురుషుఁడు- చిత్తము. (సిద్ధార్థకునితో వెళ్లును. తిరిగివచ్చి) ఆర్య! ముద్రాలాంఛితమయిన యీపెట్టె వానిచంకనుండి జారిపడ్డది.

భాగు- (చూచి) కుమార! దీనియందును రాక్షసునిముద్రయున్నది.

మలయ- ఇది లేఖముయొక్క అపూర్వార్థముగావచ్చును. ఈముద్రగూడఁ జెడకుండఁదీసి చూపుము.

భాగు- (అట్లుచేసి చూపును.)

మలయ- (చూచి) నాయొంటినుండి యొలిచి రాక్షసునకు నేఁబంపిన యాభరణమిది. ఈలేఖ చంద్రగుప్తునకని వ్యక్తము.

భాగు- ఇదిగో, సంశయము తేలిపోవును. భద్రా! వానిని మఱలఁ గొట్టుము.

పురు- చిత్తము. (వెళ్లి మరలవచ్చి) వాఁడు కొట్టఁబడి "కుమారునికి స్వయముగా విన్నవించెద" నని చెప్పుచున్నాఁడు.

మలయ- ప్రవేశపెట్టుము.

పురు- చిత్తము. (వెళ్ళి సిద్ధార్థకునితోఁ బ్రవేశించును.)

సిద్ధా- (పాదములమీఁద వ్రాలి) కుమారుఁడు నాకభయ ప్రదానము చేయవలెను.

మలయ- భద్రా! పరాధీనునకభయమే! కనుక యథార్థముచెప్పు.

సిద్ధా- కుమారుఁడవధరింపఁదగును. ఈలేఖమిచ్చి యమాత్య రాక్షసుఁడు నన్నుఁ జంద్రగుప్తుని సన్నిధికిఁ బంపినాఁడు.

మలయ- నోటిమాటలేవో వానినిఁగూడ వినఁగోరుచున్నాను.

సిద్ధా- కుమార! అమాత్యరాక్షసుని సందేశమిట్లు- "మొదట నీతో ననుసంధానముగావించినవారు, నాప్రియస్నేహితులు, రాజులైదుగురు. ఎవరనఁగా, కులూతాధిపుఁడు చిత్రవర్మ, మలయదేశాధిపుఁడు సింహనాదుఁడు, కాశ్మీరదేశాధిపుఁడు పుష్కరాక్షుఁడు, సింధురాజు సింధుషేణుఁడు, పారసీకాధిపతి మేఘాక్షుఁడు. ఇందు మొదటి ముగ్గురును మలయకేతుని దేశమునభిలషించుచున్నారు. ఇతరులిర్వురును ధనకోశమును, ఏనుఁగుబలమును అభిలషించుచున్నారు. కనుక మహారాజు చాణక్యుని నిరాకరించి నాకెట్లు ప్రీతిఁగలిగించెనో, అట్లే వారికి సమకూర్చుటకు మొదటనే నిర్ణయమయిన యర్థము సంపాదయితవ్యము." అని నోటిమాటలతోడి సందేశము.

మలయ- (తనలో) చిత్రవర్మాదులును నన్నభిద్రోహించుచున్నారా! అందుచేతనే వారికి రాక్షసునియందు నిరతిశయమయిన భక్తి (పయికి) విజయా! అమాత్యరాక్షసునిఁ జూడఁగోరుచున్నాను.

ప్రతీ- చిత్తము. (వెళ్లును.)

రాక్ష- (తనయింటియందు, ఆసనస్థుఁడయి, చింతాకులుఁడయి పురుషునితోఁ బ్రవేశించును. తనలో) మాసైన్యములు చంద్రగుప్తబలములతో నిండియుండుట సత్యముగా నామదికి సంశయమాపాదించుచున్నది. ఎందుచేతనా?

సీ॥ సరవిని సిశ్చిత ♦ శక్తిమంతంబౌచుఁ
బటువుగ నిశ్చయ ♦ ఘటితమౌచు।
సరిగఁ బక్షంబున ♦ సంస్థితంబౌచు వి
పక్షంబునుండి వి ♦ వర్తమైన।
యట్టి సాధనము ని ♦ రాటంకముగ నౌను
సాధ్యసిద్ధికి నిని ♦ స్సంశయముగ।
స్వయముగా నెయ్యది ♦ సాధ్యమో యదియుఁ బ
క్షవిపక్షములకు నై ♦ క్యమగు నదియుఁ।

గీ॥ బక్షిమందు విరుద్ధమై ♦ పరఁగు నదియు ।
నిట్టిసాధనమంగీక ♦ రించునెడల ।
వాదికినిబోలె భూతల ♦ నాథునకును ।
నిగ్రహమ్ము దటస్థించు ♦ నిశ్చయముగ ॥ 10 ॥

లేక, వారికి చంద్రగుప్తునియందలి విరాగమునకుఁ గారణములు మాకుఁ దెలిసినపిమ్మట మేము రహస్యముగాఁ దెలిపిన భేదోపాయముల నంగీకరించి యిందుఁ జేరిరి. అట్టివారితో నిండియుండుట శంకకర్హముగాదు. (పయికి) ప్రియంవదక! కుమారుననుసరించివచ్చు రాజులతో నామాటలుగా నిట్లుచెప్పుము. ఇపుడు దినదినమును కుసుమపురమునుసమీపించుచున్నాము. కనుక మీరు వేర్వేఱ మొనలతోఁ బ్రయాణము సాగింపవలసినది. ఎట్లనఁగా—

సీ॥ ఖస మాగధగణంబు ♦ గలవారు నన్నను
వ్యూహించుకొని సైన్య ♦ ముఖమునందు ।
యవనదేశమహీవ ♦ రాన్వితులౌచుఁ గాం
ధారులు మధ్యయా ♦ నమ్మునందు ।
నిట్లు వీరలవెంబ ♦ డించి హూణబలంబుఁ
జేదిబలంబును ♦ జేరిరాఁగ ।
వీరాధివీరులై ♦ వెలసెడువారలు
శకమహీనాథులు ♦ జరుగవలయు ।
గీ॥ నింకమిగిలియున్న ♦ పృథ్వీంద్రులెల్లఁ గౌ,
లూతముఖ్యబలము ♦ నాతతంబు ।
మార్గమధ్యమునఁ గు ♦ మారుని సర్వదా,
యావరించియుండి ♦ యరుగవలయు ॥ 11 ॥

ప్రియం— అమాత్యులాజ్ఞాపించినట్లే (వెళ్లును.)

ప్రతీ— (ప్రవేశించి) అమాత్యులకు జయము, జయము. కుమారుఁడు నిన్నుఁ జూడఁగోరుచున్నాఁడు.

రాక్ష— భద్రా! ఒకముహూర్తమాగుము. ఎవఁడురా! అక్కడ?

పురు— (ప్రవేశించి) ఏమి సెలవు?

రాక్ష— భద్రా! శకటదాసునితో నిట్లుచెప్పుము. "కుమారుఁడు మాకాభరణముఁ బంపించినపుడు, అలంకరించుకొనకుండ నిపుడు కుమారునిదర్శనమనుభవించుట మాకు యుక్తముగాదు. కనుక మేము కొనియున్న యలంకారములు మూఁడింటిలో నొకటి యియ్యవలసినది." అని.

పురు— చిత్తము. (వెళ్ళి తిరుగవచ్చి) అమాత్య! ఇదిగో, ఆయలంకారము.

రాక్ష— (నాట్యముచేఁజూచి, యలంకరించుకొని, లేచి) భద్రరాలా! రాజకులమునకు వెళ్ళుమార్గముఁ జూపు.

ప్రతీ—అమాత్య! రా, రమ్ము.

రాక్ష— (తనలో) అధికారపదమనఁగా నిర్దోషుఁడయిన పురుషునకును మిగులభయమునకు హేతువు. ఏమా?

చ॥ పతియెద నాది నేభయము ♦ ప్రాకును సేవకు రాజసన్నిధి ।
స్థితు నెడ సుస్థిరంబగు హ్రా ♦ దిక్ మతి,దుర్జనమత్సరైకమూలము
న్నతపదమెక్కి, కార్యభర ♦ ణ ప్రతిపాదకులైనవారి సం ।
స్థితి యిటులు ఘ్రియంబునకు ♦ సిద్ధము పాతమటంచుఁ దోఁచెడుక్

ప్రతీ— (చూచి) అమాత్య! ఇదిగో, కుమారుఁడు కూర్చున్నాఁడు. కనుక సమీపింపుము.

రాక్ష— (నాట్యముచేఁజూచి) ఇదిగో, కుమారుఁడు.

గీ॥ పదము నెదుటఁజూపుఁ ♦ గదిపియుఁ దానిఁ గాం ।
చక యె నిశ్చలముగఁ ♦ జక్షులమర ।
దుర్వహమ్ము కార్యదు ♦ ర్భరమున నమ్రి ।
మనఁగ మోముఁగరము ♦ నందుఁదాల్చె ॥ 13 ॥

(సమీపించి) కుమారునకు జయము, జయము.

మలయ- ఆర్య! అభివందనము. ఆసనమిదిగో, కూర్చుండుము.

రాక్ష- (కూర్చుండును.)

మలయ- ఆర్య! మీయాలస్యదర్శనముచేత మాకుద్వేగముగలిగినది.

రాక్ష- కుమార! ప్రయాణసన్నాహములోనున్న నాకుఁ గుమారునివలన నీయుపాలంభము గలిగినది.

మలయ- ఆప్రయాణసన్నాహమెట్టిదో వినఁగోరుచున్నాను.

రాక్ష- కుమార! అనుయాయులయిన రాజులిట్లాదేశింపఁబడిరి

ఖసమాగధగణంబు= (అను 11 వ పద్యముఁ జదువును.)

మలయ- (తనలో) తెలిసినది. ఎవరు నావినాశముచేతఁజంద్రగుప్తునాశ్రయించుట కుద్యమించుచున్నారో వారే నన్నావరించుచున్నారిదియేమో? (పయికి) ఆర్య! కుసుమపురమునుగూర్చి వెళ్ళువాఁడయినను, అక్కడినుండి వచ్చువాఁడయినను, ఎవఁడయిన నున్నాఁడా?

రాక్ష- కుమార! రాకపోకలయావసరమిపుడు సమాప్తమయినది. అయిదాఱు దినములలో మనమే అక్కడకుఁ జేరుచున్నాముగదా!

మలయ- (తనలో) తెలిసినది. (పయికి) అట్లయినయెడల, ఆర్యులు లేఖమిచ్చి యీపురుషునిఁ గుసుమపురమునకుఁబంపుటయేల?

రాక్ష- (చూచి) అహో, సిద్ధార్థకుఁడు! భద్ర! ఇదేమి?

సిద్ధా- (కన్నీటితో, లజ్జనునటించుచు) అమాత్యులుక్షమింపవలెను. తాడ్యమానుఁడనయిన నేనుఆమాత్యుని రహస్యము దాఁపలేకపోతిని.

రాక్ష- భద్ర! ఆరహస్యమెట్టిదో నేనెఱుఁగనే!

సిద్ధా- విన్నవించుచున్నాను. తాడ్యమానుఁడనయిన నేను- (అని సగముచెప్పి, భయముతో మొగమువాల్చును.)

మలయ- భాగురాయణ! తన స్వామియెదుట భయపడియు, సిగ్గుపడియు, వీఁడుచెప్పఁడు. అందుచే నీవే ఆర్యునకుఁ జెప్పుము.

భాగు- చిత్తము. అమాత్య! వీఁడిట్లుచెప్పినాఁడు. 'నాకమాత్యరాక్షసుఁడు లేఖమిచ్చి, నోటిమాటలును గొన్నిచెప్పి చంద్రగుప్తుని సన్నిధికంపినాఁడు' అని.

రాక్ష- భద్ర, సిద్ధార్థక! సత్యమా?

సిద్ధా- (లజ్జను నటించుచు) నన్నుఁ జావఁగొట్టుటచేత నిట్లు చెప్పినాను.

రాక్ష- కుమార! ఇది యనృతము. తాడ్యమానుఁడయినవాఁడేమయినఁ జెప్పును.

మలయ- భాగురాయణ! లేఖముఁ జూపుము. నోటిమాట లేవో తనభృత్యుఁడే చెప్పఁగలఁడు.

భాగు- (లేఖముఁజూచుచు) యథాస్థానముగా నొకానొకచోటనుండి (ఇత్యాదిగాఁ జదువును.)

రాక్ష- కుమార! ఇది శత్రుప్రయోగము.

మలయ- లేఖముయొక్క అనూన్యార్థముగా నార్యులీయాభరణముఁగూడఁ బంపిరి. ఇది శత్రుప్రయోగమెట్లుకాఁగలదు? (ఆభరణముఁ జూపును.)

రాక్ష- (ఆభరణమును లెస్సగాఁజూచి) ఇదినేఁబంపినదిగాదు: కుమారుఁడు నాకొసఁగినది. నేనొకబహుమానరూపముగా సిద్ధార్థకునకిచ్చితిని.

భాగు- ఓయమాత్య! ఇట్టి యాభరణవిశేషముఁ, విశేషించి కుమారుఁడు తనయొంటినుండి తీసి యిచ్చినది, కైకొనుటకు వీఁడంత దానపాత్రుఁడా?

మలయ- నోటిమాటలును, ఆప్తతముఁడయిన సిద్ధార్థకునివలన వినిపింపఁబడునని ఆర్యులు వ్రాసిరి.

రాక్ష- నోటిమాటలెవరివల్లనుండి? లేఖమెవరికి? నేనుమాత్రమెఱుఁగను.

మలయ- సరే! ఈముద్రి యెవరిది?

రాక్ష-కుమార! ధూర్తులు కపటముద్రను గూడ సృష్టించుటకు సమర్థులు.

భాగు- కుమార! అమాత్యుఁడు విన్నవించునది తథ్యము. సిద్ధార్థక! ఈలేఖము వ్రాసినవా రెవరు?

సిద్ధా- (రాక్షసునిముఖముఁ జూచి, మోమువంచి, ఊరకయుండును.)

భాగు- మఱల దెబ్బలు తినకు. చెప్పు.

సిద్ధా- అయ్యా! శకటదాసుఁడు.

రాక్ష- కుమార! ఇది శకటదాసుఁడు వ్రాసెనా నేను వ్రాసినట్లే.

మలయ- విజయా! శకటదాసునిఁ జూడఁగోరుచున్నాను.

ప్రతీ- కుమారుని చిత్తము.

భాగు- (తనలో) ఆర్యచాణక్యనిదూతలు అనిశ్చితార్థముల కవకాశమియ్యఁగూడదుగదా! శకటదాసుఁడువచ్చి 'ఆలేఖమిది' యని జ్ఞప్తికిఁ దెచ్చుకొని, పూర్వవృత్తాంతమును వెల్లడింపవచ్చును. అట్లయ్యేని మలయకేతునకు సందేహముకలిగి యాతంత్రమందనాదరము చూపవచ్చును. (పయికి) కుమార! అమాత్యరాక్షసుని యెదుట శకటదాసుఁడు, ఈలేఖము తాను వ్రాసినదని యొకనాటికిని ఒప్పికొనఁడు. అందువలన, అతనిలిఖితము మఱియొకటి తేఁదగును. అక్షరములపోలికచూచి సర్వమును నిర్ణయింపవచ్చును.

మలయ- విజయా! ఇట్లుచేయుము.

భాగు- కుమార! ఈముద్రియును.-

మలయ- రెండును గెమ్ము.

ప్రతీ- చిత్తము. (వెళ్ళి, మరలవచ్చి) ఇవిగో, శకటదాసుని స్వహస్తలిఖితమయిన పత్రమును, ముద్రియును.

మలయ- (రెండును నాట్యముచేఁ జూచి) ఆర్య! అక్షరముల పోలిక సరిపడియున్నది.

రాక్ష- (తనలో) అక్షరములు పరస్పరము సరిపోలియున్నవి. శకటదాసుఁడు నామిత్రమనుటకు, అక్షరములు విరుద్ధముగానున్నవి. శకటదాసుఁడే వ్రాసియుండవచ్చునా?

గీ॥ దారపుత్రకుల నె ♦ తలఁచెనంతియకాని ।
మఱచె స్వామిభక్తి ♦ మొఱకువీఁడు ।
అర్థమస్థిరంబు ♦ న భిలషించెడువాఁడు ।
తలఁపలేఁడు శాశ్వ ♦ తము యశమ్ము ॥ 14 ॥

లేక, సందేహమెందుకు-

చ॥ సికయెపుడుంచు నాశకటు ♦ చేతను సంగడికాఁడు వీఁడు దీ ।
నికి లిపి కన్యపత్రలిపి ♦ నిక్కముపోలెడు భూరిభేదసా ।
ధకులగు శత్రులంగలిసి ♦ దారసుతాదుల రక్షకాత్మర ।
క్షకుఁ గృపణత్వముంగనుచు ♦ స్వామికిఁ దానుగృతఘ్నుఁడయ్యెఁగా॥

మలయ- ఆర్య! 'సత్యవంతులు మమ్ముఁగూర్చి పంపిన యలంకారత్రయమును జేరనది' అని ఆర్యులు లేఖములో వ్రాసినవానిలో నొకటాయిది? (లెస్సగాఁజూచి) ఇది తండ్రిగారు మున్నుధరించిన యాభరణమే! (పయికి) ఆర్య! ఈయాభరణమెక్కడిది?

రాక్ష- ఒకానొకవర్తకునినుండి కొనఁబడ్డది.

మలయ- విజయా! ఈభూషణము నీవు గుర్తుపట్టఁగలవా?

ప్రతీ- (లెస్సగాఁజూచి, కన్నీటితో) కుమార, గుర్తుపట్టలేకేమి? ఇదిసుగృహీతనామధేయుఁడు పర్వతకమహారాజు పూర్వముధరించినది.

మలయ- (కన్నీటితో) హా! తండ్రీ!

గీ॥ వంశభూషణముఖ చంద్ర ♦ భాసితంబు ।
దారకాన్వితమగు శారం ♦ ద ప్రదోష ।
మువలె నీవు శోభించిన ♦ భూషణములు ।
నీదు గాత్రోచితములివి ♦ గాదె, తండ్రి! ॥ 16 ॥

రాక్ష- (తనలో) ఇది పర్వతేశ్వరుఁడు పూర్వము ధరించిన దని చెప్పినదేమి? (పయికి) ఇవియును చాణక్యప్రయుక్తుఁడయిన వర్తకునిచేత మాకు విక్రయింపఁబడ్డవని వ్యక్తము.

మలయ- ఆర్య! తాతగారు మున్ను ధరించిన యాభరణవిశేషములు, విశేషించి, చంద్రగుప్తుని హస్తగతమయినవి, వర్తకులవలన నుండి క్రయముచే వచ్చినవన్నమాట పొసఁగియుండలేదు. లేక ఇది పొసఁగియున్నది.

గీ॥ అధికలాభకాంక్షి ♦ యై క్రేతయాచంద్ర ।
గుప్తునుండి వీనిఁ ♦ గొనఁదలంచి ।
భూషణములమూల్య ♦ ముగ మమ్మెకల్పించి ।
నాఁడవోయి క్రూర ♦ బాడబుండ ॥ 17 ॥

రాక్ష- (తనలో) ఈశత్రుప్రయోగము చాలశ్లిష్టమయినది. ఏమా?

ఉ॥ పత్రము నాదిగాదనుట ♦ భావ్యము ముద్రిక నాదియుంటచేన్ ।
మైత్రినశించెనాన్ శకటు ♦ నందన నమ్మరు; భూషలమ్ముటన్ ।
ధాత్రిపుఁడె 'ట మార్యుఁడది ♦ తథ్యముగా గణియింప; రిట్టులే ।
సూత్రముఁదోఁచ; దొప్పఁదల ♦ చొప్పవరంబుగఁ;గావఁకన్యముల్ ॥

మలయ- ఆర్యునివి యడుగుచున్నాను.

రాక్ష- (కన్నీటితో) ఆర్యులని నీవుపిలిచిన మేమిపుడనార్యులమైతిమి.

మలయ- సీ॥ ఈమౌర్యుఁడెన్నఁగ ♦ నీశుని పుత్త్రుఁడు
నీకు, నేనెన్నఁగ ♦ నీకు నెపుడు ।
పరిచరణక్రియా ♦ పరుఁడనై సేవించు
మిత్రభూపాలకు ♦ పుత్త్రకుఁడను ।
అర్థంబులధికంబు ♦ లాతఁడిచ్చును నీకు
స్వమతంబునకు నను ♦ సరణమిత్తు ।
నర్థము నీకునే, ♦ నతఁడిచ్చుసత్కార
సహితదాస్యంబును ♦ సచివపదము ।

గీ॥ స్వామ్యపదవి యిచట ♦ జరుగుగదా నీకు ।
నిట్టులుండనింక ♦ నేదిగోరి ।
యగ్రకులవరేణ్యు ♦ నత్యధికార్థజా ।
తాభిలాషు నిన్న ♦ నార్యుఁజేసె? ॥ 19 ॥

రాక్ష- కుమార! అయుక్తవ్యాహారివయిన నీచేతనే నిర్ణయముగావింపఁబడెను. ఏమా? (పై పద్యమందలి యుష్మదస్మదర్థకములు వ్యత్యయముచేసి చదువుము.)

సీ॥ ఈమౌర్యుఁడెన్నఁగ ♦ నీశుని పుత్త్రుఁడు
నాకు, నీవెన్నఁగ ♦ నాకు నెపుడు ।
పరిచరణక్రియా ♦ పరుఁడవై సేవించు
మిత్రభూపాలకు ♦ పుత్త్రకుఁడవు ।
అర్థంబులధికంబు ♦ లాతఁడిచ్చును నాకు
స్వమతంబునకు నను ♦ సరణమిత్తు ।
వర్థము నాకు నీ, ♦ వతఁడిచ్చు సత్కార
సహితదాస్యంబును ♦ సచివపదము ।
గీ॥ స్వామ్యపదవి యిచట ♦ జరుగుగదా నాకు ।
నిట్టులుండ నింక ♦ నేదిగోరి ।
యగ్రకులవరేణ్యు ♦ నత్యధికార్థజా ।
తాభిలాషునన్న ♦ నార్యుఁజేసె? ॥ 19 A ॥

మలయ- (లేఖమును అలంకరణస్థగికను జూపి) అయితే, యిది యేమి?

రాక్ష- (కన్నీటితో) ఇది విధివిలసితము. ఏమా?

చ॥ పరిభవధామ భృత్యతకుఁ ♦ బాల్పడినం; గృతవేదు, లిద్ధధీ ।
భరితులు, సాధు, లాత్మజుల ♦ వాసిగ నన్నెపుడున్ సుమైత్రినా
దరణము చేయువారు, జన ♦ తాగుణవిజ్ఞులు, నైన నందభూ ।
వరుల వినాశహేతువగు ♦ పాపపుదైవముచేఁత యిద్దియున్ ॥ 20

మలయ- (కోపముతో) విధివిలసితమనియు, నాదిగాదనియు, ఇపుడును దాఁచుచున్నావు. ఓయి యనార్య!

చ॥ మహితవిషప్రయోగవిష ♦ మంబడుచుంబడుపం గృతఘ్న, యి ।
మ్మహికినిఁ బాసె నీవలన ♦ మాజనకుండటు నిన్ను నమ్మి యు;।
స్థహితులు గౌరవించి సచి ♦ వాధికృతిన్ నినుఁ బెట్టఁ గోరఁగా ।
నహహా కడంగె ద్రొప్పు మను ♦ నమ్మఁగ వారికి మాంసమున్ వలెన్

రాక్ష- (తనలో) ఇది వ్రణముమీఁద మఱియొక సెల. (పయికి చెవులు మూసికొని) పాపము శమించుఁగాక, పాపము శమించుఁగాక! పర్వతేశ్వరునిపైని విషకన్యను బ్రయోగింపలేదు. పాపుఁడను గాను.

మలయ- సరే, మఱి మాతండ్రి యెవనిచేసంహరింపఁబడెను.

రాక్ష- ఇందుకు దైవము నడుగవలెను.

మలయ- (క్రోధముతో) దైవమునా? క్షపణకుఁడు జీవసిద్ధినిఁ గాదా?

రాక్ష- (తనలో) జీవసిద్ధిగూడఁ జాణక్యచారుఁడా, అన్నన్నా, నాహృదయముగూడ శత్రులచే గృహీంతము.

మలయ- (క్రోధముతో) భాసురక! సేనాపతి శిఖరసేనునిట్లాజ్ఞాపించుచున్నాను. "ఎవరు, ఈరాక్షసునితోఁగలిసి స్నేహముత్పాదించి నాశరీరమునకు ద్రోహముగావింప నిశ్చయించి చంద్రగుప్తునారాధించుటకు సంకల్పించినారో, ఆరాజులైదుగురు ఎవరనఁగా:- కౌలూతుఁడు చిత్రవర్మ, మలయనరపతి సింహనాదుఁడు, కాశ్మీరుఁడు పుష్కరాక్షుఁడు, సింధురాజు సింధుషేణుఁడు, పారసీకాధిరాజు మేఘాక్షుఁడు అని. వారిలో మొదటి ముగ్గురు నాభూమినిఁ గామించుచున్నారు. వారిని లోఁతయిన గోతిలోఁ ద్రొక్కి మంటితోఁ బూడ్పవలసినది. తక్కిన యిరువురును హస్తిబలముఁ గామించుచున్నారు. వారినేనుఁగులఁ చేతఁ ద్రొక్కించి చంపవలసినది." అని.

పురుషు- కుమారుఁడాజ్ఞాపించినట్లు- (వెళ్ళును.)

మలయ- (క్రోధముతో) రాక్షసుఁడ, రాక్షసుఁడ! నేనువిశ్వాసఘాతకుఁడయిన రాక్షసుఁడను గాను. మలయకేతుఁడను. కనుక వెళ్ళిపొమ్ము. సర్వప్రకారములచేతనుజంద్రగుప్తునాశ్రయింపుము. చూడు.

గీ॥ చంద్రగుప్తుఁడొకఁడు ♦ చాణక్యుఁడొక్కఁడు ।
నీవు గలిసికొనఁగ ♦ మూవురైరి ।
పరఁగ దుర్నయము త్రి ♦ వర్గము నెట్లట్ల ।
తగుదు నేను మిమ్ముఁ ♦ ద్రివ్వివైవ ॥ 22 ॥

భాగు- కుమార! కాలహరణమేల? ఇపుడే కుసుమపురము ముట్టడించుటకు మనబలములకాజ్ఞాపింపవలయును.

సీ॥ లోధ్రమహీరుహ ♦ లూనపుష్పపరాగ
వాసనాబహుళసం ♦ వాసితములు ।
గాఢనారీమణీ ♦ గండస్థలంబులు
ధూమ్రిమఁల్ గాఁగ; మ ♦ ధువ్రతముల ।
కులకాంతిమించు త ♦ త్కుటిలాలకంబుల
కార్ష్ణ్యంబునకు నెంతొ ♦ కొంతగలుగ ।
ఘోటకఖురపుట ♦ క్షోదలబ్ధాత్మలా
భంబౌచు రేఁగిన ♦ పాంసుచయము ।
గీ॥ కంబములొ యనంగ ♦ గగనంబుముట్టియు ।
దంతిఘటలభూరి ♦ దానవారి ।
ఛిన్నమూలమగుచుఁ ♦ జేరి నిల్చెడుఁగాక ।
అరికులంబు నుత్త ♦ మాంగమందు ॥ 23 ॥

మలయ- (పరిజనముతో దానును నిష్క్రమించును.)

రాక్ష- (ఆవేగముతో) అయ్యయ్యో! ఛీ! ఎంతకష్టము! దిక్షుమాలి, ఆచిత్రవర్మాదులును సంహరింపఁబడిరి. అందువలన రాక్ష

సుఁడు మిత్రనాశనముకై పనిచేసినాఁడా? రిపువినాశముకై కాదా? మందభాగ్యుఁడ నిపుడు నేనేమి చేయుదును?

చ॥ చని యెదనా తపోవనము? ♦ శాంతముగాదు సవైరమాత్మ, భ ।
ర్తననుసరింతునా? సతుల ♦ ధర్మమరాతులు సావకుండ హే ।
తినిఁగొని శత్రుసేనఁగడ ♦ తేర్చెదనా? సరిపోదయుక్తమై ।
చను; నకృతజ్ఞుఁడౌదు హితుఁ ♦ జందనదాసునిఁ గావకున్నచోన్ ॥

(అందఱును నిష్క్రమింతురు.)

ఇది పాలెపు వేంకట సూర్యగోపాల ప్రధానాంధ్రీకృత
ముద్రారాక్షస నాటకమునఁ బంచమాంకము.

ముద్రారాక్షసము—షష్ఠాంకము.

సిద్ధార్థకుఁడు—(అలంకరించుకొని ప్రవేశించును. హర్షముతో)

చ॥ జయము నవాబ్దనీలునకు ♦ శౌరికిఁ గేశిముదాపహారికిన్ ।
జయము జనావళీనయన ♦ చంద్రుఁడు చంద్రమహీంద్రమౌళికిన్
జయమల విష్ణుగుప్త నయ ♦ శక్తికి సేనలనెల్ల నల్లుగూ ।
ర్చియు నిపుడాజిలో దిగక ♦ సిద్ధినిగాంచిన భూరియుక్తికిన్ ॥ 1 ॥

కనుక, చిరకాలమునకుఁ బ్రియస్నేహితుని సుసిద్ధార్థకునిఁ జూచెదను. (నడచి, చూచి) ఇదిగో నాప్రియవయస్యుఁడు సుసిద్ధార్థకుఁడిట్లే రావచ్చును? అపుడతనిని గలిసికొందును.

సుసిద్ధార్థకుఁడు— (అంతఁ బ్రవేశించును.)

క॥ సంతాపమ్మునఁ దారా
కాంతులు; పండుగులనున్ సు ♦ ఖాయితులు; సుహృ ।
ద్యంతస్థితు; లమిత్రులు
చెంతను లేకున్న అంతు ♦ చిత్తముఁ గలఁచున్ ॥ 2 ॥

నాప్రియవయస్యుఁడు సిద్ధార్థకుఁడు మలయకేతుకటకమునుండి వచ్చినాఁడని తెలిసినది. కనుక నతనిని వెతుకుచున్నాను. అదిగో, సిద్ధార్థకుఁడు.

సిద్ధా— (చూచి) ఇదిగో, ప్రియవయస్యుఁడు సుసిద్ధార్థకుఁడు. (సమీపించి) ప్రియవయస్యునకు సుఖమా?

ఇద్దఱు— (ఒకరినొకరు కౌఁగిలించుకొందురు.)

సుసిద్ధా— ప్రియవయస్య! నాకు సుఖమెక్కడ? నీవు చిరకాలప్రవాసమునుండి ప్రత్యాగతుఁడవయినను వృత్తాంతములు దెలుపక యెక్కడికో వెళ్లుచున్నప్పుడు—

సిద్ధా— చెలికాఁడ! ప్రసన్నుఁడవు గమ్ము. ననుఁజూడఁగానే యార్యచాణక్యుఁడిట్లాజ్ఞాపించెను. "సిద్ధార్థక! వెళ్ళి యీప్రియవార్తను బ్రియదర్శనుఁడయిన చంద్రగుప్తమహారాజునకు నివేదింపుము" అని. అంత నేను మహారాజునకు నివేదించి, ఆయనప్రసాదము నిట్లు సంపాదించి యనుభవించుచు, బ్రియవయస్యుని నిన్నుఁ జూచుటకు మీయింటికే బయలుదేఱితిని.

సుసి— మిత్రుఁడా! ప్రియదర్శనుఁడయిన యామహారాజునకు నివేదించిన యీప్రియవార్త నేనుఁగూడ వినఁదగినదయినయెడల నాకుఁగూడ వినిపింపుము.

సిద్ధా— ప్రియవయస్య! నీవును వినరానిదున్నదా? కనుక విను. ఆర్యచాణక్యనీతిచే, బుద్ధిమోహించిన మలయకేతుహతకుఁడు రాక్షసుని నిరాకరించి, చిత్రవర్మ మొదలయిన ముఖ్యుల నైదుగురు పార్థి

వులఁ జంపించెను. అంత, నితఁడు, అసమీక్ష్యకారి, దురాచారుఁడు, అని యెంచి, మలయకేతుకటకమును, స్వాధికారస్థానరక్షణకుశలత చేతఁ బరిత్యజించి, తక్కిన పార్థివులు, భయవిలోలములై, తనూకృతములయిన శేషసైన్యపరివారములతోఁ దమతమ దేశములకుఁ గదలిపోయిరి. అంత, భద్రభట, పురుషదత్త, డింగరాత, బలగుప్త, రాజసేన, భాగురాయణ, రోహితాక్ష, విజయవర్మ ప్రముఖులు మలయకేతుని బంధించిరి.

సుసి-వయస్యా! భద్రభటప్రముఖులు చంద్రగుప్తమహారాజునందపరక్తులయి మలయకేతునాశ్రయించిరని లోకులు చెప్పకొందురే; అయితే, కుకవినాటకమువలెనే ముఖసంధి యొకతీరు, నిర్వహణసంధి మఱియొకతీరుగా మాఱుటకు నిమిత్తమేమి?

సిద్ధా- వయస్యా! వినుమఱి. దైవగతివలెనే, అశ్రుతగతియైన యార్యచాణక్యనీతికి నమస్కారము.

సుసి- తరువాత, తరువాత.

సిద్ధా- అప్పటితరువాతనుండి, ఆర్యచాణక్యుఁడు సారసాధన సమేతుఁడయి యిక్కడనుండి వెడలి సకలరాజలోకసహితముగా మ్లేచ్ఛబలము నశేషము నాక్రమించెను.

సుసి- వయస్యా! అది యెక్కడ?

సిద్ధా- ఎక్కడ నివి?

గీ॥ హస్తులతిదానదర్పత ♦ నబ్దలీల
నుద్వహించి నడించు; హ ♦ యోత్కరముక
శాభిఘాతిభయంబున ♦ నదిరిజయన
సజ్జమై వేగఁబర్వెను ♦ చాయఁదోఁచు ॥ 3 ॥

సుసి- వయస్య! సర్వము ఉండనిమ్ము, సర్వలోకప్రత్యక్షముగా నధికారమునుండి తొలఁగింపఁబడినవాఁడయిన యార్యచాణక్యుఁడు మఱల నామంత్రిపదవినే యెక్కినాఁడా?

సిద్ధా- సఖా! ఇపుడతిముగ్ధుఁడవగుచున్నావు. అమాత్యరాక్షసునకయినను మున్ను లోతుతెలియని యార్యచాణక్యచరిత్రము లోతుఁ దెలియఁగోరుచున్నావు గనుక—

సుసి- సఖా! అయితే, అమాత్యరాక్షసుఁడిపుడెక్కడ?

సిద్ధా- సఖా! అతఁడా ప్రళయకోలాహలమధికమగుచుండఁగా మలయకేతుశిబిరమునుండి నిర్గమించి, ఉదుంబరుఁడను చారుఁడు తనతోరా, నీ కుసుమపురమునకే వచ్చినాఁడని యార్యచాణ్యునకుఁ దెలిసినది.

సుసి- నందరాజ్యమును మఱలఁ గెచ్చుటకుద్యోగించి వెళ్లి యిపుడు విఫలుఁడయి, తిరుగ నీ కుసుమపురమునకే వచ్చుటయెట్లు?

సిద్ధా- చందనదాసునందలి స్నేహముచేత నని తర్కించుచున్నాను.

సుసి- వయస్య! సత్యము. చందనదాసునందలి స్నేహముచేతనే! ఇఁక చందనదాసునకు విడుదల గనిపెట్టుచున్నావా?

సిద్ధా- వయస్య! మందభాగ్యునకతనికి విడుదలయెక్కడ? ఆర్యచాణక్యుని యాజ్ఞచేత నిపుడాతనిని మనమిరువురము వధ్యస్థానమునకుఁ గొంపోయి చంపవలెను.

సుసి- (క్రోధముతో) వయస్య! ఆర్యచాణక్యునకు ఘాతకజనుఁడితరుఁడు లేఁడా? ఈదారుణకర్మకు మనలనియోగించుచున్నాఁడేల?

సిద్ధా- వయస్య! జీవలోకమందు బ్రదికియుండఁగోరి యార్యచాణక్యుని యానతికెవఁడు ప్రతికూలింపఁగలఁడు. కనుక రమ్ము. చండాలవేషమునుధరించి చందనదాసుని వధ్యస్థానమునకు దీసికొని వెళ్లుదము.

ఇద్దఱు- (నిష్క్రమింతురు.)

ప్రవేశకము.

పురుషుఁడు- (పగ్గము చేతఁబట్టుకొని ప్రవేశించును.)

గీ॥ షడ్గుణాన్యోన్యసంయోగ ♦ శక్తిదృఢము ।
బహుతరోపాయ సుఘటిత ♦ పాశముఖము ।
నలి జయోత్కర్ష వెలుఁగుఁ జా ♦ ణక్యనీతి ।
రజ్జు, వరిబంధనమునకుఁ ♦ బ్రబలమగుచు ॥ 4 ॥

ఆర్యచాణక్యుని చారుఁడా యుదుంబరకుఁడు చెప్పిన ప్రదేశమిది. ఇక్కడనే యమాత్యరాక్షసుఁడు చూడఁబడఁగలఁడని యార్యచాణక్యుని యాజ్ఞ. (చూచి) ఇదిగో, అమాత్యరాక్షసుఁడు శిరసుపయి ముసుఁగు వేసికొని యిటే వచ్చుచున్నాఁడు. కనుక నీజీర్ణోద్యాన వృక్షములచాటున దాఁగి యాతఁడెక్కడఁ గూర్చుండునో చూచెదను (అని నడచి, అట్లుండును.)

రాక్షసుఁడు– (పైనిఁజెప్పినట్లు కత్తితోఁ బ్రవేశించును. కన్నీటితో, కష్టము, అయ్యో, కష్టము.)

సీ॥ ఆశ్రియంబు నశింప ♦ నతిభీతమైనట్టి
లంజియవోలెను ♦ లక్ష్మిసేరె ।
గోత్రాంతరుని దెస ♦ కును లోకు, లవివేకు
లు, గతానుగతికులు ♦ తగవుమాలి ।
త్యక్తానురాగులై ♦ యాలక్ష్మినే వారు
ననుసరించిరి; యిఁక ♦ నాప్తులైనఁ ।
బురుపార్థములు సిద్ధిఁ ♦ బొందనికతమునఁ
బాయగిల్లిరి కార్య ♦ భరముపట్ల ।
గీ॥ వారిననఁగనేల ♦ వారేమిసేయఁగ ।
నోపువారలకట ♦ యుత్తమాంగ ।
మెడలియున్న నాగ ♦ బృందముపోలిక ।
నున్నదిపుడు వారి ♦ యునికి పురిని ॥ 5 ॥

మఱియు– గీ॥ పతిమహాభిజనుఁ నందుఁ ♦ బాసి ఛలము ।
చేత నవినీత వృషలి నాఁ ♦ జేరి వృషలు ।

సిరి యట నెనిల్చె; మేమేమి ♦ చేయఁగలము ।
దైవమరివలె మాప్రియ ♦ త్నములఁ గూల్చ ॥ 6 ॥

నేను– గీ॥ అట్టిమిత్త్రికిఁ దగని రా ♦ జట్లు మడియ ।
శైలపతిఁ జేరి యత్నంబు ♦ సలిపి, యతఁడుఁ ।
జన, సుతునిఁ గొల్చియును సిద్ధిఁ ♦ గనను, నంద ।
వంశవైరి దైవంబె బా ♦ పండుగాఁడు ॥ 7 ॥

అహహా! మ్లేచ్ఛుని వివేకశూన్యత! ఏమా?

సీ॥ ఆమూలముగ నష్టు ♦ లైనను నందుల
పైఁగల భూరివి ♦ శ్వాసమునను ।
నుర్విఁ దాజీవించి ♦ యున్నంతకాలము
నంచితభక్తిసే ♦ వించు నెవ్వఁ ।
డట్టి రాక్షసుఁడు నం ♦ దారాతితో సంధి
సేసి వారలతోడఁ ♦ జేరుటెపుడు ।
సంభావ్యమగునె, యెం ♦ చఁడు దీని వస్తువి
వేకమూఢాత్ముఁడై ♦ వెఱ్ఱిమ్లేచ్ఛుఁ ।
గీ॥ డక్కటకట! యతని ♦ ననవేల దైవోప ।
హతుఁడు మంచిచెడ్డ ♦ లరయుటకు సు ।
శక్తుఁడింతఁగాఁగఁ ♦ జాలఁడాతని బుద్ధి ।
రూఢముగను మాఱు ♦ త్రోవఁబట్టు ॥ 8 ॥

కనుక నిపుడయినను శత్రులచేతిలోఁ జిక్కి చచ్చునుగాని రాక్షసుఁడు చంద్రగుప్తునితో మాత్రము సంధిచేయఁడు. లేక నాకు అసత్యసంధుఁడనను నపకీర్తియే మేలు. శత్రునిచే బంధనమువలని పరాభవము మేలుగాదు. (అంతటఁ గలయఁజూచి) మహారాజు పాదప్రచారపరిచయముచేఁ బవిత్రీకృతమార్గములు, కుసుమపురోపకంఠభూములివి. ఇక్కడ——

సీ॥ శార్ఙ్గంబునందున ♦ జ్యానుసంధించి యా
కర్షించు పట్టునఁ ♦ గళ్ళెము బిగి |
సడలియుండుటను న ♦ శ్వంబు జవంబున
బఱవనిచ్చోట భూ ♦ పాలకుండు |
అస్థిరంబులగు ల ♦ క్ష్యమ్ముల శరమోక్ష
మెంతో చిత్రముగఁ గా ♦ వించువాఁడు |
ఈయుపవనపంక్తి ♦ నృపులతోఁగూర్చుండు
వాఁడిచ్చటను మాట ♦ లాడువాఁడు |
గీ॥ అక్కటకట వార ♦ లందఱునుం దివం |
గతులుగాఁగ నిపుడు ♦ గానఁబడేడు |
కుసుమపురపు భువులు ♦ గొలువుకొండలపాటు |
నింతయంతయనుచు ♦ నెన్నఁజాల ॥ 9 ॥

కనుక మందభాగ్యుఁడను నేనెక్కడకు వెళ్ళెదను. (చూచి) కానిమ్ము. ఇదిగో, జీర్ణోద్యానము కనఁబడుచున్నది. ఇందుఁబ్రవేశించి యెందుమూలలముననైనను జందనదాసుని వృత్తాంతముఁ దెలిసికొని యెదను. (నడచి,) పురుషుల సమవిషమదశల విభాగపరిపాకములు తెలియఁబడకుండనే కలుగును. ఏమా?

చ॥ పురజనులెల్ల నాత్మశశిఁ ♦ బోలెను వేళ్ళులఁజూప నన్ను భూ |
వరశతముల్ భజింప నను ♦ బైల్వెడలంబుర; మట్టినేన యి |
ప్పరుసున నాప్రయత్నములు ♦ వ్యర్థముగా భయమొంది వేగఁద|
స్కరుగతివచ్చి దూరితిని ♦ సామునశించిన పాడుతోఁపునన్ ॥ 10

లేక, యెవరియనుగ్రహమువలన నివి గచింపఁబడెనో వారే చనిపోయిరి. (నాట్యముచేఁ బ్రవేశించి, చూచి) అహో! ఈజీర్ణోద్యానముయొక్క సొబగెంతిచెడిపోయినది! ఇక్కడ—

సీ॥ ఘనతిరారంభర ♦ చనము గులను నావి
పర్యస్తమీసౌధ ♦ భవనమకట |

నష్టమిత్రమ్మగు ♦ శిష్టునిహృదయంబు
చాయను శుష్కమీ ♦ సరసి యయయొ |
గుణహీన భూపాల ♦ కుని నయంబులు నాఁగ
ఫలరహితంబులీ ♦ పాదపములు |
పామరు నవినీతి ♦ చేమనంబునుబోలెఁ
దృణగణచ్ఛన్నమీ ♦ పృథివితలము ॥ 11 ॥

మఱియు— గీ॥ వాఁడిగొడ్డళ్ళఁ దెగి రుజఁ ♦ బావురముల |
కూఁతనేడ్చెడు చెట్టుల ♦ కోమలపుండ్లఁ |
బరిచితక్లేశకృపఘణుల్ ♦ శ్వసనములను |
గుబుసపుంబేలికలఁగట్టు ♦ కొలువుదోఁచు ॥ 12 ॥

ఈచెట్లు దిక్కులేక—

గీ॥ గర్భముననుండి శోషము ♦ గాంచి కీట |
రంధ్రసిర్యాసమశ్రులై ♦ రాల ఛాయ |
లెడలి మలినంబులై గోడు ♦ గుడిచి చెట్లు|
మసనమున కేగఁ గోరెడు ♦ మాడ్కిఁదోఁచు ॥ 13 ॥

దురవస్థకు లభించినదియు, అగ్రభాగము తెగిపోయినదియునగు నీరాతిమీఁద ముహూర్తమాత్రము గూర్చుండెదను. (కూర్చుండి, చెవియొగ్గివిని) ఏమిది యాకస్మికముగా శత్రుపటహనాదముతోఁ గలిసి నాందీనాదము వినఁబడుచున్నది. ఇది—

మ॥ గురుతర్ శ్రోత్రతలపీనుదోయిపటిమం ♦ గోల్వచ్చి ప్రాసాదగ |
హ్వారపీతంబయి హెచ్చుచుంబటహశం ♦ ఖారావరూపంబునాం|
దిరవంబొంతయొ కౌతుకంబు మెయినీ ♦ దిక్చక్రవాళంబు దై |
ర్ఘ్యరమంజూఁడగఁబౌఱుతెంచెననఁగా ♦ వ్యాపించుచున్ వినెడున్

ఆ! తెలిసినది. మలయకేతునిబంధనమువలన రాజకులమందుఁబుట్టినది (అని, సగముచెప్పి, అసూయతో) మౌర్యకులమున కధికపరితోషము నిది సూచించుచున్నది. (కన్నీటితో) కష్టమో హో కష్టము!

గీ॥ వినిచినాకు శత్రు ♦ విభవంబు, మున్నిష్ట
చెంతఁ జేర్చి కనఁగఁ ♦ జేసి, యింక
ననుభవింపఁ జేయ ♦ యత్నించుచున్నాఁడు
దైవమంచు మదికిఁ ♦ దట్టునరయ ॥ 15 ॥

పురుషుఁడు- ఇతఁడు గూర్చున్నాఁడు- కనుక నార్యచాణక్యుల యాజ్ఞప్తిని సంపాదించెదను. (రాక్షసునిఁ జూడనట్లునటించుచు, నతని యెదుటనే పగ్గముతో మెడకు ఉరిదగిలించుకొనును.)

రాక్ష-(చూచి, తనలో) అయ్యో! ఇతఁడాత్మవధము చేసికొనుచున్నాఁడేమి? ఇతఁడు నావలెనే దిక్కుమాలిన దుఃఖితుఁడు. కానిమ్ము ఇతనినడిగెదను. (సమీపించి, వానితో) భద్రా! భద్రా! ఏలయిట్లు చేసెదవు.

పురు- (కన్నీటితో) అయ్యా! ప్రియస్నేహితుని వినాశము వలన దుఃఖితుఁడయిన నావంటిభాగ్యహీనుఁడుజనుఁడు చేయఁదగినట్లు.

రాక్ష- (తనలో) మొదటనే నేనుగనిపెట్టినాను. నిశ్చయముగా నావలెనే దిక్కుమాలిన దుఃఖితుఁడని- కానిమ్ము. ఇతనినడిగెదను. (పయికి) భద్రా! వ్యసనసబ్రహ్మచారీ! రహస్యముగానిది, నీకు బరువులేనిది, అయ్యేనేని వినుటకుఁగోరుచున్నాను. నీప్రాణత్యాగమునకుఁ గారణమేమి?

పురు- అయ్యా! గుహ్యమునుగాదు. గురుకమునుగాదు. కాని, ప్రియస్నేహితుని వినాశమువలన దుఃఖితహృదయుఁడనయి, మరణమున కింతయేని కాలహరణముచేయుటకు సహింపకున్నాను.

రాక్ష- (నిట్టూర్చి తనలో) కష్టము. ఇట్లు సుహృద్వ్యసనమం దితరునివలె నుదాసీనులమయియున్న మేమితనిచేత నిందింపఁబడుచున్నాము. (పయికి) భద్రా! మరల నడుగుచున్నాను. నీప్రాణత్యాగమునకుఁ గారణము గుహ్యమును, గురుకమును గాదుగనుక చెప్పుము.

పురు- అహహా! ఆర్యుఁడు నిర్బంధించుచున్నాఁడు. చెప్పక తీరదు. ఇదిగో, చెప్పుచున్నాను. ఈనగరమందు జిష్ణుదాసుఁడను మణికారశ్రేష్ఠి గలఁడు.

రాక్ష- (తనలో) కలఁడు, అతఁడు చందనదాసునికిఁ బరమస్నేహితుఁడు. (పయికి) అతనికేమి?

పురు- అతఁడు నాప్రియవయస్యుఁడు.

రాక్ష- (హర్షముతో, తనలో) ప్రియవయస్యుఁడని చెప్పుచున్నాఁడు. చాలదగ్గఱిసంబంధము. బాగు! చందనదాసుని వృత్తాంతమెఱుఁగును. (పయికి) భద్రా! అతనికేమి?

పురు- అతఁడిపుడు తనసంపదనంతను దీనజనులకుఁ బంచిపెట్టి, అగ్నియందుఁజొరఁబడఁగోరి నగరమునుండి వెడలిపోయినాఁడు. కనుక నేనును బ్రియవయస్యుని చావువినకుండ నీలోఁగానే యురిపెట్టుకొని చావఁగోరి యీ జీర్ణోద్యానమునకు వచ్చినాను.

రాక్ష- భద్రా! అగ్నియందుఁ జొరఁబడుటకు నీస్నేహితునకు హేతువేమి?

గీ॥ ఔషధమునకులొంగని ♦ వ్యాధియేమొ?

పురు- అయ్యా! కాదు, కాదు.

రాక్ష- అగ్నివిషకల్పమౌరాజు ♦ నాగ్రహమ్మొ?

పురు- అయ్యా! పాపముశమించుఁగాక, పాపముశమించుఁగాక: చంద్రగుప్తుని దేశములందు దారుణమగు నాజ్ఞ లేలేవు.

రాక్ష- లాలసయొ దుర్లభాన్యక ♦ ళత్రమందు?

పురు- అయ్యా! పాపముశమించుఁగాక, పాపముశమించుఁగాక. వినయనిధులయిన వర్తకజనులకిది అభూమిగదా! విశేషించి జిష్ణుదాసునకు.

రాక్ష- నీకునెట్లట్ల చెలికాని ♦ నీలుగుటయొ ॥ 16 ॥

పురు- అవును.

రాక్ష- (ఆవేగముతో, తనలో) చందనదాసుఁడితని చెలికానికిఁగూర్చు చెలికాఁడు. అతని ప్రియస్నేహిత వినాశమే అగ్నిప్రవేశహేతువనుట యెట్లు సత్యమో, అట్లు, మిత్రస్నేహ పక్షపాతియయిన చిత్తముచే సమాకులితుఁడనగుచున్నాను. (పయికి) భద్రా! నీయాస్నేహితుని సుచరితము విస్తరించి వినఁగోరుచున్నాను.

పురు- అయ్యా! మరణమునకు విఘ్నముగలుగును గనుక మందభాగ్యుఁడను నేనింతకంటె నితరము చెప్పుటకు శక్తుఁడనుగాను.

రాక్ష- వినఁదగినంత కథను వినిపింపుము.

పురు- ఇఁకగతిలేదు. ఇదిగో నివేదించుచున్నాను. ఆర్యులు వినుఁడు.

రాక్ష- భద్రా! సావధానుఁడను.

పురు- ఈనగరమందుఁ జందనదాసుఁడను మణికార శ్రేష్ఠిగలఁడని యార్యులెఱుఁగుదురు.

రాక్ష- (విషాదముతో, తనలో) దైవముచేత, మావినాశదీక్షనుపదేశించుద్వారము తెఱువఁబడినది. హృదయమా! స్థిరపడుము. కష్టతరము సింకవినఁగలవు (పయికి) భద్రా! మిత్రవత్సలుఁడు, సాధువు, చందనదాసుని విన్నాము. అతనికేమి?

పురు- అతఁడీ జిష్ణుదాసుని ప్రియస్నేహితుఁడు.

రాక్ష- (తనలో) ఇది దుఃఖవజ్రపాతమునకు సమీపము. (పయికి) తరువాత?

పురు- జిష్ణుదాసుఁడు, తనస్నేహమునకుఁదగినట్లు చంద్రగుప్తునకిట్లు విన్నవించినాఁడు.

రాక్ష- ఎట్లు, ఏమని?

పురు- " దేవా! నాయింటియందుఁ గుటుంబపోషణమునకుఁ జాలినంత ధనమున్నది. ఆధనమును మాఱకముగాఁ బుచ్చుకొని, నాప్రియవయస్యుఁడు చందనదాసుని విడువవలెను " అని.

రాక్ష- (తనలో) సెబాసు, విష్ణుదాసా, సెబాసు. మిత్రస్నేహముఁ గనఁబఱిచినావు. ఏమా?

చ॥ తనయులఁదండ్రులున్ సుతులు ♦ దండ్రుల నన్యులఁబోలె నేఁచమి;
త్రుసియెడ మిత్రభావమును ♦ ద్రోపుడు వెట్టి యమిత్రుఁ జేయుఁ;గా
రణము ధనంబు; కైహారివి ♦ రాఁబడిఁగోరెదు నీవు మిత్రుపై।
ననురతివీడఁగోరితి; కృ ♦ తార్థముసుమ్ము త్వదర్థమిందునన్ ॥ 17

(పయికి) భద్రా! అసజ్జనుఁడట్లు విన్నవింపఁగా మౌర్యుఁడేమి యుత్తరమిచ్చినాఁడు?

పురుషు- అయ్యా! అతఁడిట్లువిన్నవింపఁగాఁ జంద్రగుప్తుండిట్లుత్తరమిచ్చినాఁడు. "జిష్ణుదాస! సెట్టి చందనదాసుని నేనీకారణముచేత బంధింపలేదు. మఱి, యాతఁడు అమాత్యరాక్షసుని గృహజనమును దాఁచినాఁడు. బహువిధముల యాచించినను సమర్పించినాఁడుగాఁడు. కనుక, అమాత్యరాక్షసుని గృహజనమును నతఁడెపుడు సమర్పించునో, అపుడతనికి విడుదలకలుగును. లేనియెడలఁ బ్రాణహరణమతనికి శిక్ష" అని పలికి, చందనదాసుని వధ్యస్థానమునకుఁ జేర్పించెను. అంత, 'ఎంతలోఁ బ్రియమిత్రుఁడు చందనదాసునివార్త నేను వినఁగూడనిది విననో, అంతలోఁగా నాత్మహత్య చేసికొనుచున్నాను' అని, శ్రేష్ఠి యగ్నిఁజొచ్చుటకుద్యుక్తుఁడయినాఁడు నేనును, ఎంతలోఁ బ్రియమిత్రుఁడు జిష్ణుదాసునివార్త, నేను వినఁగూడనిది విననో అంతలోఁగా నురిపెట్టుకొని చావఁగోరి యీ జీర్ణోద్యానమునకు వచ్చితిని.

రాక్ష- చందనదాసుఁడింకను సంహరింపఁబడలేదుగద;

పురు- అయ్యా! ఇంతవఱకు సంహరింపఁబడలేదు. అతఁడిపుడును, అమాత్యరాక్షసుని గృహజనము సమర్పించుటకు యాచింపఁబడుచున్నాఁడు. యాచ్యమానుఁడయినను మిత్రవాత్సల్యమువలన

సమర్పింపకున్నాఁడు. ఈకారణముచేత నాతని మరణమునకుఁ గాలహరణమగును.

రాక్ష- (హర్షముతో, తనలో) సెబాసు! వయస్యా చందనదాస, సెబాసు!

క॥ శరణాగతరక్షను శిబి
కిరవుగ దొరికిన యశంబ ♦ దేపాటిది నీ।
వర యశముముందరం; నహహా!
శరీరమర్పింతు హితున ♦ సన్నిధినైనన్ ॥ 18 ॥

(పయికి) భద్ర, భద్ర! నడివడిఁబరుగెత్తి జిష్ణుదాసు నగ్నిప్రవేశమునుండి నివారింపుము. నేనును చందనదాసుని మరణమునుండి తప్పించెదను.

పురు- అయితే, ఏయుపాయముచేతఁ జందనదాసునిం జావునుండి తప్పించెదవు?

రాక్ష- (కత్తినాకర్షించి) వ్యవసాయమిత్రమయిన యీఖడ్గముచేతనే; చూడవోయి-

ఉ॥ మబ్బులువాసి నాకసము ♦ మాడ్కిని నల్లనిదై రణంబుపై ।
నుబ్బునఁ బుల్కరించెనన ♦ నొప్పి కరంబునఁ బోరులందునా ।
గుబ్బగుబల్మి శత్రువులఁ ♦ గూల్చిన యీఛురి నన్ను రేఁచెడుం ।
దబ్బునఁబోయి మిత్రుని వి ♦ నాశమునుండి మఱల్పఁజూడఁగన్ ।

పురు- అయ్యా! ఈవిధముగాఁ జందనదాసుని జీవితము కాపాడఁబడఁగలదని విన్నాను. విషమదశాపరిపాకమునం గూలియున్న నేను నిశ్చయించుటకు శక్తుఁడను గాకున్నాను. మీరు సుగృహీతనామధేయులు, అమాత్యరాక్షసులవారని తలఁచుచున్నాను. కనుక సందేహము నిర్ణయించుటచేత నన్ననుగ్రహింపుఁడు.

రాక్ష- భద్రా! భర్తృవంశవినాశము ననుభవించినవాఁడను, సుహృద్వినాశమునకు హేతువయినవాఁడను, అనార్యుఁడను, దుర్గృహీతనాముఁడను, యథార్థముగా రాక్షసుఁడను నేనే.

పురు- (పాదములపై వ్రాలి) ప్రసన్నులరగుఁడు. భాగ్యముచేఁగృతార్థుడనయితిని.

రాక్ష- భద్రా! లేలెమ్ము. కాలహరణమింకవలదు. జిష్ణుదాసునకిట్లు నివేదింపుము- 'ఈరాక్షసుఁడు చందనదాసుని మరణమునుండి తొలగింపఁగలఁ' డని- (19 వ పద్యమును మఱలఁబఠించుచు, కత్తి చేతఁబూని తిరుగును.)

పురు- (పాదములపై వ్రాలి) అమాత్యరాక్షసులవారు ప్రసన్నులగుదురుగాక. ఈనగరమందు, మొదటఁ, జంద్రగుప్తహతకుఁడు, ఆర్యశకటదాసునివధ మాజ్ఞాపించెను. ఆతని నెవఁడో యొకఁడు వధ్యస్థానమునుండితప్పించి దేశాంతరమునకుం దీసికొనిపోయెను. తరువాతఁ జంద్రగుప్తహతకుఁడు, ఈప్రమాదమెవనివల్ల నెట్లుజరిగినదని ఆర్యశకటదాసవధ వంచనచేత, రోషాగ్ని ప్రజ్వరిల్లఁగా, ఘాతకజనులను వధించుటయనెడి నీటిచే దానింజల్లార్చుకొనియెను. అదిమొదలుకొని ఘాతకులు, ఖడ్గమునుధరించు నపూర్వజను నెవరినయినను ముందేని వెనుక నేనిఁ జూచిరా, అర్థమార్గమందే, తమప్రాణములఁగాపాడుకొనుటకుఁ బ్రమాదములేనివారయి వధ్యస్థానమందు వధ్యునిఁ జంపుచున్నారు. ఇట్లు శస్త్రముధరించి వెళ్ళెడు నమాత్యులచేతఁజందనదాసవధము త్వరితాయితమగును.

రాక్ష- (తనలో) ఓహో! చాణక్యవటుని నీతిమార్గము దుర్బోధముగానున్నది. ఏమో?

సీ॥ శత్రులగూఢంపు ♦ సమ్మతిచేతనే
శకటదాసుని నాదు ♦ సన్నిధికిని ।

సిద్ధార్థకుండు చె ♦ చ్చెనని యెంచుటకొక్క-
ప్రతిబంధకంబు గ ♦ న్పడెడు నెటన ।
నాతనిఁ జంపుట ♦ కని పంపి యిద్దఱి
ప్రాణముల్ గోపాన ♦ రాల్పనేల? ।
కృతకంబుగాదేని ♦ యేల శకటుఁడు స
ముద్రిలేఖాసృష్టి ♦ మూలమైన ।
గీ॥ స్వామి విద్రోహదారుణ ♦ పాతకంబు ।
తలఁచుటయకాదు నిక్కము ♦ సలిపినాఁడు? ।
తెలిసికొనలేక దిర్దిరఁ ♦ దిరుగుచుండి ।
మఱి వితర్కించుచున్నది ♦ మానసంబు ॥ 20 ॥
ంచించి) సీ॥ కత్తికియ్యాదిగాదు ♦ కాలంబు ఘాతక
ప్రాణఘాతము దీన ♦ నగునుగాక ।
యాదియందునను, గా ♦ లాంతరమునయందుఁ
బ్రకటించెడును నీతి ♦ ఫలము, దాని ।
వలనఁగార్యములేద ♦ యట్లగుటంబట్టి
ప్రస్తుతమనుసరిం ♦ పఁగనె తగును ।
నామిత్రుఁడైన చం ♦ దనదాసుఁడీరీతి
నస్మత్కృతంబౌ మ ♦ హావిపత్తిఁ ।
గీ॥ దగిలియున్నయపుడు ♦ దగదుదాసీనత ।
యింకఁ జేయఁదగిన ♦ కృత్యమొకటె ।
నేను నాదు తనువు ♦ నిష్క్రియంబుగఁ జేసి ।
హితుని వదలిపింతు ♦ నిపుడపోయి ॥ 21 ॥

అందఱు- (నిష్క్రమింతురు.)

ఇది పాలెపు వేంకట సూర్యగోపాల ప్రధానాంధ్రీకృత
ముద్రారాక్షస నాటకమున షష్ఠాంకము.

ముద్రారాక్షసము-సప్తమాంకము.

చండాలుఁడు- (అంతఁ బ్రవేశించును.) ఓసరిల్లుఁడు, అయ్యా! ఓసరిల్లుఁడు. తొలఁగుఁడు. మాన్యులార, తొలఁగుఁడు.

క॥ పురుషునకుఁ దెచ్చు వ్యాధియొ ।
మరణమ్మొ, యపథ్యసేవ ♦ మఱి రాజాప ।
థ్యరచనచేతఁ దానో ।
క్రూరుఁడేకాఁడెల్ల కులముఁ ♦ గడతేర్చుఁగా ॥ 1 ॥

మఱియు-గీ॥ ప్రాణదారపుత్ర ♦ వైభవకులములు ।
రక్షితవ్యములని ♦ రక్తిఁదలఁచు ।
వారు పరిహరింప ♦ వలయు రాజాపథ్య ।
మను విషంబు దూర ♦ ముననె భీతి ॥ 2

ఈమాటలు నమ్మరేని, రాజాపథ్యకారియవుటచే సపుత్రదారముగా వధ్యస్థానమునకుఁ గొంపోవఁబడుచున్న చందనదాసునిఁ జూడుండి. (ఆకాశమువంకఁ జూచి) ఆర్యులార! ఏమనియెదరు? 'చందనదాసుని విడుదలకుపాయమేదైనఁ గలదా,' అనియెదరా? ఈమంద భాగ్యుని విడుదల కుపాయమెట్లు? కాని, యొకటికలదు. అమాత్య రాక్షసుని గృహజనముం దెచ్చి సమర్పించుట. (మరల నాకాశము వంక) ఏమనియెదరు? శరణాగతవత్సలుఁడితఁడు తనజీవితకారణముగా నీయకార్యమును జేయుఁడా? ఆర్యులారా! ఈరీతిని యాతని శుభగతిని మీరు నిశ్చయించితిరేని, ప్రతీకారవిచారముతో మీకుఁ బనియేమి?

చందనదాసుఁడు- (వధ్యవేషధారియయి, శూలము భుజముపైఁబెట్టుకొని, రెండవచండాలుఁడనుగతుఁడుగా, కుటుంబినియుఁ బుత్త్రుఁడును దోడరాఁ బ్రవేశించును. కన్నీటితో) అన్నన్నా! ఎంత కష్టమెంతకష్టము. నిత్యచారిత్రమునకు భంగముకలుగునని భయపడు మావంటివారికిని, చోరులకుమాత్రమే యుచితమయిన మరణముఁ గలుగునని కృతాంతునకు నమస్కారము: లేక, ఘాతుకులకు, తటస్థులయందుఁగాని, యితరులయందుఁగాని భేదములేదు. ఇది యిట్లే!

క॥ మరణమువలని భయమ్మున।
పెరసుల నాశింపకింత ♦ పిల్లుదినెడు నా।
సరళహరిణంబుఁ జంపఁగఁ,
గిరాతకులమున కదేమి ♦ కీడొనరించెన్ ॥ 3 ॥

(అంతటఁజూచి) ఓప్రియసఖుఁడా, జిష్ణుదాస! నాకుఁ బ్రత్యుత్తరమైన నియ్యవేమి? లేక, యిట్టిసమయమందు దృష్టిపథమందుండినట్టివారయినను దుర్లభులుగదా! (కన్నీటితో) నాప్రియస్నేహితులు వీరు నాకు నివాపతర్పణమనునట్లు కన్నీటిధారలఁ గార్చుచు, మరలింపఁబడియు, శోకము హెచ్చుగాఁగా దీనవదనులయి, మిక్కుటమయిన కన్నీటిచేతఁ జూడ్కి మఱుఁగుపడఁగా నన్ననుసరించివచ్చుచున్నారు.

చండాలురు- (పరిక్రమించి చూచి) అయ్యా! చందనదాస! వధ్యస్థానమునకు వచ్చినావు కనుక, పరిజనమును విసర్జింపు.

చందన- (భార్యతో) ఆర్యా! కుటుంబినీ! పుత్త్రుఁడును, నీవును వెళ్ళిపొమ్ము ఇది వధ్యస్థానము. ఇంతకుమించి రాఁగూడదు.

కుటుంబిని- (కన్నీటితో) ఆర్యుఁడు పరలోకమునకుఁ బయలుదేరినాఁడు. దేశాంతరమునకుఁ గాదు. కనుక నిపుడు మరలిపోవుట కులజనమునకు యోగ్యముగాదు.

చందన- ఆర్యా! సత్యము. నాకీవినాశము మిత్త్రకార్యముచేత. పురుషదోషముచేతఁగాదు. కనుక హర్షింపవలసియుండఁగాదుఃఖించెద వేమని?

కుటుం- ఆర్య! అట్లయ్యెనా, ఇపుడు మరలిపోవుట కులజనమునకుచితముగాదు.

చంద- అయితే, ఆర్యురాలి నిశ్చయమేమి?

కుటుం- భర్తగారి చరణముల ననుసరించుట యాత్మ ననుగ్రహించుటయగునని.

చంద- ఆర్యా! ఇదితప్పుపని: లోకవ్యవహారమెఱుఁగనివాఁడు, ఈకుమారుఁడనుగ్రహింపఁబడఁదగినవాఁడు.

కుటుం- ఇతనిని బ్రసన్నులయిన కులదేవతలనుగ్రహింతురుగాక. కన్నకొడుకా! ఇఁకఁ జూడశక్యముగాని మీతండ్రిపాదములకు మ్రొక్కుము.

పుత్త్రుఁడు- (పాదములపైవ్రాలి) తండ్రీ! తండ్రిని బోఁగొట్టుకొన్న నేను చేయఁదగినదేది?

చంద- పుత్త్రా! చాణక్యుఁడులేని దేశమందు వసింపుము.

చండా- అయ్యా, చందనదాస! శూలము పాతితిమి కనుక నిపుడు సిద్ధపడుము.

కుటుం- ఆర్యులారా! రక్షింపుఁడు, రక్షింపుఁడు.

చండ- భద్రముఖ! కొంచెమాగుము. (కుటుంబినితో) జీవితవత్సలా! ఏడ్చెదవేల? ఏడ్చెడు స్త్రీజనమునుగూర్చి ప్రతిదినముజాలిపడువారు, ఏలిక, లానందులు స్వర్గమునకుఁ జనినారుగదా?

ప్రథమచండాలుఁడు- ఓరీ, వేణువేత్రక! ఈచందనదాసుని బట్టుకొమ్ము. గృహజనము తనంతటతానే వెళ్ళిపోవును.

ద్వితీయచండా- ఓరీ, వజ్రలోమ! ఇదిగో, పట్టుకొనుచున్నాను

చందన- భద్రముఖ! ఒక్కనిమిషమాగు. ఈలోఁగా, కొడుకును గాఁగిలించుకొందును. (కొడుకును గాఁగిలించుకొని) కన్నబిడ్డా! మరణము నిశ్చితమయినను, మిత్త్రకార్యమునాచరించుచు, వినాశము ననుభవించుచున్నాను.

పుత్రు- తాత! ఇది యడుగుచున్నాను. ఇది మనకుఁ గులధర్మమా యేమి? (పాదములపై వ్రాలును.)

చండా- ఓరీ వజ్రలోమ! పట్టుకో

ఇద్దఱు చండా- (శూలమెక్కించుటకు చందనదాసుని బట్టుకొందురు.)

కుటుం- (ఱొమ్ము బాదుకొనుచు) ఆర్యులారా! రక్షింపుఁడు, రక్షింపుఁడు.

రాక్షసుఁడు- (తెఱఁజిమ్ముకొని ప్రవేశించి) అమ్మా! భయపడకు, భయపడకు. ఓగోరి శూలాయతనులార! చందనదాసుఁడు చంపఁబడఁదగినవాఁడు గాఁడు. ఏమా?

సీ॥ స్వామివంశంబు మున్ • శత్రునివంశంబు
గతిని నష్టముగాఁగఁ • గాంచె నెవ్వఁ।
డత్యంతమిత్రుని • యాపదనుత్సవ
గతిని సుస్వస్థుఁడై • కనియె నెవఁడు।
వధచేయ మీచేతఁ • బరిభవక్షేత్రీకృ
తంబయ్యు మిగులఁ బ్రి • యంబుగానె।
యెవఁడు శరీరము • నెంచుచున్నాఁడో
యట్టివాఁడను రాక్ష • సాఖ్యుఁడేను।
గీ॥ గాన మృత్యులోక • గమనమార్గంబును।
రక్తపుష్పసూత్రి • యుక్తమిద్ది।
వధ్యమాల వేయ • వలయును నామెడ।
నీమహాత్ముమెడకు • నిద్ది తగదు ॥ 4 ॥

చంద- (చూచి, కన్నీటితో) అమాత్య, ఇది నీనిశ్చయమా? ఏమి?

రాక్ష- నీసుచరితములలో నించుకననుసరించుట యేకదా!

చంద- అమాత్య! నాయీసర్వప్రయాసమును నిష్ఫలముఁ జేయుటచేత నమాత్యుఁడు నాకుఁ బ్రియముగావింపలేదు.

రాక్ష- సఖుఁడా! చందనదాస! నిందింపకు. జీవలోకము స్వార్థప్రధానముగదా! భద్రముఖ! దురాత్ముఁడా చాణక్యున కిట్లు నివేదింపఁదగును.

చండా- ఏమని.

రాక్ష- సీ॥ దుష్టాత్ములమనంబె • తుష్టినొందింపఁగఁ
జాలునీ దుష్కాలి • కాలమందుఁ।
బరునిఁ గాపాడఁగ • స్వశరీరమర్పించి
మున్నుశీనరదేశ • భూమినాథుఁ।
డార్జించిన యశంబు • నతిశయించెడు కీర్తిఁ
గాంచెను; సుచరిత్ర • కలనచేత।
బుద్ధుల చేష్టిత • ములఁగూడఁ గ్లిష్టముల్
సేసిమించెను శు • ద్ధ చిత్తవృత్తిఁ।
గీ॥ బూజనములకెల్ల • భాజనంబవు నాతఁ।
డెవనిమూలముననె • యిప్పుడిట్లు।
వధ్యతాభిదశకుఁ • బాత్రమయ్యెనో యట్టి।
పాపి రాక్షసుండు • వచ్చినాఁడు ॥ 5 ॥ అని.

ప్రథమచండా- ఓరీ వేణువేత్రిక! నీవు సెట్టిచందనదాసుని బట్టుకొని, ఈశ్మశానవృక్షమునీడను ముహూర్తము గూర్చుండుము. ఈలోఁగా, ఆర్యచాణక్యునికి, 'అమాత్యరాక్షసుఁడు దొరికినాఁ' డని విన్నవించెదను.

రెండవచండా- ఓరీ, వజ్రలోముఁడ! అట్లేచేయుము. (సపుత్రదారుఁడయిన చందనదాసునితో నిష్క్రమించును.)

ప్రథమచండా- అమాత్యా! రండి. (రాక్షసునితో పరిక్రమించి) ద్వారికులలో నెవరయ్యా: అక్కడ! నందకుల పర్వతమునకు వజ్రాయుధభూతుఁడు, మౌర్యకుల ప్రతిష్ఠాపన రూపధర్మ సంచయ సంపాదకుఁడు నయిన యార్యచాణక్యునకిట్లు విన్నవింపుడు-

రాక్ష- (తనలో) ఇదిగూడ వినవలసివచ్చెను.

చండా- "ఇదిగో, ఆర్యనీతిచేతఁ దనబుద్ధిబలము వ్యర్థమయిన యమాత్యరాక్షసుఁడు గ్రహింపఁబడినాఁడని."

చాణ- (తెరచాటుననుండి మొగముమాత్రము కనిపించునట్లు ప్రవేశించి, హర్షముతో)- భద్రా! చెప్పకుము చెప్పకుము.

సీ॥ పొడుగుగాముడెడు ◆ భూరిశిఖాకలా
పంబుచే నెట్టినో ◆ జ్వాలనమూర్తి
బట్టకొంగున ముడి ◆ గట్టినదెవ్వఁడు ?
పాశజాలంబును ◆ బఱపి తాస
దాగతికగతిత ◆ దార్కొనఁజేసిన
దెవ్వఁడు; మఱియున ◆ నేకపాళి
దానవాసిత సటో ◆ త్కరము సింహంబును
బట్టి పంజరమున ◆ బెట్టెనెవఁడు
గీ॥ క్రూరనక్రమకర ◆ వాగాది జలసత్త్వ
భీమమగుచు నౌర్వ ◆ ధామమగు చ
పారమగుచు నెగడు ◆ పాథోనిధానంబు
దాఁటె నెవడు బాహు ◆ దండములను ॥ 6 ॥

చండా- నీతినిపుణబుద్ధియయిన యార్యుఁడు.

చాణ- అట్లుకాదు కాదు. నందకులద్వేషియైన దైవమని చెప్పుము.

రాక్ష- (చూచి, తనలో) ఇదిగో! అదురాత్ముఁడు-లేక-మహాత్ముఁడు కౌటిల్యుఁడు-

క॥ మానికములకుఁ దుగ్ధాం
భోనిధివలె సర్వశాస్త్ర ◆ ముల కాకరమే
ధీనిధి దుర్మాత్సర్య
స్థానంబెవ్వానిగుణవి ◆ తానముమాకుఁ ॥ 7 ॥

చాణ- (చూచి, హర్షముతో) ఇదిగో అమాత్యరాక్షసుఁడు. ఏమహాత్మునిచేత-

క॥ గురుకల్పనలం గ్లేశో
త్కరములచే జాగరంపుఁ ◆ గారణములచేఁ

జిరమాయాసితమంతః
కరణము నాయదియు వృషలు ◆ ఘనసైన్యంబుల్ ॥ 8 ॥

(యవనికఁ దప్పించి సమీపించి) ఓహో అమాత్యరాక్షస! విష్ణుగుప్తుఁడు నమస్కరించుచున్నాఁడు

రాక్ష- (తనలో) అమాత్యుఁడను విశేషణమిప్పుడు లజ్జాకరము. (పయికి) ఓ విష్ణుగుప్త! చండాలస్పర్శదూషితుఁడనయిన నన్ను నీవిపుడు ముట్టుకొనరాదు.

చాణ- అమాత్యరాక్షస! ఇతఁడు చండాలుఁడుగాఁడు. మునుపు నీవుచూచినవాఁడే, సిద్ధార్థకుఁడను పేరిటి రాజసేవకుఁడు. రెండవవాఁడును సుసిద్ధార్థకుఁడను పేరిటి రాజసేవకుఁడే. వారిచేతనే చెలిమి చేయించి, పాపము, తపస్వియయిన శకటదాసునిచేత, అతఁడెఱుఁగకుండ, అట్టికృత్రిమలేఖ నాచేతనే వ్రాయింపఁబడ్డది.

రాక్ష- (తనలో) అదృష్టముచేత శకటదాసునిపై నాకుఁగలిగిన సందేహము తొలఁగింపఁబడ్డది.

చాణ- పెక్కులేల సంక్షేపముగాఁ జెప్పెదను.

సీ॥ భద్రభటాదులా ◆ బంటులు, శకటదా
సుఁడు వ్రాసినట్లు గ ◆ న్పడినయట్టి
కృత్రిమంబైన ప ◆ త్రికయును, శకటుని
సిద్ధార్థకుఁడు నీకుఁ ◆ జేర్చుటయును
మునుపర్వతుండు దా ◆ ల్చిన యలంకారత్ర
యమ్ము వర్తకులు నీ ◆ కమ్ముటయును
జీవసిద్ధియు నిన్నుఁ ◆ జేరికొల్చుటయు, జీ
ర్ణోద్యానమున నరు ◆ నురికిఁదెగువ
గీ॥ శ్రేష్ఠిఁ జందనదాసునిఁ ◆ ద్రెంపఁజూచు,
టన్నియును నానయములు వీ ◆ రాగ్రగణ్య!

(లజ్జనభినయించి)

నినుఁబరీక్షిత భూరితే ♦ జుని మహాత్మ!
మౌర్యచంద్రుని సచివుఁగా ♦ మార్చుకొనుటకు ॥ 9 ॥

కనుక నీవృషలుఁడు నీదర్శనముచేయుటకు వచ్చుచున్నాఁడు. అతనిఁజూడుము.

రాక్ష- (తనలో) గతియేమి? (పయికి) ఇదిగో, చూచుచున్నాను.

రాజు- (విభవముకోలఁది పరివారముతోఁ బ్రవేశించును. తనలో) యుద్ధమక్కఱలేకుండఁగానే దుర్జయమయిన శత్రుకుల మార్యులచేతఁ బరాజితమగుటంబట్టి నేనులజ్జితునివలెనున్నాను. కాని-

గీ॥ ఒంది ఫలయోగము నువిధి ♦ యోగగతినిఁ
బొందుచు విపక్షతను నధో ♦ ముఖముల యిని
షంగ శయన వ్రతము వ్యథ ♦ సలుపునట్లు
తోఁచెడును సాయకములు ప్రి ♦ తుష్టిలేక ॥ 10 ॥

లేక, గీ॥ గెలువఁదగిన దెల్ల ♦ గెలుచును విగుణీకృ
త ప్రచాపుఁడైనఁ ♦ దానువలెను
స్వపితుఁడైన గురులు ♦ జాగరూకతగల్గి
నిఖలతంత్రములను ♦ నిర్వహింప ॥ 11 ॥

(చాణక్యునిసమీపించి) ఆర్య! చంద్రగుప్తుఁడు నమస్కరించుచున్నాఁడు.

చాణ- నీకాశీర్వచనములన్నియు సంపన్నమయినవి. కనుకఁ బూజనీయుఁడయిన యమాత్యరాక్షసునకు నమస్కరింపుము. నీకీయన పైతృకుండు ప్రధానముఖ్యుఁడు.

రాక్ష- (తనలో) ఇతనితో సంబంధము కలుపఁబడినది.

రాజు- (రాక్షసుంజేరి) ఆమాత్య! చంద్రగుప్తుఁడను నేను నమస్కరించుచున్నాను.

రాక్ష- (చూచి, తనలో) అహహా! ఇతఁడు చంద్రగుప్తుఁడు

క॥ చినతనమయ్యుం బ్రజచే
తను సంభావిత మహాభ్యు ♦ దయుఁడయి రాజ్యం
బున నారూఢుండు క్రమం
బున యూథైశ్వర్య విభవ ♦ మున నేనుఁగునాఁ ॥ 12 ॥

(పయికి) రాజా! విజయమగుఁగాక.

రాజు- ఆర్య!

క॥ గురువులు పూజ్యులు మీరి
ర్వురునఁ షాడ్గుణ్య ♦ చింతఁబూని మిగుల జా
గరితులయి యుండ నాచే
ధరనేదేన జితమంచు ♦ దలఁపందగునే? ॥ 13 ॥

రాక్ష- (తనలో) చాణక్యశిష్యుఁడునన్ను భృత్యభావముచేఁ జూచుచున్నాఁడు. లేక, ఇది వినయమే కావచ్చును. చంద్రగుప్తునిపై మత్సరమును మార్చుచున్నది. చాణక్యుఁడు యశస్వియగుట సర్వథాతగియున్నది. ఏమా?

చ॥ క్షితిజడబుద్ధియైనను జి ♦ గీషువు ద్రవ్యము నాశ్రయించెనా,
యతనికిఁ గీర్తిఁగూర్చు పద ♦ మంచుఁ బ్రతిష్ఠ ధ్రువంబు; లాతినిన్
జతిపడి మంత్రి శుద్ధనయ ♦ శాలియు నాశ్రయశీర్ణతం దట,
స్థితమగు సాలభూరుహము ♦ తీరునఁ గూలును నిశ్చయంబుగన్॥

చాణ- అమాత్యరాక్షస! చందనదాసుని జీవితము గాపాడఁ గోరుచున్నావా?

రాక్ష- సందేహమెందువలన?

చాణ- అమాత్యరాక్షస! నీవు శస్త్రముఁధరించినందప్ప వృషలుఁడనుగ్రహింపఁబడఁడు. సందేహమిది.

రాక్ష- ఓహో విష్ణుగుప్త. ఇల్లుకాదు కాదు. ఇందుకు మేము యోగ్యులము: విశేషించి నీవు గ్రహించిన శస్త్రమునుగ్రహించుటకు.

చాణ- రాక్షస, నేను యోగ్యుఁడను. నీవుగావుఅనుదానితో నేమి? చూడు

[illegible]ర్వితాహితదర్ప ♦ నిర్వాపణచణంబు
త్వదతిమానుషమహా ♦ త్త్వమునకులికి ।
రయుల [illegible]లు, ♦ గళ్ళెముల్ గూర్ప ఖా
ంబులయ్యెడు వారు ♦ వంబులెక్క ।
వానితోఁబాటుగా ♦ స్నానపానములు ని
ద్రాహారములును వి ♦ హారములును ।
స్వచ్ఛందసుఖములు ♦ వర్జించి యిట్లున్న
జోదుల నెల్లను ♦ జూడుమయ్య ।
గీ॥ మఱియుఁ బరికల్పనావ్యతి ♦ కరముచేతఁ ।
నట్లు పౌరచ్ఛానవంశంబు ♦ లైనయట్టి ।
కరిసమూహములంగూడఁ ♦ గాంచుమయ్య ।
కతము దీనికి నీపరా ♦ క్రమముగాదె? । 15 ॥

లేక, వెక్కులేల? నీవు శస్త్రము గ్రహించినందప్ప, చందనదాసునకు జీవితములేదు.

రాక్ష- (తనలో)

చ॥ హృది స్పృశియించు నందుల ప ♦ యింగల స్నేహకణాలువారిదు
ర్హ్రాదులకు భృత్యుఁడైతి; కయి ♦ నెంతయొ నీరిడి పెంచినట్టి చె
ట్లుఁదునుమనౌనో; మిత్రుఁడు వి ♦ డంబడఁడే ఛురిగొన్నఁగానియీ
యదునున నిట్లు కార్యగతు ♦ లవ్విధికైన దురూహ్యముల్ గదా!॥

(పయికి) ఓవిష్ణుగుప్త! ఖడ్గము దెమ్ము. సకలకృత్యములను ఆచరించుటకుఁ గారణమయిన మిత్రస్నేహమునకు నమస్కారము. మఱియొక గతిలేదు. ఇదిగో, సంసిద్ధుఁడను.

చాణ- (హర్షముతో, కత్తినిచ్చి) వృషల! వృషల! అమాత్యరాక్షసుఁడిపుడు శస్త్రమును గ్రహించుటచేత నిన్ననుగ్రహించినాఁడు. నీవదృష్టముచేత వర్ధిల్లుచున్నావు.

రాజు-ఆర్యుల యీప్రసాదము చంద్రగుప్తుఁడనుభవించుచున్నాఁడు.

పురు- (ప్రవేశించి) ఆర్యులకు జయము, జయము ఇదిగో, భద్రభట భాగురాయణ ప్రముఖులు గాలుసేఁ మలయకేతునిఁ దెచ్చినారు. వాకిటంబెట్టినారు. ఇదివిన్నారు ఆర్యులు ప్రమాణము.

చాణ- భద్రా! విన్నాము. అమాత్యరాక్షసునకు నివేదింపుము. అతఁడే యిపుడు రాజకార్యములెల్ల నిర్వహించువాఁడు.

రాక్ష- (తనలో) కౌటిల్యుఁడు, నన్ను దాసునిం జేసి, విజ్ఞాపనమునకు నాచేతఁ బలికించుచున్నాఁడు. గతియేమి? (పయికి) మేము మలయకేతునిఁ గొంచెముకాలమాశ్రయించి యుంటిమని విదితమే కదా! కనుక నతనిప్రాణములు గాపాడఁదగును.

రాజు- (చాణక్యునిమొగమువంకఁ జూచుచు.)

చాణ- వృషల! అమాత్యరాక్షసుని యీమొదటికోరిక సమ్మానింపఁదగినది. (పురుషునిఁజూచి) భద్ర! భద్రభటప్రముఖులతో మామాటలుగా నిట్లు చెప్పుము. 'అమాత్యరాక్షసుఁడు విన్నవింపఁగా, చంద్రగుప్తమహారాజు మలయకేతునికిఁ దండ్రిగారి దేశమే యిచ్చుచున్నాఁడు. కనుక నతనితో మీరును వెళ్ళి అతనినిం బ్రతిష్ఠించి మరలి రావలసినది.' అని.

పురు- ఆర్యులాజ్ఞాపించినట్లు—

చాణ- ఉండుండుము. భద్ర! భద్ర! విజయపాలునకును, దుర్గపాలునకును ఇట్లుచెప్పుము. "అమాత్యరాక్షసుఁడు శస్త్రముగ్రహించినందుకుఁ బ్రీతిచేతఁ జంద్రగుప్తమహారాజిట్లు సమాజ్ఞాపించుచున్నాఁడు. "సెట్టిచందనదాసునకు భూతలమందన్ని పట్టణములందును శ్రేష్ఠిపదమారోపింపవలసినది" అని.

పురు- ఆర్యులచిత్తము. (వెళ్ళును.)

చాణ- ఓరాజా! చంద్రగుప్త! మఱి నీకేమిప్రియముపకరింపవలెను?

రాజు- ఇంతకంటెను బ్రియమేమిగలదు?

available.

క్ష్మ [illegible] రాక్ష ♦ సప్రధానుసితోడ।
రాజ్య [illegible] ంస్థి ♦ రముగ మాకు।
[illegible] రెల్ల ము ♦ లున్మూలనంబు మ।
యింతకంటె నిష్ట ♦ మేదికలదు ? । 17 ॥

[illegible] ర్గపాలునకును, విజయపాలునకును ఇట్లు చెప్ప [illegible] మాత్యరాక్షసపరిగ్రహము చేతఁ బ్రీతుఁడయి చంద్రగుప్తమహారాజిట్లాజ్ఞాపించుచున్నాఁడు. "ఏనుఁగులు, గుఱ్ఱములు వినాగ సర్వమును బంధమునుండి వదలవలయును." అని. లేక, అమాత్యరాక్షసుఁడు రాజ్యతంత్రము నడపించువాఁడయియుండఁగా నేనుఁగులతోను, గుఱ్ఱములతోను ఏమిప్రయోజనము? కనుక నిపుడు.

గీ॥ వాహనములు హస్తి ♦ వారముఁగాకెల్ల।
బంధనమ్మునుండి ♦ వదలఁదగును।
దీర్ణశపథుఁడైతి ♦ దీనిచే నాకేశ।
పాశమునకె యింక ♦ బంధనమ్ము । 18 ॥

(అని జుట్టు ముడివైచుకొనును.)

ప్రతీ- ఆర్యులాజ్ఞాపించినట్లు- (వెళ్లును)

చాణ- అమాత్యరాక్షస! ఇఁక నీకేమిప్రియము పకరింతునో అది తెలుపుము

రాక్ష- ఇంతకంటెను బ్రియమేమిగలదు? పరితోషము లేదేని యిట్లగుఁగాక- (భరతవాక్యము.)

మ॥ ప్రళయోపప్లవ భూతధాత్రిమును వా ♦ రాహీతనూదంష్ట్రపై।
నిలిపెన్ విష్ణుఁడు; మ్లేచ్ఛపీడదొలఁగన్ ♦ నిల్పెన్ మహారాజమూ
ర్తి లసత్పీవరబాహులందిపుడు; సు ♦ శ్రీబంధుభృత్యంబుగా।
వెలయుందత్ప్రతి చంద్రగుప్తుఁడు మహిన్ ♦ వేయేండ్లు పాలించుచున్ ॥

అందఱు- (నిష్క్రమింతురు.)

ఇది పాలెపు వేంకట సూర్యగోపాల ప్రధానాంధ్రీకృత ముద్రారాక్షస నాటకమున, సర్వమును సప్తమాంకము.

శ్రీపరమేశ్వరార్పణమస్తు.

END OF
TITLE